# విజయవిహారం

జూన్ 2001 | యు ం మాసపత్రిక | రు.15

## మరోసారి.. తెలంగాణా






























## మాటామంత్రీ

### చందాలివ్వండి



"వ్యవస్థలోని అవినీతిని బట్టబయలు చేసేందుకు మరిన్ని సాహసాలు చేస్తాం. ఇందుకు ప్రజలు ఇతోధికంగా మాకు ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థిస్తున్నాం. మాకు అందే చందాల పర్యవేక్షణ బాధ్యతను నిబద్ధతగల భారతీయ ప్రముఖులకు అప్పగిస్తాం."

- తరుణ్ తేజ్‌పాల్,
తెహల్కా డాట్ కామ్ ప్రధాన సంపాదకుడు

### రాజీపడనన్నాను

అసభ్యకరమైన డాన్స్ మూమెంట్స్‌లో నటించటం, ఎక్స్‌పోజ్ చేయడం నాకెంతమాత్రం ఇష్టం లేదు. నాకు బాగా గుర్తు... ఇలాంటి సీన్లలో కాస్త సర్దుకుపోయే ధోరణి ఉండాలని రాఘవేంద్రరావు, చిరంజీవి ఓసారి చెప్పారు. నాకొచ్చే పేరేదైనా ఉంటే అది నా విలువల కారణంగానే వస్తుందని, వాటి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాను.



- సుహాసిని,
సినీ నటి (తన సినీ కెరీయర్‌పై వ్యాఖ్యానిస్తూ)

### మతానికి చెల్లుచీటి



క్లోనింగ్‌తో ఓ గొర్రె పిల్లను సృష్టించి దానికి డాలీ అని పేరు పెట్టగాలేంది మనుషుల్లోను ఆ పనిని ఎందుకు చేయకూడదు. దీని వల్ల దారుణమైన పరిణామాలేవో ఉంటాయని నేను అనుకోవడం లేదు. అనవసరమైన భయాందోళనలకు గురయ్యేవారే క్లోనింగ్‌కు అడ్డుపుల్లలేస్తారు. మతానికి చెల్లుచీటి రాయడంలో క్లోనింగ్ గొప్ప ముందడుగని నా అభిప్రాయం.

- మహేష్‌భట్, దర్శక, నిర్మాత



మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

## ఈశ ఉపనిషత్తు - 1



# ఉపనిషత్తు - అమృత జీవనం

అక్షర వాచస్పతి డా. దాశరథి రంగాచార్య **14**

1. ఓం ఈశావాస్యమిదం పర్వం యత్ కించ జగత్యాం జగత్ ।
తేన త్యక్తేన భుం జీథా మాగృధః కస్యస్విద్ధనం ॥

ఇది సొంతం ఈశ్వర మయం. జగములందలి ఈ కొంచెపు జగత్తు సొంతం ఈశ్వరమయం. అతడు త్యజించిందే అనుభవించు. అన్యుల ధనం ఆశించకు.

### ఆలోచనామృతము

సమస్తమూ ఈశ్వరమయం. ఈశ్వరుడు లేనిది ఏదీ లేదు. అతడే అంతటా నిండియున్నాడు విశ్వంలో, విశ్వాంతరాళంలో ఎన్ని జగత్తులున్నాయో, ఏమో మానవుడు ఎరుగడు. మానవునికి తెలిసిన తెలియని జగత్తులన్నియు ఈశ్వరమయములే! అన్ని మహా జగత్తుల్లో మానవుడు ఎంతటివాడు? బహు చిన్నవాడు. కొద్ది వాడు. అల్పుడు కాడు. స్వల్పుడు. ఈ చిన్నవాడికి సకల జగములను గురించి చెపుతే ఏం అర్థం అవుతుంది? వాడి జీవిత కాలమే నాలుగు నాళ్లు!

ఉమ్రెదరాజ్ మాంగ్ లాయీథీ చార్ యూమ్ కే
దో కట్‌గయే ఆర్జూమెందో ఇంతజార్ మెం

నాలుగు నాళ్ళ ఆయుష్యం అడిగి తెచ్చుకున్నాయి.

రెండు ఆశించడంలో గడిచాయి. రెండు నిరీక్షణలో.

ఇది చివరి మొగల్ చక్రవర్తి బహదుర్ షా జఫర్ కవిత.

మనిషికి అంతం ఉంది. ఈ విశ్వం అనంతం! ఏదో ఒక శాఖలో అందులోని ఉపశాఖలోని ఏ కొంచెమును ఒక జీవితంలో అర్థం చేసికోలేడు. జ్ఞాన, విజ్ఞానాలను విడగొట్టి ముక్కల కింద అణు మాత్రపు శాఖను చేసినా అధ్యయనానికి ఆయువు చాలడం లేదు. ఆవేశం, ఆరాటంలోనే జీవితం గడిచిపోతుంది. ఏ వ్యక్తీ తన జీవిత కాలంలో అనుకున్నవన్నీ చేయలేడు. జీవితం అయిపోతుంది. పనులు కోర్కెలు మిగిలిపోతాయి. మరో జన్మకు బాటలు ఏర్పడుతాయి.

విశ్వనాథ సత్యనారాయణ గారు రామాయణం ముప్ఫై ఏళ్ళు అధ్యయనం చేశారు. రామాయణ కల్ప వృక్షం రచించారు. రామాయణం తమకు అర్థం కాలేదని చెప్పారు. వారు దాపరికం లేకుండా చెప్పారు. సత్యం వచించారు. ఏదో ఒకరకంగా నేను రామాయణం నాలుగుసార్లు రచించాను. ఎనిమిదిసార్లు అధ్యయనం చేశాను. నాకూ రామాయణం అర్థమైందని చెప్పే సాహసం చేయలేను.

ఇది ఒక్క సముద్రమివ రత్నాఢ్యమగు వాల్మీకి రామాయణం గురించి. ఇది గొప్ప దేశం. దీని సాహిత్యం, సంస్కృతి, తాత్వికత, జ్ఞానం, విజ్ఞానం అనంతములు. ఒక్క జన్మ ఏం చాలుతుంది?

ఇది విశ్వంలోని అణుమాత్రాన్ని గురించే! జగములెన్ని? వాటిని గురించి ఏం తెలుసుకుంటాడు? ఉపనిషత్కారుడు ఋషి. అతనిది జ్ఞాననేత్రం - విశ్వనేత్రం, ఋషి వీటినీ, ఇంకెన్నింటినో గ్రహించాడు. గ్రహించియే 'యత్ కించ జగత్యాం జగత్' అన్నాడు.

ఈ ధరిత్రి మీద స్థావర జంగమాత్మకం అయిన జగత్తు అతి కొంచెం. అతని లోకం కొంచెం. అందుకే అంతమాత్రాన్ని గురించియే ప్రవచస్తున్నాడు.

"యత్ కించ జగత్యాం జగత్" ఈ మహా జగత్తులో ఉన్న కొంచెపు జగత్తుతోనే నరునికి పని. ఆ కొంచెపు జగత్తు 'ఈశావాస్య మిదం సర్వం. సొంతం ఈశ్వరమయం'.

ఈశ్వరుడు - పరమాత్మ - పరాత్పరుడు. వందనీయుడు. పూజనీయుడు. అర్చనీయుడు. ఆరాధ్యనీయుడు.

"ఈశావాస్య మిదం సర్వం" ఇది ఏ ఒక్క దేశ, జాతి, భాష, మత సంబంధం కాదు. ఇది సమస్త ప్రపంచం - విశ్వ మానవాళికి సంబంధించింది. ధరిత్రి మీది మానవాళికి సొంతం కలుగవలసిన జ్ఞానం. తెలియవలసిన సత్యం. కానవలసిన జ్యోతి! దీనిని నేటి దురాశాపర స్వార్థ మానవుడు గ్రహించాలి.

'ఈ కించజగత్' మానవులు మాత్రమే లేరు. ఈ జగత్తులో పశువక్ష్యాదులున్నాయి. వృక్ష, లతా, గుల్మాదులున్నాయి. నదులున్నాయి. పర్వతాలున్నాయి. క్రిమి కీటకాదులున్నాయి.

'ఈశావాస్య మిదం సర్వం' ఈ చెట్టు, పుట్ట, పురుగు బూచి సమస్తం ఈశ్వరుడే! ఇది మహత్ జ్ఞానం - మానవతా జ్ఞానం. దైవిక జ్ఞానం. ఈ జ్ఞానం కలవాడు పిపీలికంలో పరమాత్మను చూస్తాడు. చీమను నీట కొట్టుకుపోనీయడుఆకులో దాన్ని బయటికి చేరుస్తాడు. రక్షిస్తాడు.

ఈశావాస్య జ్ఞాని సకల మానవాళిని ప్రేమిస్తాడు. దేనికీ హాని తలపెట్టడు. హాని చెయ్యడు. మేలు చేస్తాడు. అలాంటివానికి దుఃఖపు జాడ కనిపించదు. ఆనందమయ జగత్తులో ఉంటాడు. ప్రేమామృతంలో తేలియాడ్తాడు.

లోకమంతా ఈశావాస్య జ్ఞానులవుతే ప్రేమ, ఆత్మీయత, అనురాగపు పరిశుద్ధ గంగలు పొంగిపొరలుతాయి. ద్వేషం, ఈర్ష్య, దుఃఖం లాంటి విషం నశిస్తుంది. అమృత ప్రవాహాలు పొంగి పొరలుతాయి! అప్పుడు రాజ్యం ఎందుకు? రాజకీయం ఎందుకు? ప్రభుత్వం ఎందుకు?

మానవతా పరిమళాలు పరివ్యాప్తం అవుతాయి.

సనాతన భారత సమాజం వ్యక్తినిష్ఠం. ఈ సమాజాన్ని సామాజిక నేతలు ఋషులు, మునులు, సాధువులు, యోగులు ఏర్పరిచారు, కాపాడారు. కొనసాగించారు. వేదం, ఉపనిషత్తు, జైన, బౌద్ధ సాహిత్యాలు, రామాయణం, భారతం, భాగవతం, పురాణాలు, జానపద సాహిత్యం ఈ వ్యక్తి నిష్ఠ సమాజాన్ని చెక్కు చెదరకుండా నిలిపాయి.

నీతి, న్యాయం, సత్యం, ధర్మం అనే స్తంభాల మీద పటిష్ఠంగా నిలిచిన ఈ కోట - ఎలాంటి భౌతిక ఆధారం లేకుండా యుగాలుగా నిలిచింది. భారత జనులకు సమ్యక్ జీవనం - శాంతి జీవితం ప్రసాదించింది.

ఈ భరత సమాజం హింస, బలవంతం మీద ఆధారపడింది కాదు. మునులు, ఋషులు నిరంతర పరిశ్రమతో వ్యక్తుల్లో న్యాయ, సత్య, ధర్మ నీతులను ప్రతిష్ఠించారు. ఇది ఆచారంగా సంప్రదాయంగా యుగయుగాలుగా నిరంతరం సాగివస్తున్నది.

భరత ప్రజకు అక్షరం రాకపోవచ్చు. కాని విద్యా వివేకాలకు కొదువ లేదు. విద్య, వివేకం ఏ కొన్ని కులాలకు మాత్రం పరిమితం అయింది కాదు. అన్ని కులాల అన్ని వర్గాల వారూ విద్యావంతులే!

రామాయణంలో గుహుడు, శబరి, వానర జాతి అక్షరాస్యులు కాకపోవచ్చు. వారిలో ఉన్న వివేకం మానవత అద్భుతాలు.

భారత ధర్మం ఒక రంతి దేవుని, ఒక శిబిని, ఒక బలిని, ఒక అలర్కుని, ఒక దధీచిని దేవతామూర్తులుగా తీర్చిదిద్దింది.

పాశ్చాత్య చరిత్ర సొంతం రక్తపు నదులే! అందులో మానవతకు తావు లేదు. అది రాజకీయం, హింస, బలవంతం మీద ఆధారపడి ఉంది. మనం నేడు ఆ దౌర్భాగ్యపు రాజకీయాన్ని అనుసరిస్తున్నాం.

భారతంలో కటికవాడైన ధర్మవ్యాధుడు స్వాధ్యాయపరుడు, బ్రాహ్మణుడు అయిన కౌశికునికి నిగూఢ ధర్మాలు ఉపదేశిస్తాడు.

భారతంలో విశ్వామిత్రుని వృత్తాంతం ఒకటి ఉంది. ఇది దాని సంగ్రహరూపం:

ఒకసారి దారుణం అయిన కరువు వచ్చింది. విశ్వామిత్రునికి చాలరోజులు అన్నం, నీరు లభించలేదు. ఒకనాటి అర్ధరాత్రి అతను ఒక మాల పల్లెకు చేరాడు. అక్కడ కుక్క మాంసం కనిపించింది. విశ్వామిత్రుడు కుక్క మాంసం దొంగిలిస్తున్నాడు. మాలతను చూచాడు. విశ్వామిత్రుని పట్టుకున్నాడు. చంపుతానన్నాడు. విశ్వామిత్రుడు తనను గురించి తెలియపరచుకున్నాడు.

"మహాత్మా! మీరేమి - ఈ నీచ కార్యం ఏమి?"

"ప్రాణ రక్షణకు ఏ పనియైన చేయవచ్చు. పూర్వం అగస్త్యుడు రాక్షస మాంసం తిన్నాడు"

"అగస్త్యుడు జనులను రక్షించడానికి వాతాపి మాంసం తిన్నాడు. ఆకలికి కాదు"

"నేను బ్రతకడానికి ఇది తప్పదు. ఇందువల్ల నాకు రెండు పాపాలు కలుగుతున్నాయి. ఒకటి దొంగతనం. రెండవది కుక్క మాంసం తిన్న పాపం. నీవు నాకు మాంసం ఇవ్వు. ఒకపాపం తప్పుతుంది. మరొక పాపం తపస్సు చేసి తీర్చుకుంటాను."

మాలతను విశ్వామిత్రునికి కుక్కమాంసం దానం చేశాడు. విశ్వామిత్రుని తస్కర దోషం నుంచి రక్షించాడు.

ఈ వృత్తాంతాన్ని గురించి చెప్పాల్సింది చాలా ఉంది. చెప్పను. రెండు విషయాలు మాత్రం చెపుతాను.

1. మాలతను విద్య, వివేకాల్లో విశ్వామిత్రునికంటే తక్కువ వాడు కాదు.

2. ఈ మొత్తం కథలో పోలీసులు ప్రభుత్వం లేనే లేదు. అవసరమూ లేదు. వ్యక్తులే ధర్మ బద్ధంగా పరిష్కారం చేసుకున్నారు.

నేను నా బాల్యంలో తెలంగాణా పల్లెల్లో వేద జీవితం - ధర్మ జీవితం - ప్రభుత్వం అదృశ్యం అయిన ప్రజా జీవితం చూశాను. 'వేదం - గ్రామం' అనే శీర్షికతో వార్త ఆదివారం సంచికలలో "వదం - జీవననాదం" సీరియల్‌లో వ్రాశాను. 'వేదం-జీవననాదం - ప్రవేశిక' అని ఎమెస్కో ఆర్షభారతి పుస్తకంగా ప్రచురించింది. అందులో పేజీలు 236 - 269లలో వేదగ్రామం ఉంది.

ఉపనిషత్తుల్లో ఈశ ఉపనిషత్తు మకుటాయమానం. దానిలో ఈశావాస్య మంత్రం ప్రాణం వంటిది.

ఈశావాస్య మంత్రం భారత ప్రజకు తెలియదు. కాని ఈశావాస్యం ఆచరిస్తున్నారు. అన్నింటినీ పూజిస్తున్నారు. సాధ్యం అయినంతవరకు హాని కలిగించడం లేదు.

అది భారత ధర్మపు మహిమ! అది భారతీయుల రక్త నాళాల్లో జీర్ణించుకు పోయింది. నేటి స్వార్థ, దురాశాపూరిత, అన్యాయ, అధర్మ, హింసాత్మక నికృష్ట సమాజంలో రాజకీయులు, ప్రభుత్వ యంత్రాంగం తప్ప సాధారణ ప్రజ ధర్మపరులు, న్యాయపరులు మాత్రమే!

అమెరికా జైళ్లలో కంటే సంఖ్యాపరంగా భారత దేశంలో నేరస్థులు తక్కువ ఉన్నారు. ఇందుకు కారణం భారత ప్రజ - సంప్రదాయసిద్ధంగా ధర్మపరులు. న్యాయపరులు.

నమో ఆర్ష ధర్మాయ



డా॥ దాశరథి విరచిత 'శ్రీమదాంధ్ర వచన అమృత ఉపనిషత్తులు' - ఎమెస్కో అర్షభారతి వారు గ్రంథరూపంలో ప్రచురించారు. అది ఇప్పుడు పుస్తకాల షాపులు అన్నిట్లోనూ లభ్యమౌతుంది.

## మానవతా ఉద్యమ స్ఫూర్తి

# సరస్వతీ గోరా



సంఘంలో వేళ్లూనుకున్న దురాచారాలను, మూఢనమ్మకాలను రూపుమాపడాన్నే జీవితాదర్శంగా ఎన్నుకున్న ఆదర్శమూర్తి సరస్వతి గోరా. 89 ఏళ్ల సరస్వతీ గోరా గత అనేక దశాబ్దాలుగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా మానవీయ విలువలను మొక్కబోని ఆశావాదంతో చాటి చెప్తున్నారు. సమాజంలో సగటు మనుషుల్లో హేతువాద దృష్టిని, మానవతా దృక్పథాన్ని పాదుకొల్పే కృషిలో భాగంగా ఆమె అనేక సంస్కరణ కార్యక్రమాలలో చురుకైన పాత్ర నిర్వహించారు.

ఆమె కృషికి గుర్తింపుగా అనేక పురస్కారాలు లభించినప్పటికీ, ఈ ఏడాది మార్చిలో ప్రకటించిన "జి.డి. బిర్లా ఇంటర్నేషనల్ అవార్డు ఫర్ హ్యూమనిజం, 2000" విశిష్టమైనది. కర్నాటక ప్రభుత్వం బసవ పురస్కారాన్ని కూడా ఆమెకు ఇటీవల ప్రదానం చేసింది.

సరస్వతీగోరా 1912 సెప్టెంబర్ 28న విజయనగరంలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి విజయనగరం మహారాజు ఆస్థానంలో పని చేశారు. వారి కుటుంబానికి గురజాడ అప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, గిడుగు రామమూర్తి పంతులు మొదలైన సంస్కర్తలతో సన్నిహిత సంబంధం వుండేది. కుటుంబ వాతావరణం సాంప్రదాయక మైనదైనా, సంస్కరణ భావాల ప్రభావం వల్ల, నాస్తికభావాలుగల గోరా (గోపిరాజు రామచంద్ర రావు)తో వివాహం అయిన తర్వాత విశాల భావాల అంకురార్పణ జరిగింది. దేశవిదేశాల్లో గోరా లెక్చరర్‌గా ఉద్యోగం చేసి, నాస్తిక భావాలుండడం వల్ల ఉద్యోగంలో ఎదురవు తున్న ఇబ్బందుల దృష్ట్యా స్వస్తి చెప్పి నాస్తిక సమాజం స్థాపించారు. మూఢ నమ్మకాలను తొలగించ డానికి సరస్వతీ గోరా 1940లోనే నిప్పులపై నడిచారు. దేవదాసీ ఆచారాన్ని అంతమొందించడానికి వారికి వివాహాలు నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సరస్వతీ గోరా నాయకత్వాన మహిళా సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్లారు. కులాంతర, మతాంతర వివాహాలు జరిపించడంలో కీలకపాత్ర నిర్వహించారు. స్త్రీకి ఆభూషణం తాను పెట్టుకున్న నగలు, ఆస్తి, సంపత్తి కాదని, స్త్రీకి నిజమైన ఆభరణం ధైర్యం, సాహసం, విద్య అని ఆమె పదేపదే పేర్కొంటారు.

ప్రజల్లో మహిమల మనస్తత్వాలు తొలగించడానికి, హేతు దృష్టిని పెంపొందించ డానికి వివిధ కార్యక్రమాల్లో సరస్వతీ గోరా పాల్గొన్నారు. సత్యసాయిబాబా విజయవాడ వచ్చినప్పుడు సరస్వతీ గోరా ఆధ్వర్యంలో వ్యతిరేక ప్రదర్శన జరిపారు. పోలీసులు వందలాది మందిని అరెస్ట్ చేశారు. 'జై ఇన్‌సాన్' అన్నది ఆమె నినాదం. మానవునికి విజయం కలగాలన్నదే తన ఆశయమని సరస్వతీ గోరా అంటారు. నాస్తిక కేంద్రమే కాదు, మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఒక లౌకికమైన ప్రత్యామ్నాయం కోసం, హ్యూమనిజాన్ని బలోపేతం చేయడం కోసం ఎందరెందరో నాస్తికులు, మానవతావాదులు, హేతువాదులు, లౌకికవాదులు చేస్తున్న నిరంతరకృషికి గుర్తింపుగానే జి.డి. బిర్లా ఇంటర్నేషనల్ అవార్డు వచ్చిందని ఆమె విశాల హృదయంతో అంటారు.

(రశ్మి ఫీచర్స్)

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చిత్తశుద్ధి లోపమే సమస్య

## సి.ఎల్.పి. అధ్యక్షులు డా॥ వై.యస్. రాజశేఖర్ రెడ్డి

❑ ప్రత్యేక తెలంగాణాపై మీ పార్టీ వైఖరి ఏమిటి?

తెలంగాణా ప్రాంతం వెనుకబాటుతనం గురించి పార్టీకి రెండో అభిప్రాయం లేదు. నిజానికి కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండగానే 1970 దశకంలో ప్రత్యేక తెలంగాణా కావాలని ఉద్యమం బాగా గట్టిగా వచ్చింది. ఆ రోజు అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ వెనుకబాటు తనాన్ని రూపుమాపడానికి ప్రత్యేకమైన ప్యాకేజీలిచ్చి, తెలంగాణా రీజనల్ బోర్డులేర్పాటు చేసి ప్రజలకొక విశ్వాసాన్ని కల్పించింది. ఆ కల్పించిన విశ్వాసాల మేరకు పనులు చేయగలిగింది. అందుకే సమస్యలు లేకుండా పోయాయి. కానీ ఈ మధ్యకాలంలో మళ్లీ... ముఖ్యంగా 1983వ సంవత్సరంలో రామారావుగారు అధికారంలోకొచ్చాక రీజనల్ ప్లానింగ్ బోర్డు రద్దుపరచడం, తెలంగాణాకి సంబంధించి ప్రత్యేకమైన అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదు అనే పరిస్థితి రావడం, మరీ ముఖ్యంగా చంద్రబాబు నాయుడు అధికారంలోకొచ్చిన ఈ ఆరు సంవత్సరాల్లో ఇరిగేషన్ మీద పూర్తి నిర్లక్ష్యం ఏర్పడింది. కర్ణాటకలో మనకన్నా రెట్టింపు బడ్జెట్ ఇరిగేషన్‌కు ఖర్చుపెడుతున్నారు. గడచిన ఆరు సంవత్సరాలు మనం ఆరువేల కోట్లు కూడా ఖర్చుపెట్టలేదు, అయితే మనకన్నా చిన్న రాష్ట్రమైన కర్ణాటకలో మనకన్నా రెట్టింపుగా పన్నెండు వేలకోట్లు ఖర్చుపెట్టింది. కాబట్టి ఇరిగేషన్ ప్రాజెక్టులు, వెనుకబడ్డ ప్రాంతాలకు సంబంధించిన ప్రాజెక్టులు మరుగునబడ్డాయి. అవి ఎప్పటికైనా కూడా వస్తాయనే నమ్మకం ప్రజలకు లేకపోయే సరికి ఆ ప్రాంతానికి సంబంధించిన ప్రజల్లో విపరీతమైన అసంతృప్తి ఏర్పడింది. దానికి కారణం... ఇదంతా! ప్రత్యేకమైన రాష్ట్రం విషయానికి వచ్చేసరికి ఆ రాష్ట్రం ఫైనాన్షియల్‌గా వయబుల్‌గా వుంటుందా, పొలిటికల్‌గా స్టేబుల్‌గా వుంటుందా అనే విషయాన్ని గూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతయినా వుంది. మరి ప్రభుత్వాలు ఒక నిర్ణయాన్ని తీసుకోవాలి. అన్ని రకాలుగా ఆలోచనలు చేయాలి. చిన్న రాష్ట్రాల వల్ల మేలైన అభివృద్ధి జరగగలుగుతుందనుకుంటే ఆ విధమైన ఆలోచనలు చేయవచ్చు. లేదూ... చిన్న రాష్ట్రాలు మరీ చిన్నవైపోతే దానివల్ల రాజకీయ అస్థిరత్వాలేర్పడుతాయి... దానివల్ల ఎకనమికల్ వయబులిటీస్ వుండవు అనుకున్నట్లయితే... తగు విధమైన చర్యలు తీసుకొని వెనుకబడ్డ ప్రాంతాలను నిజంగా అభివృద్ధి చేసే ప్రయత్నాలు గట్టిగా చేయాలి... చిత్తశుద్ధితో చేయాలి. కానీ ప్రస్తుతమున్న ప్రభుత్వాలు... అటు కేంద్రంగాని ఇటు రాష్ట్రంగానీ ఇటువంటి చిత్తశుద్ధి చూపించకపోవడం వల్లే ఇన్ని సమస్యలొస్తున్నాయి.



ఆ పార్టీతో మాకు పొత్తేమిటండీ... పార్టీనా, మన్నా అది... అదేదో బుడగ మాదిరి వచ్చింది. ఎన్ని రోజులుంటుందో తెలియదు.

* * *

ఇంతకు ముందు కూడా మేమే చేశాం. ఇదేం కొత్తనా? 69, 70, 71, 72 - ఆ మూడు నాలుగు సంవత్సరాలు ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేక ఆంధ్ర... అన్నీ మేమే చేశాం.

❑ తెలంగాణా వెనుకబాటుతనాన్ని అంగీకరిస్తున్నారు. అయితే మీ పార్టీ ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సమర్థిస్తున్నట్లా? లేనట్లా?

కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం తీసుకోవలసిన నిర్ణయం ఇది. వారు ఇవన్నీ కూడా గమనించి తగు నిర్ణయం తీసుకుంటారు.

❑ అధిష్టాన వర్గంతో సంబంధం లేకుండానే మీ పార్టీకి చెందిన తెలంగాణా శాసన సభ్యులు ఒక ఫోరంగా ఏర్పడి తెలంగాణా కోసం పోరాటం చేస్తున్నారు...

అధిష్టాన వర్గంతో సంబంధం లేకుండా కాదు అధిష్టాన వర్గాన్ని ఒప్పించడానికి ఇంప్రెస్ చేయడానికి వారు చేస్తున్న ప్రయత్నం ఇది. మా పార్టీ శాసన సభ్యులు మా పార్టీ అధిష్టాన వర్గాన్ని ఇంప్రెస్ చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను ఈ రోజు నేను తప్పనడం సరికాదు.

❑ అధిష్టాన వర్గం ప్రత్యేక తెలంగాణా విషయంలో ఆమోదం తెలుపకపోతే...

అధిష్టాన వర్గం తీసుకునే నిర్ణయం పార్టీకి చెందిన ప్రతి శాసనసభ్యునికీ శిరోధార్యం.

❑ ప్రత్యేక రాయలసీమ ఉద్యమం కోసం పోరాడతామంటున్నారు మీ పార్టీ శాసన సభ్యులు...

నో కామెంట్!

❑ టి.ఆర్.ఎస్. వల్ల మీ పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందా...

టి.ఆర్.ఎస్. వల్ల మా పార్టీకి నష్టమెందుకుంటుంది. టి.ఆర్.ఎస్.కి ఉన్న క్రెడిబులిటీ ఏమిటో మాకు తెలియదు. దాని నాయకులకు వాళ్లనుకున్న పదవులు వచ్చివున్నట్లయితే ఇవాళ ఆ పార్టీ వుండేదో, లేదో కూడా మాకు తెలియదు. దీని గురించి పెద్దగా మాట్లాడటం కూడా అనవసరం.

❑ మీ పార్టీ శాసన సభ్యులొకరు కాంగ్రెస్ పార్టీ టి.ఆర్.ఎస్.తో పొత్తు పెట్టుకుంటుందని ప్రకటించారు కదా...

సాధారణంగా ఏదైనా సమస్య వచ్చినపుడు కలిసి పనిచేస్తామని చెప్పాడు గాని పొత్తు పెట్టుకుంటామని చెప్పలేదు. ఆ పార్టీతో మాకు పొత్తేమిటండీ... పార్టీనా, మన్నా అది... అదేదో బుడగ మాదిరి వచ్చింది. ఎన్ని రోజులుంటుందో తెలియదు.

❑ తెలంగాణా, సర్కార్ ఆంధ్ర, రాయలసీమ - ఈ మూడు ప్రాంతాల్లోనూ మీ పార్టీ ఎమ్మెల్యేలు ప్రత్యేక రాష్ట్రం గురించి ప్రకటనలిస్తున్నారు...

ఎక్కడైనా... ఇంతకుముందు కూడా మేమే చేశాం. ఇదేం కొత్తనా? 69, 70, 71, 72-ఆ మూడు నాలుగు సంవత్సరాలు ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేక ఆంధ్ర... అన్నీ మేమే చేశాం.

❑ అప్పుడంటే- దాదాపు మీ పార్టీ ఒక్కటే రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖంగా వుంది.

ఇప్పుడైనా మేమే వున్నాం. ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్య పట్ల స్పందించాలంటే మేం చేయాల్సిందే.

❑ పులిచింతల విషయంలో కోస్తాఆంధ్రాలోనూ, తెలంగాణాలోనూ మీ శాసనసభ్యులే పరస్పర విరుద్ధ ప్రకటనలిస్తున్నారు కదా...

కాంగ్రెస్ పార్టీ పులిచింతలకు ఏమాత్రం వ్యతిరేకం కాదు. సమస్యే లేదు. అక్కడ స్థానిక శాసన సభ్యులేమన్నారంటే... ఇక్కడి భూములకు సంబంధించి నష్టపరిహారమిప్పించే ఏర్పాటు చేయండి, వెనుకబడ్డ ప్రాంతాలు కాబట్టి ఈ ప్రాంతానికి సంబంధించిన ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వండి అంతే కానీ వేరే అభ్యంతరాలేం చెప్పడం లేదు●



# స్నేహంగా విడిపోతేనే మంచిది

## తెలంగాణా కాంగ్రెస్ ఫోరం కన్వీనర్ పురుషోత్తం రెడ్డి

❑ ప్రత్యేక తెలంగాణా విషయమై మీ పార్టీ పాత్ర ఏమిటి?

- ప్రత్యేక రాష్ట్రానికి సంబంధించి జరిగే ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం వుంది. పార్లమెంటులో బిల్లు పాస్ కావాలి. అసెంబ్లీతో సంబంధం లేదు. అది కాంగ్రెస్, బి.జె.పి.లు రెండూ అనుకుంటేనే సాధ్యమవుతుంది. మేము ఆ ప్రయత్నం లోనే వున్నాం. మేము ఏదో గొడవలు చేసి, అరాచకాలు చేసే ఉద్దేశం కాదు. ప్రజలకు నచ్చచెప్పి, స్నేహ పూర్వక వాతావరణంలో విడిపోవడం మంచిది. కక్షలు పెంచుకుని, తగాదాలుపడి, విడిపోవడం బాగుండదని మా నిశ్చితాభిప్రాయం.

ఆంధ్ర ప్రాంత సోదరులకు కూడా 'ప్రత్యేక ఆంధ్ర' నినాదాన్ని తీసుకొమ్మని చెబుతున్నాం. వారు కూడా అక్కడ ఒక నగరాన్ని ఎంపిక చేసుకుంటే, హైదరాబాద్ లాగా డెవలప్ చేసుకోవచ్చు. అయితే ఈ ఉద్యమం వల్ల - ఆస్తులు ఎక్కడికీ పోవు. అక్కడి వారి ఆస్తులు ఇక్కడున్నా, ఇక్కడి వారి ఆస్తులు అక్కడున్నా ఇబ్బందేమీ లేదు. అధికారం చెలాయించాలనుకునే వారికే ఇబ్బంది. మేము వుంటేనే మీకు మంచి జరుగుతుందని చెప్పాల్సిన అవసరం వాళ్లకి లేదు. వినే పరిస్థితి మాకు లేదు. ఒకసారి అనుభవం జరిగింది, ప్రయత్నాలు జరిగినయ్. కమిటీలు, ఒప్పందాలు ఎన్నో విఫలమయ్యాయి. పరిస్థితి చాలా క్షీణ దశకు వచ్చింది. ఇన్నాళ్లు ఏదో కల్సి కాపురం చేశాం.

(తరువాయి 8వ పేజీలో)

మే 17న కరీంనగర్‌లో తెలంగాణా రాష్ట్ర సమితి నిర్వహించిన 'సింహగర్జన' సభ దిగ్విజయం కావడంతో మరోసారి 'ప్రత్యేక తెలంగాణా' నినాదం ఎజెండా మీదికి వచ్చింది.

గత కొన్ని రోజులుగా 'తెలంగాణా' సమస్య రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తోంది.

ఇవ్వాళ తెలంగాణా నినాదం పెద్ద ఎత్తున చర్చనీయాంశం కావడంలో చంద్రశేఖరరావు నాయకత్వంలోని తెలంగాణా రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్.)దే ప్రధాన క్రెడిట్.

తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్యమానికి చాలా చరిత్ర ఉంది. ఒకసారి భగ్గుమన్నా ఒకసారి చల్లబడినా ఈ నినాదం తెలంగాణా గడ్డ మీద దశాబ్దాలుగా అపుడపుడూ వినిపిస్తోంది. ఒక్కోసారి బలమైన ఉద్యమరూపమూ తీసుకుంటోంది.

1969లో చెన్నారెడ్డి నేతృత్వంలో సాగిన ఉద్యమం అటుపిమ్మట తెలంగాణా ప్రజాసమితి కాంగ్రెస్‌లో విలీనం కావడంతో ఆగిపోయింది.

ఇటీవల కొన్ని సంవత్సరాలుగా 'తెలంగాణా జనసభ' వంటి సంస్థలు ఉద్యమవ్యాప్తికి కొంత కృషి చేశాయి. ఇంద్రారెడ్డి కొంతకాలం ప్రయత్నించి చివరికి కాంగ్రెస్‌లో చేరిపోయారు.

ఇప్పుడు చంద్రశేఖరరావు డిప్యూటీ స్పీకర్ పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి "తెలంగాణా రాష్ట్ర సమితి" స్థాపించడంతో 'ప్రత్యేక తెలంగాణా' ఉద్యమానికి గట్టి ఊపు వచ్చింది. తెలంగాణా అంతటా వివిధ రాజకీయపక్షాల నుంచి కార్యకర్తలు, నాయకులు రాజీనామాలు చేసి టి.ఆర్.ఎస్.లో చేరిపోతున్నారనే వార్తలు వస్తున్నాయి.

రాష్ట్రంలోని రాజకీయపక్షాలన్నీ, టి.ఆర్.ఎస్. పలుకుబడి పెరిగిపోతోందని భయాందోళనలకు లోనవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

తెలుగుదేశం ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని వ్యతిరేకిస్తోంది. మే నెల చివర్లో విశాఖలో జరిగిన తె.దే. మహానాడులో తెలంగాణా ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని పలు తీర్మానాలు ఆమోదించింది. కాంగ్రెస్ ప్రస్తుతం ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉంది. తెలంగాణా కాంగ్రెస్ నేతల్లో అధికులు బాహాటంగానే ప్రత్యేక తెలంగాణా నినాదంతో గొంతు కలుపుతున్నారు.

ఒకప్పుడు, ప్రత్యేక తెలంగాణా నినాదానికి అనుకూలంగా తీర్మానాలు చేసిన బి.జె.పి. నేతలు, ప్రస్తుతం కేంద్రంలో తమ ప్రభుత్వాన్ని ఆదుకుంటున్న తెలుగు దేశాన్ని ఇబ్బంది పెట్టలేక డైలమాలో ఉన్నారు, మౌనం పాటిస్తున్నారు.

కమ్యూనిస్టులు ఎప్పటిలాగే సమైక్యరాష్ట్రం ఉండాలంటున్నారు. తెలంగాణా అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలంటున్నారు.

పీపుల్స్ వార్ తదితర యం.యల్.




ముఖ్యమంత్రి పదవి, పార్టీ అధ్యక్ష పదవి, స్పీకర్ పదవి, పార్లమెంటరీ పార్టీ నాయకత్వం, చీఫ్ విప్, ఆర్థిక మంత్రి, రెవిన్యూ మంత్రి - ఇలా అన్ని కీలకమైన పదవుల్లోనూ ఒకే ప్రాంతం వారు వుంటారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో గావి, తెలుగు దేశం పార్టీ కార్యాలయంలోగావి తెలంగాణా వారు ఒక్కరు కవిపించరు.



# పార్టీని గ్రాస్‌రూట్ మా సత్తా ఏమిటో

## తెలంగాణా రాష్ట్ర

❑ తెలంగాణా ఏ విధంగా వెనుకబడి ఉందంటారు?

అభివృద్ధి చెందటానికి కావలసిన అన్ని వనరులు, ఖనిజ సంపద, అటవీ సందప వున్న ప్రాంతం ఇది. అన్నీ వుండి కూడా కేవలం నిర్లక్ష్యం వల్ల, వివక్ష వల్ల అన్ని రంగాల్లో వెనుకబడింది. అందుకే తెలంగాణా వెనకబడిన ప్రాంతం కాదని, వెనుక పడేయ బడిన ప్రాంతమని అంటున్నాం. ముఖ్యంగా సాగునీటికి సంబంధించి ఈ ప్రాంతానికి తీవ్రమైన అన్యాయం జరిగింది. కృష్ణా గోదావరి నదులు రాష్ట్రంలోకి ముందు ప్రవేశించేది తెలంగాణా నుంచే. ఈ నదుల పరీవాహక ప్రాంతంలో దాదాపు 69 శాతం ఈ ప్రాంతంలోనే వుంది. ఆ రోజుల్లో కృష్ణా జలాల్లో 277 టి.ఎం.సి ల నీరు



సవాల్‌ను ప్రేమించే తరం కోసం సంధించిన గెలుపు బాణం - జనహర్ష గ్రూపు నుంచి నెలనెలా విజయవిహారం!

గ్రూపులు ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సమర్థిస్తున్నాయి.

వివిధ దళిత బహుజన సంఘాలు, మేధావులు స్థూలంగా 'తెలంగాణా'ను సమర్థిస్తున్నారు. దళిత బహుజనులకి ప్రత్యేక పాత్ర ఉండాలంటున్నారు.

అందరి దృష్టీ ఇప్పుడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కేంద్రీకృత మౌతోంది.

ఈ ఎన్నికలని టి.ఆర్.ఎస్. 'స్వీప్' చేస్తుందని అభిమానులు అనుకుంటున్నారు.

చంద్రబాబు వ్యతిరేక ఓటు టి.ఆర్.ఎస్., కాంగ్రెస్‌ల మధ్య చీలడంవల్ల, టి.డి.పి.కీ అంతిమంగా లాభిస్తుందని లెక్కలు వేస్తున్న వాళ్ళూ ఉన్నారు.

ఒకవేళ టి.ఆర్.ఎస్., కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదిరేపక్షంలో, టి.డి.పి. క్యాంపు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

ఈ రాజకీయ సమీకరణాలని పక్కన పెడితే తెలంగాణా నినాదం ఇప్పటికైతే కలకలం సృష్టిస్తున్నమాట నిజం.

తెలంగాణా సమస్యలో విభిన్న పార్శ్వాలను తడిమి కథనాన్ని వీలైనంత సమగ్రంగా పాఠకులకి అందించాలని 'విజయవిహారం' తరఫున ప్రయత్నించాం.

'తెలంగాణా' సమస్యపైన విభిన్న వక్షాల, వ్యక్తుల వాదనలు ఇక్కడ ఇస్తున్నాం.

ఈ వాదాలన్నింటిలోనూ సీరియస్‌గా గమనించాల్సిన సంగతేమిటంటే - తెలంగాణా వెనకబడిందని, వివక్షకీ, నిర్లక్ష్యానికీ, అన్యాయానికీ గురైందనే సంగతిని అందరూ ఏకగ్రీవంగా అంగీకరిస్తున్నారు.

హర్షించాల్సిన సంగతేమిటంటే ఇవ్వాళ్టి తెలంగాణా ఉద్యమ నాయకత్వం - ఒక ప్రాంతం ప్రజల్ని మరో ప్రాంతం ప్రజలపై రెచ్చగొట్టే విద్వేష రాజకీయాల్ని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఉద్యమాన్ని నడిపిస్తామని విస్పష్టంగా ప్రకటిస్తోంది.

'ప్రత్యేక తెలంగాణా' సాకారమవుతుందా లేదా అనేది ఇప్పుడే నిర్ధారించడం సాధ్యంకాదు. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉద్యమం మరిన్ని దశల్ని అధిగమించాల్సి ఉంది.

ఈ ఆలోచనలు, ప్రయత్నాలు అన్నీ వెనకబడ్డ తెలంగాణా అభివృద్ధిని, అలాగే రాష్ట్రంలో వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధిని అజెండా మీదకి తీసుకువస్తే అది ఆహ్వానించదగ్గ పరిణామమే కదా.

**- ఎడిటర్**





కరీంనగర్ సింహగర్జన సభ దృశ్యం

తెలంగాణాకి, 522 టి.ఎం.సి ల నీరు ఆంధ్రా ప్రాంతానికి ఇవ్వాలని ఉద్దేశించారు. ఆంధ్ర ప్రాంతాలలో ఇప్పుడు 650 టి.ఎం.సి.లు వాడుతున్నారు అంటే ఇవ్వవలసిన దానికంటే ఎక్కువ ఇచ్చారన్న మాట. మైనర్ ఇరిగేషన్‌లో కూడా ప్రభుత్వం చేసిందేమీ లేదు. విషయం చూస్తే - కల్వకుర్తి, జూరాల, భీమ, ఎస్.ఎల్.బి.సి తెలంగాణాలో పాత ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో వున్నా - బడ్జెట్‌లో నిధులు కేటాయించటం తప్ప, నిధులు మాత్రం విడుదల కావు. విడుదలైతే పనులెందుకు కావు? ఎస్.ఎల్.బి.సి. ప్రాజెక్టు నాగార్జున సాగర్‌లో భాగం, కొత్తదేమీ కాదు. సాగర్ కింద 12 లేదా 13 లక్షల ఎకరాలు తెలంగాణాలో సాగు అవ్వాలి. ఆంధ్ర ప్రాంతం అంతా కవరైంది కానీ తెలంగాణా ప్రాంతంలో ఐదారు లక్షల ఎకరాలు దాటలేదు.

ఇక గోదావరి విషయం - మేజర్ ప్రాజెక్టు శ్రీరామ్ సాగర్ స్టేజ్ - 1, స్టేజ్ - 2, స్టేజ్ - 3 కింద తెలంగాణా ప్రాంతంలో 15 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇవ్వాలని ఉద్దేశించారు. అయితే ఇప్పటివరకూ ఇది స్టేజి - 1 దాటలేదు. దీనికింద నీళ్ళు వచ్చింది ఐదున్నర లక్షల ఎకరాలకు మాత్రమే.

ఈ రోజున ఇచ్చంపల్లిని జాతీయ ప్రాజెక్టుగా పరిగణించాలని చంద్రబాబు ప్రధాని దగ్గరకు వెళ్ళి మాట్లాడుతున్నారు. ఆయన గతంలో ఫిబ్రవరి 12 వ

(తరువాయి 8 వ పేజీలో)

# లెవల్ నుంచి నిర్మిస్తున్నాం, చూపిస్తాం !

సమితి అధ్యక్షులు **కె. చంద్రశేఖరరావు**

# అశాంతివల్ల అభివృద్ధి దెబ్బతింటుంది

రాష్ట్ర హోం మంత్రి **టి. దేవేందర్ గౌడ్**



**మాకు చొరవ వుంది, తప్పుల్ని సరిచేసే శక్తి, ధైర్యం వున్నాయి. భావోద్వేగాలు పరిష్కారం కాదు. అన్నింటివి రాజకీయం చెయ్యొద్దు. అభివృద్ధిని ఆపొద్దు.**

❑ **తెలంగాణా వెనుకబాటుకు కారణం**

తెలంగాణా వెనుకబడిందన్నది నిజం. ఈ వెనుకబాటుతనమే ఒకప్పటి తెలంగాణా సాయుధపోరాటానికి, ఇప్పటి నక్సలైట్ హింసకీ వీలు ఇచ్చింది. ప్రజల కోపం ఏదో ఒక తీరులో వ్యక్తం అవుతూనే ఉంది.

వెనుకబాటుతనానికి కాంగ్రెస్ వాళ్ళే కారణం. ఈ ప్రాంతానికి చెందిన నాయకులు ఈ ప్రాంతం కోసం పాటుపడక పోవడం కారణం.

తెలుగుదేశం వల్ల ఈ ప్రాంత ప్రజల్లో పెద్ద మార్పు చైతన్యం వచ్చాయి. చంద్రబాబు నాయకత్వంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం.

❑ **ఇప్పుడు ఉద్యమం ఎందుకొస్తోంది?**

అధికారంలో లేని ప్రతీసారి కాంగ్రెస్ వాళ్ళు ఇలాంటివి లేవనెత్తుతారు.

ఇక్కడ ఉన్న పరిస్థితులకి తోడు ఇటీవల వచ్చిన కొత్త రాష్ట్రాలు బి.జె.పి. నాయకుల మాటలు దీనికి దోహదం చేశాయి.

చంద్రశేఖర రావును మేం పట్టించుకోం. తెలంగాణా పైన ఇన్ని రోజులు ఎందుకు మాట్లాడలేదో ఇప్పుడెందుకు మాట్లాడుతున్నారో ఆయనకే తెలియాలి.

మేం ప్రజలకే జవాబుదారులం. మా దృష్టి పేదరికం అసమానతలని తొలగించడంపైనే.

❑ **ప్రాజెక్టులు అమలుకాకపోవడం, నిరుద్యోగంలో మీ బాధ్యతలేదా?**

గోదావరి నదీజలాల ప్రాజెక్టులపై కొన్ని చిక్కుముళ్ళు ఉన్నాయి. వీటిని ఉపయోగించే ప్రణాళికలు గతంలో ఎవరూ రూపకల్పన చేయలేదు. మేం చేశాం. గోదావరి అథారిటీని నెలకొల్పాం. కేంద్రపై అనుమతులకోసం వత్తిడి తెస్తున్నాం. ఇరిగేషన్‌కి మేం కేటాయింపులు పెంచాం. వివరాలు చెప్పగలం వేలాది స్కూళ్ళు కాలేజీలు పెట్టాం. విద్యావకాశాలు కల్పిస్తున్నాం. పేదరిక నిర్మూలనకి పథకాలతో ముందుకి వెళ్తున్నాం.

భారీగా వనరులు సేకరించి ఖర్చు చేస్తున్నాం. ఏ రంగంలో ఎంత ఖర్చు పెట్టామో చెప్పగలం.

దీనిపై ఎవరితోనైనా చర్చకు సిద్ధం అయితే ఉపాధి అవకాశాల గురించి మేమూ ఆలోచిస్తున్నాం. ఈ ఆందోళనే దేశమంతా ఉంది. ఆర్థిక వ్యవస్థ మెరుగైతే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మా కృషి ఆ దిశగానే ఇటీవల మహానాడులో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపైనే చర్చించి తీర్మానాలు చేశాం.

❑ **ప్రత్యేక రాష్ట్రం వస్తేనే అభివృద్ధి సాధ్యం అని అంటున్నారు కదా?**

బలహీనమైన చిన్న రాష్ట్రాలు, బలమైన కేంద్రం ఉండాలని బి.జె.పి. ఆలోచన. వంద రాష్ట్రాలు ఏర్పడాలని అన్నారు. మేం దీనికి వ్యతిరేకం.

రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రాన్ని ఒత్తిడి చేసి నిధులు సాధించుకుంటాయి. స్థానిక సంస్థలు, రాష్ట్రాలు బలంగా ఉండాలి. ప్రత్యేక రాష్ట్ర వాదం ప్రగతికి ఆటంకమే.

పేదరికం, అసమానత మాటల్లో పోవు. చేతలు అవసరం. నిధులు, ప్రణాళిక, చిత్తశుద్ధి కావాలి.

ఒడిదుడుకులని అనుకూలంగా మార్చుకోగలిగిన దూరదృష్టి, సామర్థ్యం, ప్రతిష్ట కలిగిన నాయకత్వం కావాలి. ఇప్పుడు సరైన పద్ధతిలో వెళ్లకపోతే తర్వాత అవస్థలు పడాలి. ఎవరూ మనకోసం ఆగరు. విలువైన సమయం వృధా అవుతుంది. అశాంతి వల్ల ఇప్పుడిప్పుడే రూపు దిద్దుకుంటున్న అభివృద్ధి దెబ్బతింటోంది. ప్రతీ అవకాశాన్నీ అందుకోవాలి. పొరపాట్లు వుంటే చర్చిద్దాం. దిద్దుకుందాం. సలహాలు తీసుకుంటాం. మాకు చొరవ వుంది, తప్పుల్ని సరిచేసే శక్తి, ధైర్యం వున్నాయి. భావోద్వేగాలు పరిష్కారం కాదు. అన్నింటివి రాజకీయం చెయ్యొద్దు. అభివృద్ధిని ఆపొద్దు ●

## టి.డి.పి.ని ఇబ్బంది పెట్టి
# మేం ఇరకాటంలో పడలేం

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి **బండారు దత్తాత్రేయ**



❑ **తెలంగాణా రాష్ట్ర సమితి చేపట్టిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ప్రభావం ఏ విధంగా వుంది?**

- నాకు తెలిసి ఏ మాత్రం ఇంపాక్ట్ లేదు. టి.ఆర్.ఎస్‌తో పాటు తెలంగాణా కాంగ్రెస్ ఫోరం ప్రభావం కానీ ఏ మాత్రం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటు వంటివి మామూలే అనుకుంటున్నారు. చంద్రశేఖరరావు ఎమ్మెల్యే, డిప్యూటీ పదవులకు రాజీనామా చేసి రావటం వల్ల - ఇతనికి సరైన పదవి దొరకక బయటికి వచ్చి ఉద్యమాలు చేస్తున్నాడు అని అనుకుంటున్నారు. కాంగ్రెస్‌లో సీనియర్ లీడర్లు గతంలో ఇటువంటి ఉద్యమాలు ఎన్నో చేసిన వారే. అందుకే వారి గురించి కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. వారు ప్రత్యేక పి.సి.సి అన్నారు, 41 మంది ఎమ్మెల్యేలతో ఫోరం అన్నారు, చివరికి స్టేట్ లెవల్లోగానీ, నేషనల్ లెవల్లో గానీ ఒక్క తీర్మానం చేయలేకపోయారు. కాంగ్రెస్‌లో చలనం లేదు. మేం గతంలోనే తీర్మానం ఆమోదించి వున్నాం.

❑ **ఇప్పుడు ఎన్డీయేలో మీరు ఒత్తిడి తెస్తున్నారా?**

- అది కుదిరేది కాదు. మొదట ఈ

(తరువాయి 8వ పేజీలో)

# 'కాకినాడ'కే కట్టుబడి వున్నాం

బి.జె.పి. రాష్ట్రశాఖ అధ్యక్షులు **చిలకం రామచంద్రారెడ్డి**



❑ **ప్రత్యేక తెలంగాణా విషయంలో మీ పార్టీ వైఖరి ఏమిటి?**

- మేం 'కాకినాడ తీర్మానం 1998'కి కట్టుబడే వున్నాం. బి.జె.పి చిన్న రాష్ట్రాలకు అనుకూలంగా వుంది. ఆ మార్గంలో కొన్ని కొత్త రాష్ట్రాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు పార్లమెంటులో కూడా తీర్మానాలు చేయడం, అన్ని పార్టీలు ఆమోదించడం జరిగింది. ఇప్పుడే కేంద్రంలో ఎన్డీయే అధికారంలో వుంది. ఎన్డీయే అజెండాలో ప్రస్తుతం ఈ అంశం లేదు. అయినా మేము కేంద్ర పార్టీకి ఒక రిప్రెజెంటేషన్ ఇచ్చాం. వారి ఆదేశాల కొరకు ఎదురు చూస్తున్నాం. రాష్ట్ర పార్టీ మాత్రం 'కాకినాడ'కే కట్టుబడి వుంది.

❑ **కేంద్రపార్టీ ఆదేశాలు వచ్చేలోగా మీ పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందేమో కదా?**

- నష్టం ఏమీలేదు. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితులు ఏమిటో తెలంగాణా ప్రజలకు తెలుసు. ఆమేరకు కేంద్రపార్టీ ఆదేశాలకు కట్టుబడి వుండాల్సిన బాధ్యత రాష్ట్ర పార్టీకి వుంది●

# మేం చేయగలిగింది తక్కువే

బి.జె.పి. ఫ్లోర్ లీడర్ **ఎన్. ఇంద్రసేనారెడ్డి**



❑ **టిఆర్ఎస్ ప్రభావం మీ పార్టీ కేడర్ మీద ఏమైనా ప్రభావం చూపుతున్నదా?**

- ఇంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రావు, జానా రెడ్డి, అంతకుముందు రత్నాకరరావుల ఉద్యమాలవల్ల మాపార్టీకి, మా కేడర్‌కి ఎటువంటి ఇబ్బందీ రాలేదు. మా పని మేం చేసుకుంటున్నాం.

❑ **'98లో ప్రత్యేక తెలంగాణా తీర్మానం చేసి, ఇప్పుడు మళ్లీ కేంద్ర పార్టీ ఆదేశాల మీద భారం వేయటం న్యాయమేనా?**

- అప్పుడు ఎన్నికల్లో మేం ఓడిపోయినాము. ప్రజలు ఎన్నికల్లో వారి నిర్ణయం వారు ఇచ్చారు. ఈ రోజు కేంద్రంలో మిగతా అనేక పార్టీలతో కలిసి ఎన్డీయే పేరుతో ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. కామన్ అజెండాలో ప్రత్యేక తెలంగాణా లేదు. మేం అందరి కోఆర్డినేషన్‌తో ముందుకు పోవాలను కుంటున్నాం.

❑ **ఎన్డీయే అజెండాలో దీన్ని చేర్చేవరకూ మీరేమీ చేయలేరా?**

- మాకైమేం పూర్తిగా అధికారంలో లేనంత వరకూ ఎన్డీయేలో ఈ అంశం చేర్చనంతవరకూ, ఈ ఇష్యూలో మేం చేయగలిగింది తక్కువే. కాకపోతే ఎన్డీయేను ఒప్పించేందుకు కావలసిన వాతావరణాన్ని సృష్టిస్తాం●

సం॥ చందా రూ.180/- ; 5 సం॥ చందా రూ.800/- ; అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

# వారంతా కోస్తా డబ్బు సంచులకు దాస్యం చేశారు

## తెలంగాణా ఐక్య వేదిక ప్రిసీడియం సభ్యులు, కాకతీయ వర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ జయశంకర్ ఇంటర్వ్యూ



**చంద్రశేఖర రావు ఒక దశ. వుంటాడా పోతాడా అనేది వేరే విషయం. పొలిటికల్ యాక్టివిటీ వుంది. జనం కదిలారు. అప్పుడు కేవలం స్టూడెంట్లు, ఎంప్లాయిస్ మాత్రమే. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోకి కూడా పాకింది.**

రాష్ట్రాన్ని ప్రకటించారు. 1956 తర్వాత డెవలప్‌మెంట్ ఎలా జరిగిందీ అంటారు?-అలా హైదరాబాద్ డెవలప్‌మెంట్‌లో మీ పాత్ర వుంటే, విశాఖపట్నం డెవలప్‌మెంట్‌లో మా పాత్రలేదా?

విద్యారంగమే తీసుకోండి. రాష్ట్ర సగటు అక్షరాస్యత కొంచెం అటుఇటూగా 61 శాతం వుంది. కోస్తాలో 63, రాయలసీమ 60, రాజధానిలో 70కి పైగా, తెలంగాణాలో 55 శాతం మాత్రమే వుంది. రాష్ట్రంలో ఇతర వెనుకబడిన ప్రాంతాలకంటే వెనుకబడి వుంది. అక్షరాస్యత విషయంలో దేశంలోనే అట్టడుగున వుంది.

❑ సాగునీటి సమస్య గురించి...?

\- అది చావు బతుకుల సమస్య. తెలంగాణా దక్షిణ భారతదేశంలోని రెండు పెద్ద నదుల మధ్య వుంది. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానదికి వున్న పరీవాహక ప్రాంతంలో 69 శాతం భూభాగం తెలంగాణాలో వుంది. గోదావరికి వున్న పరీవాహక ప్రాంతంలో 79 శాతం భూమి తెలంగాణాది. భౌగోళికంగా చూస్తే మొత్తం రాష్ట్రంలో తెలంగాణాది 42 శాతం భూమి రాష్ట్రంలోని సాగుభూమిలో 41 శాతం ఇక్కడ వుంది. జనాభా 45 శాతం దాటింది. ఇక్కడ వర్షపాతం చాలా ప్రాంతాల్లో తక్కువ వుంది.

నదీజలాల్ని తీసుకుంటే - కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కృష్ణా నదీ నికర జలాల్ని బచావత్ ఎలా పంచిందో, అదే ప్రాతిపదిక మీద మూడు ప్రాంతాలకి నీళ్ల పంచమని అడుగుతున్నాం. రాష్ట్రానికి బచావత్ 800 టి.ఎం.సీ.ల నీరు ఇచ్చింది. తెలంగాణాకి 277 టి.ఎం.సీ.లు ఇచ్చారు. కానీ వాడకంలోకి వచ్చింది మాత్రం 10 నుంచి 15 శాతం మాత్రమే. నాగార్జునసాగర్ దిశను మార్చి, స్వరూపాన్ని మార్చి తెలంగాణాకి అన్యాయం చేశారు. మిగులు జలాలు (శ్రీశైలం కుడికాల్వ - తెలుగు గంగ) రాయలసీమకి ఇచ్చారు. కృష్ణా, భీమ నదులు ప్రవహించే మహబూబ్‌నగర్ జిల్లాలో తాగునీరే లేదు. ఇంక సాగునీరు ఎక్కడ?

కృష్ణా నది ద్వారా- ఆంధ్ర, రాయలసీమ ప్రాంతంలో సాగవుతున్నది 35 లక్షల ఎకరాలు. తెలంగాణాలో చూస్తే కేవలం 5 లక్షల ఎకరాలు మాత్రమే! గోదావరిలో నీళ్లు ఇంకా వున్నయ్, వాడుకోదల్చుకుంటే! బచావత్ ఇచ్చింది 1480 టి.ఎం.సీ.ల నీళ్లు. అందులో సగం ఖర్చయిపోయింది. ఎక్కువ భాగం ధవళేశ్వరానికి వెళ్లాయి. కనీసం ఇంకో 700 టి.ఎం.సీ.ల చిల్లర నీరు వుంది. ఎలా తీసుకురావాలి? ఎత్తిపోతలా? గ్రావిటీనా? అది ప్రజల సమస్య కాదు. టెక్నికల్ ప్రాబ్లమ్.

దీనిలో ముఖ్యమైన మెలిక - ఇచ్చంపల్లి! దీని ఎత్తు 112 మీటర్లా - 95 మీటర్లా అనేది వివాదం. ఈ ప్రాజెక్టుకి అంతర్రాష్ట్ర ఒప్పందం కావాలి 112 మీటర్ల ఎత్తులో కడితే తెలంగాణాకి శాశ్వత నష్టం. దీని స్టోరింగ్ కెపాసిటీ 320 టి.ఎం.సి.లు. వాస్తవంగా ఈ పథకంలో కేవలం 80 టి.ఎం.సి.లే తెలంగాణాకు ఉద్దేశించారు. మిగతా అంతా పవర్ జనరేషన్ ప్రాజెక్టు కోసం. పవర్‌ను మూడు రాష్ట్రాలు పంచుకుంటాయి. పవర్‌ను ఉత్పత్తి చేసిన తర్వాత ఆ నీళ్లు మళ్లీ పోలవరానికి, ధవళేశ్వరానికే పోతాయి. ఇది ఆ ప్రాంతాలకు గుప్తంగా మరో 300 టి.ఎం.సి.ల నీరు అందించే పథకం అన్నమాట.

దీంతో కోస్తా ప్రాంతం రైతులకు సబ్సిడీతో నీరు అందుతుంది. అది ఎలాగంటే ఈ రోజు లెక్కల ప్రకారం ఒక్క ఎకరానికి నీళ్ళు అందించే ప్రాజెక్టుకి లక్షరూపాయలు ఖర్చవుతోంది. 10 లక్షల ఎకరాల ప్రాజెక్టు ఎన్ని కోట్లవుతుంది? ఖర్చు ప్రభుత్వానిదే, అంటే ప్రజలదే కదా! ఆ నీళ్ళను పొలాలకు తీసుకుపోయేవరకూ - ఒక్క ఎకరానికి నీళ్ళు అందించటానికి - ఒక ఏడాదికి ప్రభుత్వానికి 1250 రూపాయలు ఖర్చు అవుతాయి. నీటి తీరువా 50 లేదా వందరూపాయలు - 250 రూపాయలుంది అనుకున్నాగానీ 1000 రూపాయల సబ్సిడీ ఇచ్చినట్టే తెలంగాణా ప్రాంతం వ్యవసాయం బావుల మీద, విద్యుత్ ఆధారంగా జరుగుతోంది. బావి తవ్వకోవాలి, ఇంజన్ కొనుక్కోవాలి. కరెంట్ బిల్లు కట్టాలి. సంవత్సరానికి రెండువేల రూపాయలు ప్రభుత్వానికి కట్టాలి.

ఒకే రాష్ట్రంలో- ఒకే ప్రభుత్వం కింద వున్న రెండు ప్రాంతాల ప్రజలకు సాగునీరు ఒకే రేటుకి ఇవ్వాలా వద్దా?

ఇచ్చంపల్లి మీద ఇప్పుడు సిఎం హడావుడి మొదలుపెట్టాడు. మాక్కావలసింది ప్రాజెక్టు ఎత్తు కాదు, ఎన్ని ఎకరాలు అనేది కాదు - ఎంత నీరు, ఎంత కాలం వాడబోతున్నారు? కృష్ణా జలాల్లో ఎలాగూ ముంచారు. గోదావరిలో ముంచకుండా వుండాలంటే - 700 టిఎమ్‌సిల నీటిలో మా వాటా ఎంతో చెప్పండి అని అడుగుతున్నాం మేం. మేము చిన్న చిన్న ప్రాజెక్టులు కడితే ముంపు సమస్యా ఉండదు, అంతరాష్ట్ర వివాదమూ ఉండదు.

❑ నక్సలైట్ సమస్య గురించి...?

\- నక్సలైట్ల వల్ల అభివృద్ధి ఆగిందా? అభివృద్ధి ఆగిపోవడం వల్ల నక్సలైట్లు పుట్టుకొచ్చారా? కార్యకారణ సంబంధాల్ని వక్రీకరిస్తున్నారు. పోనీ వాదన ప్రకారం చూసినా- నక్సలైట్ల ప్రభావం తక్కువగా వున్న ప్రాంతాలు, జిల్లాలు ఎక్కువ అభివృద్ధి చెందాలి కదా - మరి మహబూబ్ నగర్ ఎందుకు వెనకబడింది? విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల్లో కూడా నక్సల్స్ వున్నారు. అక్కడ అభివృద్ధి ఎలా సాధ్యమైంది? ఇదొక సాకు మాత్రమే.

కొత్తగూడెంలో థర్మల్ పవర్ స్టేషన్, రామగుండంలో థర్మల్ స్టేషన్, ప్రైవేటు సెక్టర్‌లో వరంగల్ జిల్లాలో - అటవీ ప్రాంతంలో వున్న ఎ.పి. రేయాన్స్, అన్నీ సజావుగానే నడుస్తున్నాయి.

తుపాకులతో విప్లవాన్ని తేలేరని నక్సలైట్లకు, తుపాకులతో ఉద్యమాల్ని అణచలేరని ప్రభుత్వాలకు చెబుతుంటాము మేము. నాగార్జున సాగర్ కాలవ దిశ ఎందుకు మారింది? వరంగల్‌లో బస్ పేలితేనో కరీంనగర్‌లో ఇంకేదో దగ్ధమైతేనో మారిపోయిందా? రాజోలిబండ డైవర్షన్ స్కీం నుంచి మహబూబ్ నగర్‌కు నీరు రావాలి. అక్కడి భూస్వాములు - ఇప్పటికీ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అనే భూస్వామి నాయకత్వంలో దాన్ని పగలకొట్టి ఇటు నీరు రాకుండా చేస్తున్నారు. అది సమ్మతమేనా మీకు? దాని గురించి మాట్లాడరు. ఇక్కడ అదే పని ఎవరన్నా చేస్తే నక్సలైట్ సమస్య అంటారు. వందేళ్ల నుంచి రెండు పంటలు పండించే కోస్తావారికి - ఒక్క సంవత్సరం నీళ్లు లేకపోతే, కిన్నెరసాని నుంచి వదిలారు. మెదక్‌లో, నిజామాబాద్‌లో పంటలు మాడిపోతుంటే వాటికి నీరు ఇవ్వటానికి మీకు చేతులు రావు. ఇక్కడి నీటిని మాత్రం వేరే ప్రాంతానికి ఇస్తారు. సింగూరు ప్రాజెక్టు - మెదక్, నిజామాబాద్ జిల్లాల కోసం - కొద్ది శాతం హైదరాబాద్ నగరానికి! కానీ ఎక్కువ శాతం నీటిని నగరానికి తాగించి ఆ జిల్లాలకు అన్యాయం చేస్తున్నారు.

❑ తెలంగాణా వారే ఎక్కువ మంది ముఖ్యమంత్రులయ్యారు అనే వాదన గురించి...

\- నరసింహారావు, అంజయ్య, చెన్నారెడ్డి - ఈ ముగ్గురే. జలగంను గుర్తించం, కోస్తా నుంచి వచ్చాడు. ఖమ్మంను ఆంధ్రలో కలుపుతానన్నాడు. నాగార్జున సాగర్ ఎడమ కాల్వను గుంటూరుకు తీసుకుపోయాడు. అతడి లాయల్టీ అంతా కోస్తాకే. ఈ ముగ్గురూ కలిసి అతి కష్టంగా - ముక్కలు ముక్కలుగా కేవలం ఐదేళ్లు పాలించారు. రాష్ట్రాన్ని ఎక్కువకాలం పాలించింది, పాలిస్తున్నది రాయలసీమ నాయకులు. మరి రాయలసీమ కూడా వెనుకబడిన ప్రాంతం గానే వుండిపోయింది. సంజీవరెడ్డి సొంత జిల్లా అనంతపురం తీవ్ర దుర్భిక్ష ప్రాంతంగా ఎందుకుండిపోయింది? పాలించిన వాళ్లంతా కేవలం కోస్తా డబ్బు సంచులకు దాస్యం చేశారు. పులిచింతల వద్దని రాయలసీమ, తెలంగాణా, గుంటూరు అప్‌లాండ్స్ వారు, అందరూ మొత్తుకుంటున్నారు. కానీ, దాన్ని ఆపితే చంద్రబాబు పదవిలో వుండడు. కృష్ణా జిల్లాలో వున్న డబ్బు సంచులు ఇంకో నాయకుడిని వెతుక్కుంటాయి.

❑ సాంస్కృతికంగా జరుగుతున్న అన్యాయం గురించి...?

తెలంగాణా డయిలెక్ట్‌ను, యాసను అవహేళన చేయడం అనేది - తారా స్థాయికి పోయింది. సినిమాల్లో ఇది బాగా కనపడుతూనే వుంది. సహజంగా స్పందించే గుణమున్న మాజీ ముఖ్యమంత్రి టి. అంజయ్య మాటలకు తాటాకులు కట్టారు. ఈ రకంగా వుంటే సాంస్కృతిక సమ్మేళనం, సమైక్యత ఎలా జరుగుతుంది? 1969 ఉద్యమంలో - విజయభాస్కర రెడ్డి - హైదరాబాద్‌ను వదిలిపోవలసివస్తే, హైదరాబాద్‌ను తగలబెట్టిగానీ పోము అన్నాడు.

❑ చంద్రశేఖర రావు గురించి...?

చంద్రశేఖర రావు ఒక దశ. వుంటాడా పోతాడా అనేది వేరే విషయం. పొలిటికల్ యాక్టివిటీ వుంది. జనం కదిలారు. అప్పుడు కేవలం స్టూడెంట్లు, ఎంప్లాయిస్ మాత్రమే. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోకి కూడా పాకింది●

## వ్యూహాత్మక మౌనం



ఎం.సత్యనారాయణరావు

ప్రత్యేక తెలంగాణా అంశంపై విజయవిహారం కదిపినా వ్యూహాత్మక మౌనం పాటించిన వారున్నారు.

వ్యక్తిగతంగా తాను 'తెలంగాణా'కి అనుకూలమైనా అధిష్ఠానం నిర్ణయం వెలువడేవరకూ ఏమీ చెప్పలేనని పి.సి.సి. అధ్యక్షులు ఎం.సత్యనారాయణరావు చెపితే, 'తెలంగాణా' అంశాన్ని తమ పార్టీ ఇంకా చర్చించి ఒక వైఖరిని నిర్ణయించుకోలేదని మజ్లిస్‌నేత సలావుద్దీన్ ఓవైసీ తెలిపారు●

నివసించవచ్చు. ఆంధ్రాప్రాంతం నుంచి వచ్చినవారి గురించి ఇబ్బంది ఏమీలేదు. వారు బతకడానికి వచ్చారు. ఇక్కడ ఎడ్జస్ట్ అయ్యి బ్రతుకుతున్నారు. ఆ మాటకొస్తే తెలంగాణా వాళ్ల లక్షల సంఖ్యలో మహారాష్ట్ర పోయి బతుకుతున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. వారిద్దరూ అమెరికాలో ఉన్నారు. ఎక్కడ మంచి అవకాశాలు ఉంటే మనుషులు అక్కడికి

**ఆంధ్రాప్రాంతం నుంచి వచ్చినవారి గురించి ఇబ్బంది ఏమీలేదు. వారు బతకడానికి వచ్చారు. ఇక్కడ ఎడ్జస్ట్ అయ్యి బ్రతుకుతున్నారు. ఆ మాటకొస్తే తెలంగాణావాళ్ల లక్షల సంఖ్యలో మహారాష్ట్ర పోయి బతుకుతున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. వారిద్దరూ అమెరికాలో ఉన్నారు. ఎక్కడ మంచి అవకాశాలు ఉంటే మనుషులు అక్కడికి వెళతారు. అదేమీ తప్పు కాదు. ఎక్కడైనా ఆస్తులు కొనుక్కుని అమ్ముకునే హక్కు వుంది. అమెరికాలో ఒక తెలుగువాడు సెనేటర్ అయ్యాడు. మహారాష్ట్రలో ఒక తెలంగాణావాడు ఎం.పి. అయ్యాడు. మహారాష్ట్రలో మూడు నాలుగు వందల మంది తెలంగాణావాళ్ళు సర్పంచులుగా ఉన్నారు. మున్సిపల్ ఛైర్మన్‌లు ఉన్నారు. అందుకని నేను ఎట్టి పరిస్థితుల్లో 'ఆంధ్రా గో బ్యాక్' లాంటి నినాదాల్ని సమర్థించను, అంగీకరించను.**

వెళతారు. అదేమీ తప్పు కాదు. ఎక్కడైనా ఆస్తులు కొనుక్కుని అమ్ముకునే హక్కు వుంది. అమెరికాలో ఒక తెలుగువాడు సెనేటర్ అయ్యాడు. మహారాష్ట్రలో ఒక తెలంగాణావాడు ఎం.పి. అయ్యాడు. మహారాష్ట్రలో మూడు నాలుగు వందల మంది తెలంగాణావాళ్ళు సర్పంచులుగా ఉన్నారు. మున్సిపల్ ఛైర్మన్‌లు ఉన్నారు. అందుకని నేను ఎట్టి పరిస్థితుల్లో 'ఆంధ్రా గో బ్యాక్' లాంటి నినాదాల్ని సమర్థించను, అంగీకరించను. ఇది అర్థ రహితం. నేను ఇచ్చిన ఈ పిలుపుకి మంచి స్పందన వస్తోంది. తెలంగాణా ఉద్యమానికి సంబంధించి, ఏ పార్టీ నాయకులైనా, ఎవరైనా మాకు అన్యాయం జరిగింది అని గొంతెత్తి నినదించేవాడికి - మరో ప్రాంతం ప్రజల మీద ద్వేషం కక్కే నైతిక హక్కు ఉండదు. ఎవరైనా సరే, ఏ ప్రాంతం వారైనా సరే ప్రజల్ని ప్రేమించేవాడు - మంచి నాయకుడవుతాడు. రాజకీయనాయకుడు కాకపోయినా ప్రజానాయకుడు అవుతాడు. బ్రతకడానికి వచ్చిన పేదలు, ఇక్కడ ఏదో ఉద్యోగమో, సద్యోగమో చూసుకుని బతుకుతున్నారు. అదేమీ తప్పుకాదు.

వరంగల్‌కి చెందిన ఒక లంబాడీ గుంటూరులో వ్యాపారం చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జించాడు. నా సొంత మరదల్ని ఈ మధ్యనే కాకినాడకిచ్చాం. ఇక్కడివాళ్ళు అక్కడికి, అక్కడివాళ్ళు ఇక్కడికి.... ఇదంతా కామన్. సమస్యల్లా దోపిడిచేసేవారితోనే. మా పోరాటం వివక్షమీద, నిర్లక్ష్యంమీద, తెలంగాణాకు జరుగుతున్న అన్యాయం గురించి మాత్రమే. శాంతియుత పద్ధతుల్లోనే ఉద్యమాన్ని నడుపుతాం.

❑ చంద్రబాబు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానంటున్నారు కదా?

\- అదంతా డ్రామా. ఒక్క ఉదాహరణ చెపుతాను బ్రదర్... పాత హైద్రాబాద్ రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు ముందు వెళ్లోడి ముఖ్యమంత్రిగా వున్న కాలంలో, కృష్ణా జలాల్లో 480 టి.ఎమ్.సి.లు కేటాయించారు. అందులో హైద్రాబాద్ స్టేట్‌లో భీమా ప్రాజెక్టు సైటు వుంది. ఈ ప్రాజెక్టు ద్వారా హైద్రాబాదు రాష్ట్రానికి 100 టి.ఎమ్.సి.ల నీటిని కేటాయించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడం వల్ల ఆ ప్రాజెక్టు సైటు కర్ణాటకకు వెళ్ళిపోయింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు ఇటువంటి ఇబ్బందులు వచ్చినా ముందుగా చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఆ నీరు ఆయా ప్రాంతాలకు ఇవ్వాలనేది చట్టం. దాని ప్రకారం భీమా ప్రాజెక్టుమంచి వచ్చే నీటితో మహబూబ్ నగర్‌లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆ జిల్లాను దత్తత తీసుకున్నానని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి ఆ ప్రాజెక్టు విషయమై ఎందుకు కృషి చేయడం లేదు?

❑ మీరు ఎన్నో ఏళ్లగా రాజకీయాల్లో ఉన్నా, ఇప్పుడు తెలంగాణా గురించి మాట్లాడుతున్న దాని మీద కొందరు విమర్శిస్తున్నారు?

\- ఎవరు తెలంగాణా గురించి మాట్లాడినా - అదిగో నువ్వు మొన్నటిదాకా ఎందుకు మాట్లాడలేదు? అని అడుగుతారు. అయితే ఈ రోజు మాట్లాడడం తప్పా? పార్టీ అంతర్గత మీటింగుల్లో అనేక సార్లు మాట్లాడాను. పార్టీ అన్న తర్వాత కొన్ని నిబంధనలు, పద్ధతులు ఉంటాయి కాబట్టి ఆ మేరకు లోపలే మాట్లాడాలి. పదవుల కోసమే ఉద్యమాలు అనే వాదం మొదలయ్యింది. నేను సరే, మరి ముఖ్యమంత్రి ఎందుకు ఇచ్చంపల్లి, తెలంగాణా ప్యాకేజీ అంటూ మాట్లాడు తున్నాడు? అదే ప్రశ్న ఆయనకు కూడా వర్తిస్తుంది కదా? నేను మాట్లాడితే తప్పు, ఇన్నాళ్ళకు ఆయన మాట్లాడి ప్రజల్ని ఇంకా భ్రమల్లో పెడుతుంటే అది ఒప్పా? తెలంగాణా గురించి మాట్లాడితే నన్ను అవకాశవాది అంటున్నారు. ముఖ్యమంత్రిది అవకాశ వాదం కాదా? బి.జె.పిది పచ్చి అవకాశం వాదం కాదా? కుర్చీల కోసం కొట్లాడేవాళ్ళకి కుర్చీలను విడిచిపెట్టిన నా గురించి మాట్లాడే నైతిక హక్కులేదు.

❑ ఉద్యమానికి ప్రజాస్పందన ఎలాఉంది?

\- ప్రజలు ఎప్పుడూ తెలంగాణాని కోరుతునే వున్నారు. నేను కరీంనగర్‌లో పెట్టిన మీటింగుకి లక్షలాది మంది ప్రజలు హాజరయ్యారు. వారంతా వాలంటరీగానే వచ్చారు. నిర్లక్ష్యం, వివక్ష, అన్యాయం ప్రజల అనుభవంలో ఉన్నాయి. బాధలు పడేది వారు. ప్రజలు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 1972 లోనే చెప్పారు. ఎన్నికల్లో తెలంగాణా ప్రజాసమితిని గెలిపించారు. ఆనాడే ఒక రిఫరెండం అయిపోయింది.

❑ కృష్ణ మాదిగ, రాబోయే తెలంగాణాలో 87 శాతంగా వున్న దళిత బహుజన మైనారిటీలకు రాజ్యాధికారంలో అంతే శాతం షేరు కోసం చేస్తున్న డిమాండ్ గురించి ఏమంటారు?

\- ఈ రోజు ఉమ్మడి రాష్ట్రంలో ఆయన షేరు ఏమిటో చెప్పమనండి? ముఖ్యమంత్రికి అమ్ముడుపోయిన వాళ్ళు మాట్లాడే మాటలివి. తెలంగాణా అనగానే ఇటువంటివి మాట్లాడుతున్నారు. ప్రజల మనోభావాలను కలుషితం చేస్తున్నారు. తెలంగాణా వచ్చాక ఈ విషయాలు మాట్లాడుకోవచ్చు. తెలంగాణా వచ్చాక కూడా వారుతమ వాటాకోసం ఉద్యమించ వచ్చు. సిద్ధాంత రాద్ధాంతాలను పక్కన పెట్టి ముందు తెలంగాణా సాధన కోసం అందరూ అన్ని పార్టీల వారు సిద్ధాంతాల వారు కృషి చేయాలని కోరుతున్నారు. ఇది కులాల,మతాల ఉద్యమంకాదు. తెలంగాణాలో యావన్మంది ప్రజలకు ప్రయోజనం కలిగేలా మనం ప్రజాస్వామిక తెలంగాణాను రూపొందించుకోవాలి. సామాజిక న్యాయం ప్రకారం ఎవరి వాటా వారు సాధించుకోవాలి. నేను ప్రజల మనిషిని. నా నియోజక వర్గంలో నా కులస్థుల ఓట్లు 200 కంటే మించవు. కానీ నన్ను ప్రజలు కులమతాలకు అతీతంగా గెలిపిస్తూనే వచ్చారు.

❑ పంచాయితీఎన్నికల్లో గెలుస్తామన్న ఆత్మవిశ్వాసంతోనే ఉన్నారా?

\- మా సత్తా ఏమిటో పంచాయితీ ఎన్నికల్లో చూపించబోతున్నాం. ప్రస్తుతం పార్టీని గ్రామ స్థాయిలోకి తీసుకువెళ్ళి, గ్రాస్ రూట్ లెవల్ నుంచి నిర్మిస్తున్నాం. తెలంగాణాలోని మూడవ వంతు మండలాల్లోకి ఇప్పటికే చొచ్చుకుపోయాం. గత ఉద్యమాలకి, ఈ ఉద్యమానికి తేడా - ఇప్పుడు ఇది గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది. అదే గొప్ప మలుపు ●

సం॥ చందా రూ.180/- ; 5 సం॥ చందా రూ.800/- ; అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

# తెలంగాణా

## దాశరధి రంగాచార్య

తెలంగాణా ప్రాంతం మాత్రం 300 ఏళ్ల వెనుకబడిపోయింది.

❑ తెలంగాణాలో కూడా చైతన్యం పెరిగింది, ఉద్యమాలు కూడా వచ్చాయి కదా?

- మాడపాటి హనుమంతరావు వంటి పెద్దలు ' నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభ' ప్రారంభించి, తెలుగు వేషభాషల్ని రక్షించటానికి, తెలుగువారిలో చైతన్యం పెంచటానికి పూనుకున్నారు. తర్వాత కాలంలో ఇదే ఆంధ్రమహాసభగా ప్రసిద్ధిగాంచింది. కమ్యూనిస్టులు ఆంధ్రమహాసభలో ప్రవేశించి, ప్రజలలో చైతన్యం కలిగించేందుకు ఒక మహోద్యమాన్ని ప్రారంభించారు. ఇది కేవలం నిజాం వ్యతిరేకపోరాటమే కాదు, పెత్తందారులకి, జాగీర్దారులకి, మొత్తం భూస్వాములకీ వ్యతిరేకంగా నడిచింది. తెలంగాణ ప్రజలలో అతికొద్ది s వందేళ్ల స్వాతంత్రోద్యమంలో ఇటువంటి

(తరువాయి 12వ పేజీలో)

ఉద్యమాన్ని ఆయన ప్రారంభించలేదు. చాలా తక్కువ మందికి ఆ విషయం తెలుసు. అప్పటికే 10 నెలలుగా ఉద్యమముంది. ఆయన మొదట ఉద్యమాన్ని చేజిక్కించుకున్నాడు, తర్వాత నాశనం చేశాడు.

చెన్నారెడ్డి ఈ పని చేస్తుంటే, విమర్శించే బదులు తెలంగాణా మేధావులు ఆయన్ని అనుసరించారు. నేను విమర్శించాను. అసలు చెన్నారెడ్డి అధ్యక్షుడు కావాలని ఎందుకు అనుకోవాలి? ఉద్యమంలో పని చేయవచ్చు కదా, నా భయం ఏమిటంటే ఓసారి అధ్యక్షుడయ్యాక ఉద్యమాన్ని నాశనమే చేస్తాడు. ఆయన అదే చేశాడు. చివరికి కాంగ్రెస్‌లో చేరాడు.

ఈ రోజైనా సరే, తెలంగాణా మేధావులు ఒక ప్రెషర్ గ్రూప్‌లాగా పని చేయాలి. కానీ రాజకీయ నాయకులకి లొంగిపోతే ఈ మేధావుల విశ్వసనీయత దెబ్బతింటుంది. రేప్పొద్దున్న ద్రోహం జరిగితే చెయ్యగలిగేది ఏమీ లేదు.

నేను చాలా పరుషమైన భాష మాట్లాడుతున్నానని అంటున్నారు. నిజానికి నేను మాట్లాడేది రాజకీయ భాష.

అసలు ఉద్యమాన్ని ఒక వ్యక్తి ఎందుకు డామినేట్ చెయ్యాలి? ఎందుకు కంట్రోల్ చెయ్యాలి?

(తరువాయి 13వ పేజీలో)

దూసుకుపోయింది. దాంతోపాటు కేవలం వర్షాధార ప్రాంతాలను గుర్తించి విద్యుత్ కనెక్షన్ల ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడం జరిగింది. దానివల్ల వెనుకబడ్డ ప్రాంతాలైన రాయలసీమ, తెలంగాణా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అభివృద్ధి పెరిగింది. తాత్కాలికంగానైనా ఆకలికేకలు సద్దుమణిగాయి.

❑ ఎక్కువ శాతం మంది ప్రత్యేక తెలంగాణాను కోరుకుంటున్నట్టున్నారు కదా..

- కావచ్చు, కాకపోనూ వచ్చు. ఎందుకంటే 50 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ప్రజాఉద్యమాన్ని

(తరువాయి 13వ పేజీలో)

ఉద్యమకారులు కోస్తా ప్రజల పట్ల కోస్తా ఆంధ్రా స్త్రీల పట్ల చేసిన ద్వేషపూరితమైన, అసభ్యకరమైన వ్యాఖ్యలను ప్రస్తావించి విమర్శించడం చర్చకు దారితీస్తోంది ●



# ఉద్యమాలు చేసి సాధించుకున్న రాష్ట్రాన్ని ముక్కలు చేసుకోవటం మంచిదికాదు

## సి.పి.ఎం. రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు



❑ ప్రత్యేక తెలంగాణా గురించి మీరేమంటారు?

- తెలుగు భాష మాట్లాడే ప్రజలంతా అనేక ఉద్యమాలు చేసి, ఒక చరిత్ర నేపథ్యంలో సాధించుకున్న ఆంధ్రప్రదేశ్‌ను రెండు లేదా మూడు ముక్కలు చేసే ప్రయత్నం మంచిది కాదని మా పార్టీ అభిప్రాయపడుతోంది. మేము తెలుగు ప్రజానీకం ఐక్యతనే కోరుకుంటున్నాం.

రాష్ట్రాన్ని విభజించగానే ఆటోమేటిగ్గా వెనకబడిన ప్రాంతాలు వెంటనే అభివృద్ధి చెందుతాయని మేం అనుకోవడం లేదు. ఎందుకంటే, వెనుకబాటు తనానికీ, చిన్నచూపుకీ - విభజనకీ సంబంధం లేదు. వెనుకబాటు తనం అనేదీ సాపేక్షంగా వుంది. రాష్ట్రంలో తెలంగాణా ప్రాంతం నిస్సందేహంగా వెనుకబడిన ప్రాంతం. మళ్లీ అందులోనే పోల్చి చూసుకుంటే కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ లాంటి ప్రాంతాలు ఇంకా వెనుకబడి వున్నాయి. ఆంధ్రాలో ఉత్తరాంధ్ర ప్రాంతం బాగా వెనుకబడి వుంది. తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలకంటే కూడా బాగా వెనుకబడి వుంది ఈ ప్రాంతం. అలాగే ప్రకాశం జిల్లా, రాయలసీమ ప్రాంతాలు బాగా వెనుకబడి వున్నాయి. అందుకే వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను తీసుకుని కృషి చేయాల్సి వుంది. అంతేగానీ విడిపోవడమే పరిష్కారం కాదు.

❑ వనరులన్నీ సంపన్న ప్రాంతాలకే తరలిస్తున్నారన్న వాదనపై మీరేమంటారు?

- అయితే దీనికి బాధ్యత ఎవరిది? పరిపాలన చేసేవారిది. నిన్నా మొన్న కాంగ్రెస్ పార్టీ, ఇవాళ తెలుగుదేశం పార్టీలే రాష్ట్రాన్ని పాలిస్తూవచ్చాయి. ఇపుడు విభజన కోరుతున్న వారితో సహా అనేకులు ఆ రెండు పార్టీలలో పనిచేసిన వారే, అధికారాన్ని అనుభవించిన వారే! తమ పార్టీలు, తాము చేసిన వైఫల్యాలను ఇప్పుడు పునాదిగా చేసుకుని విభజన కోరటం ప్రజలను అపహాస్యం చేయడం తప్ప మరొకటి కాదు. ఇప్పటికీ ఆ పార్టీలతో పోట్లాడటం ద్వారా సమైక్యాంధ్రలో కూడా అభివృద్ధి చెందటం సాధ్యమే!

❑ చిన్న రాష్ట్రాల వాదన కూడా వుంది కదా!

- అవును. వెనుకబాటుతనం అనేదానితో నిమిత్తం లేకుండా కూడా చిన్న రాష్ట్రాలయితే మేలు అనే వాదన కూడా వుంది. ఉత్తర ప్రదేశ్‌లో సంపన్న ప్రాంతం వారు తమ ప్రాంత వనరులన్నింటినీ వెనుకబడిన ప్రాంతాలకు తరలిస్తున్నారని, అందుకే తమకు హరితప్రదేశ్ అనే ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని గొడవ చేస్తున్నారు. విచిత్ర మేమిటంటే, బిజెపి - వెనుకబాటు తనంతో వచ్చే డిమాండ్‌నే కాకుండా, ఈ విరుద్ధమైన డిమాండ్‌నూ బలపర్చటం. బిజెపికి చిన్న రాష్ట్రాలుంటే మంచిది - ఎందుకంటే అధికారాన్ని కేంద్రీకరించు కోవటం సులభం. ఒకే భాష వున్న రాష్ట్రాలు రెండు మూడు ముక్కలైతే వారికి లాభం. భాష పేరుతోనో ప్రాంతం పేరుతోనో ప్రజలంతా ఐక్యంగా, బలంగా వుండే అవకాశం పోతుంది. అప్పుడు కేంద్రం సులభంగా పెత్తనం చేయవచ్చు. కేంద్రం దయాదాక్షిణ్యాల మీద రాష్ట్రాలు ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది ఫెడరలిజానికి, రాజ్యాంగ స్ఫూర్తికీ విఘాతం. అప్పుడు హిందుత్వను రుద్దటం, విస్తరించటం వారికి తేలికవుతుంది. ఈ బిజెపి 'కుట్ర'లోకి విభజన కోరుతున్న వారు కూడా పడే ప్రమాదం కనిపిస్తోంది.

> బిజెపికి చిన్న రాష్ట్రాలుంటే మంచిది - ఎందుకంటే అధికారాన్ని కేంద్రీకరించు కోవటం సులభం. ఒకే భాష వున్న రాష్ట్రాలు రెండు మూడు ముక్కలైతే వారికి లాభం... అప్పుడు కేంద్రం సులభంగా పెత్తనం చేయవచ్చు. కేంద్రం దయాదాక్షిణ్యాల మీద రాష్ట్రాలు ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది ఫెడరలిజానికి, రాజ్యాంగ స్ఫూర్తికీ విఘాతం. అప్పుడు హిందుత్వను రుద్దటం, విస్తరించటం వారికి తేలికవుతుంది. ఈ బిజెపి 'కుట్ర'లోకి విభజన కోరుతున్న వారు కూడా పడే ప్రమాదం కనిపిస్తోంది.

❑ తెలంగాణాకు ప్రత్యేక సంస్కృతి ఉంది. కాబట్టి వేరే రాష్ట్రం కోరుతున్నామని కొందరంటున్నారు?

- కొందరు మేధావులు తెలంగాణాను వెనుకబడిన ప్రాంతంగానే కాదు, ఇదొక ప్రత్యేక జాతి, భాష వేరు, సంస్కృతి వేరు, ఆచార వ్యవహారాలు వేరు. అందుకే వేరే రాష్ట్రం కోరుతున్నామని అంటున్నారు. ఇది కూడా సరైంది కాదని మేం భావిస్తున్నాం. మాండలికాలు, యాసలు... ఇలా అనేక వ్యత్యాసాలు అనేకం వుండొచ్చు. తెలుగు భాష ఒకటే. స్వాతంత్రోద్యమ కాలంలో కూడా తెలంగాణా ప్రాంతంలో తెలుగు భాషా నిలయాలు, తెలుగు భాష ప్రచారం కోసం కృషి జరిగాయి. తెలుగు భాష మాట్లాడేవారు అంతా ఒకటే అనే భావం ప్రజలలో వేళ్లూనుకుంది. అది మనం కాదంటే పోయేది కాదు.

ఇప్పుడు నిరుద్యోగం, ఉన్న ఉపాధి అవకాశాలు దెబ్బతినటం లాంటి అనేక సమస్యలవల్ల తెలంగాణా యువతలో అసంతృప్తి వుంది. అందుకే వారిలో ఈ వాదం పట్ల సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. వాళ్లను తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఇంకో మార్గం లేదు, ఇదైనా తమ సమస్యలను పరిష్కరించగలదేమోనన్న ఆశ వారిది. అయితే విభజనే పరిష్కారం కాదని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

❑ విభజన వాదం నష్టదాయకమనే అంటారా?

- విభజన వాదం, తెలంగాణాలోని కులవివక్షను, శాంతిభద్రతల సమస్యను, భూస్వాముల దోపిడీని అరికట్టదు. అమాయకుల మీద పెరిగిపోతున్న స్టేట్ రిప్రెషన్ తగ్గదు. ఇవన్నీ ఏం జరగకుండా కేవలం రాష్ట్రం ఒక్కటే వస్తే, సామాన్య ప్రజలకు ఒరిగేదేమీ వుండదు. బడా పెట్టుబడిదారీ వర్గం కూడా విభజనే కోరుతోంది. మరోవైపు పీపుల్స్‌వార్ కూడా కోరుతోంది. వారికి ఏదో ఒక గడబిడ కావాలి. కాశ్మీర్, వేర్పాటును, ఉల్ఫాను, .... ఇలా అన్నింటిని సమర్థిస్తారు. ప్రతి తుపాకీ గొట్టాన్ని బలపరిచే ప్రయత్నం చేస్తూ వుంటారు.

❑ **తెలంగాణా వెనుకబాటుతనం పరిష్కారానికి మీరు చేసిన కృషి ఏమిటి?**

- మేం 1969 నుంచి స్పష్టమైన వైఖరి తీసుకున్నాం. ప్రత్యేకమైన ప్రణాళికలు, నిధులు, యంత్రాంగం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చాం. గోదావరి నదీజలాల సమస్య మీద, ఎస్.ఎల్.బీ.సి., శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుల నిర్మాణానికి మా రైతు సంఘాలు ఆందోళన చేశాయి. అలాగే 610 జీ.వో. అమలు జరపమని

(తరువాయి 13వ పేజీలో)

# ప్రత్యేక రాష్ట్రం పరిష్కారం కాదు ప్రాజెక్టుల సాధనకి ఉద్యమించాలి



## సి.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి

> తెలంగాణాకు న్యాయం జరగలేదనే విషయంలో కమ్యూనిస్టు పార్టీ ఏకీభవిస్తుంది. వేగంగా, ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షను సంపూర్ణంగా అర్థం చేసుకుంటున్నదీ, బలపరుస్తున్నదీ. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతోనే సమస్య పరిష్కారం అవుతుందనే వాదనతో మాత్రం ఏకీభవించదు.

> సమైక్య రాష్ట్రంలో కూడా మన అభివృద్ధిని సాధించవచ్చు. తెలంగాణా వెనకబాటు తనానికి కోస్తాలోని, రాయలసీమలోని తెలుగు భాష మాట్లాడే సోదర ప్రజలు కారణంకాదు. కేవలం పాలకులే దీనికి కారణం. ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పోరాడాలి. ప్రాజెక్టు సాధనకోసం ఉద్యమించాలి.

❑ ప్రత్యేక తెలంగాణాపై మీ పార్టీ వైఖరి ఏమిటి?

- మాపార్టీ మొదట్నుంచి 'సమైక్య రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి' అనే నినాదంతోనే పనిచేస్తున్నది. వాస్తవానికి 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే నినాదంతో 1940ల నుంచి - విభిన్న ముక్కలుగా చీలివున్న తెలుగు ప్రజలందరికీ ఒక సమైక్య రాష్ట్రాన్ని సాధించే కృషి చేసింది. ఆనాడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వున్న తెలుగుప్రాంతాలు , కర్ణాటకలోని కోలారు ప్రాంతం, నిజాం పాలనలో వున్న తెలంగాణా ప్రాంతం, ఒరిస్సాలోని కొన్ని తెలుగుప్రాంతాలు - వీటన్నింటిని కలుపుకుని తెలుగు వారందరికీ ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని మిగతాపార్టీలతో సహా కమ్యూనిస్టుపార్టీ పనిచేసింది. ఇతరభాషల వారు మన పట్ల వివక్ష చూపుతున్నారని, అన్యాయం చేస్తున్నారని, డామినేట్ చేస్తున్నారనే అభిప్రాయం - పదేపదే రాకుండా చూసేందుకు గాను ఇది ఉపయోగపడుతుందని భావించాం. 1956లోనే విశాలాంధ్ర ఏర్పడినా, రాష్ట్రంలో జరగాల్సిన రీతిలో అభివృద్ధి జరగలేదు. తెలంగాణ, ఉత్తరాంధ్రజిల్లాలు, దక్షిణాంధ్రలో ప్రకాశం జిల్లా, రాయలసీమ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదు. తెలంగాణాకు సంబంధించి, ప్రత్యేక సమస్య - వర్షపాతం తక్కువగా వుండటం. దీనితో పాటు ఏళ్లతరబడి ప్రాజెక్టులు పెండింగ్‌లో పడి ఆగిపోవటం - ఈ పరిస్థితుల్లో కరువు కాటకాలు పెరిగాయి. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఇతర ప్రాంతాలతో పోల్చి చూసుకున్నప్పుడు - సహజంగానే తెలంగాణా ప్రజలలో తమకు వివక్ష జరుగుతున్నదన్న అసంతృప్తి, ఆవేదన పెరిగాయి. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలలో వస్తున్న మార్పులు, ప్రైవేటీకరణ లాంటి ప్రజావ్యతిరేక విధానాల దుష్ఫలితాలు తెలంగాణలో మరింత వికృతంగా ప్రతిఫలిస్తున్నాయి. రైతుల ఆత్మహత్యలు, చేనేత మరియు పవర్‌లూమ్ కార్మికుల ఆత్మహత్యలు ఇందుకు నిదర్శనం. నిజాం షుగర్స్, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ, తాండూరు సిమెంటు ఫ్యాక్టరీ, ఆల్విన్, ఆజంజాహి లాంటి పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. ఉన్న ఉద్యోగాలు పోవటం, మరోవైపు కొత్త ఉద్యోగావకాశాలు లేకపోవటం వల్ల ఈ ప్రాంతపు ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

విద్యుత్‌చార్జీలు పెంచటం వల్ల, విద్యుత్ మీద ఆధారపడే వెనుకబడిన ప్రాంతాల రైతులు సహజంగానే ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో వున్న సాగుభూమిలో - ఇరిగేషన్ ద్వారా, ప్రాజెక్టుల ద్వారా సాగు అయ్యే భూమి కోస్తాలో 34 శాతం వుంటే, తెలంగాణా రాయలసీమలలో 7 లేదా 8 శాతం కూడా లేదు. తెలంగాణాలో భూగర్భజలాల మీద ఆధారపడాల్సిన పరిస్థితి. అందుకే విద్యుత్ ఛార్జీల సమస్య ఇక్కడే ఎక్కువ. దానికితోడు నక్సలైట్లను అణిచేపేరుతో బోగస్ ఎన్‌కౌంటర్లు, అమాయక యువకులను హత్య చేయడం, పోలీసుల దౌర్జన్యాలూ పెరిగిపోయాయి.

అభివృద్ధి జరిగిన ప్రాంతాలతో వున్నన్ని స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు ఈ ప్రాంతంలో లేవు. ఇందులో చాలా సమస్యలనే ప్రభుత్వమే తీసుకొచ్చిపెట్టింది. పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. గోదావరి నదీజలాల ఎత్తిపోతల పథకం ద్వారా 47 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం వున్నది. ఈ పథకం ఒక్కటే కాదు, శ్రీరాంసాగర్ రెండవదశ, వరదకాల్వ, ఎస్ఎల్‌బిసి, భీమ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం లాంటి అనేక ప్రాజెక్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.

సహజంగానే, ఈ ప్రాంత ప్రజల్లో ఒక అసంతృప్తి - మిగతా ప్రాంతాల మాదిరిగా తాము అభివృద్ధి చెందలేదన్న ఒక న్యాయబద్ధమైన ఆవేదన పెరిగింది. సమతూకంతో కూడిన అభివృద్ధి జరగనందు వల్ల తమ పట్ల వివక్ష చూపుతున్నారన్న ఆలోచన మధ్యతరగతి మేధావి వర్గాలలో రోజురోజుకి పెరుగుతూవచ్చింది.

ముప్పై ఏళ్ళనాడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కారు. రీజనల్ కౌన్సిల్‌ను ఎన్.టి.రామారావుగారు రద్దు చేశారు. తెలంగాణా ప్రాంతంలోని 4,5,6 జోన్‌లలో 59,000 మంది ఇతర ప్రాంత ఉద్యోగులు ఉన్నారని, వారిని సూపర్ న్యూమరి పద్ధతి ద్వారా వారి ప్రాంతాలకి బదిలీ చేసి, ఆ ఖాళీలను స్థానికులతో పూరించాలని, 1985లో 610 జీ.ఓ. జారీ చేసి దాని అమలు చేయలేదు.

ఈ నేపథ్యంలో ప్రజల్లో చాలా తీవ్రమైన అసంతృప్తి, ఆవేదన, కోపం రగులుతూ వచ్చాయి. వీటన్నింటికీ పరిష్కారమార్గంగా కొందరు ప్రత్యేక రాష్ట్రాన్ని సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా

(తరువాయి 13వ పేజీలో)

అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

సామాజిక స్పృహనీ, చైతన్య స్ఫూర్తినీ కలిగించే
అన్నమయ్య స్వరార్చనకే అంకితమవుతానంటున్న

# జ్యోతిర్మయి




అన్నమాచార్య సంకీర్తనామృతం ఎంత మధురంగా వుంటుందో ఒక శోభారాజు, ఒక బాలకృష్ణప్రసాద్, ఒక జ్యోతిర్మయి నోట విన్నప్పుడు గాని తెలియదు. మనిషి జీవితంలోని, ఆలోచనల్లోని, ఆచరణలోని డొల్లతనాన్నీ, చీకటి కోణాల్నీ ఎత్తి చూపుతూ - సమాజం పట్ల స్పృహనీ, స్ఫూర్తినీ, ఆలోచనల్లో అభ్యుదయ ధోరణినీ నూరిపోసే వేలాది అన్నమాచార్య సంకీర్తనలకి, ఆయన సాహిత్యానికీ విశేష ప్రచారం తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా అదే జీవిత ధ్యేయంగా కృషి చేస్తున్న యువ సంగీత విదుషీమణి 28 ఏళ్ల కొండవీటి జ్యోతిర్మయి. అన్నమయ్య సంకీర్తనాగానంతో జ్యోతిర్మయి ఇప్పుడు ప్రతి తెలుగింటికీ పరిచయమైంది.

తల్లితండ్రుల ప్రోత్సాహంతో చిన్నప్పుడే సంగీతం మీద ఆసక్తి పెరిగి పదో ఏటనుంచే సాధన మొదలుపెట్టింది. కర్నాటక సంగీతంలో 'సంగీత విశారద', 'సంగీత ప్రవీణ' డిగ్రీలు పొందింది. ఒకవైపు నిరంతరం స్వరసాధన కొనసాగిస్తూనే మరొకవైపు ఇంగ్లీషు లిటరేచర్‌లో డిగ్రీని కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిప్లొమా కోర్సు పూర్తి చేసింది. అన్నమయ్య కీర్తనలు, సాహిత్యం ఆమెని బాగా ఆకర్షించాయి. క్రమంగా ఆసక్తి ఎక్కువైంది. ఆ కీర్తనల ప్రచారాన్నే కెరీర్‌గా చేసుకోవాలని నిశ్చయించుకుంది. అన్నమయ్య సంకీర్తనా గానంలో సుప్రసిద్ధుడైన జి. బాలకృష్ణ ప్రసాద్, శతావధాని మేడసాని మోహన్ ఆమెను వెన్ను తట్టారు. తిరుమల-తిరుపతి దేవస్థానం వారి అన్నమాచార్య ప్రాజెక్టులో శిక్షణ పొంది, ఉత్తమ పరిశోధకురాలిగా ప్రశంసలు పొందింది. మరోవైపు టీవీ ఛానెల్లలోనూ, రేడియో ద్వారానే కాక ఎన్నో సంగీత పోటీలు, కచేరీల ద్వారా జ్యోతిర్మయి ప్రతిభ రాష్ట్ర నాలుగు దిక్కులా వ్యాపించింది. యూనివర్శిటీ స్థాయిలో నిర్వహించిన దాదాపు అన్ని పోటీల్లోనూ ఉత్తమ గాయని అవార్డులు ఆమెకే దక్కాయి. యునెస్కో క్లబ్ ద్వారా 'సంగీత రత్నశ్రీ' విశిష్ట పురస్కారం పొందింది.

ప్రస్తుతం అన్నమయ్య సంకీర్తనలకు విస్తృత ప్రచారం కల్పించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని కల్యాణ్ నగర్-3 (ప్లాట్ 122)లో కళాపీఠం ఏర్పాటు చేసి ఔత్సాహికులకు శిక్షణ ఇస్తోంది. అన్నమాచార్య - టిటిడి ప్రాజెక్టు వారు వెలుగులోకి తెచ్చిన, ఇంకా తెస్తున్న వందలాది సంకీర్తనల్ని అద్భుతగానం చేస్తూ, అన్నమయ్య స్వరార్చనకే తన జీవితాన్ని అంకితం చేస్తానంటోంది జ్యోతిర్మయి●




మూడున్నర లక్షల మందితో పోటీపడి నాలుగవ ర్యాంకు సాధించడమంటే మాటలా! కేవలం ఇరవైమూడేళ్ల వయసులో ఈ అద్భుతాన్ని సాధించి ఐ.ఎ.ఎస్.కు ఎంపికై మహామహా మేధావుల్నే ఔరా అనిపించింది స్మితాదాస్. మన రాష్ట్రానికి గత రెండు దశాబ్దాలలో సివిల్స్‌లో ఈ ర్యాంకు దక్కడం ఇదే మొదటిసారి. తోటివాళ్లంతా కంప్యూటర్ వెల్లువలో పడి కొట్టుకుపోతుంటే స్మిత ఐ.ఎ.ఎస్.నే తన ఏకైక లక్ష్యంగా ఎంచుకుంది. దానికోసమే చదివింది. ఏ ఇతర పోటీ పరీక్షల్నీ పట్టించుకోలేదు. పట్టుదలతో చివరికి దాన్ని సాధించింది.

సివిల్స్‌లో జాతీయ స్థాయిలో నాలుగవ ర్యాంకు సాధించి,
23 ఏళ్ల వయసులోనే ఐఎఎస్‌కి ఎంపికైన

# స్మితా దాస్

ఆమె ప్రొఫైల్‌ని పరిశీలిస్తే - స్మిత సాధించిన విజయం ఎంత అపురూపమైందో తెలుస్తుంది. పుట్టుకతో బెంగాలీ అయినా ఆమె చదువంతా చాలావరకు హైదరాబాద్‌లోనే జరిగింది. తండ్రి పి.కె.దాస్ రిటైర్డ్ కల్నల్. తండ్రి ఉద్యోగ రీత్యా స్మిత స్కూలు చదువు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగింది. 1992లో ఆయనకి హైద్రాబాద్‌కి బదిలీ కావడంతో స్మిత కుటుంబం అప్పటినుంచి ఇక్కడే స్థిరపడింది. తల్లి పూరబీ దాస్ ఆర్.కె. పురంలోని ఆర్మీ స్కూల్‌లో టీచరు.

పదవతరగతి దాకా ఆర్మీస్కూలులో చదివిన స్మిత సెంట్ ఆన్స్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేసింది. డిగ్రీలో కామర్స్ తీసుకుంది. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో బి.కాం. పూర్తి చేసాక తోటివాళ్లలా రకరకాల పోటీపరీక్షల్లో కూరుకుపోలేదు. కనీసం పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరే ఆలోచన కూడా చేయలేదు. ఐఎఎస్‌నే గురిపెట్టింది. 1999లో ఒకసారి ప్రిలిమినరీ పరీక్ష రాసింది. అందులో కనీసం క్వాలిఫై కూడా కాలేదు. కానీ నిరాశ పడలేదామె, ఆ ఫెయిల్యూర్ మరింత పట్టుదలని రగిలించింది. మరో పదినెలల తర్వాత జరిగిన 2000 ప్రిలిమినరీ పరీక్షలో క్వాలిఫై అయింది. మెయిన్స్‌కి తను చదివిన కామర్స్‌ని కాకుండా ఆప్షనల్స్‌గా ఆంత్రోపాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టుల్ని ఎంచుకుంది. అప్పటి దాకా వీటిగురించి ఏమాత్రం అవగాహన లేదు. పట్టుదలతో పరీక్ష సమరంలోకి దూకింది. హైద్రాబాద్‌లోనే బ్రెయిన్‌ట్రీ శిక్షణా సంస్థ ఆమెకు అండగా నిలిచింది. స్మిత హార్డ్‌వర్క్, ఆత్మవిశ్వాసం, విల్‌పవర్‌కి ఫలితం దక్కింది. వందలోపు ఏదో ర్యాంకు వస్తుందనుకున్న స్మితకి ఏకంగా జాతీయ స్థాయిలో నాలుగవ ర్యాంకు వచ్చింది. రాష్ట్రం నుంచి సివిల్స్‌కి ఎంపికైన వారిలో స్మిత అందరికంటే టాపర్.

పి.జి. చేయకుండా కేవలం డిగ్రీతో సివిల్స్ రాసి దేశంలోని అత్యున్నత సర్వీసు అయిన ఐఎఎస్‌కి కేవలం 23 ఏళ్ల వయసులో ఎంపికైన రికార్డు బహుశా స్మితదేనేమో!

కేవలం చదువుల్లోనే కాదు హిందుస్తానీ సంగీతంలోనూ, అథ్లెటిక్స్‌లోనూ గొప్ప జీనియస్ అయిన స్మితకి రియల్లీ హ్యాట్సాఫ్●

ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో
కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి, 35 శిక్షణా సంస్థలు
నడుపుతున్న 26 ఏళ్ల కలకత్తా కుర్రాడు

# ప్రేమ్‌జిత్ సేన్




సెప్టెంబరు 1999లో ఆస్ట్రేలియాలో జరిగిన 8వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో - కిక్ బాక్సింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించి ఛాంపియన్ అయ్యాడు. అదే టోర్నమెంటులో కరాటేలో సిల్వర్ మెడల్ గెల్చుకున్నాడు. తర్వాత సంవత్సరం జరిగిన వరల్డ్ కప్ పోటీలలో అతడి శిష్యులు రెండు బంగారు పతకాల్నీ, ఒక రజిత పతకాన్నీ సాధించారు. ఇరవై ఆరేళ్ల కలకత్తా యువకుడు ప్రేమజిత్‌సేన్ విజయపరంపర ఇది.

సేన్ నడువుతున్న 'బుడో-ర్యు కరాటే-డూ' ఇంటర్నేషనల్‌కి ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్, వరల్డ్ ట్రోఫీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్‌ల గుర్తింపు వుంది. ఇరవై ఆరేళ్ల వయసుకే ప్రతిభావంతుడైన మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సేన్ ఆరవ ఏట నుంచే కరాటే నేర్చుకోవటం మొదలు పెట్టాడు. 36 ఛాంబర్ ఆఫ్ షావొలిన్, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ లాంటి బ్రూస్‌లీ సినిమాలు, పుస్తకాలు సేన్‌లో కరాటే మీద ఆసక్తిని విపరీతంగా పెంచాయి. ప్రేమ్‌జిత్ 1986లో తన పదమూడో ఏట బ్యాంకాక్ వెళ్లి గ్రాండ్ మాస్టర్ చాంగ్‌లీ దగ్గర ఆరు నెలలపాటు శిక్షణ తీసుకున్నాడు.

ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ వారు సేన్‌కి తమ సంస్థలో చీఫ్‌రిఫరీ, ప్రెసిడెంట్ హోదాలను ఇచ్చారు. ఇరవై ఆరేళ్ల వయసులోనే ఈ విజయాలు సాధించటం ఒక ఎత్తయితే, తొలి భారతీయుడు కావటం మరో ఎత్తు. 1999లో జరిగిన ప్రపంచ స్థాయి పోటీల్లో సేన్ సంస్థ ఐదు మెడల్స్‌ను గెల్చుకుంది. సేన్ బెంగాల్‌లో 35 శిక్షణా సంస్థలను నడుపుతున్నాడు. బీహార్, ఝార్ఖండ్, అస్సాం, ఒరిస్సాలలో కూడా కొన్ని సెంటర్లు స్థాపించాడు.




త్వరలో ప్రభుత్వ సహకారంతో మార్షల్ ఆర్ట్స్ అకాడమీని నెలకొల్పాలన్న ఆలోచనలో వున్నాడు సేన్. ప్రస్తుతం ఆయన ఆధ్వర్యంలో 2000 మంది కరాటే నేర్చుకుంటున్నారు. మొన్న ఏప్రిల్‌లో ఏథెన్స్ (గ్రీస్)లో జరిగిన వరల్డ్ ప్రొఫైల్ కిక్ బాక్సింగ్ పోటీలకు భారత ప్రతినిధిగా వెళ్లొచ్చాడు సేన్ ●






వికలాంగుల చిరుదీపం

# జయశ్రీ

ఇప్పుడు దేశ జనాభా వందకోట్లపైనే. ఇందులో అన్ని రాష్ట్రాలనుంచీ, కులాల నుంచీ, మతాల నుంచీ తీసుకుంటే మొత్తం దేశ వ్యాపితంగా చూసుకుంటే వికలాంగుల జనాభా 6 కోట్లు. ఇంత పెద్ద సంఖ్యలో వున్న విగలాంగుల కోసమే ప్రత్యేకంగా ఓ పత్రిక పెట్టింది జయశ్రీ రవీంద్రన్. ఐదేళ్ల క్రితం చెన్నైలో 'ఎబిలిటీ ఫౌండేషన్'ను స్థాపించింది. దేశవ్యాపితంగా వికలాంగులను వివిధ రంగాలలో ప్రోత్సహించి, వారి జీవితాలను మెరుగుపరచాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన సేవాసంస్థ ఇది.

(జయశ్రీకి కూడా వినికిడి సమస్య వుంది. కానీ ఆమె దాన్ని ఎప్పుడూ లోపంగా భావించలేదు)

ఈ సంస్థ ఆధ్వర్యంలో 'సక్సెస్ అండ్ ఎబిలిటీ' అనే పత్రికను తీసుకొస్తోంది జయశ్రీ. విగలాంగులలో ఆశావహ దృక్పధాన్ని, పాజిటివ్ థింకింగ్‌ను పెంచడమే పత్రిక లక్ష్యం. వికలాంగులలో ఎంతో ప్రతిభాపాటవాలు దాగివున్నాయి. వాటిని వెలికి తెచ్చే విధంగా ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించటం అవసరం. వీరిలో చాలా మంది ఏ లోపమూ ఫీల్ కాకుండా సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు" అని చెబుతోంది జయశ్రీ.

నిజమే! వికలాంగులైన వారికి, .......... ఆ పరిస్థితిలో లేరని ధైర్యం చెప్పాల్సిన అవసరం వుంది. వైకల్యం వున్నంత మాత్రాన జీవితంలో అడుగు ముందుకు వేయడం అసాధ్యం అనే భావనను తొలగించాలి. వికలాంగులై వుండి కూడా వివిధ రంగాల్లో విజయం సాధించిన, సాధిస్తున్న ధీరోదాత్తులను ఉదాహరణలుగా చూపాలి. ఇదంతా పత్రికలో ప్రతిఫలింప చేయటానికి జయశ్రీ కష్టపడుతున్నారు.

ఫౌండేషన్ ద్వారా బధిరులకు, మూగవారికి, వివిధ రకాల కోర్సులలో శిక్షణ ఇస్తున్నారు. ఇదంతా 'చీకట్లో చిరుదీపం' అంటారామె. ఈ చిరుదీపం మహాజ్యోతిగా వెలగాలని ఆశిద్దాం●

## ఐదు రాష్ట్రాల్లో ఉపఎన్నికలు

# ఎన్.డి.ఏ.కి ఎదురుదెబ్బ



ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎవర్నీ పెద్దగా ఆశ్చర్యపర్చలేదు. మెజారిటీ పోల్‌సర్వేలు ఈసారి ఫలితాల్ని సరిగానే అంచనా వేయగలిగాయి. ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాలకుగాను అస్సాం, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలలో కాంగ్రెస్ - తమిళనాడులో డి.ఎం.కెని మట్టి కరిపించి అన్నాడిఎంకె అధికారంలోకి వచ్చాయి. పశ్చిమబెంగాల్‌లో లెఫ్ట్‌ఫ్రంట్ మరోసారి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నాయి.

వరుసగా పాతికేళ్ళు ఒకే పాలన చూసి చూసి బోర్ కొట్టిందో యేమో మీడియా ఈసారి బెంగాల్‌లో లెఫ్ట్ వ్యతిరేక వైఖరి తీసుకుంది. మమతను ముఖ్యమంత్రిగా చూడాలనుకుంది. మెజారిటీ పత్రికలు, ఛానెళ్ళు ఈసారి ఆమెకు పరోక్షంగా ప్రచారం చేసిపెట్టాయి. గ్రామగ్రామానా పార్టీ యంత్రాంగం విస్తరించకుండా కేవలం వాదబలంతో ఎవరైనా ఎన్ని ఓట్లు సంపాదించ గలరు అనే విషయాన్ని మీడియా పట్టించుకోలేదు. ఆమె పర్సనల్ ఇమేజికున్న పరిమితులనూ గుర్తించలేదు. బెంగాల్ ముఖ్యమంత్రి పదవే జీవిత లక్ష్యంగా మమత తన సర్వశక్తులు ధారపోశారు. నడిరోడ్డుపై పోలీసులతో గొడవ పడినా, వీధుల్లో ధర్నాలు చేసినా, విపక్షాలతో పాటు, మిత్రపక్షాల విమర్శలను కూడా పట్టించుకోకుండా రైల్వేమంత్రిగా ఆ రాష్ట్రానికే అధిక ప్రాజెక్టుల కట్టబెట్టినా... ఏం చేసినా అందుకోనవే. అయితే బి.జె.పి.తో కలిసుంటే కోల్పోయే మైనార్టీ ఓట్లను, గుడ్‌బై చెప్పేస్తే కోల్పోయే అగ్రవర్ణ, కాయస్త ఓట్లను, అధికార ఫలాలను తూకం వేస్తూ వేస్తూ ఆమె చాలా కాలాన్ని మింగేశారు. చిట్టచివర దశలో హడావుడిగా బి.జె.పి.ని వీడి కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నారు. అవసరమైతే మళ్ళీ చేరడానికి దాన్ని ఓ ఆప్షన్‌గా అట్టే వుంచు కున్నారు. ఆమె ఎన్.డి.ఎ. నుంచి విడిపోయిన సమయమూ, పద్ధతీ వల్ల ఎవర్నీ కన్విన్స్ చేయలేకపోయారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ప్రజలను చాలా తక్కువ అంచనా వేశారు. పైగా మాటల్లోనూ, చేతల్లోనూ స్థిరత్వం తక్కువ. లెఫ్ట్ వ్యతిరేకత తప్ప స్వంత విధానాలంటూ లేకపోవడం మరో పెద్ద లోటు. మరోవైపు వామపక్షాలు రాష్ట్రంలో చేపట్టిన భూ సంస్కరణల ప్రభావం ఇప్పటికీ కొద్దో గొప్పో మిగిలే వుంది. దానికి తోడు గ్రామ గ్రామానా పటిష్టమైన పార్టీ యంత్రాంగం వుంది. మంచికైనా, చెడుకైనా... వాదనలతో జనాల్ని తమ వైపు తిప్పుకోవడంలోనైనా, లేక రిగ్గింగ్‌లోనైనా వాళ్ళు తృణమూల్ కార్యకర్తల కంటే రెండడుగులు ముందే వుంటారు. మమత మరికాస్త జాగ్రత్తగా వ్యవహరించి వుంటే, వరుస తప్పిదాలకు పాల్పడకపోయి వుంటే ఆమె లెఫ్ట్ కూటమికి కాస్త గట్టిపోటీ ఇచ్చి వుండేవారు.

ఈ ఎన్నికల్లో బెంగాల్ కంటే కూడా అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించిన రాష్ట్రం తమిళనాడు. అవినీతి కేసుల్లో జయలలితకు శిక్షపడి వుండడంతో నామినేషన్ల ఘట్టానికి ముందే అక్కడ తీవ్ర చర్చ మొదలైంది. ఊహించినట్టుగానే ఎన్నికల సంఘం జయలలిత నామినేషన్లను తిరస్కరించింది. శిక్ష పడిన నేరస్తులు ఎన్నికల్లో పోటీచేయడానికి అనర్హులు అనే నిబంధన ప్రకారం ఈ చర్య తీసుకుంది. కానీ జయను శాసనసభ తమ నేతగా ఎన్నుకోగానే గవర్నర్ ఫాతిమా బీవీ కూడా ఆలస్యం చేయకుండా ఆమెను పిల్చి ముఖ్యమంత్రి గద్దెపై కూర్చుండబెట్టారు. దానికి ఆమెకున్న 'సాంకేతిక కారణాలు' ఆమెకున్నాయి. అస్సలు ఎమ్మెల్యేగా ఎన్నికవడానికే అర్హత లేని వ్యక్తిని సి.ఎం. పోస్టులో ఎలా కూర్చోబెడతాం అనే ప్రశ్నలో కూడా తనకు సంబంధం లేదని ఆమె భావించినట్టు కన్పిస్తోంది. సాంకేతిక పరంగా ఇక ఆరు నెలల వ్యవధిలో జయ ఎమ్మెల్యేగా ఎన్నిక కావాల్సి వుంటుంది. ఎమ్మెల్యేగా ఎన్నిక కావాలంటే ఆమె ఈ లోపు కోర్టు శిక్షల నుంచి తప్పించుకోవాల్సి వుంటుంది. లేకపోతే ఎన్నికల నిబంధనల్లో మార్పైనా రావాల్సి వుంటుంది. ఇంకో రకంగా చెప్పాలంటే ప్రాసిక్యూషన్ విభాగం తన చేతుల్లో వుంటుంది కాబట్టి ఈ ఆరు నెలల్లో కోర్టులను తప్పుదారి పట్టించడానికైనా, లేదా కేంద్రంపై ఏదో రకంగా వత్తిడి తెచ్చి ఎన్నికల నిబంధనల్లో మార్పు తేవడానికైనా ఆమెకు అవకాశం వుందన్న మాట. నేరస్తుల్లో రాజకీయ నేరగాళ్ళకు వుండే సౌకర్యమే వేరు. చట్టం ముందు అందరూ సమానులే అంటుంది మన రాజ్యాంగం. సమానుల్లో కొందరు ఎక్కువ సమానులుంటారని చరిత్ర మరోసారి నిరూపించింది. గ్రెకో, బ్రెకో లోన్ తీసుకున్న వాళ్లపై బ్యాంకులు అదే పనిగా దాడి చేసి చెంబూ, తపేలా రోడ్డుపై విసిరేస్తూ వుంటే అదే బ్యాంకుల్లో కోట్లకొద్దీ డబ్బు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తల పేర్లను కనీసం పేపర్లలో ప్రకటించడాని క్కూడా ప్రభుత్వం నిరాకరిస్తుందే అలాగన్న మాట.

ఇపుడేమిటి? గవర్నర్ చర్య మీద పుంఖాను పుంఖాలుగా చర్చ సాగుతోంది. ఆమె అలా చేసి వుండాల్సింది కాదని కొందరు, అందులో తప్పేమీ లేదని మరి కొందరూ వాదిస్తున్నారు. చర్చ ఎక్కువ సాంకేతిక పరమైన విషయాల చుట్టే తిరుగు తోంది. ఓ పిచ్చివాణ్ణి, సంఘ వ్యతిరేక శక్తినో అసెంబ్లీ నేతగా ఎన్నుకుంటే ఆరు నెలల్లో ఎన్నిక కమ్మని గవర్నర్ సి.ఎం. సీటులోకి ఆహ్వానిస్తారా అని న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కొందరైతే గవర్నర్‌ను రీకాల్ చేయాలని కూడా పిలుపునిస్తున్నారు. బహుశా ముందు ముందు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితే వస్తే ఫాతిమా బీవీ 'ఐ ఫాలోడ్ ది బుక్' (రాజ్యాంగాన్ని అనుసరించాను) అంటారేమో! రాజ్యాంగంలో సరైన వివరణల్లేని వాక్యాలున్నాయేమో వెతికి వాటికి తమకనుగుణంగా భాష్యం చెప్పుకోవడానికి మన రాజకీయ నేతలు ఎప్పుడూ ప్రయత్నిస్తూ వుంటారు. అప్పటికే రాజ్యాంగ కర్తలు చాలా చాలా శ్రమించి అనేకానేక వివరణలతో ప్రపంచంలోనే అతి పెద్ద బౌండు పుస్తకం రాసిపెట్టారు. అదీ సరిపోవడంలా. ఇంత దారుణమైన పరిస్థితి వస్తుందని వారు మాత్రం ఎక్కడ ఊహించి వుంటారు!

ముందు మనం ప్రతీ విషయాన్ని సాంకేతిక పరంగా చూసే దుస్థితి నుంచి బయట పడాలి. వాటి స్ఫూర్తి ఏమిటన్నది తెలుసుకోవాలి. నేరస్తుల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు అంటే ఏమిటర్థం? చట్ట సభలనేవి ప్రజల్ని పరిపాలించడానికి చట్టాలు రూపొందించే అత్యుత్తమ వేదికలు కాబట్టి అక్కడ కూడా నేరగాళ్ళు అడుగుపెడితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా తయారవుతుందనేది ఇందులో స్ఫూర్తి. మరి చట్టాలను ఏ మాత్రం లెక్క చేయకుండా, కోట్లకొలది ప్రజాధనాన్ని బొక్కసంలో నింపుకున్న నేరగత్తెకు సి.ఎం. పదవి ఎలా కట్టబెడతారు? దొంగ చేతికి తాళాలి వ్వడమంటే ఇదేనేమో! మామూలుగా ఈ వాక్యం హాస్యాన్ని ధ్వనిస్తుంది. కానీ ఇక్కడ మాత్రం చాలా క్రూరంగా ధ్వనిస్తోంది. పాలకులు పాలితుల కంటే ఉన్నత ప్రమాణాల్లో వుండాలనేది కనీస న్యాయం. కానీ వాస్తవం దానికి పూర్తిగా తల్లకిందులుగా వుంది.

నిజానికి ఈ దుస్థితి ఈమెతోనే మొదలు కాలేదు. గతంలో కల్యాణ్‌సింగ్ బాబ్రీ మసీదు విధ్వంసం కేసులో ఓ రోజు శిక్షపడి కూడా ముఖ్యమంత్రి గద్దెనెక్కారు. ఇప్పుడు మన హోంమంత్రి ఎల్.కె. అద్వానీ, మానవ వనరుల మంత్రి మురళీ మనోహర్ జోషి, క్రీడల మంత్రి ఉమాభారతి అదే కేసులో ఛార్జిషీట్లు దాఖలై కూడా మంత్రి పదవుల్లో దర్జాగా కొనసాగుతున్నారు. విచిత్రమైన విషయమేమంటే అణచివేత, పీడన నుంచి పగా, ప్రతీకారాలతో బంది పోటైన ఫూలన్‌దేవి మనకు నేరస్తురాలిగా కనిపిస్తుంది కానీ రథయాత్రతో వేలాది మంది ప్రాణాలు పోవడానికి కారకుడైన అద్వానీ నేరస్తుడిగా కనిపించడు. సమాజంలోని ఆధిపత్య సంబంధాలు, భావజాలం మనం నేరాల్ని చూసే దృష్టి కోణంపై ప్రభావం చూపుతాయి. ఇది చాలాచాలా అంశాల్ని ప్రభావితం చేస్తుంది.

మళ్ళీ తమిళనాటకు వద్దాం. డబ్బు సంపాదించ డానికి మన ముందున్న ఆదాయ మార్గాల్లో, వ్యాపారాల్లో అత్యుత్తమమైనది రాజకీయ రంగం. మిగిలిన వ్యాపారాలకు చట్టాల భయం, ప్రభుత్వ భయమన్నా ఎంతో కొంత వుంటుంది. ఇక్కడ అదీ లేదు. వీళ్ళే ప్రభుత్వం కదా! ఈ స్పృహ ప్రజలకు ఎప్పటినుంచో వుంది. కాబట్టి రాజకీయ నాయకుల అవినీతికి ఓ రకమైన సామాజిక ఆమోదం (లెజిటిమసీ) వచ్చేసింది. పైగా రాజకీయ నాయకుల్లో జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్‌లే అవినీతిపరులన్న భ్రమలు జనానికెప్పుడూ లేవు. కాబట్టి అవినీతి అనేది జయకు వ్యతిరేకంగా పనిచేసే అంశం కాదు. మేం సచ్ఛీలురం, సత్యహరిశ్చంద్రులం అని డబ్బా కొట్టుకుని టేబుళ్ళ కింద చేతులు పెడితే తప్ప రాజకీయ నేతల అవినీతిని జనం అంతగా పట్టించుకోరు. దీనికి తోడు వయసుతో పాటు కరుణానిధిలో పెరిగిపోతున్న అసహనం, కొడుకు పట్టాభిషేకానికి తొందరపాటు, దానివల్ల పార్టీలో ఏర్పడ్డ అంతర్గత కలహాలు, పొత్తులు కుదుర్చుకోవడంలో చేసిన తప్పిదాలు... ఇవన్నీ డి.ఎం.కె. ఓటమికి కారణమయ్యాయి. డి.ఎం.కె.కి ఇక ముందున్నది కూడా గడ్డుకాలమే. వాళ్ల పార్టీ గుర్తు ఉదయించే సూర్యుడు. ఇప్పుడది అస్తమించే సూర్యుడిగా మార్చుకోవాలి. ఎందుకంటే కరుణానిధికి ద్రావిడ ఉద్యమం చరిత్ర, వెనుకబడిన కులాల వారి తరఫున నిలబడిన చరిత్ర ఎంతో కొంత వున్నాయి. సామాజిక గౌరవం వుంది. మురికివాడవాసులకు పాండీబజారు వంటి ప్రధానమైన స్థలాల్లో అపార్టుమెంట్లు కట్టించిన ఘనత వుంది. బి.సి. కాలనీలు, ఎస్.సి. కాలనీలు అంటూ ఊరికి దూరంగా అంటువాడల నిర్మాణంలా కాకుండా అన్ని కులాలను కలిపి వుంచుతూ 'సమత్వాపుర్' నిర్మాణానికి శ్రీకారం చుట్టిన చరిత్ర వుంది. రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాల్లో తలపండిన అనుభవం వుంది. ఇవే తన చివరి ఎన్నికలన్న మాటను ఉల్లంఘించి తిరిగి రావాలనుకున్న ఆయన ఆరోగ్యం సహకరించడం కష్టమే. ఆయన కుమారుడు, డి.ఎం.కె. యువరాజు స్టాలిన్‌కు ఇవేవీ లేవు. ఉన్నదల్లా నలుగురు గూండాలను వెంటేసుకుని తప్పతాగి టాటా సుమోలో తిరుగుతూ, కనిపించిన ఆడవాళ్ళనల్లా వేధించి కాల్చుకుతిన్న చరిత్రే.

మొత్తం మీద ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నది ఎన్.డి.ఏ. మిత్రపక్షాలైతే లాభపడింది మాత్రం కాంగ్రెస్. కేరళ, అస్సాం, పాండిచ్చేరిలలో కాంగ్రెస్ తిరిగి అధికారం చేజిక్కించుకోగలిగింది. నాయకత్వ లక్షణాలు లేవని బయటి నుంచీ, లోపలి నుంచీ విమర్శల దాడినెదుర్కొంటున్న సోనియా గాంధీకి ఇవి కొంత మేరకు ఊరటనిచ్చినట్టే. తహల్కా వ్యవహారం ఈ ఎన్నికల్లో బి.జె.పి. మిత్రపక్షాల పాలిట శాపంలా పరిణమించింది. మామూలుగా ఓటర్లు నేతల అవినీతిని అంతగా పట్టించుకోరు కానీ బి.జె.పి. మామూలు పార్టీ కాదు గదా! మేం అలాంటిలాంటి వాళ్ళం కాదు, అవినీతికి తావులేని పార్టీ మాది. మచ్చలేని వ్యక్తిత్వం మా నాయకులది. ఆరెస్సెస్ శిక్షణలో రాటుదేలిన ఉక్కు క్రమశిక్షణ మాది. అని వారు అదే పనిగా బాకా కొట్టుకున్నారు. అసలు ఆ పార్టీ పైకి రావడమే విశిష్ట వ్యక్తిత్వం, విశిష్ట నాయకత్వం అనే నినాదాలతో వచ్చింది. విశిష్టత అనేది పార్టీకి మారుపేరుగా చెప్పుకుంది. అంతటి ఘనమైన పార్టీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ ఊరూ పేరూ లేని వాళ్ళ దగ్గర్నుంచి లక్షరూపాయలు తీసుకోవడమే కాక, డాలర్లు కావాలని కోరడం దేశమంతా టీవీల్లో చూసింది. ఈ మాత్రం దానికి ఇంత బాకా ఎందుకు అనే ఏహ్యాభావం పుట్టింది. పైగా దృశ్యరూపంలో చూసేదాని ప్రభావం ఎక్కువ వుంటుంది. కాబట్టి ఎన్నికల్లో పనిచేసింది కేవలం ప్రభుత్వాలపై ప్రజలకు ఏర్పడే వ్యతిరేకత మాత్రమే కాదు. తహల్కా కూడా - ఇపుడే కాదు. వచ్చే యేడాది ప్రారంభంలో జరిగే యు.పి. ఎన్నికల్లో కూడా ఇది ప్రభావం చూపించే అవకాశముంది. యు.పి. తమ గుండెకాయ కనుక తహల్కాను మరుగు పరిచే మరో అంశాన్ని తెర మీదకు తేవడానికి బి.జె.పి. నేతలు ఇపుడు వ్యూహ రచన చేస్తున్నారు.

ఎన్నికలు పాలకుల క్రీడగా మారి చాలా కాలమైంది. తింటున్నది గొంగట్లో అని స్పష్టంగా తెలిసుండడం వల్ల ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల జనం క్రీడను వినోదించడానికి అలవాటు పడ్డారు. ఇదీ భారత్ ప్రజాస్వామ్య వ్యవస్థ దుస్థితి● - ఆర్. మోహన్



జయలలిత

| తమిళనాడు | |
|---|---|
| మొత్తం సీట్లు | 234 |
| ఫలితాలు ప్రకటించినవి | 233 |
| అన్నాడిఎంకె ఫ్రంట్ | 194 |
| డిఎమ్‌కె ఫ్రంట్ | 39 |
| ఇతరులు | 1 |



బుద్ధదేవ్ భట్టాచార్య

| పశ్చిమబెంగాల్ | |
|---|---|
| మొత్తం సీట్లు | 294 |
| లెఫ్ట్ ఫ్రంట్ | 199 |
| తృణమూల్, కాంగ్రెస్ | 86 |
| ఇతరులు | 9 |



కరుణానిధి



మమత

| కేరళ | |
|---|---|
| మొత్తం సీట్లు | 140 |
| యుడిఎఫ్ | 99 |
| ఎల్‌డిఎఫ్ | 40 |
| ఇతరులు | 1 |



ఎ.కె.ఆంటోని



ఇ.కె.నయనార్

| అస్సాం | |
|---|---|
| మొత్తం సీట్లు | 125 |
| కాంగ్రెస్ | 68 |
| ఎజిపి, బిజెపి | 41 |
| ఇతరులు | 16 |



తరుణ్ గొగోయ్

| పాండిచ్చేరి | |
|---|---|
| మొత్తం సీట్లు | 30 |
| కాంగ్రెస్, టిఎంసి | 13 |
| అన్నాడిఎంకె | 3 |
| డిఎంకె, పియంసి, బిజెపి | 12 |
| ఇతరలులు | 2 |



జనహర్ష గ్రూపు ఇప్పుడు రియల్ ఎస్టేట్, చిట్‌ఫండ్, పబ్లిషింగ్ రంగాల్లో పనిచేస్తోంది

- ➢ కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు తెలంగాణాని ఎందుకు పట్టించుకోలేదు?
  - అధికారంలో లేనపుడు పట్టించుకుందామని.
- ➢ బి.జె.పి. సిద్ధాంతం 'చిన్న రాష్ట్రాలు - బలమైన కేంద్రం' కదా?
  - నిజమే, అధికారం లేనపుడు 'చిన్న రాష్ట్రాలు', అధికారం దొరికినపుడు 'బలమైన కేంద్రం'.
- ➢ టి.ఆర్.ఎస్. పట్ల పి.డబ్ల్యు.జి. కార్యకర్తల వైఖరి?
  - పగలు టి.ఆర్.ఎస్. రాత్రి పి.డబ్ల్యు.జి.
- ➢ టి.ఆర్.ఎస్. పట్ల బి.జె.పి. కార్యకర్తల వైఖరి?
  - ఎన్నికల వరకుటి ఆర్.ఎస్., ఎన్నికల్లో బి.జె.పి.
- ➢ అస్సాం ముఖ్యమంత్రి గోగోయ్ భవిష్యత్తు?
  - ఏముంది, కాంగ్రెస్ సంప్రదాయాల ప్రకారం అసమ్మతి వర్గం ఏర్పడి 'గో,గో' (ఫో,ఫో) అనడమే.
- ➢ కేరళలో ఆంటోనీ తర్వాత ఎవరు అధికారంలోకి వస్తారు?
  - ఎన్నికల తర్వాత ఐతే మార్క్సిస్టులు, ఎన్నికల ముందైతే కరుణాకరన్ వర్గం.



- ➢ ఆ రోజుల్లో కాంగ్రెస్ ఎదుర్కొన్నంత తేలిగ్గా ఈ రోజు చంద్రబాబు 'ప్రత్యేక తెలంగాణ'ని ఎదుర్కోలేరు ఎందుచేత?
  - ఆనాడు ఇందిరాగాంధీ ఆఫర్ చేసినట్టు ఇప్పడు చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి ఆఫర్ చెయ్యలేరు కదా? అందుచేత.
- ➢ బి.జె.పి. నినాదంలో ఏమిటి మార్పు?
  - గతంలో 'ఒక్క ఓటు - రెండు రాష్ట్రాలు' ఇప్పడు 'రెండు ఓట్లు (బి.జె.పి.కి, తె.దే.కి) - ఒకే రాష్ట్రం'.
- ➢ టి.ఆర్.ఎస్. పట్ల కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి?
  - టికెట్ దొరికితే కాంగ్రెస్, దొరక్కపోతే టి.ఆర్.ఎస్.
- ➢ టి.ఆర్.ఎస్. పట్ల సి.పి.ఐ. కార్యకర్తల వైఖరి?
  - అలాంటి వాళ్లెవరూ ఇప్పడు లేరు.
- ➢ జయలలిత ప్రస్తుత విధానం?
  - కేసుకు కేసు, జైలుకు జైలు
- ➢ బెంగాల్‌లో మమతకీ మార్క్సిస్టులకీ ఏమిటి వైరం?
  - ఏముందీ, గడ్డి (తృణమూల్)కీ, కొడవలికి ఉన్న వైరమే.
- ➢ మమతా బెనర్జీ రైలు (మంత్రిపదవి) ఎందుకు దిగేశారు?
  - రైటర్స్ బిల్డింగ్ స్టాప్ వచ్చేసిందనే భ్రమలో.

(రైటర్స్ బిల్డింగ్: ప.బెంగాల్ ముఖ్యమంత్రి కార్యాలయం)

## ఎం.పి. టాక్



ఢిల్లీ నుంచి తెలుగుదేశం ఎం.పి. ఒకాయన పబ్లిక్ బూత్ నుంచి ఫోన్ చేసుకుంటుంటే, వెనకాల ఉన్న సర్దార్జీ గొడవ చేశాడు: "భాయిసాబ్ మీరు అర్ధగంట నించి ఫోను పట్టుకున్నారు. ఇప్పటి వరకూ ఒక్క మాట మాట్లాడలేదు. అవతల మాకూ అర్జంటు పనులున్నాయి. మేము మాట్లాడుకోవద్దా?"

ఎం.పి. ఫోను మీద చెయ్యి ఉంచి చిన్నగా చెప్పాడు: "ఉండవయ్యా, నేను మా సి.ఎం.గారితో మాట్లాడుతున్నాను"

## విజయవిహారం

15

## తెహల్కా



తెహల్కా విలేకరులు మారువేషాలు రహస్య కెమెరాలతో జయలలిత దగ్గిరకి వెళ్లారు.

"10 కోట్ల కంట్రాక్టు మాకు ఇప్పిస్తే మీకు ఒక కిలో బంగారం ముడుపుగా ఇచ్చుకుంటాం" అన్నారు తెహల్కా బృందం.

"అంటే నేను మీ కళ్ళకి లంచగొండిలా కన్పిస్తున్నానా? అని గయ్ మని లేచారు జయలలిత.

### నిత్య కృషీ వలుడు, గిన్నీస్ రికార్డు సాధించిన తెలుగు వీరుడు

# శరగోపన్ నండూరి



గిన్నిస్ పుస్తకంలోకి చేరడం అంటే మాటలా? ప్రపంచం మొత్తం మీద ఎవరూ చేయలేని సాహసాన్నో, విన్యాసాన్నో, అద్భుతాన్నో చేయాలి. అది పూర్తిగా అసాధారణమైనదై వుండాలి. గిన్నిస్ సంస్థ అధికారులు ప్రపంచంలో ఏ మూల ఇలాంటిది జరిగినా అక్కడికి స్వయంగా వెళ్లి, కళ్లతో చూసిగానీ ప్రపంచ రికార్డుగా నమోదు చేసుకోరు. అలాంటి అరుదైన రికార్డుని తన పేరిట రాసుకున్నాడు మన తెలుగువాడైన శరగోపన్ నండూరి. ఓ మామూలుగా మొక్కగా వుండే మిరపని ఓ చెట్టుగా పెంచి ఈ రికార్డు సాధించాడు. ఇదీ ఓ రికార్డేనా అని పెదవి విరిచేవారు ఒక్కసారి మిరప వివరాల్ని తెలుసుకుంటే ఇది నిజంగా ఎంత గొప్ప రికార్డో అర్థమవుతుంది. మామూలుగా అయితే ఓ మిరప మొక్క జీవితకాలం మహా అయితే ఏడాది. ఎత్తు ఎక్కువలో ఎక్కువ మూడు - నాలుగు అడుగులు మించదు. ఓ మిరప మొక్క దాని జీవితకాలంలో 500 గ్రా (ఎండిన వాటి బరువు) దిగుబడి మాత్రమే ఇస్తుంది.

కాని శరగోపన్‌కు గిన్నీసు రికార్డు సాధించి పెట్టిన మిరప 'చెట్టు' రూటే వేరు. ఇది 13.8 అడుగుల ఎత్తు దాకా పెరుగుతూ పోయింది. రెండున్నర ఏళ్లపాటు దిగుబడి ఇచ్చింది. ఈ కాలంలో ఇది ఇచ్చిన దిగుబడి నాలుగున్నర కిలోలు (ఎండిన వాటి బరువు). మామూలు మొక్క ఇచ్చేదానికంటే ఎనిమిది రెట్లు ఎక్కువ. ఈ మిరపచెట్టు అసాధారణ లక్షణం మహా మహా సైంటిస్టులకే అంతు పట్టలేదు. మామూలుగానైతే మిరప మొక్క కాండ పీలగా, సన్నగా వుంటుంది. కాని ఈ చెట్టు కాండం దృఢంగా బలమైన దుంగలాగా పెరిగింది.

అసలిదంతా అనుకోకుండా జరిగింది. మచిలీపట్నంలో పుట్టిన శరగోపన్ ఎకనామిక్స్‌లో డిగ్రీ చేశాడు. ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగంలో చేరాడు. శ్రీశైలం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా బదిలీ అయినప్పుడు ఈ మిరప అద్భుతం జరిగింది. పెరటి మొక్కల పెంపకం పట్ల శరగోపన్‌కి చిన్నప్పటి నుంచీ ఆసక్తి ఎక్కువ. తాను ఎక్కడున్నా మొక్కల పెంపకాన్ని సీరియస్ వ్యాపకంగా చేపట్టేవాడు. పచ్చటి నల్లమలై కొండల మధ్య శ్రీశైలం దేవస్థానం ఆయనకు అలాట్ చేసిన క్వార్టర్ పరిసరాల్లో కూడా రకరకాల మొక్కల్ని పెంచాడు. 1978లో కొన్ని మిరప విత్తనాల్ని పెరట్లో చల్లాడు. వాటిలో ఓ మొక్క కొద్ది రోజుల్లోనే అనూహ్యంగా పెరగడం మొదలైంది... ఆ మొక్కలో ఏదో విశేషముందని గ్రహించి సేంద్రియ ఎరువుల్ని వేస్తూ జాగ్రత్తగా పెంచాడు. రెండేళ్ల తిరిగేనాటికి అదో చెట్టుగా విస్తరించింది. ఈ అసాధారణమైన మిరప చెట్టు గురించి విని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సైంటిస్టులు శ్రీశైలం చేరారు. ఢిల్లీలోని ఐసిఎఆర్ ఈ చెట్టు విత్తనాల పరిశోధనలు చేసింది. 1984లో శరగోపన్ ఈ చెట్టు గురించిన వివరాలని గిన్నీస్ సంస్థకి







తెలుగు జర్నలిజం చరిత్రలో ఒక వినూత్నాధ్యాయం - తెలుగు పాఠకుల ఉత్తమాభిరుచికి నిజమైన నిదర్శనం- విజయవిహారం

# తెలుసా?



తన 'ఆకస్మిక పర్యవేక్షణ'ల శైలిలో భాగంగా ఒకసారి చంద్రబాబు ఒక అర్థరాత్రి హఠాత్తుగా హైద్రాబాద్ పోలీసు కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేశారు. అక్కడి పోలీసులు ప్రజల కంప్లైంట్లకి ఎలా ప్రతిస్పందిస్తున్నారో చూద్దామని ఆయన ఉద్దేశం.

చంద్రబాబు కాల్ ఎత్తిన పోలీసు "ఎవుడ్రా ఇంత అర్థరాత్రి ఫోన్ చేసింది. ఇప్పుడేమంత ముంచుకొచ్చింది?" అన్నాడు.

చంద్రబాబుకి తిక్కరేగి "ఎవరు నువ్వు. నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని గద్దించారు.



పోలీసు తాపీగా "తెలీదు, నరే, ఎవర్నువ్వు?" అని అడిగాడు.

చంద్రబాబు "నేను సి.ఎం., చంద్రబాబు నాయుడిని మాట్లాడుతున్నాను" అన్నారు.

అవతల్నించి "నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో, నా పేరేమిటో నా ర్యాంకేమిటో నీకు తెలుసా?" అని గద్దింపు వినిపించింది.

చంద్రబాబు ఖంగుతిని "తెలీదు. సరే. ఎవర్నువ్వు?" అని అడిగారు.

"హమ్మయ్య, అంతే చాలు" అని అవతలి వైపు ఫోను డిస్‌కనెక్ట్ అయ్యింది.

**జోకులన్నీ సరదాకి. కేవలం నవ్వుకోడానికి. వీళ్ళ మీదో వాళ్ళ మీదో జోకేస్తే ...ం నవ్వరు సరికదా, నవ్విపోతారు. అదే జోకుకి జయలలితనో, ...ంద్రబాబునో, వాజ్‌పాయ్‌నో, అద్వానీనో జతకలిపితే చక్కగా పేలుతుంది. ...క మనసారా నవ్వుకోడానికి తప్ప ఎవరి మనసూనొప్పించడం మా ...ద్దేశంకాదు. సో ఇట్సాల్ జస్ట్ ఫర్ ఫన్. డోన్ట్ మిస్టేక్ అజ్.....**

**- ఎడిటర్**

# గోల్డ్



తెహల్కా విలేకరులు సర్ది చెప్పి "లంచం కాదు మేడం, మీరు మాకు కంట్రాక్టు ఇప్పిస్తే మేం, మీకు కిలో బంగారం వది రూపాయలకి అమ్ముతామన్న మాట" అన్నారు తెహల్కా బృందం.

ఈ మాటకి జయలలిత కాస్త మెత్తబడి, తలాడించి "సరే, కానీ నేను ఆ రేటుకి మీ దగ్గిర 30 కిలోల బంగారం కొంటాను" అన్నారు.

# గాంధీ

గాంధీ భవన్ దగ్గిర "గాంధీ జయంతి" నభ జరుగుతోంది.

"గాంధీగారు మన 'జాతిపిత'. ఈ రోజు మన భారతదేశం ఈ స్థితిలో నిలబడిందంటే అందుకు కారణం ఆ మహానుభావుడు" - ఒక వక్త ఆవేశంగా ప్రసంగిస్తున్నాడు.

"ఛ, తప్పంతా ఒక్క మనిషి మీద వేయడం బాగోలేదు" - వింటున్న నాయకుడు ఒకాయన గొణుక్కున్నాడు.





# ఏంకాదులే

రాజకీయాల నుంచి రిటైరయ్యాక చంద్రబాబు, వైయస్. కలిసి బిజినెస్ పెట్టుకున్నారు.

ఒకసారి ఇద్దరూ కలిసి విశ్రాంతి కోసం ఊటీ వెళ్ళారు.

సడన్‌గా వైయస్ కంగారుపడి "కొంప మునిగింది బ్రదర్, మన క్యాష్ బీరువా తాళం వేయడం మర్చిపోయాను" అన్నారు.

"పోన్లే బ్రదర్ ఏం కాదులే, మనిద్దరమూ ఇక్కడ ఎదురెదురుగానే ఉన్నాం కదా" అన్నారు చంద్రబాబు.

పంపాడు. మిరప పండించే ఎన్నో దేశాల్లో వాకబు చేసి ఇలాంటి మిరప చెట్టు మరొకటి లేదని నిర్ధారించుకున్నాక 1984లో దీన్ని ప్రపంచ రికార్డుగా నమోదు చేశారు.

పేరు చూస్తే తమిళియన్‌లా కనిపించినా ఆరణాల తెలుగువాడైన శరగోపన్ అప్పటి నుంచి హార్టీకల్చర్ స్పెషలిస్టుగా, కన్సల్టెంట్‌గా, పర్యావరణ పరిరక్షకుడిగా గొప్ప పేరు ప్రతిష్ఠలు పొందారు. ఇటీవలే వ్యవసాయ రంగానికి సంబంధించి - మద్రాసు తెలుగు అకాడమీ వారు ఉగాది పురస్కారంతో ఈ గిన్నిస్ వీరుడిని సత్కరించారు. 200కు పైగా అవార్డులూ, సన్మానాలూ పొందారు. ఢిల్లీలో జాతీయ స్థాయి వ్యవసాయ ప్రదర్శనేర్పాటు చేసి సత్కారం పొందారు. శరగోపన్ పెంచిన 'గిన్నిస్' మిరప చెట్టుపై సాగుతున్న పరిశోధనలు ఓ కొలిక్కి వచ్చి - అలాంటివి పెంచడం సాధ్యమే అయితే - భవిష్యత్తులో ప్రతి ఇంటికి అలాంటి ఒక్క మిరప చెట్టున్నా చాలు - ఆహార అవసరాలు తీరిపోతాయి●

## సెరెబ్రల్ పాల్సీ జబ్బుతో చేతులు పనిచేయకున్నా 'నోటిరాత'తో ఎం.ఏ. పూర్తిచేస్తానంటున్న

# ప్రభావతి




క్లాసులో తోటిపిల్లలు ఆమెని ఆటపట్టించేవారు. స్నేహితులు ఉత్సాహంగా, స్వేచ్ఛగా ఎగిరి గెంతులేస్తుంటే ఆమె ఓ మూల దిగాలుగా కూర్చొని, మనసులోనే కుమిలిపోయేది. తోటివాళ్ళలా ఆమెకీ ఆడాలనుండేది. లోకమంతా తానై స్వేచ్ఛగా ఎగరాలనుండేది. సెరిబ్రల్ పాల్సీ అనే ఓ మాయదారి జబ్బు ప్రభావతి అనే ఆ అమ్మాయి బాల్యంలోని ఉత్సాహానికీ, స్వేచ్ఛకి సంకెళ్ళు వేసింది.

ఈ వ్యాధితో ఆమె రెండు చేతులూ పని చేయకుండా పోయాయి. కాని ప్రభావతికి అందరిలా స్కూలుకు వెళ్లాలని, అందర్లా తానూ చదువుకోవాలని తహతహలాడేది. పెన్ను పట్టి రాసేందుకు చేతులు పనికి రాకుండాపోయినా నిరాశపడలేదు. ఐదవ ఏట నుంచి పెన్నుని నోట్లో పెట్టుకొని రాయడం ప్రాక్టీసు చేసింది. మెడని ముందుకు వంచి - నరాలు తెగేలా లాగేస్తున్నా - పళ్ల నొప్పితో జివ్వుమంటున్నా లెక్కచేయక రాయడం అలవాటు చేసుకుంది. 'మౌత్ రైటింగ్' మొదట్లో వంకర టింకరగా గజిబిజిగా వుండడంతో టీచర్‌తో ఎన్నోసార్లు చీవాట్లు తిన్నది. అయినా ఏమాత్రం కుంగిపోలేదు. కొద్ది రోజుల్లోనే రాతపై పట్టు దొరికింది. నోటిరాత చక్కబడింది. ఇలా మొదటి తరగతి నుంచి నోటిరాతతో చదువు మొదలుపెట్టిన ప్రభావతి ఎస్‌ఎస్‌సిలో 54 శాతం మార్కులతో పాసై టీచర్లనీ, డాక్టర్లనీ ఆశ్చర్యపరిచింది. అచంచల ఆత్మవిశ్వాసం, గుండెబలమే ఆమెని ముందుకు నడిపించాయి. ఈ ఏడాది పియుసి (ఇంటర్) మొదటి సంవత్సరం పరీక్ష కూడా నోటితోనే రాసింది. తన పరీక్ష గురించి చెబుతూ "నా పరిస్థితిని గమనించి కనీసం ఓ పావుగంట అదనపు టైం కూడా ఇవ్వలేదు. మెడలు ముందుకు వంచి రాయడం వల్ల మధ్యమధ్యలో కొంతసేపు రిలాక్స్ అవక తప్పదు." అని వాపోయింది. ప్రభావతిది నిరుపేద కుటుంబం. తండ్రి కె.బైరప్ప పోర్టర్‌గా పనిచేస్తున్నాడు. వారిది బెంగుళూరు సమీపంలోని ఏథకి అనే ఓ పల్లెటూరు. రోజుకి రెక్కలు ముక్కలు చేసుకున్నా 40 రూపాయలకి మించని ఆదాయం. "అయినా నా బిడ్డ ఎందాకా చదివితే అంత వరకు చదివిస్తా. ఆమెకేలోటూ రానివ్వను" అంటున్నాడు. ప్రభుత్వం నుంచీ, ఏ రాజకీయ నాయకుడి నుంచీ ఎలాంటి సహాయం అందకున్నా పట్టుదలతో ఇలాగే చదువు కొనసాగించి ఎం.ఏ. పూర్తి చేస్తానంటోంది ప్రభావతి●

### వయసు : 15, ఊరు : హైదరాబాద్, సాహసం : పసిఫిక్ మహాసముద్రంలో 575 మైళ్లు పదిరోజుల్లో ప్రయాణం చేసిన

# శివానీ



షార్క్ చేపలు తిరుగాడే అగాధ జలాల్లో, పదిహేను అడుగుల ఎత్తున పడి లేస్తున్న కెరటాలలో, 575 మైళ్ళ దూరం ప్రయాణించటానికి పదిరోజులు సరిపోవచ్చు. కానీ ఈ సాహసానికి మామూలు గుండెలు సరిపోవు. అలా అని కొమ్ములు తిరిగిన నావికులో, చేతులు తిరిగిన గజ ఈతగాళ్లో చేయలేదు. పదిహేనేళ్ల హైదరాబాద్ అమ్మాయి శివానీ సాధించిన ఘనవిజయమిది. (శివానీ కుటుంబం ప్రస్తుతం అమెరికాలో వుంటోంది)

శివానీ కపాడియా ఈ సాహసయాత్ర పోయినేడాది ఆగస్ట్ 11 నుంచి 20 తేదీ వరకూ చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి హార్బర్ వరకూ సాగిన యాత్రలో ముఖం మీద పడుతున్న పెద్ద కెరటాల్నీ, బోటుకింద అనుసరిస్తున్న షార్క్ చేపల్నీ, వికారంగా అనిపించే వాతావరణాన్నీ దాటుకుని మరీ రెండు లక్షల అమెరికన్ డాలర్ల బహుమతిని సాధించింది. (బహుమతి మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు అందించింది) శివానీకి వెనకాల ఒక సపోర్టు బోట్, ఆహారం, నీళ్లతో సహా అనుసరించింది.





షార్క్‌చేపలు, మీదకు పడుతున్న కెరటాలు చూసి కొద్దిగా భయం వేసిందని, కెరటాల ధాటికి పడిపోయానని చాలా సార్లు అనుకున్నానని చెబుతోంది శివానీ.

శివానీ, హైదరాబాద్‌లో ప్రముఖ వైద్యుడిగా పేరు తెచ్చుకున్న రాజేష్ కపాడియా కుమార్తె. రాజేష్ తన పదహారో ఏట వరంగల్ మెడికల్ స్కూల్‌లో చేరారు. ఇరవై ఒకటోఏట డాక్టరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసిన ఘనత ఆయనదే. ఆయన కూతురైన శివానీ కూడా అదేరీతిలో చదువులో, సాహసాల్లో ప్రతిభను, కనపరచటం విశేషం. శివానీ తన ఆరవ ఏటనుంచే జెట్‌స్కీ (వాటర్ స్కూటర్)తో అమెరికాకి 32 మైళ్ల దూరంలోని కాటలీనా దీవికి వెళ్లివస్తుండేది.

ఇక చదువులో కూడా లెక్కలేనన్ని అవార్డులు, రివార్డులు అందుకుంది. 1997లో యు.ఎస్.నేషనల్ స్పెల్లింగ్ బీ ఛాంపియన్‌గా గెలుపొందింది. ఇంగ్లీష్ ఉచ్చారణలో జరిగే గొప్ప పోటీ ఇది. శివానీ ఇంగ్లీష్, హిందీ, గుజరాతీ, స్పానిష్, లాటిన్ భాషలు మాట్లాడుతుంది. రెండేళ్ళ పాటు లాటిన్ నేర్చుకుని అందులో గోల్డ్‌మెడల్ కూడా సంపాదించింది. రెండుసార్లు అమెరికా అధ్యక్షుడి పేరు మీద ఇచ్చే అవార్డులను అందుకుంది. నేషనల్ సైన్స్ మెరిట్ అవార్డుని గెలుచుకుంది. వాషింగ్టన్ డి.సి.లో జరిగిన గ్లోబల్ యంగ్ లీడర్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది.

ఈ సాహసబాలిక భవిష్యత్తులో ఏమవ్వాలనుకుంటోంది?...... ఆస్ట్రోనాట్, లాయర్, శిల్పి, బిజినెస్ వుమెన్ - వీటిలో ఏదో ఒకటి!●

---

## కొత్త పరిశోధనలు

### టాబ్లెట్ కెమెరాలు

చూడ్డానికి ఇవి అచ్చు పెద్ద సైజు కాప్సూల్ లాగా వున్నాయి కదూ! నిజమే! ఇవి కాప్సూల్సే. కాని వీటిల్లో వున్నది ఏ మందో మాకో కాదు. ఫోటోలు తీసే బుల్లి కెమెరాలున్నాయి. వీటి సైజు ఒక అంగుళం. ఒక్క గుళికను గుటుక్కుమంటే చాలు! అది పేగుల్లోకి దూసుకుపోతూ చకచకా జీర్ణమండలాన్నంతా ఫోటోలు తీసేస్తుంది. మామూలుగా దీన్ని మింగేసి మన రొటీన్ పనిలో మునిగిపోవచ్చు. పేగుల్లోకి మెల్లగా జారే ఈ కాప్సూల్ కెమెరా పేగుల్ని సెకనుకు రెండు ఫోటోలు తీస్తుంది. మన బెల్టుకు కట్టుకునే వాక్‌మన్ లాంటి రిసీవర్‌కి ఈ ఫోటోలు చేరతాయి. మరుసటి రోజు డాక్టరుగారు ఈ రిసీవర్‌లోని ఫోటోలన్నింటిని క్రమపద్ధతిలో పేర్చి-పేగుల్లోని జబ్బుని, అద్దంలో చూసి నంత తేలిగ్గా గుర్తు పట్టేస్తాడు. ప్రస్తుతం కడుపులోని జబ్బుని నిర్ధారించాలంటే-ఎండోస్కోపి చేస్తున్నారు. ఇది పేషెంట్‌కి కాస్త బాధని, అసౌకర్యాన్నీ కలిగించే పద్ధతి. పేషెంట్‌కి మొదట నొప్పి తెలీకుండా సెడెటివ్ ఇవ్వాలి. ఆ తర్వాత ఓ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ని గొంతులోంచి పేగుల్లోకి జొప్పించాలి. ఇంతా చేసి ఈ ఎండోస్కోపీలో పేగుల్ని చివరిదాకా చూడ్డం కుదరదు. చుట్టలా వుండే చిన్న పేగుల్లో ఒక వంతు భాగం దాటి కేబుల్‌ని



జొప్పించడం సాధ్యం కాదు. కాని ఈ పిల్ కెమెరాతో ఈ ప్రాబ్లెం లేదు. దీంతో ఎలాంటి నొప్పీ వుండదు. గుక్కెడు నీళ్ల సాయంతో గొంతులోకి తేలిగ్గా జారుతుంది. పేగుల మడతల్లోకి తేలిగ్గా చొచ్చుకుపోతుంది. ఇజ్రాయిల్‌కి చెందిన ఓ సంస్థ ఈ అద్భుత కెమెరాలకి రూపకల్పన చేసింది. ఈ ఏడాది ప్రయోగదశ పూర్తయి మార్కెట్లోకి రావొచ్చు. ఇలా కాప్సూల్స్‌లో ఇమిడే సూక్ష్మ మిషన్ల సాయంతో కడుపులోకి మందుల్ని పంపడం, పేగుల లోపలి బయాప్సీ చేసి ఖచ్చితంగా రోగ నిర్ధారణ చేయడం లాంటి పనులు కూడా సాధ్యమవుతాయి●

### బి.పి. వాచ్





బీపీ చెకప్ కోసం ఇక డాక్టర్ల చుట్టూ చక్కర్లు అఖ్ఖర్లేదు. మనల్ని ఎప్పుడూ అంటి పెట్టుకొని, ఎప్పటికప్పుడు బిపి లెవెల్స్‌ని చూపిస్తుంది ఈ వాచ్. డాక్టరైనా పొరబడొచ్చేమోగాని దీని రీడింగ్‌లో తేడా వుండదు. 112/80 అని (పై ఫొటోలో) ఎంత నిక్కచ్చిగా చూపిస్తోందో చూడండి. బీపీ రీడింగ్ చూసుకోవాలన్నప్పుడు ఈ వాచీకి ఓ వైపు చిన్న బటన్‌లాగా వున్న బిపి సెన్సార్‌పై వేలు పెడితే చాలు. డయల్ మీద రీడింగ్ కనిపిస్తుంది. టైమూ, తేదీ లాంటివయితే మామూలే! సవాలక్ష ఒత్తిళ్ల మధ్య బతికే మనకు గుండె గతిని తెలిపే ఇలాంటి నమ్మకమైన నేస్తం ఒకటి ఖచ్చితంగా వుండాల్సిందే. జపాన్‌కు చెందిన ప్రసిద్ధ సంస్థ కేసియో ఈ బీపీ మానిటర్ వాచీని తయారు చేసింది●

---



### మార్షల్ ఆర్ట్స్‌లో మేటి, కరాటేలో బ్లాక్ బెల్ట్, యోగాలో ది బెస్ట్ పదమూడేళ్ళ అడ్వెంచరెస్ కిడ్

# కీర్తి



పన్నెండేళ్ల కీర్తికి సాహసం ఆరోప్రాణం. తన పొట్టపై నుంచి ఇద్దరు కూర్చుని వున్న మోటార్ సైకిలు నడిచిపోయినా, బరువైన గ్రానైట్ రాళ్లను ఉంచి పగలగొట్టినా నవ్వుకుంటూ ఒళ్లు దులుపుకుంటూ మామూలుగా పైకి లేస్తుంది కీర్తి. హైదరాబాద్‌లోని డిఫెన్స్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న ఈ అమ్మాయి 'యోగ', 'మార్షల్ ఆర్ట్స్'లలో చూపిన ప్రతిభ పలు బహుమతులను తెచ్చిపెట్టింది. కీర్తి 1999 డిసెంబర్‌లో యుముగుచి కరాటేలో బ్లాక్ బెల్టు సాధించింది. పోయినేడాది నవంబర్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించింది. వివిధ జాతీయస్థాయి 'యోగా' పోటీలలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది. ఈ మధ్య ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వహించిన యోగాపోటీలలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచింది. పొట్టమీద నుంచి మోటార్ సైకిల్ నడిపించుకోవటం, గ్రానైట్ రాళ్లు పెట్టి పగులగొట్టించుకోవటం లాంటి సాహసాల నుంచి పొట్ట మీద నుంచి కారు పోనించుకునే పరిస్థితికి ఎదిగింది. ప్రస్తుతం బస్సును గానీ లారీని గానీ పొట్ట మీద నడిపించినా భరించగలిగే శక్తిని సంతరించుకోవాలని ఆశిస్తోంది. ఈ సాహసబాలికకు సూర్యచంద్ర కల్చరల్ అసోసియేషన్ వారు 'బాలరత్న' అవార్డునీ, వాసవీ ఆర్ట్ థియేటర్స్ వారు 'వాసవీ బాలరత్న' అవార్డునీ అందచేశారు. కీర్తి వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్‌లలో కూడా ప్రతిభను కనబరుస్తోంది●











మీరు హైద్రాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు

ముస్లింల్లో బహుభార్యాత్వాన్ని, కోర్టుల ప్రమేయం లేకుండా విడాకులు పొందే సంప్రదాయన్నీ రద్దు చేయాలని కోరుతూ ఇటీవల జులేఖాబీ అనే ముస్లిం మహిళ సుప్రీం కోర్టు తలుపుతట్టారు. ముస్లిం మహిళలకి - రాజ్యాంగ సూత్రాలైన సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవ హక్కులు అందడం లేదని, 50 ఏళ్ళుగా దేశంలో పరిస్థితి ఇలాగే ఉందని ఆమె వాదన.

జులేఖాబీకి 1989లో వజల్ అనే యువకుడితో వివాహమైంది. అప్పటికి ఆమె వయసు 20 సంవత్సరాలు. ముస్లింల్లో బహుభార్యాత్వానికి ఉన్న అనుమతిని అడ్డం పెట్టుకుని 1991 లో వజల్ మరో మహిళను పెళ్ళి చేసుకున్నాడు. 1996 లో జులేఖాబీకి 'తలాక్' చెప్పాడు. 1993 నుంచి రూ.400/- మనోవర్తిగా ఇచ్చేవాడు. ఆ పిదప అదీ ఇవ్వనని నిరాకరించాడు.

మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు వజల్‌కు అనుకూలంగా రావడంతో 1999లో జులేఖాబీ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. తనకు మనోవర్తిని పునరుద్ధరించాలని కోరుతూ ఆమె పెట్టుకున్న పిటిషన్ సుప్రీంకోర్టులో ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది.

ఇప్పుడు తాజాగా దాఖలు చేసిన కేసులో జులేఖాబీ తన భర్త తనకు ఇచ్చిన తలాక్ నామాను చెల్లదని ప్రకటించాలని కోరుతున్నారు.

తలాక్ పద్ధతి దుర్వినియోగమౌతోందని టెలిగ్రావ్ ద్వారా తలాక్ చెప్పే విధంగా వెర్రితలలు వేస్తోందని జులేఖాబీ సోదహరణంగా కోర్టుకు విన్నవించుకున్నారు. కోర్టుతో ప్రమేయం లేకుండా విడాకులు ఇచ్చేందుకు వీలు కల్పిస్తున్న తలాక్, ఇలా, జిహార్, లియాన్ ఖులా వంటి సంప్రదాయాల్ని నిషేధించాలని, ముస్లిం స్త్రీలకి పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలని ఆమె వాదిస్తున్నారు.

ఇదంతా చూస్తుంటే మనకు 1985 నాటి షాబానో కేసు గుర్తుకురావట్లేదా.

43 సంవత్సరాలు కాపురం చేశాక షాబానోని 1975లో భర్త అహ్మద్ ఖాన్ ఇంట్లోంచి గెంటేశారు. 1978లో షాబానో కోర్టుల్ని ఆశ్రయించింది. అదే సంవత్సరం భర్త ఆమెకు విడాకులిచ్చాడు.

అయిదుగురు పిల్లలున్న షాబానోకి నెలకి రూ.25/- భరణం ఇస్తే చాలని మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. మధ్య ప్రదేశ్ హైకోర్టు 1980లో




ఆ మొత్తాన్ని రూ.179.20 కి పెంచమని చెప్పింది. 1985 ఏప్రిల్ 23న సుప్రీంకోర్టు షాబానోకి నెలకి రూ.500/- భరణంగా చెల్లించాలని తీర్పుఇచ్చింది.

ముస్లిం మతవాదులు, ముల్లాలు మతం ప్రమాదంలోపడిందని గగ్గోలు పెట్టారు.

73 సంవత్సరాల వృద్ధురాలు షాబానో వత్తిడికి తట్టుకోలేక తీర్పుని ఉపసంహరించుకోమని కోర్టుని కోరింది. తమ తీర్పు తిరుగులేదని న్యాయమూర్తి ప్రకటించారు.

ముస్లిం మతవాదుల హడావుడి తాకిడికి రాజీవ్ ప్రభుత్వం హడలిపోయింది.

అభ్యుదయ వాదులు, ప్రగతి కాములు కాస్త ఆలస్యంగా నిద్రమేల్కొన్నారు. అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. మహిళల నిరసనల మధ్య 1986 ఫిబ్రవరిలో రాజీవ్ ప్రభుత్వం ముస్లిం మహిళల గొంతునొక్కే బిల్లుకి పార్లమెంటు ఆమోద ముద్ర వేయించింది.

ముస్లిం మహిళలకి అన్యాయం జరిగిందని బాధపడి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ రాజీనామా చేశారు.

పార్టీలకి ఓట్లు కావాలి. మతవాదులకి ఆధిపత్యం కావాలి. నిరుపేద, నిరక్షరాస్య మహిళల హక్కులు, న్యాయం ఎవరికి కావాలి?

తదనంతరం సంభవించిన పరిణామాలు మరీ దురదృష్టకరమైనవి. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మత పెద్దలకి లొంగిపోయిందనే ప్రచారం - హిందూ మతవాదుల పలుకుబడి పెరగడానికి ఉపయోగపడటం, దేశం మతవాదుల చదరంగ క్రీడకి రక్తాన్ని మూల్యంగా చెల్లించాల్సిరావడం - దరిమిలా అయోధ్య తదనంతరం పరిణామాల్లో భారత రాజకీయాలపై మతవాదుల పట్టు పెరిగిపోవడం, లౌకిక ప్రగతి వాదుల గొంతు బలహీనం కావడం విషాదకరమైన చరిత్ర.

దేశ ప్రజలందరికీ కుల, మత, ప్రాంత, లింగ వివక్ష లేని యూనిఫామ్ సివిల్ కోడ్ కావాలనే చర్చకూడా వచ్చింది. ఆ చర్చని ప్రారంభించినవారి ఉద్దేశ్యాలపై అనుమానాలూ వ్యక్తమయ్యాయి.

ఈ నేపథ్యంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల్లోని పరిస్థితుల్ని విశ్లేషిస్తూ లౌకిక ప్రజాతంత్రవాది, అస్ఘర్ అలీ ఇంజనీర్ హిందూ పత్రికలో రాసిన వ్యాసాన్ని ఇక్కడ అందిస్తున్నాం.

- ఎడిటర్

# బంగ్లాదేశ్‌లో యూనిఫామ్ ఫ్యామిలీ కోడ్

పురుషాధిక్య సమాజంలో ఇతర మహిళల్లాగే ముస్లిం మహిళలు కూడా ఎంతో కాలంగా ఎలాంటి అధికారాలు, హక్కులకు నోచుకోలేదు. ఒకప్పుడు అఖండ భారతంలోని భాగాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో కూడా పరిస్థితి దీనికేమాత్రం భిన్నంగా లేదు. భారత్‌లో లాగే అక్కడి మహిళలు కూడా హక్కులు లేక నానా అగచాట్లకు గురి అవుతున్నారు. అయితే 1961లో అయూబ్‌ఖాన్ హయాంలోని పాకిస్తాన్‌లో కొన్ని మహిళా సంఘాల ఒత్తిడికి తలొగ్గి ముస్లిం పర్సనల్ లాలో కొన్ని మార్పులు చేశారు. ఒకే ఒక్క సిట్టింగ్‌లో తలాఖ్ పదాన్ని మూడుసార్లు అనేసి విడాకులు పొందే పద్ధతిని రద్దు చేశారు. ఖురాన్ (4:35)లో పేర్కొన్న విధంగా 'మధ్యవర్తిత్వ భావనను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం - విడాకుల విషయంలో తమ ప్రయోజనాలు కాపాడుకునేందుకు మధ్యవర్తులను నియమించుకునే హక్కు ముస్లిం మహిళలకి వుంటుంది.

బహుభార్యత్వం విషయంలోనూ - 1961లో అదే అయూబ్‌ఖాన్ హయాంలో - 'ముస్లిం ఫ్యామిలీ ఆర్డినెన్స్' జారీ అయింది. దీనిప్రకారం రెండవ పెళ్లిచేసుకోగోరే పురుషుడు విధిగా ఆ విషయాన్ని ముందు మొదటి భార్యకి తెలియజేయాలి. ఆమె ఆమోదం పొందాలి. అంతేకాక రెండవ భార్యని ఏ కారణం వల్ల చేసుకోవలసి వచ్చిందో కోర్టుల్ని నమ్మించాలి పాకిస్తాన్ మహిళలకు ఇది ఓ గొప్ప ఊరట. పై ఆర్డినెన్స్ అమల్లోకి వచ్చినప్పుడు బంగ్లాదేశ్ పాకిస్తాన్‌లో భాగంగా వుంది. తర్వాతికాలంలో పాకిస్తాన్ నుంచి విడిపోయాక కూడా బంగ్లాదేశ్‌లో ఈ సవరించిన చట్టం అమల్లో వుంది. ముస్లిం పర్సనల్ లాలో మహిళలకి అనుకూలంగా చేసిన పై సవరణలు పట్ల పాకిస్తాన్‌లో సంప్రదాయవాదులు మండిపడ్డారు. అయినా ఆయా ప్రభుత్వాలేవీ వాటిని ఉపసంహరించ లేదు. రెండు దేశాల్లోనూ ఇవి ఇప్పటికీ అమల్లో వున్నాయి. అయితే - బంగ్లాదేశ్ విషయానికొస్తే - అక్కడి పరిస్థితులు ఎంతో ఆసక్తికరంగా వున్నాయి. ఆ దేశంలో బలీయమైన లౌకిక, నిఖార్సైన సంప్రదాయ ధోరణులు రెండూ కనిపిస్తాయి. పెద్దగా చదువుకోని ఇమామ్‌లు, సైద్ధాంతిక వాదులైన జమాతె ఇస్లామీ శక్తుల సంప్రదాయ ధోరణుల ప్రభావం బంగ్లాదేశ్ సంస్కృతిపై బలంగా వుంది. ఈ మధ్యే ఢాకా హైకోర్టు ఒక విడాకుల కేసులో 'తలాక్ త్రయం' పద్ధతికి వ్యతిరేకంగా సంచలనాత్మకమైన తీర్పు చెప్పింది. మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు తీసుకునే ఈ సంప్రదాయానికి అనుకూలంగా ఏ ఇమామైనా ఫత్వా జారీ చేస్తే - విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా స్పష్టమైన రూలింగ్ ఇచ్చింది. సంప్రదాయ వాదుల్లో ఈ రూలింగ్ తీవ్ర కలకలం రేపింది. జమాతే ఇస్లామీ అయితే ఏకంగా సమ్మె పిలుపు ఇచ్చింది. దీంతో అభ్యుదయ, లౌకిక శక్తులు ఒకవైపు, మతవాదులు మరోవైపు - తీవ్రస్థాయిలో ఘర్షణకి దిగారు. ఈ కొట్లాటల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు.


ఆయూబ్ ఖాన్

అదే విధంగా - విడాకులు పొందిన మహిళ జీవితాంతం లేదా మరొకర్ని పెళ్లాడేదాకా మనోవర్తి పొందడానికి అర్హురాలవుతుందని ఢాకా హైకోర్టు 1999లో ఒక రూలింగ్ ఇచ్చింది. ఖురాన్ (2:241)లో పేర్కొన్నదాని ఆధారంగానే కోర్టు ఈ రూలింగ్ ఇచ్చింది. కాని ఈ తీర్పును బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

ఈ రకంగా బంగ్లాదేశ్‌లో అభ్యుదయ, సంప్రదాయ శక్తులు రెండూ చెరోవైపు బలంగా మోహరించి వున్నాయి. ముస్లిం పర్సనల్ లాలో మరిన్ని మార్పులు చేయాలని సెక్యులరిస్టులు డిమాండ్ చేస్తున్నారు. భారత్‌లో ముస్లిం మైనారిటీల మాదిరిగానే బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీలు తమ పర్సనల్ లాలో వేలు పెట్టడానికి వీల్లేదని శాసిస్తున్నారు. ఈ కారణంగా - బంగ్లాదేశ్‌లోని హిందూ మహిళల్ని ఇప్పటికీ పాతకాలం నాటి సంప్రదాయాలు, చట్టాలే శాసిస్తున్నాయి.

ప్రస్తుతం - బంగ్లాదేశ్ ప్రభుత్వం 1961 నాటి 'ముస్లిం ఫ్యామిలీ ఆర్డినెన్స్'ని దాటి ఎన్నో అడుగులు ముందుకు వెళ్లి - ఒక 'ఉమ్మడి కుటుంబస్మృతి' (యూనిఫాం ఫ్యామిలీ కోడ్) ముసాయిదా రూపొందించాలని యోచిస్తోంది. బేగం ఖలీదా జియా నహా ప్రతిపక్ష నాయకులంతా దీనికి సుముఖంగానే వున్నారు. ఈ కోడ్ అందరికీ వర్తిస్తుంది. చాలావరకు తమ జీవితాలని తామే శాసించుకునే అవకాశం మహిళలకి కలుగుతుంది.


అస్ఘర్ అలీ ఇంజనీర్

ఇకపై బంగ్లాదేశ్ మహిళలకి విడాకులు అనేవి ఎంత మాత్రం బాధాకరమైన అనుభవంగా మిగిలిపోయే అవకాశం లేదని భావిస్తున్నారు. ఏ మతానికి చెందిన మహిళలైనా సరే - వారిపట్ల వివక్షను అంతం చేసి - వారికి సమాన హోదా కల్పించాలన్నదే ఈ కోడ్ తాలూకు ముఖ్య ప్రయోజనంగా కనిపిస్తోంది. 'బంగ్లాదేశ్ మహిళా పరిషద్' ఈ కోడ్‌ని రూపొందించింది. ఈ మహిళా సంస్థ మహిళల హక్కుల కోసం అక్కడ గత 30 ఏళ్లుగా పోరాటం చేస్తోంది. బిఎంపి ప్రధాన కార్యదర్శి అయేషాఖాన్ తమ పోరాటం గురించి చెబుతూ "వ్యక్తిగత హక్కుల విషయంలో మహిళల్ని అణగదొక్కడంతోపాటు దారుణమైన వివక్ష చూపుతున్నట్టు మేం గుర్తించాం. రాజ్యాంగం స్త్రీ, పురుషులకు సమాన హోదా కల్పిస్తున్నప్పటికీ అభివృద్ధి చెందే అవకాశాలు ఎంతమాత్రం మహిళలకి లేవు" అంటారు. కోడ్ ముసాయిదాలోని తొలిభాగం వివాహం - విడాకులకు సంబంధించినది. దీని ప్రకారం - పెళ్లిని కాని, విడాకులని గాని తప్పనిసరిగా రిజిస్టరు చేయించాలి. అంతేకాక - మగపిల్లలకి 22 సంవత్సరాలు, ఆడపిల్లలకి 18 సంవత్సరాల వయసుని పెళ్లికి యుక్తమైన వయసుగా నిర్ణయించింది. బంగ్లాదేశ్‌లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలకి రజస్వల అయీకాగానే - లేక - అంతకు ముందుగానే పెళ్లిళ్ల చేయడం సంప్రదాయంగా వుంది. ఈ రకమైన పెళ్లిళ్లేవీ రిజిస్టరు అయిన పాపాన పోలేదు.

ఏవో కారణాల వల్ల మగవాళ్లు అర్థాంతరంగా వదిలేసి పోవడమో - లేక తలాక్ అంటూ మూడుసార్లు చెప్పేసి విడాకులు తీసుకోవడమో జరగడంతో ఇలాంటి టీనేజి ఆడపిల్లలు ఎదుర్కొనే దుర్భర చేదు అనుభవాలు ఎన్నో... ఒకవేళ ఈ పెళ్లిళ్లే కనక రిజిస్టర్ అయివుంటే - తమ హక్కుల్ని డిమాండ్ చేయడానికి సాధించుకోవడానికీ - ఇలాంటి వారికి - చట్టపరమైన ఆయుధం చేతిలో వుండేది. భారత్‌లో కూడా పెళ్లిళ్లని తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలని జాతీయ మహిళా కమిషన్ సిఫార్సు చేసింది. కాని సంప్రదాయ వాదులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఈ సిఫార్సును ప్రభుత్వం ఎన్నడూ పరిశీలించిన పాపాన పోలేదు.

మహిళలుగాని, పురుషులుగానీ ఏ కారణాలపై విడాకులు తీసుకోవచ్చో ప్రతిపాదిత 'యూనిఫాం ఫ్యామిలీ కోడ్' స్పష్టంగా చెబుతోంది. పురుషులు ఎనిమిది, మహిళలు పది కారణాలపై విడాకులు కోరవచ్చు. పురుషుడి అనైతిక వర్తన, నపుంసకత్వం, శారీరక, మానసిక వేధింపులు మొదలైనవి మహిళలువిడాకులు కోరడానికి తగిన కారణాల్లో కొన్ని. ప్రస్తుత కోడ్‌లో వరకట్నం వేధింపుల్ని కూడా విడాకులకు అర్హమైన కారణంగా చేర్చారు. అయితే వరకట్నానికి ఇస్లాంలో అనుమతి లేకపోయినా దాన్ని విడాకుల కోసం ఓ అర్హమైన కారణంగా చేర్చడం - నిజంగా ఓ సరికొత్త భావనే. వరకట్నం అనేది ఇతర ఇస్లామిక్ దేశాల్లో లేదు. కాని దురదృష్ట వశాత్తూ భారత ఉపఖండంలోని ముస్లింలలో మాత్రం ఈ దురాచారం బాగా పాతుకుంది.

'ముస్లిం మహిళ' అనే అంశంపై ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ సెమినార్‌లో వరకట్నం ఇస్లాం వ్యతిరేకమని ఉలేమా అంగీకరించారు. దీనికి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు.

ఒక ముస్లిం మహిళను ఆమె భర్త నాలుగేళ్లకి పైగా వదిలేస్తే అతడి నుంచి విడాకులు పొందే హక్కు ఆ మహిళకి వుంది. 1939 నాటి ముస్లిం వివాహ చట్టాన్ని రద్దు చేయడంతో ఈ హక్కు ఆమెకి సంక్రమించింది.

అయితే - ప్రస్తుతం యూనిఫాం ఫ్యామిలీ కోడ్ మరికొంత ముందుకెళ్ళి - భర్త కనక రెండేళ్ల పాటు భార్య సంరక్షణ ఖర్చుని చెల్లించకున్నా లేక ఆమె గురించి ఇతరత్రా ఏరకంగా పట్టించుకోకపోయినా ఆ మహిళకి విడాకులు కోరే హక్కుని కల్పించింది.

అంతేకాక భర్త డ్రగ్స్‌కి బానిస అని తెలిసినప్పుడు కూడా భార్య విడాకులు కోరవచ్చు. పురుషుడు కూడా ఇదే కారణంపై భార్య నించి విడాకులు డిమాండ్ చేయవచ్చు. యుఎఫ్‌సి ముసాయిదా ప్రకారం - తన భార్య లెస్బియన్ అయినప్పుడు విడాకులు కోరే అవకాశం భర్తకి వుంది కానీ భర్త స్వలింగ సంపర్కుడైనప్పటికీ అతడి నుంచి విడాకులు కోరే అవకాశం భార్యకి లేదు.

భర్త ఆలన, పాలనకు నోచుకోని మహిళలకు సంబంధించి - భిన్న మతాచారాలు, సాంప్రదాయ చట్టాలకు అతీతంగా యుఎఫ్‌సి మరో ముఖ్యమైన ప్రతిపాదన చేసింది. భార్యని వదిలేసిన సందర్భంలో భర్త ఆమె పోషణ ఖర్చుని భరించడాన్ని ఈ కోడ్ తప్పనిసరి చేయనుంది. పోషణ ఖర్చుల్ని చెల్లించడానికి స్పష్టమైన విధివిధానాలను పొందుపరుస్తూనే, అలా చెల్లించినప్పుడు ఏ రకమైన చర్య తీసుకోవాలో కూడా ఇది నిర్దేశిస్తుంది. బంగ్లాదేశ్‌లో భర్తలు వదిలేసిన భార్యల సంఖ్య అంతకంతకు పెరుగుతోందని ఆ దేశానికి చెందిన మహిళా ఉద్యమనాయకురాలు ఫరీదా ఆరిఫ్ చెప్పిన మాటల్ని గమనిస్తే కోడ్‌లో పొందుపరిచిన ఈ ప్రతిపాదన ప్రాముఖ్యత అర్థమవుతుంది. అలాంటి మహిళలకు సంరక్షణ ఖర్చును చెల్లించేందుకు ఇప్పటికైనా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరమని ఫరీదా చెబుతున్నారు.

యూనిఫాం ఫ్యామిలీ కోడ్‌లోని మిగతా భాగాల్లో - మైనర్లకి సంరక్షకుల నియామకం, దత్తత మొదలైన అంశాల గురించి పేర్కొంది. దత్తతకు సంబంధించి ఈ కోడ్ ఒక ఉమ్మడి చట్టాన్ని సూచించింది. వివాహిత జంట దత్తత చేసుకోవడానికి మార్గాలని చాలా సరళం చేసింది. కానీ ఒక మహిళ గాని, పురుషుడుగాని విడివిడిగా దత్తత తీసుకోవడాన్ని అనుమతించ లేదు. వారసత్వానికి సంబంధించి కూడా ఈ కోడ్ ఒక ఉమ్మడి చట్టాన్ని పొందుపరిచింది.




ఆస్తి హక్కులు అనేవి అసలే వివాదాలమయం. ఒక మహిళకి వివాహమైనా, కాకున్నా ఆస్తిలో సమాన హక్కులుండాలని ఫ్యామిలీకోడ్ చెబుతోంది. కోడ్‌లోకెల్లా అత్యంత వివాదస్పదమైన అంశం ఇదే. ఎందుకంటే - ఆస్తిలో మహిళలకి సమాన హక్కులు కల్పించే అంశాన్ని షరియత్ ప్రస్తావించలేదు.

మహిళలకి ప్రయోజనం చేకూర్చే ఎన్నో సవరణలతో కూడిన 'యూనిఫాం ఫ్యామిలీ కోడ్'పై సహజంగానే సంప్రదాయ వాదులు చిందులేస్తున్నారు. కాని మహిళా సంస్థలు ఈ కోడ్ అమలుపై మరోవైపు తీవ్రమైన ఒత్తిడి తెచ్చే అవకాశముంది. ఢిల్లీలో జరిగిన సెమినార్‌ని పరిశీలిస్తే భారతదేశంలో కూడా ముస్లిం మహిళలు మార్పుని ఎంతగా కోరుతున్నారో రేఖామాత్రంగా అర్థమవుతుంది. 'తలాక్ త్రయం' న్యాయబద్ధతని బహుభార్యత్వాన్నీ ఈ సెమినార్‌లో చాలా మంది విమర్శించారు. తలాక్ విధానాన్ని తొలగించాలని, బహుభార్యత్వంపై అదుపు అవసరమని ఈ మేరకు సవరణలు చేయాలని ముస్లిం లాబోర్డుని కోరారు●

# అల్లా మెహర్బాన్ తో గధా పహిల్వాన్

## (దేవుడు దయచూపిస్తే గాడిదే పహిల్వాన్) 5

యర్రంశెట్టి శాయి



చోరప్పన్ చిన్నసైజ్ వికటాట్టహాసం చేశాడు.

"ఏమప్పా హోమ్‌మినిష్టరూ! ఏమి విశేషం? మనవాండ్లందరూ నిండా సౌఖ్యమా?"

"ఏదో సార్. తమ దయ! అలా ఉన్నాం!"

"ఏమంటా ఉన్నాడు నీ ముఖ్యమంత్రి? చోరప్పన్‌ని కాల్చి సంపుతామంటాడా?"

"అహహ- అదేం లేదుసార్! మేమెప్పుడయినా అట్లా చేశామా ఏంది? మీ జీవితమంతా అడవుల్లోనే మూడు ఏనుగుదంతాలూ ఆరుపులుల చర్మాలుగా గడిపేరు కాదా ఏంది? ఏనాడయినా మేము మీ జోలికొస్తిమా? ఒక్క పోలీసోడినయినా మీరున్న చోటికి పంపినామా?

"మరా టి.వి.లో ఆ ప్రకటనలిస్తా వుండావేందప్పా - అడవిదొంగ చోరప్పన్‌ని నిండా కాల్చి సంపుతాం - 'Shoot at Sight' ఆర్డర్స్ ఇచ్చివుండాం! పోలీస్ బెటాలియన్ ఆయుధాలతో అడవుల్లోకి పంపి ఉండాము. ఏందప్పా ఇది? తమిళనాడు మాజీముఖ్యమంత్రి కరుణానిధి మాతో రొంబస్నేహం సేస్తాడు. కర్నాటక ముఖ్యమంత్రి కృష్ణ రొంబ ఫామిలీ ఫ్రెండ్ మాదిరి ఉంటాడు. వాళ్లకంటె నువ్వా మీ ముఖ్యమంత్రి గొప్పసారువాళ్లా ఏమి?"

"అయ్యో సార్! అట్లా అపార్ధం చేసుకుంటే ఎట్లా సార్? మేము న్యూస్ పేపర్లకూ, టి.వి. చానెల్స్‌కీ ప్రజలకూ స్టేట్‌మెంట్లిచ్చేది అవన్నీ నిజంగా చేస్తానికా ఏంది? వాళ్లను వెధవల్ని చేస్తానిక్కాదూ? ఇవన్నీ మీకు తెలిదా ఏంది?"

"ఏమప్పా నీ మాట మీది నిండా నమ్మకముండాదిలే! మా కుక్క కంటే రొంబ విశ్వాసం గల వాళ్లప్పా మీరు. ఇంతమంది విశ్వాసం ఉన్న రాజకీయనాయకులుండగా ఇంక కుక్కెందుకని మొన్నే మా కుక్కని బ్లూక్రాసోళ్లకి ఇచ్చానప్పా! ఆ బ్లూ క్రాస్ నల్ల క్రాసప్పా! వాళ్లు కుక్కలకు తిండి పెట్టరు గానీ రొంబా ప్రేమ పెడతారప్పా! ఆ ప్రేమ మాత్రం ఎవరప్పా పెడతారు ఈ చెడ్డ రోజుల్లో - అందుకే వాళ్లన్నాకూడా నాకు నల్లా ఇష్టం-"

చోరప్పన్ మాటలకు హోమ్ మినిష్టర్‌కి కోపం వచ్చిందిగానీ చోరప్పన్ మీద కోపం తెచ్చుకున్న వాడెవడూ బ్రతికి బట్టగట్టడని తెలుసు గనుక మళ్ళీ మస్కా కొట్టే కార్యక్రమంలో పడిపోయాడు.

"అవున్సార్? అన్నట్లు ఇప్పుడే మీ డిమాండ్స్ లిస్ట్ నాకు చేరింది సార్!"

"అన్నీ నిండా సది వావా?"

"మొత్తం చదివుండలే! చాలా వెరయిటీ డిమాండ్స్ సార్ మీవి! ఇంతవరకూ ఏ కిడ్నాపరూ కూడా ఇంతమంచి డిమాండ్స్ పెట్టలేదు మన దేశంలో-"

"నేను ఆర్డినరీ డెకాయిట్‌ని కాదప్పా! రొంబ ఇంటెలిజెంట్ డెకాయిట్ గానే - అందుకే రెండు రాష్ట్రాల పోలీసు బలగం గాజులు తొడుక్కున్నదప్పా - ఎంత దొడ్డవాడినయినా కాష్‌తో కిలోల లెక్కకొంటా నప్పా - నీ రేటెంతో అడిగి నిన్ను హోల్‌సేల్‌గా కొన్నానా లేదాప్పా? ఏమి మాట్లాడవేమి?"

"అవునవున్సార్"

"ఇంతకు నా డిమాండ్స్ గురించి ఏమయ్యా ఆలోచిస్తిరి? ఓకే చేస్తిరా లేదా?"

"భలేవారే సర్ మీరు డిమాండ్స్ అడగటం మేము కాదనటమూనా?"

"మరానంగతి టి.వి.లో ఎనౌన్స్ చేయరేమి? ఏమయినా వర్జ్యం ఉండాదా?"

"అబ్బే- మీ విషయంలో అవేమీ ఉండవుసార్! కాపోతే కొన్ని ఫార్మాలటీస్ ఉంటాయ్ కదా! మీ డిమాండ్స్ వెంటనే వప్పేసుకుంటే ప్రజల్లో మా పార్టీ పరువుపోతుంది. అందుకని...."

"ఏమప్పా అట్టా మాట్టాడతా ఉండావు? ఆ వీరప్పన్ డిమాండ్స్ అన్నీ నిమషాల్లో కర్ణాటక, తమిళనాడు ముఖ్యమంత్రులు వప్పుకున్నారు కదా? నువ్వా, నీ ముఖ్యమంత్రీ వాళ్ల కంటే ఎక్కువా?"

"ఒక్క రోజు ఓపిక పట్టండి సార్! ఈలోగా కొంచెం డ్రామా ఆడి కాబినెట్‌లో డిస్కషన్ చేసినట్టు చేసి, గత్యంతరం లేని పరిస్థితుల్లో మీ డిమాండ్స్ వప్పుకోడానికి గవర్నమెంట్ అంగీకరించిందని ప్రెస్ మీట్‌లో ఎనౌన్స్ చేస్తాం! మీకు తెలీందేమున్నది సార్! మా రాష్ట్రంలో ప్రజలకు కొంచెం పొలిటికల్ అవేర్‌నెస్ ఎక్కువ! అందుకని కొంచెం డ్రామా, మెలోడ్రామా, డాకూ డ్రామాల్లాంటివి ఉపయోగించాల్సి వస్తుంది-"

"సరే నప్పా! మీరే మీటింగ్‌లయినా పెట్టుకోండి, ఏమయినా చేసుకోండి! నా డిమాండ్స్ వప్పుకోడానికి ఇంకా వారం టైమిచ్చి ఉండాను- ఈ లోగా వప్పుకోకపోతే కర్నాటక సిఎంనేమి, మీ సిఎంని కూడా కిడ్నాప్ చేస్తా-"

హోమ్ మినిష్టర్ గుండె ఆనందంతో వేగంగా కొట్టుకోసాగింది.

"ఆ! నిజంగానా సార్? నిజంగా మా సిఎంని కిడ్నాప్ చేస్తారా? బాబ్బాబు ఆ పనేదో త్వరగా చేయండి సార్! చేస్తే నేనే సిఎం అవుతాను సార్! అప్పుడు మనిద్దరం కలిసి రాష్ట్రాన్ని పంచుకోవచ్చు - "నేనెప్పట్నుంచో సిఎంనవాలని కోరికసార్! మీ దయవల్ల అది నెరవేరితే మీకేం కావాలంటే అది ఇచ్చుకుంటాను. మీకు ఫారెస్ట్‌లన్నీ కంట్రాక్ట్ కిచ్చేస్తాను- రాష్ట్రంలోని పెద్ద పెద్ద కంట్రాక్ట్‌లు కూడా మీకిప్పిస్తాను - రాష్ట్రంలో ఒక ఏరియా మీద మీకు ఫుల్ పవర్స్ ఇస్తాను. ఆ ఏరియాలో ధనవంతులను బెదిరించి డబ్బు వసూలు చేసుకోవచ్చు. కంట్రాక్టర్లందరి నుంచీ పర్సంటేజీలు వసూళ్ళు చేయువచ్చు - ఇక సిటీస్‌లో, టౌన్స్‌లోనూ రోడ్లన్నీ మీరు ఆక్రమంచి స్కూటర్ పార్కింగ్‌లనీ, కార్‌పార్కింగ్‌లనీ, సైకిల్ పార్కింగ్‌లనీ, మనుషుల పార్కింగ్‌లనీ - తెగ డబ్బు కొట్టేయువచ్చు - ఇవన్నీగాక వ్యాపారస్తుల నుంచి దోచుకోవటం సంగతి సరేసరి-"

చోరప్పన్‌కి అతని వాగుడు చిరాకు కలిగించింది.

"ఏయ్ - ఏమప్పా! ఒకసారి మొదలు పెట్టిందానే, కామా, ఫుల్‌స్టాప్ లేకుండా పిచ్చికుక్కలాగా అరుస్తాఉండావు. మా సిఎంని కిడ్నాప్ చేయమంటే మా సిఎంని కిడ్నాప్ చేయమని మన దేశంలో అన్ని రాష్ట్రాలనుంచీ ఫుల్ డిమాండ్స్ ఉన్నాయప్పా నాకు. అందరు సిఎంలనూ ఒకేసారి ఎట్లా కిడ్నాప్‌సేస్తాను? ఈ అడవిలో నాకేమయినా ఫైవ్‌స్టార్ ఫెసిలిటీస్ ఉండాయా ఏంది? అదీగాక సిఎంని కిడ్నాప్ చేసి సంవత్సరం పాటు నాకస్టడీలో ఉంచుకోవాలంటే ఎంత ఖర్చవుతుందను కున్నావు? అయిదుకోట్లప్పా! అంజి కోట్లు - మరివాడికే అంజికోట్లు ఖర్చయితే నాకెంత మిగలాలి? కనీసం యాభయ్ కోట్లయినా మిగలాలా? అంటే మొత్తం 70 కోట్లు ఖర్చవుద్ది? నువ్ కనీసం పాతిక కోట్లయినా కాష్‌డౌన్ చేయగలవా?"

"ఏమప్పా మాట్లాడవేమి? ఇస్తానంటే నీ పేరు వెయిటింగ్ లిస్ట్‌లో పెడతాను-"

"పాతిక కోట్లు కాష్‌డౌన్ అంటే కొంచెం కష్టమే సార్! కాష్ అంతా స్విస్ బాంక్‌లో ఉంది. అది వెనక్కు రావాలంటే కొంచెం టైమ్ పడుతుంది - హవాలాలు గివాలాలు చాలా గొడవుంది దానికి-"

"అందుకే వాయిముడప్పా అని చెప్పేది! అయ్యయ్యో - నా టైమంతా వేస్ట్ చేశావ్ కదప్పా! సెల్‌ఫోన్‌లో కార్డ్ మొత్తం అయి పూడ్చింది. నా డిమాండ్స్ సంగతి త్వరగా తేల్చి జైల్లో ఉన్న నా సెకండ్ సెటప్ రాజమ్మను వెంటనే విడుదల చేసి పోలీస్ జీప్‌లో నా ఏరియాకు పంపించు! రాత్రిళ్ళు అది పక్కన లేకపోతే నిద్ర పట్టి పూడ్చటం లేదప్పా-"

"అలాగే సార్- పాపం రాజమ్మ లేకపోతే చాలా కష్టమే మీకు-"

ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

హోమ్ మినిష్టర్‌లో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. ఇంతకాలం అడవిదొంగ చోరప్పన్ వల్ల ఎలక్షన్ సమయంలో ఫండ్స్, స్మగ్లింగ్ వ్యాపారానికి బాసట, ప్రత్యర్ధులను లేపేసేందుకు సాయం - ఇవే లాభాలను కున్నాడు. కానీ ఇప్పుడు కొత్త పాయింట్ దొరికింది. ఎలాగోలా సిఎంని కిడ్నాప్ చేయించగలిగితే ఆటోమేటిగ్గా తనే సిఎం అయిపోతాడు. చోరప్పన్ ఆ పని చేసి పెడితే 75 కోట్లేం ఖర్మ వందకోట్లయినా ఇచ్చేయువచ్చు. వరల్డ్ బ్యాంక్ ఫండ్సన్నీ ఇలాంటి అవసరాలకు కాకపోతే ఇంకెందుకు మరి?

వెంటనే జీప్‌లో సిఎం ఇంటికి బయల్దేరాడు.

వెంటనే లోపలికి పిలిపించాడు ముఖ్యమంత్రి.

"రండి! ఇప్పుడే మీకు పంపిన చోరప్పన్ డిమాండ్స్ కాపీ నాక్కూడా ఫాక్స్‌లో వచ్చింది. దాన్ని గురించే డిస్కస్ చేయడానికి కాబినెట్ మీటింగ్ పిలిచాను-"

"ఇంకా మీటింగెందుకు సార్- డిమాండ్స్ అన్నీ ఓకే చేసేస్తాం కదా!" అడిగాడు హెల్త్ మినిష్టర్.

"అలా వెంటనే వప్పేసుకుంటే మన గవర్నమెంట్ పరమనీచనికృష్ట మయిన ప్రభుత్వం, మన ముఖ్యమంత్రి చేతగాని వెధవ, మన హోమ్‌మినిష్టర్ ఒక పిట్టలదొర అని అనుకోరంటండీ?" చిరాగ్గా అన్నాడు ముఖ్యమంత్రి.

"అంటే ఆ విషయాలు ప్రజలకు తెలీకూడదంటారు అంతేకదా?"

సిఎం మళ్లీ చిరాగ్గా చూశాడు.

ఈలోగా రెవిన్యూ మినిష్టర్ అందుకున్నాడు.

"ఆ డిమాండ్స్‌లో పెద్ద కష్టమయినవేమీ లేవు - ఎటొచ్చీ చోరప్పన్ జీవిత చరిత్ర మన రాష్ట్రంలోని స్కూలు సిలబస్‌లో పాఠ్యాంశంగా పెట్టమంటున్నాడు. అది కొంచెం ఇబ్బంది కరంగా వుంటుంది. న్యూస్ పేపర్‌వాళ్ళు దుమ్మెత్తి పోస్తారేమో-"

"వాళ్ళెలా క్రిటిసైజ్ చేస్తారండీ, మన గవర్నమెంట్‌నీ, మన సిఎంనీ, మన పనితీరునీ తెగపొగుడుతూ, తెగ ఆకాశానికెత్తేస్తూ, అసహ్యంగా భజన చేయిస్తున్నాం కదా! రాష్ట్రంలో రోజురోజుకీ పెరిగిపోతున్న అవినీతిగురించీ, గూండాయిజం గురించీ, పోలీస్‌స్టేషన్ ఎదురుగ్గానే జరుగుతోన్న చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి, పిల్లల కిడ్నాప్‌లు, మిషనరీ హోమ్స్‌ద్వారా అమ్మకాల గురించీ ఇవేమీ ఎవరూ హైలైట్ చేయకుండా మానేజ్ చేస్తున్నాం కదా!"

"అంటే చోరప్పన్ జీవిత చరిత్ర పిల్లలకు పాఠంగా పెట్టేద్దామంటారా?" చిరాగ్గా అన్నాడు ఎడ్యుకేషన్ మినిష్టర్.

"పెడితే తప్పేముందండీ? ఇప్పుడు కొంచెం క్రిటిసిజం వచ్చినా వచ్చే ఎలక్షన్లో ఎలాగో చోరప్పన్ కొత్త పార్టీ పెట్టి సిఎం అయ్యే అవకాశాలున్నయ్. లేదా కనీసం అపొజిషన్ లీడర్ అయినా అవుతాడు. అంటే కాబినెట్ హోదా వస్తుంది. అప్పుడింక ఎవడూ మాట్లాడడుగా-"

"ఎలా మాట్లాడతారు? ఎన్నుకున్నది ప్రజలే గనుక ఎవడయినా కొశ్చెన్ చేస్తే చెప్పు తీసుక్కొట్టవచ్చు-"

"కానీ అది చదివిన పిల్లలు చెడిపోడానికి అవకాశం ఉందికదా?" ఎడ్యుకేషన్ మినిష్టర్ ఇంకా సంతృప్తి పడకుండా గొణిగాడు.

దాంతో హోమ్‌మినిష్టర్‌కి కోపం వచ్చింది.

"పిల్లలు ఇంకా ఇప్పుడు కొత్తగా చెడిపోయేందుకు అవకాశం ఎక్కడుందండీ అసలు? అదివరకు పిల్లలు ఆలోచనలకూ ఇప్పటి పిల్లల ఆలోచనలకూ ఏనాడో చాలా వ్యత్యాసం వచ్చేసింది. అదివరకు సైన్యంలోచేరి దేశంకోసం త్యాగాలు చేయాలనుకునేవారు. ఇప్పుడు సైన్యంలో చేరి "తెహల్కా స్కామ్‌ల ద్వారా కోట్లు కొట్టేయాలని ప్లాన్లు వేస్తున్నారు. అది వరకు మంచి క్రీడాకారులయి దేశ విదేశాల్లో పేరు తెచ్చుకోవాలని కలలు కనేవాళ్ళు. ఇప్పుడు త్వరగా క్రీడల్లోకి షార్ట్‌కట్స్ ద్వారా జొరబడి మాచ్ ఫిక్సింగ్‌ల ద్వారా కోట్లు సంపాదించాలని ఆశపడుతున్నారు. అదివరకు మంచి గుణగణాల ద్వారా, తెలివి తేటల ద్వారా నలుగురిలో పేరు ప్రఖ్యాతులు పొందాలనుకునేవారు. ఇప్పుడు శరీరాన్ని వీలయినంతవరకూ నగ్నం చేసి మోడలింగ్‌లు, ఇతర బాడీషోలు చేసి అర్జంటుగా డబ్బు, లగ్జరీస్ పొందాలనుకుంటున్నారు. అదివరకు





మీరు హైద్రాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు

ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్. అయి సంఘాన్ని బాగు చేద్దామనుకునేవాళ్ళు. ఇప్పుడు దొంగలతో, బ్రోకర్లతో, వ్యభిచారులతో, అవినీతిపరులతో, క్రిమినల్స్‌తో ఫ్రెండ్‌షిప్ ఏర్పరచుకుని దేశం సర్వనాశనం అయినాసరే డబ్బూ, మందూ, సెక్స్‌లను ఎంజాయ్ చేయాలను కుంటున్నారు...."

"స్టాపిట్" ముఖ్యమంత్రి గట్టిగా అరచాడు.

అందరూ సైలెంటయిపోయారు.

"ఒకే ఒక్క డిమాండ్ తప్ప మిగతావన్నీ అంగీకరించడానికి కాబినెట్ అంగీకరించింది" అని మనం వెంటనే ప్రెస్‌కి స్టేట్‌మెంటి చ్చేద్దాం!"

"ఆ ఒక్కటీ ఏమిటిసార్?"

"అదే చోరప్పన్ 20 కోట్ల కాష్ అడిగాడు కదా! అది మాత్రం ప్రభుత్వం ఇవ్వటానికి అంగీకరించదు - ప్రభుత్వం బ్లాక్ మెయిలింగ్‌కి భయపడదు -" అని చెప్తే సరిపోతుంది.

అందరూ అదిరిపడ్డారు.

"అదేమిటిసార్! అది అసలయిన డిమాండ్! అది వప్పుకోకపోతే చోరప్పన్ ఎలా ఊరుకుంటాడు?"

సిఎం అందర్నీ వెర్రి వెధవల్ని చూసినట్లు చూశాడు.

ఇంతకాలం నుంచీ రాజకీయాల్లో ఉన్నారు - మంత్రి పదవులు వెలగ పెడుతున్నారు. అయినాగానీ లుచ్ఛాపనులు మీకేమీ తెలీనట్లూ - చేతకానట్లూ డ్రామా ఆడి ఇంకా జెంటిల్మెన్‌గా వేషాలేస్తారేమిటయ్యా! నేనేమంటున్నాను? అలా అని ప్రజలకు చెప్దామంటున్నాను. అంతేగాని నిజంగా డబ్బు ఇవ్వకపోతే ఎలా? ఇలాంటివన్నీ లోపాయికారీగా జరిగిపోవాలిగానీ ప్రజలకు తెలీకూడదు. వీరప్పన్ వ్యవహారంలో కూడా అంతేకదా! ముందు డబ్బు తాలూకు డిమాండ్ గురించి మాట్లాడారు. తర్వాత ఆ టాపిక్ ఎత్తటం మానేశారు-"

అందరూ సిఎం చెప్పిందానికి వప్పుకుని తప్పట్లు కొట్టారు.

"ఇప్పుడు చేయాల్సిందేమిటంటే మనం ఒకటి రెండు తప్ప మిగతా డిమాండ్స్ అన్నీ వప్పుకున్నట్లు - చోరప్పన్ దగ్గర కెళ్లి మాట్లాడి, కర్ణాటక చీఫ్ మినిష్టర్‌ని విడిపించడానికి ప్రభుత్వం తరఫున ఒక దూత కావాలి-"

అందరూ మొఖాలు చూసుకున్నారు.

"చోరప్పన్‌తో ఎవరికి మంచి స్నేహం ఉందో తెలిస్తే ఆ వ్యక్తిని పంపించవచ్చు".

ఎవరికి వాళ్లే ఆలోచనలో పడ్డారు.

"చోరప్పన్‌తో అన్నీ పార్టీల వాళ్ళకూ స్నేహం ఉంది సార్! కాపోతే ఎవరితో ఎక్కువ క్లోజ్‌గా ఉంటాడో తెలుసుకోవాల్సి వుంది-" అన్నాడు రెవిన్యూ మినిష్టర్.

"తెల్సుకోడానికేముంది? నా దగ్గర అందరిదీ హిస్టరీ ఉండ్లా? ఎలక్షన్ టైమ్‌లో ఎవరు చోరప్పన్ దగ్గర ఎన్నెన్ని లక్షలు తీసుకుందీ మొత్తం ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ఉంది-"

ముఖ్యమంత్రి అతని వేపు అభినందన పూర్వకంగా చూశాడు.

"గుడ్! అయితే మన ప్రాబ్లెమ్ సాల్వ్ అయిపోయినట్లే! చోరప్పన్ ఎవరికి ఎక్కువ ఎలక్షన్ ఫండ్ ఇచ్చాడో అతనే క్లోజ్ ఫ్రెండ్, బాగా కావలసిన వాడు అయింటాడు- అతనెవరో చూడండి-"

హోమ్ మినిష్టర్ తడుముకోకుండా సమాధానం చెప్పాడు.

"ఇంకెవరు? మన బాలశకుని! బాలశకునికి యాభైలక్షలు డొనేషన్ ఇచ్చాడు-"

"కానీ బాలశకుని ఎలక్షన్‌లో పోటీ చేయలేదుకదా? ఆ డబ్బు ఎవరికి వాడారు మరి?"

"ఇంకెవరు? వాళ్ళల్లుడు గంగారామ్-"

"అయితే ప్రాబ్లెమ్ సాల్వ్ అయిపోయినట్లే - మన ప్రభుత్వ దూతగా గంగారామే చోరప్పన్ దగ్గర కెళ్ళి దౌత్యం చేస్తాడు -" చెప్పాడు ముఖ్యమంత్రి.

"సరే సార్- నేనిప్పుడే గంగారామ్‌ని పిలిపిస్తాను సార్" అంటూ సెల్‌ఫోన్‌లో రింగ్ చేశాడు హోమ్ మినిష్టర్.

గంగారామ్ వెంటనే లైన్లోకొచ్చాడు.

"ఏమయ్యా గంగారామ్! రాష్ట్రంలో ఏగొడవచ్చినా నీ చుట్టూనే తిరుగుతా ఉండాదయ్యా! ఏంది సంగతి?"

గంగారామ్‌కి అతని మాటలు ఓ పట్టాన అర్ధం కాలేదు.

"ఇప్పుడేం జరిగింది సార్! బైగాడ్ చెప్తున్నాసార్- పిల్లల దత్తత కేసులో పోలీసుల వెతుకుతోన్న శాంతి దయాల్ మాత్రం మా ఇంట్లో లేదు - ఒక్కసారి మాత్రం వచ్చి మా ఇంట్లో దాక్కుంటానని అడిగింది. నేను వీల్లేదని ఖండితంగా చెప్పేశాను- అంతేకాదు - ఆ పిల్లల దత్తత గొడవల్లా మా మిసెస్‌క్కూడా ఏమీ సంబంధం లేదు-"

"ఆ సంగతులన్నీ నాకు తెలుసులేవయ్యా! నేను మాట్లాడదల్చుకుంది ఆ విషయం కాదు - అడవిదొంగ చోరప్పన్ పెట్టిన డిమాండ్స్ గురించి మాట్లాడ్డానికి నిన్ను దూతగా అతని దగ్గరకు పంపాలని చీఫ్ మినిష్టర్‌గారు డిసైడ్ చేశారు-"

"ఆ! నేనా? చోరప్పన్ దగ్గరకా?"

"ఓవరాక్షన్ వద్దు - సిఎంగారు చోరప్పన్ ఎలక్షన్ ఫండ్ లిస్టంతా చూశారు - అతను ఇచ్చిన 50 లక్షలు పెద్ద మొత్తం నీదే - అందుకని నువ్వే వెళ్లాలి-"

"నేను ఆ డబ్బు తీసుకునేప్పుడు ఒకే ఒక్కసారి అతనిని కలుసుకున్నాను సార్ - ఆ తరువాత ఇంతవరకూ మళ్ళీ కలుసుకోలదు-"

"అదేగదా నేనుకూడా అనేది - కృతజ్ఞత చెప్పటానికయినా వెళ్ళాలి కదా! అదే గవర్నమెంట్ డ్యూటీ మీద వెళ్ళావనుకో - నకల లాంఛనాలు, సైట్ సీయింగ్, అనఫీషియల్‌గా అడవి జంతువుల్ని వండుకు తినేయటం - న్యూస్‌పేపర్, టీ.వి. కవరేజ్ - ఇలా ఎన్నో సౌకర్యాలుంటయ్. పైగా సిఎమ్‌తో మంచి చనువు ఏర్పడుతుంది. అంటే ఫ్యూచర్‌లో మినిష్టరయిపోవచ్చు-"

"కానీ నాకూ చోరప్పన్‌కీ పరిచయం ఉందని ప్రజలకు తెలిస్తే - వచ్చే ఎలక్షన్లో ఓట్లు వేస్తారో, వేయరో-"

"తెలివితక్కువ మాటలు మాట్లాడతా వేమయ్యా! ప్రజలకు ఛాయిసెక్కడుందసలు? ఎలక్షన్లో నిలబడే ప్రతివాడికీ ఏదొక అవినీతి భాగోతమో, క్రిమినల్ రికార్డో, స్కామ్‌ల రికార్డో - ఉండక తప్పదు కదా! అవిలేని వాడు రాజకీయాల్లోకెలావస్తాడు, ఎందుకొస్తాడు? చచ్చినట్లు వాళ్ళల్లో ఒకడికి ఓట్లు వేయాల్సిందే కదా! ఒకవేళ వాళ్ళు వేయకపోయినా మన వాళ్ళతో ఎలాగూ వేయించేస్తాం! అయినా మన్దేశంలో ఓటు అనేది ఏందయ్యా? పెద్దఫార్సే కాదూ? దీనికి వాల్యూ ఇస్తానంటా వేంది?"

"నేను ఆలోచించి చెప్తాన్సార్ - ఎందుకో నా అంతరాత్మ వప్పుకోవటం లేదు"

"ఏంది? అంతరాత్మా? రాజకీయాల్లో కొచ్చాక మళ్ళీ అంతరాత్మలేందయ్యా? అంతరాత్మలున్నోడు ఎవడయినా రాజకీయాల్లో ఉంటాడా? అందుకే గదా అప్పుడప్పుడు శరద్‌పవార్ లాంటి తిరుగుబాటు నాయకులు 'అంతరాత్మ'ను గుర్తు చేసుకుంటూంటారు-"

"మీరెన్నైనా చెప్పండి సార్- నాకిష్టం లేదు-"

"ఎలక్షన్ ఫండ్ కొట్టేసేప్పుడు మాత్రం ఇష్టం ఉంటుంది - ఇప్పుడు ఉండదు. అంతేనా? సరే - నిన్నెట్టా వప్పించాలో నాకు తెలీదా ఏంది?" అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేశాడతను.

"అంతరాత్మ" అందిచిలుక పంజరంలో నుంచి.

పాపారావ్ గంగారామ్ వేపు జాలిగా చూశాడు.

"సిఎమ్‌గారడిగినప్పుడు వప్పుకుంటేనే ఆరోగ్యం సార్"

"కాని...." నసిగాడు గంగారామ్.

"అంతరాత్మ" అంది చిలుక.

"జనం - ఓట్లు లాంటివాటి గురించి ఆలోచించకండి సార్! ప్రజల్లో మెజారిటీ మన రాజకీయ నాయకుల్లాంటి వాళ్ళే. వాళ్ళూ అవినీతి, అక్రమాలు, స్కామ్‌లు చేసేవాళ్ళే - అందుకే అలాంటి కేసుల్లో ఇరుక్కున్న వాళ్ళను ఆనందంగా మళ్ళీ మళ్ళీ ఎన్నుకుని అధికారం కట్టబెడుతున్నారు. తెహల్కా అనేది ఇప్పుడొక క్వాలిఫికేషన్! ఎన్నికల్లో గెలవడానికి అది గొప్ప అర్హత! బోఫోర్స్ అనేది గెలవడానికి ఉపయోగించే మంత్రం!"

"అంతేనంటావా?"

"అంతే సార్. ఇంకేం ఆలోచించకుండా వప్పేసుకోండి. పైగా చోరప్పన్ మన మీద దయ చూపిస్తే మీరు ఖచ్చితంగా మినిష్టరవటం ఖాయం! చోరప్పన్ రికమెండ్ చేస్తే కాదనే వాడెవడూ లేడు-"

ఇద్దరూ మాట్లాడుకుంటూండగానే పోలీస్ జీప్ వచ్చి ఇంటిముందాగింది.

ఎస్పీ లోపలికొచ్చాడు.

"గుడ్‌మాణింగ్ గంగారామ్ గారూ"

"గుడ్ మాణింగ్! ఏమిటిలా వచ్చారు?"

"ఏముందీ? పిల్లలను కిడ్నాప్ చేసి 'హోమ్స్' ద్వారా విదేశాలకు అక్రమంగా ఎక్స్‌పోర్ట్ చేసే గాంగ్ మెంబర్స్ కోసం వెతుకుతూ ఇలా వచ్చానుసార్ - 'అందులో' మీ మిసెస్ రాజేశ్వరి పేరు కూడా వుంది. ఆమె కోసం ఇప్పటివరకూ ఢిల్లీ, కలకత్తా, చెన్నయ్, బెంగుళూరు, మైసూర్, ఊటీ, కొడైకెనాల్, డార్జిలింగ్- అన్నీ వెతికాం! అయినాగానీ మీ భార్యగారు కనిపించలేదు-"

"అదేమిటి? మా ఆవిడ మా ఇంట్లో ఉంటుంది. ఢిల్లీ, కలకత్తా, ముంబయ్,



చెన్నయ్‌ల్లో ఎందుకు వెతికినట్లు మీరు?

ఎస్పీ సమాధానం చెప్పకుండా దగ్గాడు.

వెంటనే చిలక అందుకుంది.

"పోలీసుల ఎప్పుడూ నిందితుల్ని వాళ్ళింట్లో తప్ప మిగతా దేశమంతా వెతుకుతారోయ్ పిచ్చి మొఖమా? కామన్‌సెన్స్ లేదేమోయ్ బొత్తిగానూ"

ఎస్పీ కోపంగా చిలకవేపు చూశాడు.

"మీరీ చిలక నోరుమూయించకపోతే దీన్ని అరెస్ట్ చేయాల్సి వస్తుంది-"

చిలకనవ్వింది

"పిచ్చివాడా! పక్షులను, జంతువులను ఇలా పంజరాల్లో ఉంచి హింసించేవారి మీద కేస్‌లు పెట్టాల్సింది పోయి నన్ను అరెస్ట్ చేస్తావా?"

పాపారావ్ కల్పించుకున్నాడు.

"ఇంతకూ గంగారామ్‌గారి భార్య రాజేశ్వరీ దేవి పిల్లలను అక్రమంగా విదేశాల్లో దత్తత ఇచ్చే గాంగ్‌లో మెంబరయినట్లు మీ దగ్గరేమయినా ఆధారాలున్నయ్యా?"

"ఆధారాల్దేముంది? కావాలంటే అయిదు నిముషాల్లో తయారు చేయగలం - మీ భార్యను ఎక్కడ దాచారో మీరు వెంటనే చెప్పాలి గంగారామ్ గారూ?"

గంగారామ్ కంగారుపడ్డాడు.

"తెలీదు- రెండ్రోజులనుంచీ నాకూ కనిపించలేదు-" ఠక్కున అబద్ద మాడేశాడు.

"నిజమే చెప్తున్నారా?"

"అవును-"

"ఒక్క విషయం గుర్తుంచుకోండి! మీ ఆవిడ ఆచూకీ తెలిపిన వారికి పదిలక్షల బహుమతిని ఇంతకుముందే ప్రకటించాం! ఖచ్చితంగా మీ ఆవిడజాడ మాకు తెలీకపోదు వస్తా-"

అంటూ బయల్దేరబోతూంటే రాజేశ్వరి లోపల్నుంచి హాల్లోకొచ్చింది.

ఆమెని చూస్తూనే ఎస్పీ సెల్యూట్ కొట్టాడు.

"నమస్తే మేడమ్-"

"నమస్తే ఏమిటి పొద్దన్నే ఇలా వచ్చారు?"

"ఏవో డ్యూటీలుంటాయ్ కదా మేడమ్ - మా డ్యూటీలు మేము రొటీన్‌గా చేసుకుంటూనే వుండాలి"

"అన్నట్లు పిల్లల అక్రమ దత్తత కేస్‌లు మా ఫ్రెండ్ శాంతి దయాల్ మీద కేస్ ఎప్పుడు ఎత్తి వేస్తున్నారు?"

"ఇంకా తెలీదు మేడమ్! ఆమె భర్త మా ఎక్స్ డిజిపి కదా! అయనిష్టం! ఆయనేమో ఆమె ఆచూకీ తెలిపేవారికిచ్చే బహుమతి మొత్తాన్ని ఇరవైలక్షలకు పెంచమని హోమ్‌మినిష్టర్ గారిని బ్రతిమాలుతున్నాడు. అలా పెంచితే తనే ఆమె తనింట్లోనే ఉందన్న ఆచూకీ తెలిపి ఆ డబ్బు తీసుకోవాలని ఆలోచనలో ఉన్నారు. ఆ తరువాతే కేస్ సాక్ష్యాధారాలు లేని కారణంగా ఎత్తివేయటం జరుగుతుంది-"

"సరే- అదేదో త్వరగా చూడండి! ఎందుకంటే ఆమె వచ్చేవారం ఆమె అవినీతికి వ్యతిరేకంగా నెక్లెస్ రోడ్ మీద ఒక పరుగుయాత్ర లీడ్ చేస్తోంది. అప్పుడు పోలీస్ ఎస్కార్ట్ ఎలాగూ ఉంటుంది. కాబట్టి - ఇంకా పోలీసుల ఆమెకోసం గాలిస్తున్నారు అంటే బావుండదు-"

"అదేం ఫర్లేదు మేడమ్! ఆమే శాంతా దయాల్ అని మా డిపార్ట్‌మెంట్‌కి తెలీదని స్టేట్‌మెంటిస్తే సరిపోతుంది- ఇవన్నీ జనానికీ తెలిసిన ట్రిక్సే-"

ఎస్పీ వెళ్ళిపోయాడు. రాజేశ్వరి వెళ్తూ వెళ్తూ ఓ ముక్క మాట్లాడివెళ్లింది.

"నేను రవీంద్ర భారతిలో ఓ కల్చరల్ ప్రోగ్రామ్‌లో గెస్ట్‌గా వెళ్తున్నాను - సిటీకేబుల్లో డైరెక్ట్ టెలికాస్ట్ అవుతుంది చూడండి!"

గంగారావ్ ఆ షాక్ నుంచి తేరుకోడానికి చాలా సేపు పట్టింది.

"పాపారావ్?"

"ఏంసార్?"

"ఏమిటి ఫార్సంతా?"

"దీన్నే ఇండియన్ డెమొక్రసీ అంటారోయ్" అంది చిలుక

"సార్- గొప్పగొప్పోళ్ళు - క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్నప్పుడు వాళ్ళను అరెస్ట్ చేసి వారికి ఇబ్బంది కలిగించకుండా ఉండటం కోసం పోలీసులు "వారికోసం గాలించటం" అనే స్కీమ్ వాడతారు. వాళ్ళు పబ్లిగ్గా, పోలీస్ స్టేషన్ ఎదురుగ్గానే మీటింగ్ పెట్టినా వాళ్ళను కనలేరు వినలేరు పలకలేరు - మూడుకోతుల బొమ్మ పోలీస్ సింబల్ అన్నమాట.

అదే మిడిల్‌క్లాస్ లేక లోక్లాస్ ఫెలోస్ మీద ఏమయినా కేస్‌లు వస్తే క్షణాల్లో అరెస్ట్ చేస్తారు. ఒకవేళ వాళ్ళు పారిపోతే వారి కుటుంబ సభ్యులను లాకప్‌లోకి తోసి ఆచూకీ చెప్పేవరకూ వేధిస్తారు.

మనం ఇప్పుడు వి.ఐ.పి. కేటగిరీలో ఉన్నాం కాబట్టి మన మేడమ్‌ని కూడా అరెస్ట్ చేయరు-" వివరించాడు పాపారావ్.

సెల్‌ఫోన్ మోగింది.

"ఏందయ్యా గంగారామ్ - ఏంది నీ కథ?నీభార్య రాజేశ్వరీ దేవీ దత్తత కుంభ కోణంలో ఉందని మా పోలీసులంటా ఉండారు ఏందికత? ఆమెనెక్కడ దాచావ్ నువ్వు?"

గంగారామ్ తడబడి పోయాడు.

"అదీ అది-ఆ విషయం నాకూ ఇప్పుడే తెల్సింది సార్- కానీ బైగాడ్ చెప్తున్నా సార్ - మా మిసెస్‌కి అలాంటి కార్యకలాపాలతో సంబంధం లేదు. వాటితో సంబంధం వున్న డిజిపి మిసెస్ శాంతా దయాళ్ మా మిసెస్‌కి ఒక స్నేహితురాలు అంతవరకే-"

"అది చాలుగదయ్యా - లోపల వేయటానికి-"

"నిజమేగాన్సర్-"

"నన్నిప్పుడేం చేయమంటావ్? మా మిసెస్‌ని అరెస్ట్ చేయించమంటావా? చోరప్పన్ దగ్గరకు దౌత్యానికి వెళ్ళడానికి వప్పుకుంటావా?"

"వప్పుకోండిసార్ - లేకపోతే ఇలాంటివి ఇంకో రెండు మూడు కేస్‌లు మీ మీద పడతయ్-" మెల్లగా చెప్పాడు పాపారావ్.

"సరే సార్ - వప్పుకుంటున్నాను" అన్నాడు గంగారామ్.

"ఈ పని అప్పుడే చేసి ఉంటే మీ మిసెస్ మీదకి ఈ కేస్ వచ్చేది కాదుగదా?"

"మరిప్పుడీ కేస్ ఎత్తేస్తారా?"

"అప్పుడే ఎలా? మీ ఆవిడ మీ ఇంట్లోనే ఉందని నువ్ పోలీస్ కమిషనర్‌ని కలుసుకుని ఆచూకి ఇచ్చేసెయ్. అలా ఆచూకీ ఇచ్చినందు గ్గాను వచ్చే పదిలక్షల బహుమతిలో అయిదు లక్షలు నీకు - అయిదునాకు! ఎలా వుంది అయిడియా?"

గంగారావ్ గొంతు తడారిపోయింది.

"అంటే నిజంగా నాకు అయిదు లక్షలిస్తారా?"

"కాష్ డౌన్-"

"అంటే తర్వాత మరి మా మిసెస్‌ని అరెస్ట్ చేస్తారా?"

"మరీ ఇంత పిచ్చాడివేమిటి గంగారామ్! మనలో మనకి అరెస్ట్ లేమిటి? ఇందాకే మీ మామ బాలశకుని యాంటిసి పేటరీ బెయిల్ తీసుకొచ్చి సబ్మిట్ చేశాడు. కనుక అది బయటకు రాక ముందే మనం ఆ డబ్బు తీసుకుని పంచేసుకోవాలి-"

గంగారామ్ ఆనందంతో పొంగిపోయాడు.

"అలాగే సార్. అయితే ఇప్పుడే పోలీస్ కమిషనర్‌గారి ఆఫీస్‌కెళ్తున్నాను"

"జైహింద్!" అన్నాడు హోమ్ మినిష్టర్.

"జైహింద్!" అన్నాడు గంగారామ్.

"మేరాభారత్ మహాన్ హై" అంది చిలుక పంజరంలోనుంచి ●

మీ ఇంటి వద్దే విజయవిహారం చందా చెల్లించవచ్చు!, పాత కాపీలను పొందవచ్చు- ఫోన్ చేయాల్సిన నంబర్ : 7007053, సెల్ నెం.9848019076

# జోతిషజీ చెప్తున్నారు... జ్యోతిశ్శాస్త్రంలోనే అంతా ఉందిష!

"జామాతా దశమగ్రహః" అనే నానుడి చాలామందికి తెలుసు. అల్లుడు పదవ గ్రహం లాంటివాడు అని అర్థం. ఈ పదవ గ్రహం మంచిదైతే పిల్లనిచ్చిన కుటుంబానికి బాధలు తప్పుతాయి. అదే దుష్ట గ్రహమైతే జీవితకాలం పట్టి పీడించి పల్లార్చినట్టేనన్న మాట. కూతుర్నివ్వటంతో పాటు కట్నాలు, కానుకలు, పండగలకి పబ్బాలకి సత్కారాలు, అల్లుడ్నీ అల్లుని కుటుంబ సభ్యులను ప్రసన్నం చేసుకునే చిట్కాలూ మొదలైనవన్నీ పెళ్లీ, తదనంతర తంతుల్లో ఆచారబద్ధం చేసిన సాంప్రదాయాలుగా ఇంకా కొనసాగుతున్నాయంటే, దశమగ్రహ ప్రతాపం ఇంకా చూపిస్తూనే వుందంటే, పై సామెత పుట్టిన కాలం నాటి సామాజిక పరిస్థితుల్లో పెద్ద మార్పేమీ రాలేదన్న మాట!

పోనీ ఆ పదవ గ్రహాన్ని వదిలేద్దాం. మిగిలిన తొమ్మిది మాటేమిటి? అవి కూడా మానవ జీవితం మీద, ముఖ్యంగా ప్రతి మలుపు దశలోనూ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తూ వుంటాయట! ఎట్లాంటి ప్రభావాన్ని చూపిస్తాయనేది ఆయా వ్యక్తులు జన్మించిన సమయంలో గ్రహాల పొందికను బట్టి వుంటుందట!! ఒక్క మాటలో... ప్రతి వ్యక్తి యొక్క జాతకమూ, జీవితమూ, భవిష్యత్తూ పుట్టుకతోనే నిర్ణయమైపోతుందనీ, అది ఫలానా ఫలానా విధంగా వుంటుందనీ, సాగుతుందనీ లెక్కలుగట్టి తేల్చి చెప్పే దాన్ని "జ్యోతిశ్శాస్త్రం" అంటున్నారు.

దీని ప్రకారం గుజరాత్ భూకంపంలో ప్రాణాలు కోల్పోవటాలూ, లక్షలాది కుటుంబాల జీవితాలు అల్లకల్లోలం కావటాలూ ముందే నిర్ధారితమైపోయి వుంటుంది. ఆంధ్రాలో ఆత్మహత్యలూ, రైతులకు గిట్టుబాటు ధరల్లేక విలవిలలాడటాలూ, కొద్దిమంది కోటీశ్వరులైపోయే అవకాశాలు లభించటాలూ... యివన్నీ కూడా ముందే గ్రహ గతుల కారణంగా నిర్ధారణమైపోయి వున్నాయట! జీవన "గతి"ని నిర్ణయించే గ్రహగతులనూ, స్థితులనూ కనుక ముందే అర్థం చేసుకుంటే వాటి నివారణోపాయాలు, గ్రహశాంతులు చేయించుకుని జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చునట! ఇటువంటి భలే మంచి చౌక బేరాలు, చిట్కాలూ కూడా మార్కెట్లో, కంప్యూటర్లో అతి సులువుగా లభించే మహదవకాశాలు కల్పించటానికే జ్యోతిషాన్ని విశ్వవిద్యాలయాలన్నిటా, డిగ్రీ తరగతుల నుండి, పరిశోధనాస్థాయి దాకా పాఠ్యాంశంగా చేయించాలని, ఒకనాటి కాశీ విశ్వవిద్యాలయపు భౌతిక శాస్త్రాచార్యులు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంలోని మానవ వనరుల శాఖామంత్రి మురళీమనోహర్ జోషి ఆదేశాలనిప్పించారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ విశ్వవిద్యాలయాలకు ఆ మేరకు ఆదేశాలను, తాఖీదులను పంపించేసింది. దీనిపై వాద వివాదాలు ఉధృతంగా చెలరేగుతున్నాయి. వివాదంలో కీలక ప్రశ్న ఏమంటే జ్యోతిషం శాస్త్రమా? కాదా అనేది. దాని పేరులోనే (జ్యోతిశ్శాస్త్రం) శాస్త్రం వుంటే దాన్ని శాస్త్రం కాదన్నంత మాత్రాన కాకుండా పోతుందా? రెండువేల సంవత్సరాలుగా దాన్ని నమ్మి, పాటించి ప్రతి కార్యక్రమానికి రాహు కాలం లేకుండా, కుజబలాబలాలు వుండేట్లు చూసి, గురు, శుక్ర మౌఢ్యాలు లేని సమయంలో సుముహూర్తాలు నిర్ణయించి సమస్త క్రతువులూ నిర్వహించటం, ప్రజానీకం దాన్ని అనుసరించటం సర్వసాధారణంగా వున్నపుడు అది శాస్త్రం కాకుండా ఎలా పోతుందీ అనే ప్రశ్న సామాన్యుడు సహజంగానే వేస్తాడు.




భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతీ గ్రహీత సర్ సి.వి. రామన్ జ్యోతిషాన్ని నమ్మాడనీ కనుక అది శాస్త్రమేననే వొక బలహీన వాదనని యు.జి.సి. ఛైర్మన్ హరిమోహన్ గౌతమ్ చేశాడు. సర్ సి.వి. రామన్‌కు స్వయంగా మేనల్లుడూ, శిష్యుడూ అయిన రామశేషన్ (బెంగుళూరు) సి.వి. రామన్ జ్యోతిషాన్ని అశాస్త్రీయ సిద్ధాంతంగా పరిగణించాడని ప్రకటించాడు. బి.వి. రామన్ అనే ప్రముఖ జ్యోతిష్కుని యింటికి సర్ సివి రామన్‌గారి భార్య వెళ్లి తన భర్త జాతకాన్ని చూపించింది కనుక సివి రామన్ గారికి జ్యోతిషంపైన నమ్మకం వున్నట్టేనని బి.వి. రామన్ గారి కూతురూ, ప్రస్తుతం వొక జ్యోతిశ్శాస్త్ర పత్రికా నిర్వాహకురాలూ అయిన గాయత్రీ దేవి వాదన చేస్తోంది. 1975లోనే ప్రపంచంలోని ప్రముఖ శాస్త్రజ్ఞులు (అందులో మన దేశీయుడైన డా॥ చంద్రశేఖర్‌తో పాటు 19 మంది నోబెల్ బహుమతీ గ్రహీతలు) 186 మంది జ్యోతిషం శాస్త్రం కాదు కేవలం మూఢవిశ్వాసం అని ప్రకటించిన దానిని మరికొందరు ఉదహరిస్తున్నారు.

మనం వేసుకోవాల్సిన ప్రశ్న ఏమంటే - శాస్త్రజ్ఞులందరూ కలిసి భూమి బల్లపరుపుగా ఉందీ అంటే బల్లపరుపై పోవటమూ, గుండ్రంగా వున్నదీ అంటే గుండ్రంగా మారిపోవటమూ జరుగుతుందా? వాస్తవంగా భూమి గుండ్రంగా వున్నందువల్లే అది గుండ్రంగా వుంటుందా? మరొక మాటతో విశ్వాసాన్ని బట్టి "సత్యం" వుంటుందా, సత్యాన్నే మనం విశ్వసించే విధంగా మనం మానసికంగా సంసిద్ధమై వున్నామా లేదా?

చంద్రుని మీద మానవులు కాలూని దాని మట్టినీ, వివిధ పదార్థాలనీ భూమి మీద పరిశోధనాలయాల్లో పరీక్షిస్తున్నా చంద్రుడు 27 నక్షత్రాల (తారల) భర్త అనీ, మామగారైన దక్ష ప్రజాపతి శాపం వల్లనే ప్రతి 15 రోజులకూ క్షీణ, వృద్ధి కళలతో సతమతమవుతూ వుంటాడనీ, రాహువూ, కేతువూ అనే దుష్ట గ్రహాలు ఆగ్రహించి మింగినందువల్లే ఆరు నెలలకొకసారి (సూర్యుడు కూడా) గ్రహణంతో కాంతి హీనమవుతారనీ ఇంకా నమ్మేవారు కోకొల్లలుగా వున్నారు. "ఎవరి మౌఢ్యం వారికానందం" అని సరిపుచ్చుకోవచ్చు కానీ స్వయంగా బి.జె.పి. ప్రభుత్వమే రంగంలో దిగి "వేదిక్ జ్యోతిర్ విగ్యాన్" అనే పేరుతో సుమారు 1500 - 2000 సంవత్సరాల కాలం నాటి ఖగోళ శాస్త్రాన్నీ, ప్రాచీన ఆధునిక మౌఢ్యాలతో మిళితం చేసిన విశ్వాసాల్నీ జోడించి జ్యోతిషాన్ని వొక పాఠ్యాంశంగా మన ముందుకు తెస్తోంది.



మన పూర్వీకుల నవగ్రహాలలో భూమి లేదు. కారణం - భూమి చుట్టూ సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, గురుడు (బృహస్పతి), శుక్రుడు, శని, రాహువు, కేతువూ అనే నవగ్రహాలూ తిరుగుతూ వుంటాయి. నవ గ్రహ కుటుంబానికి (ఆ మాటకొస్తే సమస్త విశ్వానికే) ఆనాటి వారి లెక్కన భూమే కేంద్రం. భూమి మీద అత్యంత జ్ఞానసంపన్నుడైన మానవుని కోసమే భగవంతుడు సమస్త విశ్వాన్నీ, నక్షత్ర మండలాల్నీ, నవగ్రహాల్నీ, వృక్షాల్నీ, పశుపక్ష్యాదుల్నీ సప్తసముద్రాల్నీ సృష్టించాడని ఆనాటి విశ్వాసం. ఆనాటి మానవ విజ్ఞాన పరిమితి అది. వాటిని మతానికీ - భగవంతునికీ లంకెవేసి తమ విశ్వాసాన్ని కాదన్న వాళ్లని దైవద్రోహులుగా భావించి శిక్షించిన సందర్భాలున్నాయి.

మనది భూకుటుంబం కాదు. సౌర కుటుంబం. దీని కేంద్రం సూర్యుడు. సూర్యుడు గ్రహం కాదు. నక్షత్రం. చంద్రుడు భూమికి ఉపగ్రహం మాత్రమేనని మొదటిసారిగా ప్రచారం చేసిన లియొర్డినో బ్రూనో అనే శాస్త్రజ్ఞుడ్ని ఆనాటి రోమన్ క్యాథలిక్ చర్చి చంపించేసింది. ప్రముఖ ఖగోళ శాస్త్రజ్ఞుడు గెలీలియోను విషం తాగి చస్తావా? ఈ విశ్వానికి భూమే కేంద్రమని అంగీకరిస్తావా అని పీకల మీద కూర్చుంది. స్పుత్నిక్కులు కనుగొని భూగోళ చిత్రాలు తీసేదాకా "భూమి బల్లపరుపుగా వుంది" అని వాదించే సంస్థ వొకటి లండన్‌లో వుండేది.

ఇపుడు మన కళాశాలల్లో నేర్పబోయే జ్యోతిశ్శాస్త్రం ప్రకారం మానవుల ఖగోళశాస్త్ర నూతన ఆవిష్కరణలన్నీ పనికిరానివై పోతాయి. రాహువూ, కేతువూ అనే లేనేలేని గ్రహాలు వున్నట్టుగా, వాటి వల్లే సూర్యచంద్ర గ్రహణాలు ఏర్పడుతున్నట్టుగా చదువుకోవాల్సి వుంటుంది. ఆధునిక టెలిస్కోపుని కనుగొని నిర్మించేదాకా యురేనస్ (1781), నెప్ట్యూన్ (1846), ప్లూటో (1930) అనే గ్రహాల్ని శాస్త్రజ్ఞులు కనుగొనలేకపోయారు. మన జ్యోతిష్కుల గడపల ముందు నిలబడి "మమ్మల్ని మీ లోపలికి రానిస్తారా?" అని అడుక్కునే దశలోనే పై మూడు గ్రహాలూ వేచి చూస్తున్నాయి.

జ్యోతిష్కుల లెక్కప్రకారం నిజ, ఊహాగ్రహాల ప్రభావం భూమి దానిపై నివసించే జీవ, నిర్జీవ రాసులపై వుంటుంది. 1962 ఫిబ్రవరిలో సంభవించిన అష్టగ్రహ కూటమితో భయంకర వినాశాలు తలెత్తుతాయనీ, (ప్రముఖ రచయిత గుడిపాటి వెంకటచలంగారి ప్రకారమైతే తిరువణ్ణామలైలో వున్న రమణా శ్రమం తప్ప మిగతా ప్రపంచమంతా మునిగిపోతుంది) విపరీత ప్రచారం జరిగింది. ఏమీ ప్రమాదాలు సంభవించవని శాస్త్రజ్ఞులు హెచ్చరిక చేసినా జనం విపరీతంగా భయపడిపోయారు. నిజానికి ప్రజల్ని విశ్వాసాల పేరుతో భయపెట్టటం కూడా సామాజిక నేరమే. అది పుకార్లు వ్యాప్తి చేసి అల్లకల్లోలం సృష్టించటంతో సమానం. కానీ అష్టగ్రహ కూటమి పేరుతో భయపెట్టిన వారందరూ అతి సులువుగా, కనీసం ప్రజలపట్ల బాధ్యత వహించకుండా, గ్రహశాంతులు చేసినందువల్లే ప్రమాదం తప్పిందని చెప్పుకున్నారు.

వినీలాకాశంలో మినుకు మినుకుమంటూ మనకు కనిపించే నక్షత్రాలూ, రాశులూ... వాటి వెలుగు భూమి మీదకు చేరటానికే ఏళ్లూ పూళ్లూ పడుతుంటాయి. అంటే మనం చూచేవి ఎన్నో నెలల, సంవత్సరాల వెనకటి స్థితిలోని వెలుగునన్నమాట!

వాటి ప్రభావం భూమిపైన స్వల్పంగా కూడా వుండదనీ మన సూర్యకుటుంబంలోని గ్రహాల ప్రభావం కూడా ఏమీ వుండదనీ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మనకు అతి సమీపంలో భూమికి ఉపగ్రహంగా వున్న చంద్రుని యొక్క ప్రభావం సముద్రం నీరులాంటి భారీ జల పదార్థం మీద (పోటు - ఆటు రూపంలో మనకు తెలుస్తుంది) కొంత వుంటుందని మాత్రమే చెబుతున్నారు. ఏది ఏమైనా జ్యోతిషం చెక్కుచెదరని స్థిర విశ్వాసాలపై ఆధారపడి వుంటే విజ్ఞానశాస్త్రం పరిశీలన- పరిశోధన- ఆవిష్కరణ- సరికొత్త నిర్ధారణలపై అభివృద్ధి చెందుతూ వుంటుంది. విశ్వాసాలు మౌఢ్యం స్థాయికి చేరిన వారూ, వాటి పేరుతో సామాజిక బాధ్యతల నుండి తప్పించుకుని తారాబలాలు, చంద్రబలాలపై భారం మోపదలుచుకున్న వారూ... శాస్త్రీయ జ్ఞానాన్ని వెనక్కి నెడతారు.

ఈ క్రింది కారణాల వల్ల జ్యోతిషాన్ని ఖచ్చితంగా అశాస్త్రీయమని చెప్పవచ్చు.

1. సౌరకుటుంబానికి సూర్యుడు కేంద్రం కాగా, జ్యోతిషం భూమిని కేంద్రంగా పరిగణిస్తుంది.

2. నక్షత్రమైన సూర్యుణ్ణీ, ఉపగ్రహమైన చంద్రుణ్ణీ జ్యోతిషం గ్రహాలుగా భావిస్తుంది.

3. ఉనికిలోనే లేని రాహువు, కేతువు అనే గ్రహాలను, వాస్తవికమైనవిగానూ, దుష్టమైనవి గానూ గుర్తించి గణన చేస్తుంది.

4. యూరేనస్ - నెప్ట్యూన్ - ప్లూటో అనే వాస్తవ గ్రహాలను ఇప్పటికే పరిగణలోనికి స్వీకరించలేదు.

ఈ కారణంగా జ్యోతిషం పేరుతో చెప్పే భవిష్యత్ ఫలితాలు జోస్యం (ప్రిడిక్షన్) స్థాయిలోనే ఉండిపోయినాయి. అదే శాస్త్రమయితే జరిగిన ప్రతి పొరపాటునే కారణాలను అన్వేషించి, పరిహరించుకోడానికి ప్రయత్నిస్తుంది.

జ్యోతిషం వ్యాప్తి గాంచిన కొద్దీ నిరుద్యోగులు తమకు ఉపాధి లభించక పోవటానికి ఆర్థిక, పారిశ్రామిక సంక్షోభం కాదనీ, రైతులు తమకు గిట్టుబాటు ధరలు లభించకుండటానికి ప్రపంచీకరణ విధానాలు కారణం కావనీ, మహిళలపై అవమానాలు, అత్యాచారాలు పెచ్చరిల్లటానికి సాంస్కృతిక దిగజారుడుతనం కాదనీ, అవినీతి అక్రమాలకు స్వార్థరాజకీయ నాయకులు కాదనీ... తమ తమ దుర్భర జీవన స్థితిగతు లకు తమ పుట్టుక కాలంనాటి గ్రహ గతులే కారణమనీ ఆత్మవంచనతో బతకమని చెప్పటానికే జ్యోతిషాన్ని పాఠ్యాంశంగా ప్రస్తుత పాలకులు ప్రవేశపెడుతున్నారు●

- దివికుమార్

"జ్యోతిషం లాంటి మార్మిక విషయాలు బలహీనమైన మనస్సుకి గుర్తు. అవి మన మెదళ్లలో ప్రాముఖ్యాన్ని పొందుతుంటే మనమొక మంచి వైద్యుణ్ణి సంప్రదించాలి. పౌష్టికాహారం, విశ్రాంతి తీసుకోవాలి".
**- స్వామి వివేకానంద**

"వంద అబద్ధాలలో ఒక్క నిజం చెప్పినా జ్యోతిష్కులు ఎంత హాయిగా వున్నారు. అదే యితరులు (శాస్త్రజ్ఞులు) వందింట ఒక్క అబద్ధం పల్కినా తమ ప్రతిష్టను కోల్పోతున్నారు"
**- 1483-1540 సం॥ల మధ్య జీవించిన ఫ్రాన్సిస్కో గుసియార్దిని.**

"తారాబలాలు, జ్యోతిషం, జోస్యం చెప్పటం, వాటిని అదృష్ట దురదృష్ట సంఘటనలను గుర్తించటం, మంచి చెడులుగా వ్యవహరించటాన్ని వదుల్చుకోవాలి" **- గౌతమ బుద్ధుడు**

"చెడిపోయిన గడియారం కూడా రోజుకి రెండుసార్లు సరైన సమయాన్నే సూచిస్తుంది. కొన్ని జోస్యాలు నిజమైనంత మాత్రాన జ్యోతిషం శాస్త్రం కాలేదు"
"మెదడు అనేది ప్యారాచూట్ లాంటిది. అది తెరుచుకుని వున్నప్పుడే సరిగా పని చేస్తుంది. మెదడు తెరుచుకుని వుండటం అంటే దాన్ని ఖాళీగా, భావరహితంగా వుంచుకోవటమని అర్థం కాదు"
**- ప్రొ. హెచ్. నరసింహయ్య**

"నీకు ఎవరో చెప్పిన కారణంగా దేన్నీ నమ్మొద్దు. అది సాంప్రదాయకమైనది కనుక, దాన్ని నువ్వే ఊహించావు కనుక, నీ ఉపాధ్యాయుడు చెప్పాడు కనుక ఆయనపై గౌరవంతో దేన్నీ నమ్మొద్దు. ఏదియైన పరీక్ష, విశ్లేషణా మంచికి ఉపయోగమూ, ప్రయోజనమూ, అందరి సంక్షేమమూ కలిగించే సిద్ధాంతాన్నే నమ్మి, అంటిపెట్టుకుని నీకు మార్గదర్శిగా స్వీకరించు.
**- గౌతమ బుద్ధుడు**

"శాస్త్ర విజ్ఞానం అంటే పరీక్ష నాళికలవైపు చూడటం, మిశ్రమాలు కలపటం, పెద్దవో చిన్నవో ఉత్పత్తులు చేయటం కాదు. జీవితానికీ, మనస్సుకీ శాస్త్రబద్ధంగా వ్యవహరించే శిక్షణగా శాస్త్రవిజ్ఞానం వుండాలి".
**- జవహర్‌లాల్ నెహ్రూ**


మీ ఇంటి వద్దే విజయవిహారం చందా చెల్లించవచ్చు!. పాత కాపీలను పొందవచ్చు- ఫోన్ చేయాల్సిన నంబర్ : 7007053, సెల్ నెం.9848019076

ప్రొఫెషనల్స్‌నీ, లెర్నర్స్‌నీ
సమానంగా ఆకర్షిస్తూ,
సంచలనం సృష్టిస్తున్న
తొలి తెలుగు
కంప్యూటర్‌ఎడ్యుకేషన్ సీరియల్ !!



సి.యస్. సలీం బాషా



# కంప్యూటర్ క్లాస్‌రూమ్

(పద్నాలుగవ భాగం)

**చాలామంది పాఠకులు విండోస్'95 పాత వెర్షన్ అని - విండోస్'98, విండోస్-మి గురించి రాస్తే బావుంటుందని అడుగుతున్నారు. అయితే 1995లో విడుదలైన విండోస్'95ని ఇప్పటికీ అధికశాతం యూజర్స్ వాడుతున్నారు. ఇదొక స్టాండర్డ్ వెర్షన్. దాని తర్వాత వచ్చిన వెర్షన్స్‌లో - పెద్దగా ఫీచర్స్ ఏమీలేవు. అదీగాక సాధారణంగా కంప్యూటర్ నేర్చుకునేవారికి విండోస్'95 అనువుగా వుంటుంది. విండోస్'98, విండోస్-మిలో వున్న కొత్త ఫీచర్లు తర్వాత కూడా నేర్చుకోవచ్చు. కాని విండోస్ 3.1.... తర్వాత వెర్షన్‌లకు విండోస్ 95కు మధ్య ఎంతో తేడా వుంది. ఈ కారణాల వల్ల ఒక ప్రామాణికమైన ఆపరేటింగ్ సిస్టమ్ కనుక విండోస్'95ను గురించి రాయడం జరుగుతోంది. అవసరమైనపుడు ఇతర వెర్షన్‌ల గురించి కూడా ప్రస్తావించటం జరుగుతుంది. గమనించగలరు...**

గత సంచికలో ఫైల్సు విధానం గురించి కొంత తెలుసుకున్నాము. ఇపుడు ఫైల్సు సృష్టించటం. తీసేయటం లేదా మనకి కావాల్సిన ఫైలు గురించి వెతకటం, ఫోల్డర్స్‌ను సృష్టించటం, డిస్క్‌ను ఉపయోగించటం వంటి వివిధ అంశాల గురించి తెలుసుకుందాం....

File Management : ఫైల్స్ మేనేజ్‌మెంట్‌కి విండోస్'95లో ఎక్స్‌ప్లోరర్ (explorer) అనే ఉపయోగకరమైన యుటిలిటీ ప్రోగ్రాం వుంది. విండోస్ ఎక్స్‌ప్లోరర్‌ను ఉపయోగించటానికి Start Menu ద్వారా Open చేసుకోవచ్చు. లేదా Desk Top మీద అమర్చుకున్న ఆబ్జెక్ట్ ద్వారా వెళ్ళవచ్చు. అపుడు విండో ఇలా వుండవచ్చు.




ఈ విండోలో ఎడమ పక్క మనం సెలెక్ట్ చేసుకున్న ఫోల్డర్ - కుడివైపు అందులో వున్న సబ్-ఫోల్డర్స్/ఫైల్సు వివరాలు వున్నాయి. ఇలా కాకుండా నేరుగా డెస్కటాప్‌నుంచి My Computer తర్వాత మనకు కావాల్సిన డ్రైవ్ - తర్వాత ఆ ఫోల్డర్‌ను ఓపెన్ చేసుకోవచ్చు. అయితే అపుడు రెండుమూడు విండోలు ఓపెన్ చేయాలి. ఎలా చేసినా పని జరుగుతుంది. మనం తరచూ ఉపయోగించే ఫోల్డర్ లేదా ప్రోగ్రాముసు నేరుగా Shortcut ద్వారా ఓపెన్ చేసుకోవచ్చని ఇంతకు ముందే తెలుసుకున్నారు. Explorer ద్వారా అయితే ఫైల్సు కాపీ చేయటం సులువుగా వుంటుంది. అదీ కాకుండా అనవసరంగా ఎక్కువ విండోలు ఓపెన్ చెయ్యాల్సిన అవసరం వుండదు.

## విండోస్ ఎక్స్‌ప్లోరర్ (Windows Explorer)

Start Menu నుంచే కాకుండా Explorer ను ఓపెన్ చెయ్యటానికి అనేక పద్ధతులు వున్నాయి.

☛ My Computer ఆబ్జెక్ట్‌ను రైట్ క్లిక్ చెయ్యటం ద్వారా వచ్చే మెనూలో నుంచి ఎక్స్‌ప్లోరర్‌ను సెలెక్ట్ చేసుకుంటే ఎక్స్‌ప్లోరర్ విండో వస్తుంది.




☛ ఏదైనా డ్రైవ్ ఆబ్జెక్ట్‌ను (డెస్కటాప్) రైట్‌క్లిక్ చేసినా అటువంటి మెనూ వస్తుంది.

☛ ఏదైనా ఫోల్డర్‌ను రైట్ క్లిక్ చేసినా అదే మోనూ వస్తుంది. అందులో నుంచి ఎక్స్‌ప్లోరర్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఇంతకు ముందే చెప్పినట్టు ఎక్స్‌ప్లోరర్ ఒక ఫైల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాము. దాని ద్వారా మనకు అవసరమైన పనులు చేసుకోవచ్చు. ఉదాహరణకు మొదట్లో ఇచ్చిన విండోస్ చూస్తే ఒక ఫోల్డర్‌లో ఏముందో చూడటానికి పనికి వస్తుంది. ఒక ఫోల్డర్‌లో ఇతర ఫోల్డర్స్ వుంటే దాని పక్కన + గుర్తు వుంటుంది. ఆ గుర్తు మీద డబుల్ క్లిక్ చేస్తే ఫోల్డర్ expand అవుతుంది. (అంటే ఫోల్డర్‌లోని ఇతర ఫోల్డర్స్ కూడా కనపడతాయి. అప్పుడు వాటిని డబుల్ క్లిక్ డ్రైవ్‌లకు కూడా అలాంటి గుర్తే వుంటుంది.

'-' గుర్తును క్లిక్ చేస్తే ఫోల్డర్ మళ్ళీ మొదటి అమరికకు వచ్చేస్తుంది. విండోలో ఎడమవైపు భాగంలో Scroll సౌకర్యం వల్ల మనం expand చేసిన ఫోల్డర్ లిస్ట్ పొడవుగా వుంటే కూడా చూడవచ్చు. Explorer ద్వారా ఫైల్సు కాపీ చేయటం సులువు. ఎడమ పక్క మనకు కావాల్సిన ఫైలును క్లిక్ చేసి డ్రాగ్ చేసి కుడివైపు వున్న ఫోల్డర్‌లో వేయాలి. కుడివైపు మనకు కావాల్సిన ఫోల్డర్ కోసం పైకీ కిందికి Scroll చేసుకోవచ్చు. ఈ సౌకర్యం వల్ల ఎక్కడి నుంచి - ఎక్కడికైనా అనే పద్ధతిలో ఫైల్సు కాపీ చేసుకోవచ్చు.

### డ్రైవ్‌లతో పనిచేయటం :

Explorer ద్వారా C: లేదా D: డ్రైవ్‌లలో వున్న సమాచారం చూడవచ్చు. కాపీ చేయవచ్చు. లేదా Files తీసేయవచ్చు explorer విండోలో C: లేదా D: డ్రైవ్‌ను Right Click రైట్ క్లిక్ చేస్తే ఇలాంటి మెనూ వస్తుంది. ⇨

ఇందులో కొన్ని Options (ఆ డ్రైవ్‌కు సరిపోకపోతే) పనిచేయకపోవచ్చు. ఇపుడు Options గురించి తెలుసుకుందాం. *Explore :* మళ్ళీ విండోస్ explorer ను స్టార్ట్ చేస్తుంది.

*Open :* ఆ డ్రైవ్‌లో వున్న సమాచారం (ఫోల్డర్‌లు-ఫైల్సు) చూడటం కోసం ఒక ప్రత్యేకమైన విండోను ఓపెన్ చేస్తుంది.



*Find :* విండోస్‌లో ఏదైనా ఫైలు/ఫోల్డర్ ఎక్కడ వుందో తెలియకపోతే వెతికి పెట్టే ప్రోగ్రాంను ఓపెన్ చేస్తుంది.

*Sharing :* నెట్‌వర్కింగ్‌లో ఈ డ్రైవ్‌ను వేరే యూజర్స్ వాడుకునేలా చేసే డైలాగ్ బాక్స్‌ను ఓపెన్ చేస్తుంది.

*Format :* ఫ్లాపీలను, డిస్క్‌లను Format చేసే ప్రోగ్రాం వస్తుంది. (Dos లో దీని గురించి వివరంగా చర్చించాము).

*Create Shortcut :* ఒక కాపీ క్రియేట్ చేస్తుంది.

*Properties :* దీన్ని క్లిక్ చేస్తే ఒక డైలాగ్ ఇలా బాక్స్ వస్తుంది. మనకు కావాల్సిన విధంగా డ్రైవ్ సెట్టింగ్స్ మార్చుకోవచ్చు. Label అనే ఫీల్డ్ దగ్గర మనకు కావాల్సిన విధంగా పేరు టైప్ చేయవచ్చు ఇది General Tab లో వుంది. అలాగే ఇందులో ఎంత స్పేస్ మిగిలింది వంటి వివరాలు చూడవచ్చు.




ఇదే డైలాగ్ బాక్స్‌లో Tools Tab ను క్లిక్ చేస్తే ఇలాంటి బాక్స్ వస్తుంది. ఇందులో Check now ఫీల్డ్ ద్వారా డిస్క్ డ్రైవ్‌ను చెక్ చెయ్యవచ్చు. అలాగే Backup ద్వారా మనకు కావాల్సిన ఫైల్స్ Backup చేసి పెట్టుకోవచ్చు.




*Defragment now :* ఈ ఆప్షన్ ద్వారా డిస్క్‌ను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చెయ్యవచ్చు ఇందులో ఫైల్స్‌ను తిరిగి అమర్చటం వంటి ప్రక్రియలు వుంటాయి. ఇది అప్పుడప్పుడు చేయటం బావుంటుంది. (దీని గురించి ఇది వరకే వివరంగా ఇచ్చాము)

*Folders* (ఫోల్డర్స్) : సాధారణంగా డిస్క్‌లో సమాచారం ఫోల్డర్స్ - ఫైల్స్/ఫోల్డర్స్ ఇలా నిల్వ వుంటుంది. ఇందులో ఒక పద్ధతి వుంటుంది. మొదట ఒక ఫోల్డర్ అందులో మళ్ళీ సబ్ ఫోల్డర్స్-ఫైల్స్ మళ్ళీ ఆ సబ్ ఫోల్డర్స్‌లో మళ్ళీ సబ్ ఫోల్డర్స్ ఫైల్స్ ఇలా ఒక Tree (చెట్టు)లాగ వుంటాయి.

ఫోల్డర్‌ను నేరుగా డెస్క్‌టాప్‌నుంచి కాని లేదా ఎక్స్‌ప్లోరర్ ద్వారా కాని ఓపెన్ చేసుకోవచ్చు.

My Computer విండోను ఓపెన్ చేసి ఒక డ్రైవ్‌ను డబుల్ క్లిక్ చేసి ఏదైనా ఒక ఫోల్డర్‌ను క్లిక్ చేస్తే వచ్చే మెనూబార్‌లో నుంచి ఫైల్ ఆప్షన్‌ను ఎన్నుకుంటే ఇలా వస్తుంది.



అదే ఫోల్డర్‌ని రైట్ క్లిక్ చేస్తే ఇలాంటి Context Menu వస్తుంది.



మొదటి మెనూకి రెండో దానికి ఒక చిన్న తేడా వుంది. మొదటి మెనూలో నుంచి New, Close లాంటి ఆప్షన్స్ బదులు Cut, Copy ఆప్షన్స్ వున్నాయి. ఈ ఫోల్డర్‌ని Cut చేసి వేరవ చోట Paste చేసుకోవచ్చు.

అలా కాకుండా C: లేదా D: డ్రైవ్‌లోని ఫోల్డర్ లిస్ట్‌లో నుంచి ఫైల్ మెరూ ఎన్నుకుంటే ఇలా వస్తుంది.



ఇవన్నీ కాకుండా నేరుగా ఎక్స్‌ప్లోరర్ నుంచి ఒక ఫోల్డర్‌ను రైట్ క్లిక్ చేస్తే ఇలాంటి సమగ్రమైన మెనూ వస్తుంది.




మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

## ఫోల్డర్స్ సృష్టించటం, పేరు మార్చటం, తొలగించటం

మనకు అవసరమైనపుడు ఒక కొత్త ఫోల్డర్‌ను సృష్టించాలంటే ఎక్స్‌ప్లోరర్ ద్వారా C: లేదా D: డ్రైవ్‌ను ఓపెన్ చేసి ఫైల్ ఆప్షన్‌ను ఎన్నుకుని అందులో మంచి New ద్వారా ఫోల్డర్‌ను ఎన్నుకుంటే మనకు కావాల్సిన ఫోల్డర్ New Folder పేరుతో అక్కడ ఒక ఫోల్డర్ సృష్టించబడుతుంది.



అక్కడే మనకు కావాల్సిన పేరు టైప్ చేసుకోవచ్చు.

ఒక ఫోల్డర్ పేరు మార్చుకోవాలంటే రెండు పద్ధతులున్నాయి.

- ఫోల్డర్‌ను ఒకసారి క్లిక్ చేసి తర్వాత దాని పేరును క్లిక్ చెయ్యాలి. Blinking cursor వస్తుంది. అక్కడ మనము కొత్త పేరు టైప్ చెయ్యవచ్చు.
- ఫోల్డర్‌ను రైట్ క్లిక్ చేసి వచ్చే మెనూలో నుంచి Rename ఆప్షన్ ఎన్నుకుని పేరు మార్చటం.

### ఒక ఫోల్డర్‌ను తొలగించాలంటే :

(ఒక ఫోల్డర్‌ను తీసేస్తే అందులోని మొత్తం ఫైల్సు, ఫోల్డర్స్ పోతాయి. అందుకే జాగ్రత్తగా వుండాలి)

- ఫోల్డర్‌ను క్లిక్ చేసి కీ బోర్డులో నుంచి కీ నొక్కవచ్చు.
- ఫోల్డర్‌ను రైట్ క్లిక్ చేసి వచ్చే ఆప్షన్‌లోనుంచి Delete ఎన్నుకోవటం
- ఫోల్డర్‌ని రైట్ క్లిక్ ద్వారా డ్రాగ్ చేసి Recycle Bin లో పడేయటం

### ఫోల్డర్స్ ఎలా వుండాలి :

విండోలో పోల్డర్స్‌ను చూడటానికి (Viewing) View Menu వుంది. ఒక ఫోల్డర్ View Menu ను ద్వారా కాని నేరుగా కాని ఓపెన్ చెయ్యవచ్చు. అది ఇలా వుంటుంది.

ఇపుడు View Menu ఆప్షన్స్ చూద్దాం.

*Large Icons* : ఫోల్డర్స్ Icons ను వీలైనంత పెద్దవిగా చేసి చూపించటం. అయితే పెద్ద Icons వల్ల విండో నిండిపోయే అవకాశం వుంది కనుక ఎక్కువ స్క్రోల్ చెయ్యవలసి రావచ్చు.



*Small Icons* : పైదానికి వ్యతిరేకమైన ఆప్షన్

*List* : Icons Horizantal గా చూసే ఆప్షన్

*Details* : చిన్న Icons ను చూపిస్తూ దాంతో పాటు ఆ ఫోల్డర్ లేదా ఫైలుకు సంబంధించిన వివరాలు కూడా చూపించటం.

*Arrange Icons* : విండోలో ఎడమపక్క, కుడిపక్క Size, Type, Date ప్రకారం Icons అమర్చటం.

*Line up Icons* : విండోలో Folder Icons ను చక్కగా అమర్చటం.

*Refresh* : కొత్తగా Add చేసిన ఫైల్సుతో పాటు విండోను Update చేస్తుంది.

*Options* : ఫోల్డర్స్‌ను చూడటానికి వివిధ ఆప్షన్స్‌ను ఇస్తుంది.

(ఇంకావుంది)

# కాలవాచక క్రియారూపం Tense



## ఇలా ఈజీగా నేర్చుకుందాం 14

## ఆర్వీయార్ మాష్టారి ఇంగ్లీషు పాఠాలు

ఇప్పటిదాకా సంభాషణలకు అవసరమైన కొన్ని అంశాల్ని గురించి తెలుసుకున్నాం. ఆహ్వానాలు, అంగీకారాలు, అభ్యర్థనలు, ఆదేశాలు లాంటి వాటి గురించీ కూడా తెలుసుకోవాలి. సంభాషణలకు సంబంధించి యింకా నిత్యజీవిత వ్యవహారంలో వుండే చాలా వాటి గురించీ తెలుసుకోవాలి. అయితే వాటికంటే ముందు క్రియ, కాలవాచక రూపం గురించి తెలుసుకోవాలి.

ఇంగ్లీషు భాష నేర్చుకుందుకు కష్టంగా వుంటుందని చాలామందికి అనిపిస్తూ వుంటుంది. దీనికి ముఖ్యకారణం ఆ భాషలో కాలనిర్దేశకమైన క్రియా రూపం. అందుకు సమానమైన రూపం మాతృభాషలో లేకపోవడం. ఉదాహరణకు "నేను రోజూ కాలేజీకి వెడుతున్నాను", "యిప్పుడు మార్కెట్‌కి వెడుతున్నాను" అని తెలుగులో చెబుతామనుకోండి. రోజూ చేసే పనికీ యిప్పుడు చేసే పనికీ కూడా "వెడుతున్నాను" అని ఒక క్రియా రూపాన్నే వాడుతున్నాం. ఇదే ఇంగ్లీషులో అయితే భిన్నంగా వుంటుంది. రోజూ, లేదా repeated గా, చేసేపనికీ, ప్రస్తుతం మాట్లాడుకునే సమయంలో చేసే పనికీ తేడా క్రియారూపం తెలియచేస్తూ వుంటుంది. "I go to college every day" అని verb ఆ పనిని తెలియచేస్తే "I am going to market" అని ప్రస్తుతం చేస్తూవున్న పనిని తెలియచేస్తుంది. ఇదే రకంగా "అతను యిప్పుడే వచ్చాడు", "ఇతను మొన్న వచ్చాడు" అని మొన్న వచ్చినా, యిప్పుడే వచ్చినా 'వచ్చాడు' అంటూ ఒకే రూపంలో క్రియని వాడుతూ వుంటాం. ఇదే ఇంగ్లీషులో అయితే "He has come just now" అనీ "He came the day before yesterday" అనీ చెప్పాలి. మొదటిది Present Perfect Tense రెండవది Simple Past Tense. ఇలా ఇంగ్లీషు భాషలో Tense చాలా రూపాలుగా వుండి నేర్చుకునేవాళ్లకి యిబ్బంది కలిగిస్తూ వుంటుంది. వాటిని గురించి బాగా తెలుసుకుంటే చాలా వరకు భాష మెలుకువలు తెలుసుకున్నట్టే.

కాలనిర్దేశక క్రియారూపాన్నే Tense అంటారు. "verb form that shows time" అని అర్థం. The Present Tense, Past Tense, Future Tense అని స్థూల విభజన. వర్తమాన, భూత, భవిష్యత్ కాలవిభజన అన్నమాట. వర్తమానం అంటే ప్రస్తుతంలో జరుగుతూ వున్నది. భూతకాలం అంటే గతంలో జరిగిపోయింది. భవిష్యత్ కాలం అంటే ముందు జరగబోయేయి.

ఇంతమేరకే అయితే మనకీ తెలుగు భాషలో వున్న రూపాల్ని తీసుకువచ్చి సులభంగా బోధపరచుకుందాం. కాని ఇంగ్లీషులో Present Tense కే నాలుగు రూపాలు వున్నాయి. అలాగే Past Tenseకీ, Future Tenseకీ కూడా. వీటన్నింటికీ మళ్లీ Passive voice లో సమాంతరంగా రూపాలు వున్నాయి. అలాంటివేవీ మన భాషల్లో లేకపోవడం వల్ల Tense వాడకం కష్టం అనిపిస్తుంది. ఆ వివరాలే యిప్పటి నుంచీ కొంత వరకూ తెలుసుకుందాం.

Simple Present Tense.

సాధారణంగా జరిగే పనిని గురించి తెలియచేస్తుంది. అంటే ఆ పని పూర్తి కానూలేదు, అనుకుంటూ వున్న క్షణంలో మాత్రమే జరుగుతూనూ వుండడం లేదు. భవిష్యత్‌లో జరుగుతుందనీ కాదు. సాధారణంగా యిలా జరుగుతూ వుంటుందని మాత్రమే. దీన్ని Simple Present Tense అనీ, Indefinite Present Tense అనీ వ్యవహరిస్తూ వుంటారు.

Subject + Verb యిదీ యీ వాక్యం తీరు.

I go, We go, You go, They go - నేను వెడుతున్నాను, మేం వెడుతున్నాం, నువ్వు/మీరు వెడుతున్నావు/రు వాళ్లు వెడుతున్నారు.

I/We/You/They go to school everyday.

ఒక దిన చర్యగా యిలానే జరుగుతూ వుంటుందన్నమాట.

I/We/You/They take milk/coffee in the morning.

పొద్దుటిపూట పాలు తాగుతాం. (సాధారణంగా అలా జరుగుతూ వుంటుంది)

అయితే He/She/It subjectగా వుంటే యీ Simple Present Tense లో verb కి 's' (spelling అవసరాల్ని బట్టి 'es') చేరుతూ వుంటుంది.

She/He goes to school in the morning.

She/He comes here everyweek.

ఇలా verbకి 's' (or 'es') చేరడం విద్యార్థులకు కష్టం అనిపిస్తుంది. He, She, It - Third person singular రూపాలు. Third person కి తెలుగు వ్యాకరణంలో ప్రథమ పురుష అంటారు. First person - I, (Singular) We (Plural) తెలుగులో ఉత్తమ పురుష.

Second Person - You (నువ్వు అనడానికి విడిగా Singular రూపం వాడుకలో లేదు. ఒకప్పుడు Thou (దౌ) అని వుండేది. పాత Bible గ్రంథాల్లో ఆ రూపం వుండేది. యీ నాటి Bible గ్రంథాల్లో కూడా Thou రూపాన్ని తీసేసి you - నువ్వు, మీరు అనే అర్థాల్లో వాడచ్చు.) మధ్యమ పురుష.

Third person singular రూపాలు He, She, It.

Third person Plural రూపం They.

ప్రథమ పురుష అన్నమాట.

"తన్నుత్తమ, ఎదుట మధ్యమ, ఎక్కడో ప్రథమ" అని యీ పురుష విభజన మూడింటి గురించీ చెప్పిన మాటల్ని మననం చేసుకోండి. ఇటీవలి కాలంలో చాలామంది - చదువుకున్నవాళ్ళే! - ఇంగ్లీషు First person కు ఉత్తమ పురుష అని తెలుగులో అనకుండా ప్రథమ పురుష అని మక్కీకి మక్కీ అనువాదం చేసి వాడుతున్నారు. అంచేత యీ పురుష గురించి యింత వివరించి చెప్పాల్సి వచ్చింది.

ఇప్పుడు మళ్లీ మన Present Tense కు వస్తే దాని రూపం Subject + Verb గా వుంటుంది.

Third person లో మాత్రం verb కి 's' చేరుతుంది.

Spelling ని బట్టి 'es' చేరుతుంది.

He/She works hard.

He/She eats sweets.

It (The dog) barks at nights.

ఈ వాక్యాల్లో verb కు సాదాగా 's' చేరిందంతే. మరి 'es' చేరే సందర్భాలో?

Verb కనక "ss, sh, ch, x, o" లతో end అవుతూ వుంటే వాటికి 'es' చేరుతుంది.

He kisses, He rushes, She watches, He boxes, He goes, He does.

Verb గనక 'y' తో end అవుతూ వుంటే ఆ 'y' మారి 'i' అవుతుంది. అప్పుడు 'es' చేరుతుంది.

ఉదాహరణకు I carry అన్నాం. Third Person లో He carry - carries. అంటే carry లోని 'y' మారి 'i' గా వచ్చి దానికి 'es' చేరుతుందన్నమాట.

He hurries - hurry లోని y - i గా మారి, అప్పుడు 'es' చేరింది.

అయితే vowel తర్వాత వచ్చే 'y' మారదు. మామూలు రూలు ప్రకారమే 's' చేర్చుకుంటుంది.

ఉదాహరణకు obey, say. యిక్కడ 'y' కి ముందు e అనీ, a అనీ vowels వున్నాయి. అంచేత Present Tense రూపంలో he obeys, he says అనే వుంటుంది.

ఇంతకీ బాగా గుర్తు పెట్టుకోవాల్సింది Simple Present Tense లో Third Person Singular లో verb కు 's' చేరుతుంది. మిగిలిన అన్ని పురుషల్లోనూ ఒట్టి verb మాత్రమే సరిపోతుంది. I, We, You, They go/eat/write.

He/She/It goes/works

ఇక యీ tense usage గురించీ, ఆ విశేషాల గురించీ తర్వాత తెలుసుకుందాం.

- ఇంకావుంది



టూవీలర్ ట్రావెలర్-3

# చల్ మేరె మోపెడ్!

## TVS స్కూటీ



TVS స్కూటీ

## SUNNY ZIP/SPICE



## HERO PUCH EZ




## LML ట్రెండీ



## LUNA SUPER



## KINETIC HONDA



## KINETIC స్టైల్



| వాహనం | ఆన్‌రోడ్ ధర | వ్యవధి | డౌన్‌పేమెంట్ | ఇన్‌స్టాల్‌మెంట్ |
|---|---|---|---|---|
| బజాజ్ స్పైస్ | 22,308/- | 11 నెలలు | 2,490/- | 2,043/- |
| | | 22 నెలలు | 2,715/- | 1,131/- |
| | | 33 నెలలు | 2,923/- | 822/- |
| బజాజ్ స్పిరిట్ | 29,163/- | 11 నెలలు | 3,255/- | 2,671/- |
| | | 22 నెలలు | 3,544/- | 1,476/- |
| | | 33 నెలలు | 3,840/- | 1,080/- |
| కైనెటిక్‌హోండా డిఎక్స్ | 39,400/- | 8 నెలలు | 15,174/- | 3,521/- |
| | | 13 నెలలు | 13,387/- | 2,460/- |
| | | 18 నెలలు | 12,062/- | 1,929/- |
| కైనెటిక్‌హోండా జెడ్ఎక్స్ | 40,800/- | 8 నెలలు | 15,702/- | 3,647/- |
| | | 13 నెలలు | 13,852/- | 2,547/- |
| | | 18 నెలలు | 13,101/- | 1,998/- |
| కైనెటిక్‌స్టైల్ | 30,850/- | 8 నెలలు | 11,946/- | 2,757/- |
| | | 13 నెలలు | 10,547/- | 1,926/- |
| | | 18 నెలలు | 9,979/- | 1,510/- |
| ఎల్ఎమ్ఎల్ (ట్రెండీ ...) | 21,335/- | 23 నెలలు | 3,485/- | 1,216/- |
| లూనా సూపర్ | 19,324/- | 12 నెలలు | 4,792/- | 1,288/- |

## TVS CHAMP



## BAJAJ స్పిరిట్



# నిదురోయే భంగిమలో మనసుతీరు తెలుసుకో













- సియస్. సలీంబాషా

# జి.డి. బిర్లా

**చదువు స్కూల్ స్థాయి కూడా దాటలేదు... అయినా భారతీయ వ్యాపార పారిశ్రామిక చరిత్రనే తిరగ రాశాడు. కఠినమైన కట్టుబాట్లు సాంప్రదాయాల మధ్య పెరిగాడు. తిరగబడి వాటిని ఛేదించేదాకా మడమ తిప్పలేదు. ఆయన జీవిత చరిత్ర చదివితే దాదాపు ఐదు దశాబ్దాల భారతీయ పారిశ్రామిక చరిత్రను తిరగేసినట్టే. జాతీయోద్యమానికి ధీటుగా దేశ ఆర్థిక స్వేచ్ఛకు సాగిన పరోక్ష పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన....**




భారత కార్పోరేట్ సాధానికి మూలస్తంభంగా నిలిచిన ఘన్‌శ్యామ్‌దాస్ బిర్లా 1894 ఏప్రిల్ 10న జన్మించారు. తల్లి యోగీశ్వరిదేవి తండ్రి బలదేవ్‌దాస్ బిర్లా. గిరి దాటడానికి వీల్లేని కట్టుబాట్ల మధ్య మడికట్టుకున్న సంప్రదాయ మార్వాడి కుటుంబం ఆయనది. (వాటిని ఛేదించేందుకు పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది జీడీకి). పుట్టిన వూరు రాజస్థాన్‌లో షెకావత్ ప్రాంతంలోని పిలాని అనే ఓ కుగ్రామం. రోడ్డు, పోస్టాఫీసు, స్కూలు లాంటి కనీస వసతులేవీ లేవక్కడ. ఎడ్లబళ్లు, ఒంటెలే ప్రయాణ సాధనాలు. చదువుకున్న వాళ్లు నూటికి ఒకరో ఇద్దరో...

తొమ్మిదవ ఏట తనకు తానే చదవడం, రాయడం కొద్దిగా నేర్చుకున్నాడు. ఏదైనా స్కూల్లో చేరిస్తే బావుంటుందని తండ్రి కలకత్తాలో వుంటున్న పెద్దకొడుకు దగ్గరికి పంపాడు ఘన్‌శ్యామ్‌ని. అక్కడ 'విశుద్ధానంద సరస్వతి' అనే స్కూల్లో చేరాడు. కలకత్తా బొత్తిగా కొత్త. పైగా కట్టడిచేసే పెద్దల్లేని చోటు. పొద్దున్నే పుస్తకాల బ్యాగుతో స్కూల్‌కని బయల్దేరి- బడికి ఎగనామం పెట్టి కలకత్తా వీధులన్నీ చుట్టి-రాత్రికి ఇంటికి చేరేవాడు. అన్న జుగల్ కిషోర్ స్వంత కాళ్లపై నిలదొక్కుకునేందుకు కసరత్తు చేస్తున్న రోజులవి. తమ్ముడిపై నిఘా వుంచే తీరిక అతడికి చిక్కేది కాదు. అలా యథేచ్ఛగా తిరిగేస్తున్న ఘన్‌శ్యామ్ తండ్రి వెనక్కి పిలిపించాడు. దీంతో అతడి స్వేచ్ఛకి తెరపడింది. అప్పటికే ముంబయిలో ఓ ఇల్లు కొన్న తండ్రి అక్కడే ఓ ట్యూటర్ని పెట్టాడు. లెక్కలతో పాటు టెలిగ్రాములు, పేపర్లు చదివేందుకు అవసరమైన మేర ఇంగ్లీషు నేర్పమన్నాడు ఆయన్ని. సంప్రదాయ మార్వాడీ కుటుంబాలకి అదో విడ్డూరమే. పరాయిభాష ఇంగ్లీషుకు దూరంగా వుండేవారు అప్పట్లో. ట్యూటర్ పుణ్యమా అని మొత్తానికి ఇంగ్లీషుపై ఆసక్తి పెరిగింది.

బయట తిరుగుళ్లని తండ్రి కట్టడి చేయడంతో గది నాలుగు గోడల మధ్యే ఎక్కువ సమయం గడిచేది. ఓ డిక్షనరీ, నోటు బుక్కులు దినపత్రికలు, కొన్ని పాఠ్యపుస్తకాలు ఆయనకి తోడయ్యాయి. వాటితో గంటల తరబడి కుస్తీ పట్టేవాడు.

అలా ఇంగ్లీషు, సంస్కృతంతో పాటు మరో రెండు భాషల్లో రాయడం, చదవడం తనకు తానే నేర్చుకున్నాడు. పుస్తకాలు చదవడం మీద ఆసక్తి పెరిగి - క్రమంగా అలవాటుగా మారింది. అలా రెండేళ్లు గడిచాక-11 ఏళ్ల వయసులో పుట్టిన వూరు పిలానికి చేరాడు. అక్కడి ప్రైమరీ స్కూల్లో ఐదో ఫారం పరీక్ష రాసి పాసయ్యాడు. అంతే... అక్కడితోనే ఆయన చదువు ఆగిపోయింది. ఒక మెగా కార్పోరేట్ ప్రపంచాన్ని సృష్టించిన జీడి బిర్లాకి చదువులో కనీసం స్కూలు సర్టిఫికేటు కూడా లేకపోవడం ఆశ్చర్యం! ఇక వయసు పదకొండేళ్లంటే - అప్పట్లో పెళ్లీడు వచ్చిందన్నట్టే! దుర్గా సోమాని అనే అమ్మాయితో ఘన్‌శ్యామ్ పెళ్లి జరిపించాడు తండ్రి. కాని అది ఎంత తొందరపాటో, దురాచారమో నాలుగేళ్లలోనే తెలిసొచ్చింది. తొలిబిడ్డ పుట్టిన కొద్దిరోజుల్లోనే దుర్గ చనిపోయింది. బిర్లాకి ఇది తీరని దుఃఖాన్ని మిగిల్చింది. అప్పటికి బిర్లా వయసు పదిహేనేళ్లే. చంటి పిల్లాడి బాధ్యతని కుటుంబంలోని పెద్దవాళ్లకి అప్పగించి బొంబాయి చేరాడు. బాధలో వున్న కొడుకుని వ్యాపారం వైపు మళ్ళించాలని - 1910లో 16 ఏళ్ల బిర్లాని కలకత్తా పంపాడు తండ్రి. జిడి బిర్లా జైత్రయాత్రకి అదే తొలిమెట్టు.

## జనపనార బ్రోకర్‌గా...

కలకత్తా చేరాడు ఘన్‌శ్యామ్. అన్న జుగల్ కిషోర్ కాటన్, సిల్వర్ ఇతర ఉత్పత్తుల్ని కొనడం, అమ్మడం చేస్తుండేవాడు. ఎందుకో దాని మీద ఆసక్తి మళ్లలేదు బిర్లాకి. జూట్ (జనపనార) బిజినెస్‌కి మంచి డిమాండ్ కనిపించింది. నార ఉత్పత్తుల్ని సేకరించి, అవసరమైన చోటికి సరఫరా చేసే జూట్ బ్రోకర్‌గా స్వంతంగా తన కెరీర్ మొదలు పెట్టాలనుకున్నాడు. కాని ఇంగ్లీషు, స్కాటిష్ వ్యాపారుల గుప్పిట్లో వుంది ఆ వ్యాపారం. వారి గుత్త పెత్తనాన్ని బద్దలు కొట్టాలంటే మాటలా! ఆ బిజినెస్‌లో మెళకువల నేర్చుకునేందుకే నానా తంటాలు పడ్డాడు. 50 వేలు ఫీజుగా ఇస్తానన్నా ఆ ట్రిక్కులను చెప్పలేదు ఓ మార్వాడీ బ్రోకరు. అదృష్టవశాత్తూ ఆయన మామగారు (దుర్గ తండ్రి) కూడా అదే వ్యాపారంలో వుండడంతో ఆయన అండ దొరికింది. 1911లో 'జి.ఎం. బిర్లా కంపెనీ'ని రిజిస్టరు చేశాడు. అప్పట్లో దేశంలోని జూట్ మిల్లులన్నీ యూరోపియన్ల గుప్పిట్లో వుండేవి. వాళ్ల ఆమోదం వున్న వారికే జూట్ బిజినెస్‌లో స్థానం వుండేది. కొత్తవాడైన బిర్లాకి ఇదో పెద్ద అడ్డంకి.

చివరికి - తన మామగారి పేరు మీద ట్రేడింగ్ చేయాల్సి వచ్చింది. ఇంగ్లీషు వాళ్లతో పరిచయాలు పెరిగాయి. వాళ్ల అహాన్ని, వివక్షనీ, ఆగ్రహాన్ని రుచి చూసాడు. ఎంత వివక్ష అంటే - ఇంగ్లీషు వాళ్ల ఆఫీసుల కెళ్లినప్పుడు లిఫ్టులు వాడనిచ్చేవారు కారు. కుర్చీల్లో కూర్చోనిచ్చేవారు కారు. ప్రతి విషయంలో భారతీయులకి చిన్నచూపే. ఈ అవమానాలకి బిర్లా కుత కుత ఉడికిపోయాడు. వాళ్ల పెత్తనాన్ని బద్దలుకొట్టాలనుకున్నాడు. ఈ ఆలోచనే ఆయనని రాజకీయాలవైపు, స్వతంత్ర పోరాటాలవైపు మళ్లించింది.

అప్పుడే బాలగంగాధర తిలక్ బ్రిటిష్ పాలన మీద నిప్పులు చెరుగుతూ, బెంగాల్ నాలుగు చెరగులా ప్రభంజనంలా చుట్టేస్తున్నాడు. 1916లో కలకత్తాలో తిలక్‌ని మొదటిసారి చూసారు బిర్లా. ప్రేక్షక పాత్రకి స్వస్తి చెప్పి ప్రత్యక్ష పోరాటానికి దిగేందుకు బిర్లాతోపాటు మరికొందరు యువకుల్ని ఉసిగొల్పింది ఈ సంఘటన. అప్పటికే బిర్లా 'మార్వాడి స్పోర్టింగ్ క్లబ్'ని కొందరు మిత్రులతో ఏర్పాటు చేశాడు. ఇందులో యువకులకి సాయుధ శిక్షణ కూడా ఇచ్చేవారు.



రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీజీతో

ఓసారి 'రోడ్డా'అనే ఇంగ్లాండ్‌కంపెనీ నుంచి కొన్ని తుపాకులు, మందుగుండు కలకత్తా పోర్ట్‌కి వచ్చాయి. వాటిని అన్‌లోడ్ చేసేప్పుడు దొంగచాటుగా ఓ తుపాకుల పెట్టెని దొంగిలించారు ఈ క్లబ్ యువకులు. వారిలో బిర్లా కూడా వున్నాడు.

పోలీసులు దాడి చేయడంతో ఆ పెట్టెను హుగ్లీ నదిలో పడేశారు. వ్యాపారంలో నిలదొక్కుకుంటున్న దశలో ఈ కేసు బిర్లా మెడకి చుట్టుకుంది. చివరికి బిర్లా కుటుంబానికి బాగా తెలిసిన ఓ డాక్టరు పోలీసులను ఒప్పించి ఆయన్ని బయటికి తెచ్చాడు. ఎలాగో టెర్రరిస్టుగా ముద్రపడే ప్రమాదం తప్పింది. ఇలా - ఈ కేసులో కొన్ని నెలలపాటు అజ్ఞాతంలో గడపాల్సి వచ్చింది బిర్లా. విశేషమేమిటంటే - బిర్లాని పట్టుకోవడానికి - వెంటపడ్డ టీగార్ట్ అనే పోలీసు కమీషనరే - తర్వాతికాలంలో బిర్లా కంపెనీ లండన్ శాఖ అధిపతిగా నియమితుడయ్యాడు.

## బ్రిటిష్ వాడి విలన్

ఒకవైపు భార్య దూరమైన దుఃఖం... మరోవైపు స్వతంత్రంగా వ్యాపారంలో నిలదొక్కుకోవాలన్న ఆరాటం... కాని అడుగు ముందుకు కదలకుండా అడ్డంకులు... ఇదీ కలకత్తాలో బిర్లా తొలినాళ్ల పరిస్థితి. అన్నతో కలిసి ఒక చిన్న గదిలో వుండేవాడు. చాలా రోజులు స్వయంపాకమే. ఆ రోజులు బిర్లా జీవితంలో చాలా కీలకమైనవి.

ఆయన జూట్ వ్యాపారంలోకి దిగడం కుటుంబంలో ఎవరికీ నచ్చలేదు. బ్రిటిష్ వాళ్లకి అడుగడుగునా జోహుకుం అంటూ తిరగాలని హెచ్చరించినా వినలేదు. అప్పుడే 'రోడ్డా ఆయుధాల' కేసులో ఇరుక్కున్నాడు. ఆ కేసు నుంచి బయట పడేనాటికి మొదటి ప్రపంచ యుద్ధం ముంచుకొచ్చింది. దీని పరిణామాలు ఎలా వున్నా జూట్ పరిశ్రమకి మాత్రం ఈ యుద్ధం నిజంగా వరమే అయింది. ప్రధాన బ్రిటిష్ కంపెనీలన్నీ తుపాకులు, మందుగుండు తయారీకి సంబంధించిన పరిశ్రమలవైపు మళ్లాయి. మరోవైపు బ్రిటిష్ ప్రభుత్వానికి యుద్ధరంగంలో సైన్యం రక్షణకి ఇసుకబస్తాలు అవసరమయ్యాయి. దీంతో గోనెసంచులకి, ఇతర జూట్ ఉత్పత్తులకి విపరీతమైన డిమాండ్ పెరిగింది. స్థానిక భారతీయ వ్యాపారులకి మంచి అవకాశం దొరికింది. 1915-21 మధ్య జూట్ పరిశ్రమ అనూహ్యంగా లాభాల పంట పండించింది. కుటుంబాన్ని ఎదిరించి ఈ కొత్త వ్యాపారంలోకి దిగిన బిర్లా - యుద్ధం ముగిసేనాటికి ఆర్థికంగా బాగా నిలదొక్కుకున్నాడు. భవిష్యత్తులో దేశ పారిశ్రామిక రంగాన్నే మలుపు తిప్పిన బిర్లా జీవితంలో ఇదో ముఖ్యమైన మజిలీ. యుద్ధం పుణ్యమా అని లాభాలు మూడురెట్లు వచ్చాయి. అప్పుడే బిర్లాకి మరో ఆలోచన వచ్చింది. ఎవరో తయారు చేసిన ఉత్పత్తులతో వ్యాపారం చేయడం కంటే - వాటిని తయారు చేయాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా - ఓ జూట్ మిల్లుకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఇది ఒక రకంగా బ్రిటిష్ వారిని ప్రత్యక్షంగా ఢీకొనడమే! ఊహించినట్టే అడుగడుగునా అడ్డుపడ్డారు బ్రిటిష్ అధికారులు. ఇంపీరియల్ బ్యాంకు నుంచి రుణం అందకుండా చేశారు. మిల్లు కోసం భూమి దొరక్కుండా చేశారు. ఎక్కడైనా స్థలం కొందామనుకుంటే దాన్ని ముందే కొనేసేవారు. యంత్రసామగ్రిని దిగుమతి చేసుకోకుండా - రవాణా ఛార్జీలు, దిగుమతి సుంకాలని భారీగా పెంచారు. రూపాయి మారకం రేటుని హఠాత్తుగా సవరించారు. దీంతో యంత్రాల విలువ ఇంగ్లాండ్‌లో దాదాపు మూడురెట్లు ఎక్కువైంది. ఇలాంటి ప్రతిబంధకాలు బిర్లా వంటి భారతీయ యువ పారిశ్రామికవేత్తలని నీరుగార్చాయి.

అయినా వెనక్కి తగ్గలేదు బిర్లా. తన సర్వస్వాన్నీ పణంగా పెట్టి జూట్ మిల్లు ఏర్పాటు చేశాడు. కాని ఆస్తి అంతా దాదాపు హరించుకుపోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ ఒత్తిడికి తలొగ్గి ఒకదశలో మిల్లుని అమ్మేయాలనుకున్నాడు. ఆండ్రూ యూలె అనే బ్రిటిష్ కంపెనీతో ఒప్పందం కూడా కుదిరింది. బిర్లా ఓసారి ఆ కంపెనీ కార్యాలయానికి వెళ్లినప్పుడు "హాయిగా కుటుంబ వ్యాపారమేదో చూసుకోక బ్రిటిష్‌వారినే ఢీకొందామనుకున్నావా? బిజినెస్ గురించి ఏబీసీలు తెలియవు కానీ ఆశ మాత్రం మిల్లు ఓనరునవుదామనే!" అంటూ వెటకారం చేశారు. ఈ అవమానానికి మండిపడ్డాడు బిర్లా. మిల్లు అమ్మకం ఆలోచనకి స్వస్తి చెప్పాడు. అంతేకాదు... తన తోటి వ్యాపారుల్ని కూడా కొత్త మిల్లులు ఏర్పాటుకు ప్రోత్సహించాడు.

జూట్ ఉత్పత్తులకి డిమాండ్ పెరగడంతో ఈ భారతీయ మిల్లులన్నీ నిలదొక్కుకున్నాయి. బ్రిటిష్ అధికారులు బిత్తరపోయారు. వాళ్ల దృష్టిలో బిర్లా ఓ విలన్‌గా మారాడు. అలా... ఓ మామూలు జూటు ఉత్పత్తుల వ్యాపారంతో మొదలైన బిర్లా వ్యాపారం తర్వాతి కాలంలో ఓ మహాసామ్రాజ్యంగా విస్తరించి భారతీయ కార్పోరేట్ రంగ రూపురేఖల్నే మార్చేసింది.



## గాంధీ సమక్షంలో...

జూట్ వ్యాపారంతో ఇంగ్లీషువాళ్ల ఆధిపత్యాన్ని బద్దలుకొట్టి పెద్ద సంచలనమే సృష్టించాడు బిర్లా. మరికొందరు స్థానిక వ్యాపారులకి కూడా బిర్లా సాహసం స్ఫూర్తినిచ్చింది. వాళ్ళూ ఈ వ్యాపారంలోకి దిగి లాభాలు ఆర్జించారు. ఇది అప్పట్లో చాలా మందికి కొత్త పరిశ్రమ నెలకొల్పేందుకు అవసరమైన పెట్టుబడుల్ని సొంతంగా సమకూర్చుకునే అవకాశం కల్పించింది. తరువాత బిర్లా దృష్టి కాటన్ వైపు మళ్ళింది. ఢిల్లీలోని సబ్జీ మండిలో గిల్డారీ కాటన్ మిల్లు ఖరీదు చేశాడు. 1921లో ఏర్పాటు చేసిన జియాజీరావ్ కాటన్ మిల్లు, గ్వాలియర్‌లో ఏర్పాటు చేసిన మరో మిల్లు భవిష్యత్తులో భారతీయ టెక్స్‌టైల్ చరిత్రనే మలుపుతిప్పిన సంస్థలుగా ఎదిగాయి. బ్రిటిష్ పాలనకి వ్యతిరేకంగా సాగుతున్న రాజకీయ పోరాటానికి ధీటుగా - భారతీయ వ్యాపార రంగాన్ని రక్షించుకోవడానికి కూడా పరోక్షంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఉందని గుర్తించాడు బిర్లా. రాజకీయాల్లో ఉంటేగానీ తమ గొంతు వినిపించే అవకాశం రాదన్న సంగతి అర్థమైంది. 1921లో సెంట్రల్ లెజిస్లేటివ్ కమిటీకి పోటీచేసి ఎన్నికయ్యారు. ఇది బిర్లా జీవితంలో కీలకమైన మలుపు. ఇంతవరకు సొంత వ్యాపారాన్ని చూసుకుంటూ వచ్చిన బిర్లా ఇప్పుడు మొత్తం దేశ వ్యాపారవర్గానికి ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే హఠాత్తుగా అదే సమయంలో బిర్లా రెండవ భార్య మహాదేవి చనిపోయింది. ఇది ఆయన్ను బాగా కుంగదీసింది. ముగ్గురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లల ఆలన కష్టమైంది. వీరి బాధ్యతను సోదరులకి అప్పగించాడు. ఆయనలో విరక్తి భావం చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ ఇదే సమయంలో గాంధీజీతో పరిచయం ఏర్పడింది. మనశ్శాంతి కోసం కొన్నాళ్ళు గాంధీజీ సమక్షంలో గడిపాడు. ఒరిస్సాలో నెలరోజుల పాటు ఆయనతో పాటు పాదయాత్రలో పాల్గొన్నాడు. అప్పటికే కోటీశ్వరుల్లో ఒక్కడైన బిర్లా ఆ సందర్భంలో దొరికిందేదో తిని, రోడ్డు పక్క కటికనేలమీద పడుకున్న సందర్భాలెన్నో. పూర్తిగా కుటుంబంతో సంబంధం లేకుండా గడిపాడు. కొన్ని నెలల తర్వాత గాంధీజీ ఒత్తిడి మీద ఇంటికి తిరిగి వచ్చాడు బిర్లా. అప్పుడు కలకత్తాలో హిందూ ముస్లిం ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. బిర్లా ఇల్లు ఉద్రిక్తతలకి నెలవైన ప్రమాదకరమైన ప్రాంతం మధ్యలో ఉంది. అయినా ఆ ఘర్షణల్లో నిర్వాసితులైన ఎంతోమంది ఇరువర్గాలకు చెందిన పేదలకు బిర్లా నివాసం సురక్షితమైన ఆశ్రయంగా మారింది. దీంతో ఆయన పేరు ఆ ప్రాంతం అంతా మార్మోగిపోయింది. గాంధీజీ ప్రశంసల జల్లు కురిపించారు. ఘర్షణల నివారణలో బిర్లా చూపిన అసమాన ధైర్యానికి గౌరవంగా బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఉన్నత పురస్కారాన్ని (నైట్‌హుడ్) ప్రకటించింది. కానీ దాన్ని తిరస్కరించాడు బిర్లా. ఓవైపు జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొంటూనే మరోవైపు వ్యాపారాన్ని విస్తరిస్తూపోయాడు. 1927లో ఢిల్లీకి చెందిన హిందుస్తాన్ టైమ్స్ పత్రికని స్వాధీనం చేసుకోవడం జాతీయోద్యమానికి ఎంతో దోహదం చేసింది. 1927లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గోరఖ్‌పూర్ నుంచి బిర్లా ఎన్నికైనప్పుడు గాంధీ నెహ్రూతో కొన్ని విభేదాలు పొడసూపాయి. కానీ భారతీయ పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని సమర్థంగా ఢీకొనే ప్రాతినిధ్యం ఎంతైనా అవసరమని వాదించాడు బిర్లా.

## లెజెండ్

క్యాపిటలిస్టుల మీద నెహ్రూకి సదభిప్రాయం లేదు. ఈ వ్యతిరేకతను బిర్లా చవిచూసాడు. పెట్టుబడిదారుల దృష్టి లాభలపైనే వుంటుందన్నది నెహ్రూ వాదన. లాభాలు లేందే కొత్త పరిశ్రమలు స్థాపించడమెలా సాధ్యం? దేశం అభివృద్ధి చెందాలంటే పారిశ్రామిక ప్రగతే కదా ముఖ్యం అన్నది బిర్లా వాదన. ఇలా వారి మధ్య విభేదాలు కడదాకా కొనసాగాయి. దేశవ్యాప్తంగా బిర్లా వ్యాపార సంస్థలపై ఎన్ని సార్లు టాక్స్‌దాడులు జరిగాయో లెక్కలేదు. మరోవైపు గాంధీజీ మాత్రం ఇటు జాతీయోద్యమాన్నీ, అటు వ్యాపార వర్గ ప్రయోజనాలనీ సమాన దృష్టితో చూసారు. అందుకే గాంధీజీ అంటే బిర్లాకి అమితమైన ప్రేమ, వాత్సల్యమూనూ. జాతీయోద్యమానికి ఆర్థికంగా అండగా నిలిచిన వారిలో బిర్లాయే అగ్రగణ్యుడు. 1930లో మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి, 1931లో రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీజీతోపాటు హాజరయ్యాడు. ఒక పారిశ్రామికవేత్త అయి వుండీ గాంధీజీ ఇచ్చిన విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. సంప్రదాయ మార్వాడీ కుటుంబంలో పుట్టినా కుటుంబం పాటించే అర్థంలేని కట్టుబాట్లనూ, ఆచారాల్నీ తీవ్రంగా ఖండించాడు. మార్వాడీ పెద్దలకి ఎదురు తిరిగి దాదాపు రెండు దశాబ్దాల పాటు వెలివేతకు గురయ్యాడు. బాల్యవివాహాల రద్దుకీ గొంతు విప్పాడు. వితంతు పునర్వివాహాలు జరిపించాడు. విదేశీ ప్రయాణం చేస్తే నాలుక కాల్చుకొని ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్న కులపెద్దల ఆంక్షపై తిరుగుబాటు చేశాడు. చివరికి హరిజనుల్ని అల్లంత దూరంలో వుంచే దుష్టసంప్రదాయాన్ని బద్దలుకొట్టి హరిజన్ సేవక్ సంఘ్ అధ్యక్షుడిగా బాధ్యతలు భుజాన వేసుకున్నాడు. వారికి ఆలయ ప్రవేశం కల్పించేందుకు ఉద్యమం చేశాడు. తాను స్కూల్ డ్రాప్ అవుట్ అయినా ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలు గల బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బిట్స్)ని పిలానీలో స్థాపించాడు. ఇటు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోనైతే బిర్లాది ఓ చరిత్రే. 1945లో కేవలం 20 కంపెనీలున్న బిర్లా గ్రూపు 1983లో ఆయన చనిపోయే నాటికి 200లకిపై వ్యాపార, పారిశ్రామిక సంస్థలతో దేశంలోనే ప్రథమస్థానాన్ని ఆక్రమించింది. 1948, జనవరి 30న గాంధీజీ బిర్లా హౌజ్‌లోనే ఒక ఉన్మాది చేతిలో అసువులు బాసారు. ఎంతో ఇష్టంగా కట్టించుకున్న సువిశాలమైన ఆ భవనాన్ని జాతికి అంకితమిచ్చారు బిర్లా.

89 ఏళ్ల పండు వయసులో కేధార్‌నాథ్ యాత్రకి స్వయంగా నడిచి వెళ్ళి ఆ తర్వాత కొద్ది నెలల్లోపే 1983లో లండన్‌లో కన్నుమూశారు బిర్లా●

\- శేషు

# ముప్పుని ముందే పసిగట్టే రొటీన్ టెస్టులు



మన శరీరంపై ఏ రకమైన జబ్బులు దాడి చేయబోతున్నాయో - దాన్ని ముందే కొన్ని సంకేతాలు బయటపెట్టేస్తాయి. చాలాసార్లు వాటిని గుర్తించం. గుర్తించినా సీరియస్‌గా పట్టించుకోం. ఈ రెండు కారణాలవల్ల జబ్బులు తీవ్రస్థాయికి చేరతాయి. అప్పుడు డాక్టర్ల చుట్టూ చక్కర్లు... మందులు. ముందే ప్రమాద సంకేతాలని గమనిస్తే చాలావరకు ఈ అవస్థలేవీ వుండవు. మరి ఈ సంకేతాలని పసిగట్టడమెలా?

ఏ జలుబో, జ్వరమో వచ్చినప్పుడు డాక్టర్ దగ్గరికెళితే కనీసం నాలుగైదు టెస్టులేవో రాస్తాడు. ఇవన్నీ అనవసరమేనా అనిపిస్తుంది చాలాసార్లు. కానీ భవిష్యత్తులో ప్రమాదకరంగా మారే జబ్బులని పట్టిచ్చే సంకేతాలు ఈ మామూలు టెస్టుల్లోనే దొరికిపోతాయి. వయసు 30 దాటాక - ఏ జబ్బు లక్షణం లేకున్నా రొటీన్‌గా ఇలాంటి టెస్టుల్ని చేయించుకోవడం చాలా అవసరం. అందుకే ఈ మధ్య చాలా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు మాస్టర్ హెల్త్ చెకప్ స్కీంలని పోటాపోటీగా ప్రవేశపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు మనం చేయించుకోవాల్సిన ఆ రొటీన్ టెస్టులేవో కాస్తయినా అవగాహన వుండాలి.



## 1. సిబిపి (కంప్లీట్ బ్లడ్ పిక్చర్)

వ్యాధి తీవ్రమైనదైనా, మామూలుదైనా డాక్టరు మొట్టమొదట రాసే రక్త పరీక్ష ఇది. కామన్‌గా రాసేదే అయినా వ్యాధినిర్ధారణలో చాలా కీలకమైన ప్రాథమిక పరీక్ష. రక్తం అనేది వెంట్రుక నుంచి గోటి మొదటిదాకా ప్రవహించే ప్రాణద్రవం. ఎర్రరక్తకణాలు, హిమోగ్లోబిన్, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఇలా రక్తంలోని అన్ని అంశాల గురించి స్పష్టమైన చిత్రాన్ని కళ్లముందుంచే పరీక్ష ఇది. ఉదాహరణకి హిమోగ్లోబిన్ శాతం తక్కువుంటే ఎనీమియా జబ్బుకి సంకేతం. తెల్లరక్తకణాలు వుండాల్సిన సంఖ్యకంటే అధికంగా వుంటే కాన్సర్ (ల్యుకేమియా) లేక ఇతర ఇన్‌ఫెక్షనేదో పొంచి వుందన్నమాటే! ఇక కణాలు తక్కువగా వుంటే జలుబు లాంటివి ముసురుకుంటాయి. ఈ తెల్లరక్త కణాల్లోనూ ఐదు రకాలుంటాయి. వీటి సంఖ్యలో తేడా 'డిఫరెన్షియేట్ కౌంట్' ద్వారా తెలుస్తుంది. ఈ కౌంట్ మామూలుగా లేదనుకోండి అలర్జీలు, చర్మరోగాలు, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌లు.... ఇలాంటిదేదో ముంచుకొస్తుందనడానికి సంకేతం. కేవలం 30-40 రూపాయల ఈ మామూలు పరీక్ష ద్వారా ఎంతటి ప్రమాదకరమైన సంకేతాలని తెలుసుకోవచ్చో అర్థమవుతుంది.

## 2. సియుఇ (కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్)

ఇది కూడా సిబిపిలాగే డాక్టర్లు రొటీన్‌గా రాసే చిన్న టెస్టు. మూత్రం వ్యర్థపదార్థమే అయినా రాబోయే జబ్బులకి ఎన్నో సంకేతాలని పట్టిచ్చే అతి ముఖ్యమైన డయాగ్నొస్టిక్ ఏజెంట్. రంగు పచ్చగా మారితే జాండిస్‌కి సంకేతం అన్నది అందరికీ తెలిసిందే. బైల్‌సాల్ట్స్, బైల్ పిగ్మెంట్స్ మూత్ర పరీక్షలో జాండిస్‌ని నిర్ధారిస్తారు. ఆల్బుమిన్ అనే మరో పదార్థం వుంటుంది. ఇది ఎక్కువగా వున్నట్టు తేలితే కిడ్నీకి సంబంధించిన సమస్య వున్నట్టే. రంగు, స్పెసిఫిక్ గ్రావిటీ, ఆల్బుమిన్, సుగర్, ఎసిడిటీ, ప్రోటీన్, బైల్‌పిగ్మెంట్స్ - మొదలైన అంశాల గురించి ఈ టెస్టులో పరీక్షిస్తారు. మూత్రంలో ప్రొటీన్‌ల శాతం ఎక్కువగా వున్నట్టు తేలితే కిడ్నీలు వాచాయనో, ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాయనో అర్థం. లేక శరీరంలో ఎక్కడో వున్న సిస్టులు, ట్యూమర్లు బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌లు కిడ్నీల పని తీరును ఆటంక పరుస్తున్నాయని అర్థం. ఇక ఎసిడిటీ (అల్సర్‌కి సంబంధించింది కాదు) అంశానికొస్తే మూత్రం అనేది మామూలుగా ఆమ్ల లక్షణం కలిగి వుండాలి. ఇది పరీక్షలో కనక క్షారగుణం (అల్కలైన్) వున్నట్టు తేలితే బ్లాడర్ లేదా కిడ్నీలకి సంబంధించి ఏదో ఇన్‌ఫెక్షన్ వుందని అర్థం. న్యూమోనియా కొన్ని దశలలో, కొన్ని నరాల జబ్బులలో కూడా మూత్రం అల్కలైన్‌గా మారుతుంది. అంటే - పరీక్షలో మూత్రం అల్కలైన్‌గా తేలితే వీటిలో ఏదో లోపమున్నట్టు అర్థం. అలాగే మూత్రంలో బైల్ పిగ్మెంట్స్‌వుంటే లివర్ లేదా గాల్‌బ్లాడర్ జబ్బు ఏదో వుందన్న మాటే! అంటే - కేవలం 30 - 40 రూపాయల ఈ చిన్న టెస్టుతో ఎన్ని జబ్బులకి సంకేతాలని తెలుసుకోవచ్చో చూడండి. యూరిన్ అనాలిసిస్ అనేది ఒక ప్రాణాన్ని రక్షించగలిగే టెస్టు.

## 3. బిపి టెస్ట్

శరీరంలో రక్తం నాళాల్లో వేగంగా ప్రవహిస్తుందని తెలుసు. ఈ వేగంతో నాళాల గోడలపై కొంత ఒత్తిడి కలుగుతుంది. ఈ ఒత్తిడే బ్లడ్ ప్రెషర్. ఆరోగ్యవంతుల్లో 120/80 అని లెక్క. ఇందులో పై నంబర్ సిస్టాలిక్ ప్రెషర్‌ని సూచిస్తుంది. గుండె ముడుచుకున్నప్పుడు రక్తం నాళాల్లోకి చిమ్మబడి గోడలపై కలిగే గరిష్ఠ ఒత్తిడే సిస్టాలిక్ ప్రెషర్. రెండోదైన కింది నంబర్‌ను డయాస్టాలిక్ ప్రెషర్ అంటారు. గుండె వ్యాకోచించినప్పుడు రక్తనాళాల్లోని (ధమనులు) రక్తం అందులోకి చేరుతుంది. ఆ స్థితిలో ధమనుల్లోని గోడలపై కలిగే ఒత్తిడి డయాస్టాలిక్ ప్రెషర్. స్థూలంగా చెప్పాలంటే - గుండె సంకోచించినప్పుడు వ్యాకోచించినప్పుడు నాళాల్లో కలిగే ఒత్తిడులే ఈ నంబర్లన్నమాట. ఇది వయసును, తిండినీ, మానసిక స్థితినిబట్టి మారుతుంది. పైన చెప్పిన 120/80 అనే సంఖ్యని మించిపోతే అది హైబీపీ అన్నమాట. ఇది ఒక రకంగా సైలెంట్ కిల్లర్. గుండెపోటుకు, స్ట్రోక్‌కి, కిడ్నీలు చెడిపోవడానికీ - ఇంకా ఎన్నో ప్రాణాంతక జబ్బులకి హైబీపీ ఒక సంకేతం అన్నమాట! దీన్ని అదుపులో వుంచకుంటే ప్రాణాంతకమే. విచిత్రమేమంటే - దీన్ని అదుపులో వుంచడం కూడా చాలా సులువే. రెగ్యులర్‌గా బీపీ టెస్టు చేయించుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. తలనొప్పి, మగత, చికాకు, కోపం, నిద్రలేమి, బలహీనత ఇలాంటి లక్షణాలున్నాయంటే - అది హైబీపీ కావచ్చని అనుమానించాల్సిందే. అందుకే డాక్టరు ముందుగా రొటీన్‌గా చేసే మొట్టమొదటి పరీక్ష ఇదే. అందుకే వయసు 30 దాటిందంటే రెగ్యులర్‌గా బిపి పరీక్ష అత్యవసరం. ఈ చిన్న టెస్టుని బేఖాతరు చేస్తే ప్రమాదం ముంచుకొచ్చినట్టే. ఈ పరీక్షని ఏదో ఒక్కసారి చేయించుకొని నిర్ధారణకి రాకుండా వరసగా కనీసం మూడు రోజులు - మూడుసార్లు చేయించుకొని బీపీ గురించి నిర్ధారణకి రావడం మంచిది.

## 4. ఎక్స్‌రే చెస్ట్

డాక్టర్ రాసే ప్రాథమిక టెస్టుల్లో ఛాతీ ఎక్స్‌రే ఒకటి. శరీరంలో లోపల తాజాగా ఏం జరుగుతోందో ఫొటోలో స్పష్టంగా చూపించే పరీక్ష ఇది. నానా రకాల చెత్త, కాలుష్యం మధ్య బతికేస్తున్న మన ఊపిరితిత్తుల్లో ఎంతటి ప్రమాదకరమైన ఇన్‌ఫెక్షన్‌లు తిష్ట వేసాయో ఈ మామూలు ఎక్స్‌రే టెస్టు పట్టిచ్చేస్తుంది. ముఖ్యంగా టిబి లాంటి జబ్బులను ముందుగానే పసిగట్టవచ్చు. అలాగే ఎక్స్‌రేలో గుండె పరిమాణం, దాని ఆకారం, పనితీరు కూడా తెలుస్తాయి. దగ్గు, జలుబు, జ్వరం, దమ్ము, ఆయాసం లాంటి లక్షణాలున్నప్పుడు ఛాతీ ఎక్స్‌రే అవసరం. ప్రస్తుతం మాస్టర్ హెల్త్ స్కీంలు అన్నింట్లో చెస్ట్ ఎక్స్‌రే విధిగా వుంటోంది.

## 5. ఇసిజి

ఇది కూడా ప్రాథమిక టెస్టుల్లో ఒకటి. ఇసిజి అంటే ఎలక్ట్రోకార్డియో గ్రాఫ్. గుండె కొట్టుకునే క్రమంలో ఓ క్రమపద్ధతిలో విద్యుత్ ప్రకంపనలు వెలువడతాయి. ఈ ప్రకంపనల్ని గ్రాఫ్ రూపంలో రికార్డు చేసేదే ఇసిజి. గుండెలో పై రెండు గదులు ఏట్రియా అయితే కింది రెండు గదులు వెంట్రికల్స్. కుడివైపున్న ఏట్రియం నుంచి ఒక విద్యుత్ ప్రకంపనం మొదలై వెంట్రికల్స్‌ను చేరుతుంది. దీని ఫలితంగానే గుండె కొట్టుకుంటుంది. ఇదంతా ఒక క్రమపద్ధతిలో, రిథమిక్‌గా ఖచ్చితమైన వ్యవధిలో నిరంతరం జరుగుతూనే వుంటుంది. ఇసిజి రికార్డు చేసేది ఈ రిథమ్‌నే. ఇసిజి గ్రాఫ్‌లో ఏమైనా తేడా కనిపించిందంటే - గుండె పనితీరులో ఏదో లోపం పొంచివుందన్నట్టే. మామూలుగా - గుండె నిమిషానికి 50 - 100 మధ్య హెచ్చుతగ్గులు లేకుండా కొట్టుకుంటుందంటే ఇసిజి నార్మల్‌గా వున్నట్టే. ఏ జబ్బు లక్షణాలు లేకపోయినా 35 - 40 ఏళ్లు వచ్చాయంటే - తరచూ ఇసిజి తీయించుకోవడం ఎంతైనా అవసరం. ఇది చాలా ఈజీ టెస్టు. ఛాతీకి, చేతులు, కాళ్లకి కొన్ని వైర్లు అమర్చి గుండె ప్రకంపనాలని కాగితంపై రికార్డు చేస్తారు. చవకైన పరీక్షే అయినా జీవితానికి ప్రాణమైన గుండెలో ఏ చిన్న లోపం తలెత్తినా ఇట్టే పసిగట్టే అత్యంత కీలకమైన ప్రాథమిక పరీక్ష కూడా ఇదే. ఇసిజీలో ఏదైనా అనుమానం వుంటే 'స్ట్రెస్ ఇసిజి' అనే మరో పరీక్ష చేస్తారు. ఎక్సర్‌సైజు చేస్తున్నప్పుడు రికార్డు చేసే పద్ధతి ఇది.

## 6. కొలెస్టరాల్

రక్తనాళాలు బ్లాక్ అయిపోయి ఏదైనా ప్రమాదం ముంచుకొచ్చే పరిస్థితులు శరీరంలో ఏర్పడుతున్నాయేమో తెలుసుకునేందుకు చేసే మరో కామన్ పరీక్ష ఇది. ముఖ్యంగా గుండెజబ్బుల నిర్ధారణలో ఈ పరీక్ష చాలా అవసరం. కొలెస్టరాల్ అనగానే మైనం లాగా వుండి రక్తనాళాల్లోపల పేరుకుపోయి రక్తప్రవాహానికి అడ్డుపడే చెడువు కొవ్వు పదార్థమేమో అనుకుంటాం. కానీ ఇది పూర్తిగా నిజం కాదు. నరాలకి ఇది ఇన్సులేషన్‌లా పనిచేస్తుంది. కొన్ని కీలకమైన హార్మోన్ల ఉత్పత్తిలో కొలెస్టరాల్‌దే కీలకపాత్ర.

జీర్ణక్రియలో అతిముఖ్యమన పైత్యరసాన్ని తయారు చేయడానికి లివర్ దీన్నిఉపయోగించుకుంటుంది. మరి ఇది చేసే చెడుపు ఏమిటి? కొలెస్టరాల్ శాతం ఉండాల్సిన దాని కన్నా పెరిగితే రక్త నాళాల గోడల చుట్టూ పేరుకుపోతుంది. ఇది రక్త ప్రవాహాన్ని నిరోధిస్తుంది. దీనివల్ల గుండెకి ఆక్సిజన్ సరిగ్గా అందదు. ఫలితంగా 'స్ట్రోక్' వచ్చే ప్రమాదం ఉంది.

కొలెస్టరాల్ శాతం తగిన మోతాదులో ఉందా లేదా అనేది తెలుసుకోవడానికి ఈ పరీక్షే ఆధారం. కొలెస్టరాల్‌లో కూడా రెండు రకాలున్నాయి.

1. హెచ్‌డిఎల్ (హైడెన్సిటీ లిపోప్రోటీన్)
2. ఎల్‌డిఎల్ (లోడెన్సిటీ లిపోప్రోటీన్)

వీటిలో హెచ్‌డిఎల్ శరీరానికి మేలు చేసేది. దీని లెవెల్ ఎక్కువగా ఉంటే గుండెపోటు వచ్చే ప్రమాదం దాదాపు లేనట్టే. ఎల్‌డిఎల్ శరీరానికి చెడుపు చేస్తుంది. దీని శాతం ఎక్కువగా ఉంటే గుండెపోటు ప్రమాదం పొంచి వుందన్నమాటే. అందువల్ల గుండెజబ్బులకి దారితీసే ప్రమాద సంకేతాలను ఈ కొలెస్టరాల్ పరీక్షలో తేలిగ్గా తెలుసుకోవచ్చు. ఇది కూడా తరచూ చేయించుకోవాల్సిన ఓ రొటీన్ టెస్ట్.

## 7. బ్లడ్ షుగర్

బ్లడ్ షుగర్ అనేది అజాగ్రత్తగా ఉంటే ఎన్నో అనర్థాలకి దారితీసే జబ్బు. బ్లడ్ షుగర్‌ను ఓ మామూలు పరీక్ష ద్వారానే కనిపెట్టవచ్చు. రక్తంలో గ్లూకోజ్ పరిమాణాన్ని కనిపెట్టే పరీక్షే బ్లడ్ షుగర్ టెస్ట్. మామూలుగానైతే మనం తినే ఆహారంలోని గ్లూకోజ్‌ను ఇన్సులిన్ అనే ఎన్‌జైమ్ జీర్ణం చేస్తుంది. కానీ డయాబెటిస్ సమస్య ఉన్నవారిలో ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడంతో జీర్ణం కాని గ్లూకోజ్ రక్తంలో అలాగే ఉండిపోతుంది. ఈ షుగర్ లెవెల్ ఎక్కువగా ఉన్నట్టు ఈ టెస్ట్‌లో తేలితే తగిన మందులతో దాన్ని అదుపు చేసి రాబోయే ప్రమాదం నుంచి ముందే జాగ్రత్త పడచ్చు. బ్లడ్ షుగర్ టెస్ట్‌ని ఉదయం ఖాళీ కడుపుతో ఒకసారి, అన్నం తిన్నాక రెండు గంటలకి మరోసారి చేస్తారు. మొదటిదాన్ని ఫాస్టింగ్ బ్లడ్‌షుగర్ అనీ, రెండవదాన్ని పోస్ట్ లంచ్ అనీ అంటారు. మొదటిది 80-120 మధ్య, రెండవది 140-180 మధ్య ఉండాలి. ఫాస్టింగ్ ఉదయమే చేయించుకోవాలి. ఎందుకంటే కనీసం 10-12 గంటలు కడుపు ఖాళీగా ఉంటుంది. రక్తం తీసిన వెంటనే కడుపునిండా భోజనం చేసిన రెండు గంటలకి పోస్ట్ లంచ్ షుగర్ కోసం మళ్ళీ రక్తం తీస్తారు. మామూలుగా జలుబు, జ్వరం లాంటివి లేనప్పుడే ఈ పరీక్ష చేయించుకోవాలి.



ఎందుకంటే జ్వరంతో ఉన్నప్పుడు షుగర్ లెవెల్ పెరిగే అవకాశం ఉంది. బ్లడ్ షుగర్ పరీక్షలో షుగర్ పరిమాణం పెరిగినట్టు తేలితే ముందు జాగ్రత్త పడి ప్రమాదం రాకుండా నివారించవచ్చు. ఇది కూడా 100-150 రూపాయల మధ్య ఖర్చయ్యే చవకైన పరీక్ష.

## 8. ఎల్ఎఫ్‌టి (లివర్ ఫంక్షన్ టెస్ట్)

మన శరీరంలో లివర్ అనేది ఓ కీలకమైన పవర్ సెంటర్. అతి ముఖ్యమైన భాగం. దీని పనితీరుమీదే మన ఆరోగ్యం ఆధారపడి వుంది. చిన్న పనికి కూడా తీవ్ర అలసట, జ్వరంగా వున్నా, లివర్ పెరిగినట్టు అనుమానం ఉన్నా, కళ్ళూ, కాళ్ళూ, చేతిగోళ్ళూ, చర్మం పచ్చగా మారినా ఈ పరీక్ష అత్యంత అవసరం. ఈ టెస్ట్‌లో లివర్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన కెమికల్స్ ఉండాల్సిన స్థాయిలో ఉన్నాయా లేదా తెలుస్తుంది. ఉదాహరణకి ఎస్‌జిఒటి, ఎస్‌జిపిటి అనే ఎంజైమ్‌లు, బైలిరూబిన్ అనే మరో పదార్థం లివర్‌లో ఉత్పత్తి అవుతాయి. లివర్ ఇన్‌ఫెక్షన్‌కు గురైనప్పుడు వీటి పరిమాణం పెరుగుతుంది. అంటే లివర్‌లో లోపానికి ఇది ప్రమాద సంకేతం అన్నమాట. ఎల్ఎఫ్‌టి పరీక్షలో ఈ రసాయనాల తగు మోతాదులో ఉన్నాయో లేదో తెలుస్తుంది. వీటి పరిమాణం ఎక్కువగా ఉన్నట్టు తేలితే లివర్‌కి సంబంధించిన జబ్బేదో పొంచి వుందన్నట్టే. ఈ పరీక్ష ద్వారా తగిన చికిత్స పొంది ప్రాణాంతకమైన ముప్పు నుంచి బయట పడొచ్చు. అందుకని ఎల్ఎఫ్‌టిని కూడా రొటీన్‌గా చేయించే పరీక్షల్లో ఒకటిగా చేర్చారు.●

- ఎస్వీయస్

## మధుమేహంలో రక్త మూత్ర పరీక్ష

మధుమేహ వ్యాధి నిర్ణయంలో రక్తపరీక్ష ప్రముఖ పాత్ర వహిస్తుంది.

ఆరోగ్యవంతుని రక్తంలో సుగర్ భోజనం తర్వాత కూడా 160 మి॥గ్రా॥ (ట్రూగ్లూకోజ్) మించదు. పరగడుపున చేసే పరీక్షలు 60-90 మి.గ్రా. మధ్య వుంటుంది.

మధుమేహ వ్యాధి వున్నవారిలో గ్లూకోజ్ ఈ పరిధిని దాటిపోతుంది. వ్యాధి మరీ తీవ్రంగా వుంటే 500 మి.గ్రా. వరకు కూడా పెరగవచ్చు.

మధుమేహంలో తప్ప మరే వ్యాధిలోనూ రక్తంలో గ్లూకోజ్ 200 మి.గ్రా. మించి వుండదు. అయితే థైరాయిడ్, పిట్యూటరి ఎడ్రినల్ గ్రంధులు అతి చురుగ్గా (హైపర్ యాక్టివిటీ) పనిచేసే వ్యాధుల్లో భావోద్వేగంతో కూడిన మానసిక ఒత్తిడిలో బ్లడ్ సుగర్ తాత్కాలికంగా పెరుగుతుంది. దీనికి కారణం ఎపినెఫ్రిన్ అనే ఎంజైమ్ విడుదలై ఇన్సులిన్ స్రావాన్ని అడ్డుకోవడమే.

పాంక్రియాటిస్ వ్యాధి గ్రస్తమైనా లేక కేన్సరుకు గురైన వ్యాధి తీవ్రతను బట్టి బ్లడ్ సుగర్ ఎక్కువగానే వుంటుంది. పై వ్యాధుల్లో తప్ప పరగడుపు రక్తం షుగర్ 150 మి.గ్రా. మించితే మధుమేహమని చెప్పవచ్చు. 200 మి.గ్రా. దాటితే వ్యాధి నిర్ణయం తిరుగులేనిదిగా భావించవచ్చు.

గ్లూకోజ్ వినియోగపరీక్ష - కేవలం మూత్రపరీక్ష ద్వారా మధుమేహ వ్యాధి నిర్ణయం చేయలేము. మధుమేహం వున్న కొందరి మూత్రంలో షుగర్ వుండకపోవచ్చు. మూత్రంలో సుగర్ వున్నా అందరూ వ్యాధి గ్రస్తులేనని నిర్ధారించడం సరికాదు. అనుమానం వున్న కేసులలో గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ (G.T.T.) చేయవలసి వుంటుంది. మధుమేహాన్ని నిర్ధారించే ఈ పరీక్షలో పరగడుపున రక్తం తీసిన వెంటనే 50 గ్రా॥ గ్లూకోజ్ 200 మి.లీ. నీటిలో కరిగించి త్రాపిన పిమ్మట ప్రతి అరగంటకొకసారి చొప్పున ఐదుసార్లు (2½ గం.) రక్తం నమూనాలను సేకరించాలి. ఆయా సమయాల్లో మూత్రం నమూనాను కూడా పరీక్షించాలి. నార్మల్ కేసులో ఏ మాత్రం నమూనాలోను సుగర్ కన్పించదు. అరగంట నుంచి ఒకటిన్నర గంటల వరకు రక్తంలో చక్కెర శాతం పెరుగుతూ పోయి ఆ తర్వాత తగ్గుముఖం పడుతుంది. రక్తంలో చక్కెర 180 మి.గ్రా. దాటనంతవరకు మూత్రంలో షుగర్ కనిపించదు. ఈ 180 మి.గ్రా. అనేది మూత్రపిండం నిలువరింపు స్థాయిగా గుర్తించారు.

కొంతమందికి భోజనం తర్వాత లేక గ్లూకోజ్ ద్రావణం తాగిన తర్వాత అరగంట నుంచి గంటలోపు బ్లడ్ షుగర్ నార్మల్ పరిధిని దాటిపోతుంది. మూత్రంలో కూడా షుగర్ కనిపిస్తుంది. కానీ ఒకటిన్నర గంటల తర్వాత రక్తం, మూత్రం రెండిటిలోనూ నార్మల్‌గా ఉంటుంది. దీనికి కారణం గ్లూకోజ్‌ను జీర్ణం చేసే ఇన్సులిన్ ఆలస్యంగా స్రవించడం అయి వుంటుంది. అంతే తప్ప వీరిని డయాబెటిక్స్‌గా గుర్తించబడదు. చాలా కొద్దిమందిలో మూత్రపిండ నిలువరింపు స్థాయి తక్కువగా ఉంటుంది. వయసు మళ్ళినవారిలో బ్లడ్ షుగర్ పెరిగినా మూత్రంలో మాత్రం షుగర్ కినించదు. కొంత మంది మధుమేహ వ్యాధిగ్రస్థులకు కూడా ఇలాంటి కేసులు కనిపిస్తాయి. రక్తనాళాలు గట్టిపడి సాగే స్వభావం కోల్పోడమే దీనికి కారణం. బ్లడ్ షుగర్ 250 మి.గ్రా. ఉన్నా మూత్రంలో షుగర్ కనిపించని అరుదైన కేసులు కూడా ఉంటాయి.

గర్భిణీగా ఉన్న కాలంలో స్త్రీలు మూత్రంలో కొంత చక్కెరను కోల్పోవచ్చు. అంత మాత్రాన వీరిని డయాబెటిక్స్‌గా నిర్ధారించలేం.

మధుమేహ నిర్ధారణయితే ప్రత్యేక శ్రద్ధతో చికిత్స తీసుకోవాలి. పరగడుపున బ్లడ్‌షుగర్ నార్మల్‌గా వున్నంత మాత్రాన రోగం లేదని కొట్టిపారేయలేం.

వ్యాధిని అదుపు చేసే నిమిత్తం తరచుగా రక్తం మూత్ర పరీక్షల రిపోర్ట్‌లు అవసరం గనుక రోగి స్వయంగా మూత్ర పరీక్ష చేసుకునేందుకు వీలుగా కెమికల్ రియేజెంట్‌తో కూడిన ప్లాస్టిక్ పుల్లలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. అలాగే బ్లడ్ షుగర్‌ను కూడా గ్లూకోమీటర్ అనే పరికరం, దానికి సంబంధించిన స్ట్రిప్స్ సాయంతో స్వయంగా పరీక్ష చేసుకోవచ్చును. తక్షణం అప్పటికప్పుడు రిపోర్ట్ ఫలితం తెలుస్తుంది.

మధుమేహ వ్యాధి గ్రస్తులు ఏడాదికొకసారైనా లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష చేయించుకోవటం శ్రేయస్కరం.

గత కొన్ని వారాలుగా మధుమేహం ఏమేరకు అదుపులో వుందో తెలుసుకోడానికి గ్లైకోసిలేటెడ్ హిమగ్లోబిన్ అనే మరో రక్త పరీక్ష ఎంతగానో ఉపకరిస్తుంది●

- డా. జి.ఆర్. చౌదరి

సం॥ చందా రూ.180/- ; 5 సం॥ చందా రూ.800/- ; అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076



# వైతాళికుడు అంబేద్కర్

సాంఘిక విప్లవ సూర్యుడి శిఖరాయమాన వ్యక్తిత్వంపై నిబద్ధతగల సోషలిస్టు మేధావి నిష్పాక్షిక విశ్లేషణ

13 కులనిర్మూలన కాంక్షించే ప్రతి ఒక్కరూ చదివితీరాల్సిన రచన!

ధారావాహిక ♦ రచన : కీ.శే. మధులిమాయె ♦ అనువాదం : కీ.శే.సురమౌళి

(గత సంచిక తరువాయి)

1947లో దేశ విభజన ఒప్పందానికి దారితీసిన కారణాలనేకం. వాటిని ఒకసారి పూర్వం నుంచీ వివరించడానికి ప్రయత్నిస్తాను. కేవలం బ్రిటిష్ ఎత్తుగడలే దీనికి కారణం అనడం సరిగాదు. అలాగే కాంగ్రెసు ముస్లిం నాయకుల్లో లోపించిన రాజకీయ విజ్ఞత, లేదా ఎవరో కొందరు వ్యక్తుల ఆటవిక మనస్తత్వమో ఈ విషాద పరిస్థితికి కారణం అనడానికి వీలులేదు. ఏదో ఒక ఏకైక కారణమని ఎత్తి చూపించే విశ్లేషణలు సంతృప్తికరంగా లేవు. ముస్లింలలో వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించింది బ్రిటిష్ ప్రభుత్వమేననడంలో సందేహం లేదు. అయితే దాన్ని సృష్టించింది మాత్రం వారు కాదు. ఇస్లాం - హిందూ మతాల మధ్య ఎనిమిది వందల సంవత్సరాల నుంచి అపరిష్కృతంగా ఉన్న సంఘర్షణ దీనికి బీజాలు వేసింది. వేలాది సంవత్సరాల సాంఘిక అనైక్యత, హిందూ సమాజం జీవాణువుల్లో మురుగుతున్న బలహీనతలు దీన్ని పోషించాయి.

ప్రఖ్యాత అమెరికన్ దౌత్యవేత్త, రచయిత, తమ దేశపు విదేశాంగ విధానాన్ని గురించి అన్న మాటలు మన దేశంలోని హిందూ ముస్లిం సమస్యకు సంపూర్ణంగా వర్తిస్తాయని నా అభిప్రాయం.

మానవేతిహాసంలో సాగే ఆటుపాటుల్లో ఒక సంఘటన మరోదానికి కారణమవుతుంది. ప్రతీ పొరపాటుకు, అంతకుముందు జరిగిన పొరపాట్లు కారణం. ఒక రకమైన క్షమాగుణం అలవడుతుంది. అదే విధంగా ప్రతి పొరపాటు మున్ముందు జరుగబోయే పొరపాటును నిర్ధారిస్తుంది. ఇందువల్ల ప్రస్తుత పొరపాటు నిర్దాక్షిణ్యంగా పరిణమిస్తుంది.

హిందువులు ప్రజాస్వామ్యం పట్ల సూత్రప్రాయ వైఖరిని అవలంబించారు. ఒక మనిషి-ఒక ఓటు అనే సూత్రమిది. హిందూ ఆధిపత్యం రాగలదన్న భయంతో స్వయం నిర్ణయాధికారం అనే సిద్ధాంతాన్ని లేవదీశారు ముస్లింలు. (సాంస్కృతిక సమైక్యత గురించి నేను చెప్పడం లేదు) పాశ్చాత్య సంస్కృతి నాటిన జాతీయ రాజ్యాల (నేషనల్ స్టేట్) భావన ఎంత లోతుగా నాటుకొని వుందంటే, 1946 జూలై వరకూ, సంపూర్ణ విభజన ఫలితంగా సంభవించే భయంకర పరిణామాలకు జిన్నా సంసిద్ధులు కాలేదు. 1946 డిసెంబరు వరకూ కాంగ్రెసు నాయకత్వం కూడా భయంకర పరిస్థితి రాగలదని ఊహించలేదు. అయితే హిందూ - ముస్లిం సంఘర్షణలకు దూరంగా ఉండి, సమస్యను నిష్పక్షపాత వైఖరితో పరిశీలించి నిర్ణయాలకు వచ్చిన వ్యక్తి అంబేద్కర్ ఒక్కరే. ఇంతటి నిష్పక్షపాత వైఖరిని అవలంభించ గలగడం, విభజన గురించి తగాదా పడుతున్న పక్షాలకూ వర్గాలకు సాధ్యపడలేదు.

## పాకిస్తాన్ : అంబేద్కర్ పాత్ర-1

పోరాటశీలి, తార్కికుడేకాక అంబేద్కర్‌కు పాండిత్యం అన్నా, జ్ఞానం అన్నా ఎనలేని అభినివేశం వుండేది. ముస్లింలీగు వారు, పాకిస్తాన్ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత హిందూ, ముస్లిం సమస్య మీద ఈయన 1940లో ప్రచురించిన పుస్తకం ఆయన పాండిత్యానికి ప్రతీక. "పాకిస్తానా? భారత విభజనా?" అన్న పుస్తకాన్ని రాయడంలో అంబేద్కర్‌గారి ఉద్దేశం ప్రజలను ఆలోచింప చేసి ప్రేరణ కలిగించడమే. అందుకని ఆయన ఉద్దేశపూర్వకంగానే రెచ్చకొట్టే భాషను ఉపయోగించారు. ఆక్రామకులైన హిందువులకు అధికారాన్ని అప్పగించి వారిని తమ వారసులుగా బ్రిటిష్ పాలకులు ప్రతిష్ఠించి పోతారన్న ఆశపెట్టుకోవద్దని ఆయన హిందువులను హెచ్చరించారు. అందువల్ల వారు పాకిస్తాన్‌ను, తాము అనుకున్నట్లుగా నివారించగలమనుకోవడం భ్రమ అని ఆయన తీర్పు చెప్పారు. ప్రతీ ముక్క సామ్రాజ్యానికి లొంగివుండే విధంగా దేశాన్ని విభజించడానికిగాని, ఆ మాటకు వస్తే ముక్కలు ముక్కలుగా చేయడానికి బ్రిటిష్‌వారు వెనుకాడరని అంబేద్కర్ వివరించారు. ఏదేమైనా, పాకిస్తాన్ కోర్కెను అణచివెయ్యడానికి బ్రిటిష్ వారు బలప్రయోగం చేస్తారని హిందువులు ఆశ పెట్టుకుంటే అది అడియాసే అవుతుందని ఆయన విపులీకరించారు. అది అసాధ్యం.

ప్రముఖ కాంగ్రెసు నాయకుల రచనలనూ, ఉత్తర ప్రత్యుత్తరాలనూ పరిశీలిస్తే కాంగ్రెసు నాయకులు ఇటువంటి భ్రమల్లో ఉండేవారని రుజువవుతుంది. అత్యంత తెలివైన, సర్దార్ పటేల్ వంటి నాయకుడు సైతం బ్రిటిష్ వారి ఉద్దేశాలను గురించి భ్రమల్లోనే ఉండేవారన్న విషయం, 1946 ప్రథమార్థంలో ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల వల్ల తేటతెల్లమవుతున్నది. అయితే తాత్కాలిక ప్రభుత్వాల్లో పనిచేసి నప్పుడు వచ్చిన అనుభవజ్ఞానం వల్ల ఆయన భ్రమలు తొలగడం ప్రారంభ మయింది. అప్పటి నుంచి ఆయన విభజనను సమర్థించడానికి ముందుకు వచ్చారు. 'విభజించి వేస్తే పీడా పోతుంది. ముస్లిం సమస్యా, ముస్లిం సమస్యల తలనొప్పిలేకుండా పోతుంది' అనేది ఆ తర్వాత కాలంలో వల్లభాయిపటేల్ వైఖరిగా కొనసాగింది.

ఒకే ఒక్క కేంద్ర ప్రభుత్వం ఉండగల భారతదేశం అన్న ధ్యేయం తిరుగులేని నిర్ణయంగా భావించడానికి వీలు లేదని అంబేద్కర్ బహుశా ముందుగానే పసికట్టారు. ముస్లిం లీగు లాహోరు తీర్మానం తర్వాత (1940) భారత విభజన అవకాశం ధృడపడి పోయిందని ఆయన నిశ్చితాభిప్రాయం.

ఆధునిక భారతదేశంలో ముస్లిం రాజకీయాల వికాసంలో ఒక సూత్రం. ఒక పద్ధతి, ఒక క్రమం ఉన్నట్లు అంబేద్కర్‌కు అనిపించింది. తమ భాగ్యం అయినటువంటి పాకిస్తాన్ స్వప్నం చుట్టూ ముస్లిం నాయకులు, సహజంగానే, ఉద్దేశపూర్వకంగా కాకపోయినా, సమీకృత్యం అవుతున్నట్లు, ఆయన కనిపెట్టారు. 30వ దశకం చివరి భాగంలోనూ, 40వ దశకపు తొలిభాగంలోనూ, (రౌండ్ టేబిల్ సభల కాలం) ముస్లింల జనాభా అధికంగా ఉన్నటువంటి అయిదు రాష్ట్రాలను ఒక్కటి చేసే లక్ష్యానికి అనుగుణంగా ముస్లిం నాయకుల సమీకరణ ప్రారంభమైంది. ఈ రాష్ట్రాల మీద హిందూ ప్రాబల్యం ఉండకూడదని హిందూ మెజారిటీ అత్యాచారం నుంచి ఈ రాష్ట్రాలను స్వతంత్రంగా ఉంచాలని వారి ఆకాంక్ష. బ్రిటిష్ పాలకుల విరమణ తర్వాత ఏదైనా కేంద్ర ప్రభుత్వం అనేది రూపొందితే అది ముస్లింలకు కనుకుట్టుగా పరిణమించేది.

జిన్నాగారి 14 సూత్రాల రూపంలో ముస్లింల కోరికలకు ధృఢమైన స్వరూపం లభించింది. కలకత్తా అఖిల పక్ష మహాసభ (1929 జనవరి) జరిగినప్పుడు నెహ్రూ నివేదికకు జిన్నా సవరణలను ప్రతిపాదించారు. తీవ్రవాదులు - జాతీయ ముస్లిములూ - హిందూ మహాసభ వారూ ఏకమై జిన్నా అభిప్రాయాన్ని తిరస్కరించారు. ముస్లింములలోని బ్రిటిష్‌వారి అనుయాయులు జిన్నాను ఏకాకిని చెయ్యడానికి ప్రయత్నించారు. వారు ముస్లిం మహాసభ అంటూ వేరే ఒక సంస్థ స్థాపించి, బ్రిటిష్‌వారి కనసన్నల్లో పనిచేయడం ప్రారంభించారు. మాక్డొనాల్డు గారి కమ్యూనల్ అవార్డు 14 సూత్రాలనూ పూర్తిగా అంగీకరించినట్లేనని అంబేద్కర్ అభిప్రాయం.





ముస్లిం లీగు సమావేశంలో జిన్నా

**ఒకే ఒక్క కేంద్ర ప్రభుత్వం ఉండగల భారతదేశం అన్న ధ్యేయం తిరుగులేని నిర్ణయంగా భావించడానికి వీలు లేదని అంబేద్కర్ బహుశా ముందుగానే పసికట్టారు. ముస్లిం లీగు లాహోరు తీర్మానం తర్వాత (1940) భారత విభజన అవకాశం ధృడపడి పోయిందని ఆయన నిశ్చితాభిప్రాయం.**

1935 చట్టం క్రింద రాష్ట్ర స్థాయిలో కలిసిమెలసి పనిచేసే అవకాశం లభిస్తుందని ముస్లిం లీగు ఆశించింది. వారి ఆశ నిరాశ అయింది. ప్రోవిన్షియల్ అటానమీ-తాత్కాలిక స్వతంత్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయడం ప్రారంభమై రెండు సంవత్సరాలు గడిచింతర్వాత (1937) కాంగ్రెసు - ముస్లిం లీగు మధ్య తగాదా తారాస్థాయికి చేరింది. ముస్లింలను అంతగా నొప్పించే పనిని కాంగ్రెసు వారు ఏమిచేశారు? అంబేద్కర్ గారే ఈ ప్రశ్న వేసుకొని సమాధానం చెప్పడానికి ఉపక్రమించారు. (1) ముస్లింలకు ప్రాతినిధ్యం వహించే ఏకైక సంస్థగా ముస్లింలీగును గుర్తించడానికి కాంగ్రెసు నాయకులు నిరాకరించడం (2) కాంగ్రెసు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లిం లీగుతో కలిసి సంయుక్త ప్రభుత్వాలను స్థాపించడానికి కాంగ్రెసు వారు నిరాకరించడం.

ముస్లింలీగు కోర్కెలను కాంగ్రెసువారు అంగీకరించడానికి ఇష్టపడలేదు. లీగుతో సంబంధంలేని ఇతర ముస్లిం సంస్థలతో వ్యవహారం నడపాలని కాంగ్రెసువారు ప్రయత్నించారు. ఇది తప్పుడు విధానం అని అంబేద్కర్ గారి అభిప్రాయం. కాంగ్రెసు వారి వైఖరిని గుడ్డిగా చట్టాన్ని అనుసరించే పద్ధతి అని అంబేద్కర్ అన్నారు. లీగుతో సంబంధంలేని ముస్లిం సంస్థలు ముస్లిం ప్రజల మధ్యకు వెళ్ళి వారి ఆదరాభిమానాలను చూరగొనలేనట్టివి: అందువల్ల ఏ పనీ కాదు. ఈ విధానం జిన్నాను రెచ్చగొట్టడానికి ముస్లింలీగును రెచ్చగొట్టడానికి ఉపకరించింది. కాంగ్రెసు పట్ల ముస్లింలకు మరింత వైముఖ్యాన్ని పెంచింది.

తమ పార్టీలకు రాజీనామాలు పెట్టి కాంగ్రెసు శపథం మీద సంతకం చేసిన ముస్లిం శాసన సభ్యులకు కాంగ్రెసువారు మంత్రివర్గంలో స్థానం కల్పించడాన్ని ముస్లిములు అసహ్యించుకున్నారు. సామూహిక బాధ్యత సాధ్యంకాదని కాంగ్రెసు నాయకులు చెప్పే సిద్ధాంతం చిత్త శుద్ధి లేనిది. ఈ మాటలన్నీ పట్టిపై మాటలేనని, చిత్తశుద్ధి లేని మాటలని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెసు పార్టీ మైనారిటీగా ఉన్నటువంటి రాష్ట్రాలలో, మిగతా పార్టీలవారిని, కాంగ్రెసు శపథం మీద సంతకాలు తీసుకోకుండానే మంత్రివర్గాల్లో చేర్చుకుని సంయుక్త మంత్రివర్గాలను ఏర్పాటు చేశారు. సంయుక్త ప్రభుత్వాలు మంచివి కాకపోతే, ఒక చోట అవి మంచివై మరొక చోట మంచివి కాకుండా ఎలా పోతాయి? అని ప్రశ్నించే హక్కు ముస్లిములకు ఉంటుంది కదా అని డాక్టర్ అంబేద్కర్ అన్నారు.

ముస్లింలతో బహిరంగంగా సామాన్య ప్రజల స్థాయిలో, సంబంధాలు పెంపొందించు కోవాలన్న జవహర్‌లాల్ నెహ్రూ పద్ధతి మూర్ఖమైనదని డాక్టర్ అభిప్రాయం. ముస్లిముల్లో కాంగ్రెసు పార్టీకి పునాది కల్పించడం దీని వల్ల సాధ్యపడలేదు సరికదా, ముస్లింలీగును ప్రాముఖ్యానికి తెచ్చింది. ముస్లిములతో నేరుగా సంబంధాలు అనే ఈ మతిభ్రమించిన విధానం, పాకిస్తాన్ కోరికను బలపరచడానికి చాలావరకు దోహదం చేసింది. ముస్లిం నాయకులను అణచివేయడానికి, లేదా వారిని నిర్లక్ష్యం చెయ్యడానికి జరిగిన ఈ ప్రయత్నం అభిశంసనీయమని డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

పైన వివరించిన విశ్లేషణలను బట్టి, డాక్టర్ అంబేద్కర్ ముస్లిం రాజకీయ పరిణామాలను సమర్థించారని గానీ, వాటి పట్ల సానుభూతితో ఉండేవారని గాని అనుకోవడానికి వీలు లేదు. అయితే ఆయన సమస్యను నిష్పక్షపాతంగా, ఆవేశరహితంగా విశ్లేషించడానికి ప్రయత్నించారు. విశ్లేషణాత్మకంగా ముస్లిముల దృక్పథాన్ని పరిశీలించడానికి ఆయన ప్రయత్నించారు.

పాలక వర్గాలకూ పాలిత వర్గాలకు మధ్య విచక్షణకు కీలకం రాజకీయ అధికారం నుంచి పాలితులను దూరం తరిమి కొట్టడమేనన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ అంబేద్కర్ ప్రతికులం ప్రతీమతం వారు తమ పార్టీకే విధేయులుగా ఉన్నారని కాంగ్రెసు వారు ప్రతిపాదించిన సిద్ధాంతం వల్ల తమను పాలిత వర్గాలుగానే, పాలిత వంశాలుగానే వ్యవహరిస్తున్నారని ముస్లిములు భావించడానికి ఆస్కారం కలిగిందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

భారతదేశంలో కొన్ని శతాబ్దాలుగా ముస్లిములు ప్రధాన పాత్ర వహించారు. మరాఠాల బలం పెరిగిన కాలంలో కూడా దేశంలో చాలా ప్రాంతాల్లో, ఈ పరిస్థితిలో మార్పు రాలేదు. బ్రిటిష్ ప్రభుత్వ హయాములోనే ముస్లిముల ప్రాధాన్యం తగ్గడం ప్రారంభమైంది. "పరిపాలనా పరంగానైతేనేమి, నిర్వహణ పరంగానైతేనేమి చట్టపరంగా నైతేనేమి బ్రిటిష్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రతి మార్పు ముస్లింములపై ఒకదానిపై ఒక దెబ్బగా పరిణమించాయి. ముస్లిం క్రిమినల్‌లా"ను ముస్లిం న్యాయస్థానాలను రద్దు చేయడమేకాక, వాటి స్థానంలో తమ చట్టాలను తమ న్యాయస్థానాలను రద్దు చేయడమేకాక, వాటి స్థానంలో తమ చట్టాలను తమ న్యాయస్థానాలను నెలకొల్పారు. దీనితో బాటే ముస్లిం షరియత్ అనగా ముస్లిం చట్టాలను, అమలు పరిచే సివిల్ లా పరిధిని పరిమితం చేస్తూ వచ్చారని అంబేద్కర్ పేర్కొన్నారు. కేసులను ఇదివరకటి మాదిరిగా ముస్లిం కాజీలు పరిష్కరించి తీర్పులు చెప్పే పద్ధతి అంతరించింది. బ్రిటిష్ ప్రభుత్వం వారు నియమించిన "లా అధికారులూ, న్యాయమూర్తులు" వారు ఏ మతానికి చెందిన వారైనప్పటికి ముస్లిం చట్టాలను వ్యాఖ్యానించి, విశ్లేషించి అంతిమ తీర్పులు చెప్పే ఆచారానికి నాంది జరిగింది. యజమానులుగా ఉన్నవారు, పాలితులుగా దిగజారిపోయారు. ఇదే ఎంతో ఘోరమైన పతనం అని భావిస్తూ వుంటే సహపాలితుల స్థాయి నుంచి, హిందువుల క్రింద పాలితులుగా దిగజారవలసిరావడం మరింత అవమానకరంగా వీరికి తోచింది.

ముస్లిం మనస్తత్వాన్ని అంబేద్కర్ పరిశోధించారు. ముస్లిం మతావేశాన్ని ఆయన ఎంత అసహ్యించుకున్నారో, హిందువులు మడికట్టుకోవడాన్ని కూడా ఆయన అంతే అసహ్యించుకున్నాడు. ఖిలాఫత్ ఉద్యమం పట్ల డాక్టర్ గారికి ఎటువంటి సానుభూతి ఉండేది కాదు. ఆ ఉద్యమాన్ని సమర్థించడంతో బాటు, ఆ ఉద్యమకారులకు మిత్రుడు మార్గదర్శకుడుగా వ్యవహరించినందుకూ ఆయన గాంధీజీని విమర్శించారు. తమ దేశాన్ని జాతీయ రిపబ్లిక్‌గా మార్చుకోదలచుకున్న టర్కీ వారిని సుల్తాన్ ఖలీఫాను కొనసాగించుకోవాలని ఒత్తిడి చేయడం ఏ విధంగా చూసినా న్యా సమ్మతమైనది కాదని అంబేద్కర్ అభిప్రాయ పడ్డారు.

(ఇంకావుంది)

**సీరియల్ 9**

# రక్తకాసారం



**నవీన్**

(గతసంచిక తరువాయి)

రెండు కార్ల నెంబర్లు ఇంచుమించు ఒకేలా ఉండటం వల్లనూ, సరిగ్గా అదే టైమ్‌కు ప్రజాద్రోహి సుఖేందర్ రెడ్డి కారు అక్కడికి చేరుకోవలసి ఉండటం వల్లనూ ఈ పొరపాటు జరిగిందనీ, ఈ పొరపాటు జరిగినందుకు చాలా విచారిస్తున్నామనీ, శేషయ్య కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామనీ, ఇలాంటి పొరపాట్లు భవిష్యత్తులో జరక్కుండా చూసుకుంటామనీ, ఈసారికి ప్రజలు తమను క్షమించాలనీ, ప్రజాద్రోహి సుఖేందర్ రెడ్డిని మాత్రం వదిలేది లేదని రెండ్రోజుల తర్వాత క్రాంతికారులిచ్చిన స్టేట్‌మెంట్‌ని అన్ని పత్రికలు ప్రచురించాయి.

ఆ రోజు సుఖేందర్ రెడ్డి ముత్యంరావు కూతురి పెళ్ళికి వెళ్ళాలని కొంచెం ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నాడు. అతని భార్య, కొడుకు వెళ్ళొద్దని ఎంత చెప్పినా వినకుండా నా ప్రాణంలో ప్రాణమైన ముత్యంరావు కూతురి పెళ్ళికి వెళ్ళకుండా ఎలా ఉంటానని బయల్దేరాడు. ఇద్దరు గన్‌మెన్లు కూడా అతని వెంట ఉన్నారు. అయినా కొంత దూరం వెళ్ళాక అతని మనస్సేదో కీడును శంకించింది. అతడు బయల్దేరే ముందు అతని భార్య "ఇవే ఆఖరు చూపులైతయ"ని హృదయవిదారకంగా ఏడ్చిన ఏడ్పు అతని చెవుల్లో గూడుకట్టుకొని పదే పదే వినిపించ సాగింది. వెంటనే అతడు డ్రైవర్‌తో కారును వెనక్కి తిప్పమన్నాడు.

"సుఖేందర్ రెడ్డికింకా భూమ్మీద నూకలు మిగిలినయ్... గందుకే ఆయనకు వెనక్కి వెళ్ళిపోవాల్నన్న బుద్ధి పుట్టింది" అని ఒకరు...

"ఆయన్ను ఫాలో అయినోళ్ళకు ఆయన కారు బయల్దేరిందే తెలుసు తప్ప వెనక్కి తిరిగింది తెల్వలేదట" అని ఒకరు...

"ఈసారెట్లనో బతికి పోయిండుగని మల్లోసారి బతుకుతడంటవా? వాళ్ళతన్ని లేపేనుడు ఖాయం" అని ఒకరు...

"లేపెస్తమని వాళ్ళు బాజాపై చెప్పుతనే ఉండిరి. అండ్ల డౌటేమున్నది" అని ఒకరు...

"యే అమెరికాకో పోతె బతుకుతడు గావొచ్చు"

"అమెరికాకు పోడటగద! బతికినా ఇక్కన్నే... చచ్చినా ఇక్కన్నే అంటున్నడట కదా..."

"గట్లనే అంటరు. పాణం మీద ఆశ లేందెవనికి"

"పొరపాటయ్యింది... క్షమించ మంటె చచ్చినోళ్ళు బతికొస్తరా? వొట్టి పుణ్యానికి ఐదుగురు ఖతమైపోయిరి. వాండ్ల పెండ్లాం, పిల్లలు ఎంతేడుస్తున్నరో. పోయినోళ్ళు పోయింద్రుగని ఉన్నోళ్ళు మాత్రం నరకం అనుభవిస్తున్నరు"

"వాళ్ళేమన్న ఈ పొరపాటు కావాల్నని చేసింద్రా? కమ్యూనికేషన్ గ్యాప్‌వల్ల గిట్ల జరిగింది... ఇట్లాటి ఉద్యమంల ఇట్లాటి పొరపాట్లు జరుగుతనే ఉంటయి"

"గా చచ్చిపోయిన శేషయ్యకు మారుతీరావంటే దేవునితో సమానమట. ఆయన ఇద్దరు కొడుకులకూ ఆయనే నౌకర్లిప్పిచ్చిండట... పైనలియ్యబోతే తీసుకోలేదట..."

"తీసుకోకపోవుడుగాదు. ఇచ్చిన పైసలు వాపసుజేసిండట? నేనేంజెయ్యలేదు. మీవోని తెలివితేటలతోటే అతనికీ నౌకరొచ్చింది. నీ పైసలు నువ్వు తీసుకోమని అక్షరాలా ఇరవై ఐదువేలు శేషయ్య చేతులబెట్టి పోయిండట. గీ రోజులల్ల గంత నీయతున్నోడున్నడు?"

"ఎవ్వడు లేడు. ఎంత దొరికితే అంత తిందామనుకునేటోడేగని చేతిలబడ్డ పైసల్ని తిరిగిచ్చేటోడెవడుండడు"

"గీ ముత్యంరావు నిజంగనే ఎవ్వరి దగ్గర పైసలు తీసుకోడంటరు. నిజమేనా? పైసలు దీసుకోకుంట రాజకీయమెట్లజేసున్నడంటవు?"

"ఎక్కన్నో తీసుకునే దగ్గర తీసుకుంటడు గావచ్చుగని మనసుంటి పేదోళ్ళ దగ్గర, మధ్యతగతోళ్ళ దగ్గర అస్సలు తీసుకోడు. సింహం కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొడుతుందట. గట్లనే ముత్యంరావు కొట్టటోన్నే కొడ్తడుగని అవకారం చెయ్యడు. అందుకే ఈ ఏరియా ప్రజలాయన్ను పూజిస్తరు. గిదే ఆయన్ను మూడుసార్లు గెలిపించింది"

"గీ ముత్యంరావు సుఖేందర్ రెడ్డికి చాలా దగ్గరోడుగదా! క్రాంతికారులు గీయన్నుకూడ యేమన్న చెయ్యరుకదా"

"గవాళ్ళు సాధారణంగ గిట్లాటిమంచోళ్ళ నేంజెయ్యరు"

ఇట్లా హకీంపేట నియోజకవర్గానికి చెందిన ప్రజలు చాలా రోజులదాకా ఈ సంఘటనను గుర్చి రకరకాలుగా చర్చించుకున్నారు. జరిగిన దాన్ని త్వరగానే మరచిపోయి జరగబోయేదాన్ని గుర్చి రకరకాల ఊహాగానాలు చేశారు. త్వరగానే ఎవరి పనుల్లో వాళ్ళు పడిపోయి ఈ విషయాన్ని మరచిపోయారు.

## 11

క్రాంతికారులు పొరపాటున ఐదుగురు అమాయకుల్ని చంపితే ఆ ఏరియాను రక్షించ వలసిన రక్షకభటులు ఎక్కన్నించో నల్గురు యువకుల్ని పట్టుకొచ్చి హకీంపేటకు దగ్గరుండే అడవుల్లోకి తీసికెళ్ళి, కాల్చేసి ఎన్‌కౌంటర్లో నల్గురు క్రాంతికారులు నేలకొరిగారని ప్రకటించారు. ఆ నల్గురు యువకులు ఎవరో, ఎక్కడివాళ్ళో ఎవరికీ తెలీదు. వాళ్ళ శవాల్ని రక్షకభటులే దహనం చేశారు.

"గిట్లయితదని నాకెరుకే. వాళ్ళు ఎందర్ని లేపేస్తే వీళ్ళందర్ని లేపెస్తరు. త్రిలింగద్వీపంల ఉన్నోళ్ళందరు చచ్చేదాక గిట్ల చంపుకుంటనే ఉంటరు" అన్నాడు హకీంపేట హైస్కూలు హెడ్మాస్టర్ రాధాకృష్ణ.

"మీరేమన్న చెప్పుండ్రిగని గీ రక్షకభటులు కూడ బొత్తిగ బరితెగించిపోయింద్రు. పల్లెలల్ల ఇరవయ్యేళ్ళ పోరగాడు ఎవ్వరు కనబడ్తే వాన్ని కాల్చిపారేసి ఎన్‌కౌంటర్ల చచ్చిండని ప్రకటిస్తున్నరు. పౌరహక్కులోల్లు ఎంత లొల్లిజేస్తేంది. వాళ్ళేమన్న బూటకపు ఎన్‌కౌంటర్లు చెయ్యకుంట ఊరుకుంటున్నరా?" అన్నాడు అదే స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న శివకుమార్.

వాళ్ళిద్దరూ ఆ స్కూల్లో హెడ్‌మాస్టర్ రూంలో కూర్చొని మాట్లాడుకుంటున్నారు.

"గట్లాటి పరిస్థితి ఎందుకొచ్చిందంటవ్? వాళ్ళు మాత్రం బరితెగించిపోలేదా? వాడు చంపుతున్నడు కాబట్టి నేను చంపుతున్న అంటున్నడు. గవర్నమెంటోడు కూడ పోలీసోళ్ళకు ఫుల్‌పవర్స్ ఇచ్చేసిండు. చట్టం లేదు. మట్టిలేదు. నువ్వెంతమందినన్న చంపు... వాళ్ళను లేకుంట చేస్తె చాలు అంటున్నడు. గీ క్రాంతికారులు బెల్లెట్‌ను వదిలిపెట్టి బాలట్‌కెందుకు రారో నాకు సమఝయితలేదు. వాళ్ళు ఎన్నికలల్ల నిల్చుంటే జనం భయానికో, భక్తికో వాళ్ళకే ఓట్లేస్తరు. వాళ్ళే గెలుస్తరు. ఎలక్షన్లల్ల గెలిచి నువ్వే సర్కారుబెట్టు. నువ్వే హుకూమత్ జెయ్యి. పేదోళ్ళను బాగుచెయ్యి. అన్యాయాలు, అక్రమాలు జరక్కుంట చూడు. నీతి నిజాయితీని నిలబెట్టు. యేదన్న జేస్తే గట్ల చెయ్యాలెగని గీ కాల్చుకునుడుతోటేమైతది? నువ్వొకన్ని కాలిస్తే వాడిద్దర్ని కాలుస్తుండె. గవర్నమెంట్ వాని చేతులుండె. రాజ్యం వాని చేతులుండె. రాజ్యమంటేంది? రాజ్యం చేతులున్నప్పుడు ఎంత బలముంటది? ఎన్ని ఆయుధాలుంటయి? ఎంత ధనముంటది? గన్ని ఆయుధాలు, గంత ధనం నీ దగ్గరున్నయా? రాజ్యంతోటి నువ్వెట్లు గెలుస్తననుకుంటున్నవు. ప్రజారాజ్యం ఎట్ల స్థాపిస్తననుకుంటున్నవు? ప్రపంచం చాలా మారిపోతాంది. వెనకటి రోజులు పోయినయి..." అన్నాడు రాధాకృష్ణ.

"మీరనేది నిజమే కావొచ్చుగని ప్రజలే కదిలిన్రంటె యే ఆయుధాలు వాళ్ళముందు పనిచెయ్యయి" అన్నాడు శివకుమార్.

"మరి ప్రజలు కదులుతున్నరా? ఎవ్వని ప్రపంచంల వాడున్నడు. ఎవ్వని పనిల వాడున్నడు. ఎట్లనన్న జేసి నాల్గు రాళ్ళు సంపాయించుకుంటె చాలు... ఎవరెక్కడబోతే నాకేంది అన్నది ఇవ్వాళ్ళ ప్రతివాడి ఆలోచనా ధోరణి. సర్కారోడు కూడ ఎప్పటికప్పుడు పేదోళ్ళకేదో మేలు చేస్తున్నట్టు భ్రమలు కల్పిస్తున్నడు. మనసుంటి ఉద్యోగస్తులకు డి.ఏ.లు పెంచి, స్కేళ్ళు పెంచి తృప్తిపరుస్తున్నరు. ఇక బడా ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులైతే అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ఖర్చుపెడ్తున్న డబ్బంతా తినేస్తున్నరు. ఈ పరిస్థితులల్ల రాజ్యంతోటి పోట్లాడ్తనని కదిలేటోడెవ్వడు. విప్లవం కోసం దీర్ఘకాలిక పోరాటం నడిపే ఓపిక ఎవనికున్నది? ఇవ్వాళ్ళ ప్రతొక్కనికి క్విక్ రిజల్ట్సు కావాలె. ఎప్పుడో విప్లవం వస్తదని ఇప్పుడు త్యాగాలు చెయ్యమంటె చేసేటోడెవ్వడు? ఎనకటి రోజుల్లనయితే అట్లాటి త్యాగాలు చేసింద్రు. ఇప్పుడెవడు చేస్తడు. యువతరాన్ని కేబుల్ టీవీల మత్తులోనూ, కంప్యూటర్ల మోజు లోనూ పడేస్తిమి. ఇవ్వాళ్ళ సమాజంలోని ప్రతొక్కడు వాని ఆర్థిక పరిస్థితి కొంచెం మెరుగవ గానే ఉన్నతవర్గాల జీవనశైలినే అనుకరిస్తున్నడు. టీవీ కొంటున్నడు. ఫ్రిజ్ కొంటున్నడు. కూలర్లు కొంటున్నడు. టూవీలర్లు కొంటున్నడు. కన్జ్యూమిరిజమ్‌ను అలవరచుకొని ఎవని ప్రపంచంల వాడుంటున్నడు. ఇవ్వాళ్ళ సమాజం గురించి ఆలోచించేదెవడు?" అన్నాడు రాధాకృష్ణ

"ఈ టీ.వీ. ఛానల్లు, ఈ కంప్యూటరీకరణలు అంతా అమెరికావాడి కుట్ర. రాజకీయ సామ్రాజ్యవాదం పోయి సాంస్కృతిక సామ్రాజ్యవాదం వస్తాంది. ఇది మరీ ప్రమాదకరం... తరతరాల మన ఆచార వ్యవహారాలూ, సాంప్రదాయాలు, కళలూ, సాహిత్యం... అన్నీ మంటగలిసిపోయే టట్టున్నయి..." అన్నాడు శివకుమార్.

"నిజమే. కని అమెరికా సామ్రాజ్యవాదం, అమెరికా సాంస్కృతిక దాడి అని గొంతు చించుకొని అరిచినోళ్ళందరు ఇప్పుడేం చేస్తున్నరో చూడు. తమ కొడుకుల్నీ, బిడ్డల్నీ అమెరికాకు పంపిస్తున్నరు. దాన్నేమంటవు? అమెరికా వాడి డబ్బుకావాలె... నీ పిల్లలు అక్కడికిబోయి నీకు డాలర్లు పంపియ్యాలె. కని వాని సంస్కృతి పంపియ్యొద్దంటవు. డాలర్లతోపాటు వాని సంస్కృతి కూడ వస్తది. అదో స్టేటస్ సింబల్‌గా కూడ మార్తది. డబ్బుకు, అధికారానికి దాసోహం అనడానికి మన వాళ్ళెప్పుడూ సిద్ధంగా ఉంటరు. మన వాళ్ళు చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండదు. మన వాళ్ళంత హిపోక్రాట్స్ ప్రపంచంలో ఎక్కడా ఉండరు. ఒకప్పుడు అమెరికా సామ్రాజ్యవాదమని ఇల్లెక్కి గొంతు చించుకున్న వాళ్ళంతా ఇవ్వాళ్ళ తమ పిల్లల్ని డాలర్లు దండుకురండని అమెరికాకు పంపిస్తుంటే ఇంకెక్కడి సామ్యవాదం? ఇంకెక్కడి విప్లవం? ఈ మార్పులే కాదు... ఇంకెన్నో మార్పులు జరుగుతున్నయి. భూస్వామ్య వ్యవస్థ పతనమైపోతాంది. వ్యవసాయం మీద ఆధారపడేటోళ్ళ సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతాంది. వ్యవసాయ యాంత్రీకరణ పెరిగిపోతాంది. సర్వీసు సెక్టర్ మీద ఆధారపడేటోళ్ళ సంఖ్య

> ఇలా ఉండగా ఓ రోజు ఓ ఇద్దరు గుర్తుతెలీని వ్యక్తులు చడీచప్పుడు లేకుండా ఆ రాజకీయ దిగ్గజం ఇంట్లో ప్రవేశించి ఆ దిగ్గజాన్ని కాల్చేసి ఎలా వచ్చారో అలాగే వెళ్ళిపోయారు.



**జరిగినకథ :** పోలీస్ అధికారి జితేందర్‌రెడ్డిని రైల్వే స్టేషన్లో ఓ అజ్ఞాత వ్యక్తి కాల్చి చంపుతాడు. ఓ వైపు శవయాత్ర జరుగుతుండగా మరోవైపు ప్రజాబంధుగా పేరుబడ్డ డాక్టర్ రఘువీర్ క్లినిక్‌లోకి ఇద్దరు ఆఘంతకులు చొరబడి ఆయనపై గుళ్ళు కురిపిస్తారు. రఘువీర్ మరణిస్తాడు. ఈ హత్యపై యూనివర్సిటీలో పెద్ద చర్చ జరుగుతుంది. మరోవైపు రావులపల్లి అనే గ్రామంలో పంచాయితీ బోర్డుకు ఎన్నికలు దగ్గరపడతాయి. వీరస్వామి, మురహరిరావుల మధ్య పోటీ తీవ్రంగా వుంటుంది. వీరస్వామి అంచనాలను తలకిందలు చేస్తూ మురహరిరావు ఎన్నికల్లో గెలిచి సర్పంచ్ అవుతాడు. వీరస్వామి వెళ్లి క్రాంతికారుల్లో కలుస్తాడు. దళనాయకుడై వచ్చి మురహరిరావుని ప్రజాద్రోహిగా ప్రకటించి బెదిరిస్తాడు. కొన్నాళ్ళకు మురహరిరావు హత్య జరుగుతుంది. అనంతారం గ్రామ సర్పంచ్ ముత్యంరావును కూడా క్రాంతికారులు హత మారుస్తారు. సీతంపేట దేశ్‌ముఖ్ కరుణాకరరావు దగ్గర శేర్‌దార్‌గా పనిచేసే వెంకటాద్రి, దేశ్‌ముఖ్ పొలంలో పిడకలు దొంగిలించిందని లచ్చయ్య భార్య ముత్తమ్మకి 50 దెబ్బల శిక్ష విధించాడు. తల్లికి జరిగిన అవమానం చూసి యాదయ్య లోలోపల రగిలిపోతాడు. యాదయ్య తమ్ముడితోసహా క్రాంతికారులతో కలిసిపోయాడు. వెంకటాద్రిని ఎవరో హత్య చేశారు. బెదిరింపులు కారణంగా కరుణాకరరావు పట్టణానికి మకాం మార్చాడు. వీరాస్వామి ఎన్‌కౌంటర్ తరువాత ఊరికి తరచుగా వచ్చి పోతున్నాడు. కరుణాకరరావు దారుణంగా హతుడవుతాడు. ఆ తర్వాత ఇద్దరు యువకుల ఎన్‌కౌంటర్లు జరుగుతాయి. సుఖేందర్‌రెడ్డి కారుగా పొరబడి నలుగురు యువకులు ఒక అంబాసిడర్ కారుపై కాల్పులు జరుపుతారు. ఆ కారులోని నలుగురు వ్యక్తులు చనిపోతారు. తిమ్మాపురం భూస్వామి శేషయ్య, ఆయన కొడుకులు రవీందర్, నరేందర్, మరో ఇద్దరు ఎమ్మెల్యే మారుతీరావు కూతురి పెళ్ళి కోసం ఆ కారులో వస్తుంటారు.

పెరిగిపోతాంది. ఏదో ఉద్యోగం సంపాదించుకున్న ప్రతివాడు కన్సూమరిజమ్‌లో పడిపోతున్నడు. ఫ్యాక్టరీలన్నీ మూతబడిపోయే పరిస్థితులొస్తున్నయి. సోషలిజమ్‌కు సింబల్స్‌గా చెప్పబడిన పబ్లిక్ సెక్టర్ యూనిట్లన్నీ దివాలా తీస్తున్నయి. ఇవ్వాళో రేపో ఇవన్నీ మూతబడిపోవడమో, ప్రైవేటోనికి అప్పజెప్పడమో జరుగుతది. ఇట్లాటి పరిస్థితులల్ల విప్లవం ఎవనిక్కావాలె... సోషలిజమ్ ఎవనిక్కావాలె?" అన్నాడు రాధాకృష్ణ.

"మానవుడు ఆశాజీవి. అందులో సామ్యవాది అయినవాడు ఇంకా ఆశాజీవి. ఇప్పుడు కాకాపోయినా ఇంకో పదేళ్ళకో, వందేళ్ళకో, రెండు వందల ఏళ్ళకో విప్లవం వచ్చి తీరుతుందనీ, పెట్టుబడిదారి వ్యవస్థలోనే దాని వినాశనానికి దారితీసే బీజాలు నాటబడ్డయనీ సామ్యవాది అయినవాడు నమ్ముతడు. కాబట్టి ఈ యుద్ధం ఇలా కొనసాగక తప్పదు" అన్నాడు శివకుమార్.

వాళ్ళలా చాలా సేపటిదాకా మాట్లాడుకుంటూనే ఉండిపోయారు. వీళ్ళిద్దరే కాదు... త్రిలింగ ద్వీపంలో ఉన్న అనేకమంది అనేకచోట్ల ఈ విషయాలను గూర్చి ఎవరికి తోచినట్టుగా వాళ్ళు చర్చించుకుంటూనే ఉన్నారు. మరోవైపు యుద్ధరంగంలో ఇరువక్షాలకు చెందిన అనేకమంది నేలకొరుగుతూనే ఉన్నారు.

మరో ఆరునెలలు గడిచిపోయాయి.

ఈ ఆరునెలల్లోనూ అడపాదడపా కొన్ని సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

ఆ తర్వాత మరో ఆరు నెలలు గడిచిపోయాయి. ఈ ఆరునెలల్లో పెద్ద సంఘటనలంటూ ఏమీ జరగలేదు. దాంతో క్రాంతికారుల ఉద్యమం బలహీనపడిందని రక్షకభటులు ప్రకటించారు.

* * *

ఆయన ఒకప్పుడు చాలా పెద్ద నాయకుడు.

ఆ రోజుల్లో త్రిలింగద్వీపమంతా ఆయన చెప్పుచేతల్లో ఉందని చెప్పుకునేవాళ్ళు.

"రాజ్యమే నేను. నేనే రాజ్యం" అన్నంతగా ఎదిగిపోయాడట ఆయన. ఆయన పేరు రామకృష్ణారావు.

కానీ ఇప్పుడాయన బక్కచిక్కిపోయాడు. వృద్ధాప్యం మీదపడటంతో ఆయనకు ఎక్కడికీ కదలలేని పరిస్థితి ఏర్పడింది. యువతరానికి చెందిన చాలామంది నాయకులు రంగం మీదికొచ్చారు. అతన్ని ముసలాడు... ముతకవాడు... కాలం చెల్లినవాడు అని అసహ్యించుకోవడం మొదలెట్టారు. ఒకప్పుడాయన తీక్షణంగా చూస్తే చాలు ఎదుటివాడు భస్మమైపోయేవాడు. కానీ ఇప్పుడతడెంత తీవ్రంగా, తీక్షణంగా చూసినా ఎదుటివాడికేమీ కావడం లేదు. దాంతో ఆయన రాజకీయాల్లోంచి విరమించుకుంటున్నట్టుగా ప్రకటించాడు. ఇంటి దగ్గరే కూర్చొని "కృష్ణా! రామా!" అనుకుంటూ విశ్రాంతి తీసుకోదల్చుకున్నానని చెప్పాడు. కానీ అతని మాటల్ని ఎవరూ నమ్మలేదు. "పెద్ద పులి శాఖాహారిగా మారడం అసంభవం" అన్నారు.

కానీ అతడు నిజంగానే రాజకీయ సన్యాసం స్వీకరించి ఇంటివద్దనే ఉండిపోయి "విశ్రాంతి" తీసుకోవడం మొదలెట్టటంతో అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. ఓ మేరుపర్వతం నేలకొరిగిందన్నారు. ఓ రాజకీయ దిగ్గజం నేలకూలిందన్నారు. నిప్పులు చెరిగిన ఓ సూర్యుడు చల్లబడ్డాడన్నారు. కొద్ది రోజుల్లోనే అందరూ ఆ రాజకీయ మేరుపర్వతాన్ని మరచిపోయారు.

చింత చచ్చినా పులుపు చావదు కదా! ఆయన ఇంట్లోనే కూర్చున్నా ఆయన దగ్గరకు ఎవరో ఒకరు రావడం జరుగుతూనే ఉంది. ఆయన కొన్ని చిన్న చిన్న పైరవీలు చేస్తూనే ఉన్నాడు. ఒకప్పుడు ఆయనకెంతో దగ్గరగా ఉండే ఆయన శిష్యుడే ఇప్పుడు త్రిలింగ ద్వీపాన్ని పాలించడం మొదలెట్టాడు. దాంతో రావుగారు తన దగ్గరకొచ్చిన వాళ్ళల్లో చాలా మందిని తన శిష్యుడి దగ్గరకు పంపించడం మొదలెట్టాడు. యేదో ముసలాడు... నాల్గురాళ్ళు సంపాదించుకోనీయ్‌లే అనుకొని రావుగారి శిష్యుడు రావుగారు పంపించిన మనుషుల పనులు జరిగే ఏర్పాటు చేశాడు. అలా కూలిపోయిందనుకున్న మేరుపర్వతం మళ్ళీ లేచి నిల్చుంది.

ఇలా ఉండగా ఓ రోజు ఓ ఇద్దరు గుర్తుతెలీని వ్యక్తులు చడీచప్పుడు లేకుండా ఆ రాజకీయ దిగ్గజం ఇంట్లో ప్రవేశించి ఆ దిగ్గజాన్ని కాల్చేసి ఎలా వచ్చారో అలాగే వెళ్ళిపోయారు.

ఈ పని చేసింది ఎవరై ఉంటారా అని చాలా మంది ఊహించడం మొదలెట్టారు. క్రాంతికారులే అయ్యుంటారని అనుకున్నారు. రక్షకభటులు కూడా ఈ పని చేసింది క్రాంతికారులేనని ప్రకటించారు. రాజకీయ సన్యాసం చేసి ఇంట్లో కూర్చున్న ఓ వృద్ధున్ని చంపడం ఏం న్యాయం అన్నారు.

"ఇది చాలా హేయమైన చర్య. యే రక్షణా లేని ఓ రాజకీయ కురువృద్ధున్ని, అకలంక దేశభక్తున్ని, స్వాతంత్ర్య సమరయోధున్ని హతమార్చడం పిరికివాళ్ళ చర్య. కేవలం తమ ఉనికిని చాటుకోవడానికే వాళ్ళీ పని చేశారు" అన్నాడు త్రిలింగద్వీపాన్ని పరిపాలిస్తున్న పాలకుడు.

"యే రక్షణాలేని ఓ ముసలాడ్ని చంపడం అన్యాయం, అక్రమం" అరిచాడు సుఖేందర్ రెడ్డి.

"ఆయన శిష్యుడికి మనస్తాపం కల్గించడం కోసమే వాళ్ళీ పని చేశార"న్నారు కొందరు.

"ఉండి ఉండి వీళ్ళీ ముసలాడ్ని ఎందుకు చంపినట్టో?" ఆశ్చర్యపడ్డారు చాలా మంది మేధావులు.

పౌరహక్కుల సంఘమంటే అందరికీ సంబంధించిందే - దాంట్లో అన్ని పార్టీల వాళ్ళుంటారు - మేధావులు.



"ఇంకేం? వాళ్ళొకన్ని లేపేశారుగా... వీళ్ళొకన్ని లేపేస్తారు" అన్నారు సామాన్య ప్రజలు. చంపబడ్డ వాడు త్రిలింగద్వీపాన్ని పాలిస్తున్న పాలకుడికి చాలా దగ్గరివాడు కాబట్టి దీని పర్యవసానాలు చాలా తీవ్రంగానే ఉంటాయేమోనన్న ఆందోళనను ప్రకటించారు కొందరు.

* * *

రాఘవరెడ్డికి డెబ్బై ఏళ్ళుంటాయి.

అతడో మధ్యతరగతి రైతు.

వెనకటి రోజుల్లోనే మెట్రిక్‌లేషన్ దాకా చదివాడు. ఆ రోజుల్లో ఆ చుట్టుపక్క ప్రాంతాల్లో అంత చదువు చదివిన వాళ్ళెవరూ లేరు. ఆయన ఉర్దూ ధారాళంగా మాట్లాడేవాడు. త్రిలింగ ద్వీపాన్ని ముస్లిం రాజులు పాలిస్తున్న రోజుల్లో రాఘవరెడ్డి అలా ఉర్దూ మంచినీళ్ళ ప్రాయంగా మాట్లాడగల్గడం వల్ల అతన్నా చుట్టుపక్కల ఊళ్ళవాళ్ళు ఎంతో గౌరవించేవాళ్ళు. ఏ పెద్ద ఆఫీసర్ ఊర్లోకొచ్చినా అతనితో మాట్లాడటానికి రాఘవరెడ్డినే తీసికెళ్ళేవాళ్ళు.

చిన్నప్పట్నించే రాఘవరెడ్డిలో యేదన్నా మంచిపని చేసి నల్గురికి తోడ్పడాలన్న ఉత్సాహం ఉరకలు వేస్తుండేది. నలభైలలో ఆంధ్రమహాసభ పేరు వినగానే ఆయన దాంట్లో చేరిపోయాడు. అది రెండుగా చీలిపోయినప్పుడు ఆయన అతివాదులలో చేరిపోయాడు. దర్జాలకూ, దేశ్‌ముఖ్‌లకూ వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. తర్వాత రజాకార్ల బారి నుండి ఎన్నో ఊర్ల ప్రజల్ని కాపాడటంలో ప్రముఖ పాత్ర వహించాడు. ఆ తర్వాత ప్రారంభమైన రజాకార్లను మట్టుబెట్టాడు. సామ్యవాదులు యాభైలలో సాయుధపోరాటాన్ని విరమించుకున్నాక సామ్యవాదపార్టీ తరపున ఎన్నికల్లో పోటీచేసి ఎం.ఎల్.ఏ.గా గెల్చాడు. ఐదేళ్ళుగా ఎం.ఎల్.ఏ.గా ఉంటూ "చాలా మంచి ఎం.ఎల్.ఏ." అన్న పేరు తెచ్చుకున్నాడు. కానీ ఆ తర్వాత జరిగిన రెండో సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం ఓడిపోయాడు. అయినా ఆయన రాజకీయాల నుండి విరమించుకోలేదు. అరవైలో సామ్యవాద పార్టీ రెండుగా చీలిపోయినప్పుడు కాబట్టి ఆయన రెండో సామ్యవాద పార్టీలో చేరిపోయాడు.

కొంతకాలం ఆయన పార్టీలో ఉత్సాహంగానే పనిచేశాడు. కానీ క్రమంగా పార్టీ ఆయన్ను పట్టించుకోవడం మానేసింది. ఆయనలో కూడా రాజకీయాలంటేనే ఒకరకమైన ఔదాసీన్యం ఏర్పడింది. ఆయనకు ఈ పార్లమెంటరీ పంథాను స్వీకరించడమే సామ్యవాద పార్టీలు చేసిన పెద్ద పొరపాటనీ, ఈ పార్లమెంటరీ పంథా ద్వారా మనం సాధించగల్గేదేమీ లేదని అనిపించడం మొదలైంది. ఆయనకు త్రిలింగద్వీపమొక పెద్ద రోగిలా కనిపించింది. చాలా తీవ్రమైన శస్త్రచికిత్స ద్వారా తప్ప ఈ రోగిని బాగుచెయ్యలేమనిపించింది.

అతని కుటుంబజీవనంలో కూడా చాలా మార్పులొచ్చాయి. అతని ఇద్దరి కొడుకుల్నీ ఇంజినీరింగ్ చదివించాడు. వాళ్ళకు పెద్ద ఉద్యోగాలే దొరికాయి. తర్వాత వాళ్ళ పెళ్ళిళ్ళు చేశాడు. ఆ తర్వాత వాళ్ళిద్దరూ తండ్రి ప్రమేయం లేకుండానే అమెరికాలో ఉద్యోగాలు సంపాదించి అమెరికా వెళ్లిపోయారు. తన కొడుకులిద్దరూ అమెరికాకు వెళ్ళిపోవడం దిగ్భ్రాంతిని కల్గించింది. అమెరికా అంటేనే రాఘవరెడ్డి మండిపడేవాడు. ఆయనకు అమెరికా మూర్తీభవించిన సామ్రాజ్యవాదంలా కనిపించేది. ఆ సామ్రాజ్యవాద దేశాన్ని అంతం చెయ్యడమే ఒకప్పుడు అతని జీవిత లక్ష్యం అనుకునేవాడు. అట్లాంటిది తను కనీ పెంచి, పెద్ద చేసి విద్యా బుద్ధులు చెప్పించిన తన ఇద్దరు కొడుకులు అమెరికాలోని ధనంతోనూ, విలాసజీవితంలోనూ ఆకర్షితులై ఆ కరుడుగట్టిన సామ్రాజ్యవాద దేశానికి వెళ్ళిపోవడం అతని హృదయాన్ని కలచివేసింది. ఆ వాస్తవాన్నతడు జీర్ణించు కోవడానికి చాలాకాలం పట్టింది. తన కొడుకుల్లాగే అనేక మంది ఇతర సామ్యవాద నాయకుల కొడుకులు కూడా అమెరికాకు వెళ్ళిపోయి అక్కడే స్థిరపడిపోవడం అతన్ని అమితంగా ఆశ్చర్యపరచింది.

కొడుకులిద్దరూ అమెరికాకు వెళ్లిపోయాక వాళ్ళ చదువుల కోసం అమ్మగా మిగిలిన భూమిని కూడా అమ్మేసి వాళ్ళూరికి దగ్గరగా ఉండే కరీమాబాద్ టౌన్‌లో ఓ ఇల్లు కొనుక్కుని అక్కడే తన శేషజీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నాడు - అతనికి ఇద్దరు కొడుకులే తప్ప కూతుళ్ళు లేరు.

ఇంట్లో అతడూ, అతని భార్య తప్ప మరెవరూ ఉండేవారుకాదు. నిండు యౌవనంలో ఉన్నప్పుడు ఆయన తన భార్యతో పట్టుమని పదిరోజులు కూడా ఎన్నడూ గడపలేదు. పోరాటంలోనే అతని యౌవనం అంతా గడిచిపోయింది. ఎప్పుడో యే అర్ధరాత్రో యేమారు వేషంలోనో వచ్చి భార్యతో కొన్ని క్షణాలు మాత్రమే గడిపివెళ్ళే వాడు. ఆ తర్వాత కూడా ఆయన తన భార్యకు న్యాయం చెయ్యలేదు. ఎన్నికల్లో పోటీచేయ్యడం, ఎం.ఎల్.ఏ.గా ఎన్నికకావడం, ఎప్పుడూ వచ్చేవాళ్ళు, వెళ్ళేవాళ్ళు... పార్టీ పనులు.... ఎంత వద్దనుకున్నా తప్పని పైరవీలు... ఇలా ఇంటిపట్టున ఎప్పుడూ ఉండేవాడుకాదు. ఇప్పుడిక రాజకీయాల్లోంచి విరమించుకున్నాడు కాబట్టి.... ఇప్పుడైనా భార్య, తనూ కలిసి ప్రశాంతంగా గడపాలని నిర్ణయించుకున్నాడు. అందుకే అతడు బయటి ప్రపంచంతో సంబంధాల్ని పూర్తిగా తెంచేసుకొని అతనికి నచ్చిన పుస్తకాలు చదువుకుంటూ, భార్యతో కబుర్లు చెప్పుకుంటూ ఇంటిపట్టున్నే ఉండటం మొదలెట్టాడు.

అలా ఓ సంవత్సరం గడిచాక ఓ రోజు వాళ్ళింటికి అతని చిరకాల మిత్రుడు పురుషోత్తం వచ్చాడు.

పురుషోత్తం, రాఘవరెడ్డి ఒకప్పుడు ప్రాణస్నేహితులు. పక్కపక్క ఊర్లే కాబట్టి వాళ్ళు చిన్నప్పట్నించే స్నేహితులయ్యారు. పురుషోత్తం ఏడోతరగతిదాకా చదివాడు. ఇద్దరు కలిసే ఆంధ్రమహాసభలో చేరారు. త్రిలింగద్వీప సాయుధపోరాటంలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇద్దరి మార్గాలు వేరయ్యాయి. పురుషోత్తం కురంగేయుల పార్టీలోనూ, రాఘవరెడ్డి సామ్యవాద పార్టీలోనూ చేరిపోయారు. మొదటిసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పురుషోత్తం కురంగీయుల పార్టీ నుండి ఎం.ఎల్.ఏ.గా పోటీ చేసి ఓడిపోయాడు. కానీ రెండో సార్వత్రిక ఎన్నికల్లో గెల్చాడు. మూడో సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయాడు. ఆ తర్వాత పార్టీ మార్చాడు. ఓ ప్రాంతీయ పార్టీని కూడా ఏర్పాటు చేశాడు. కొన్ని రోజుల తర్వాత ఆ పార్టీ మూతపడ్తే అతడు కూడా రాఘవరెడ్డి లాగే రాజకీయాల్లోంచి విరమించుకున్నాడు. అలాంటి పురుషోత్తం, ఇంతకాలం తర్వాత తనను వెతుక్కుంటూ రావడం రాఘవరెడ్డిని చాలా ఆశ్చర్యపరచింది. ఇతడెందుకొచ్చి ఉంటాడా? అనుకున్నాడు.

కుశల ప్రశ్నలయిపోయాక "నువ్విప్పుడు రాజకీయాల్లోంచి విరమించుకొని తీరికగానే ఉంటున్నవు గదా... ఊరికినే ఉంటే టైమెట్ల గడుస్తది? నువ్వు పౌరహక్కుల సంఘంల ఎందుకు చేరకూడదు?" అన్నాడు పురుషోత్తం.

వయసు మీద పడ్డది. ఇప్పుడన్నా ఇంటిపట్టున ఉందామనుకుంటున్న. నాకే పౌరహక్కుల సంఘాలూ అక్కర్లేదు - ఒకప్పుడు నేను లేకపోతే ఈ ప్రపంచం ఆగిపోతది - ఈ ప్రపంచం చెడిపోతది... ఈ ప్రపంచాన్ని బాగుచెయ్యడం నా బాధ్యత అనుకునెటోన్ని... ఇప్పుడు నాకు తెల్సిందేదంటే ఎవరు లేకపోయినా ఈ ప్రపంచం ఆగిపోదు. యే ఒక్కడూ ఈ ప్రపంచాన్ని బాగుచెయ్యలేడు... ఎందరో మేధావులు, సంఘ సంస్కర్తలు, మత గురువులు, తత్వవేత్తలు ఈ ప్రపంచాన్ని మార్చాలని, బాగుచెయ్యాలని తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఈ ప్రపంచం ఏం మారింది? మనుషులేం మారారు? మనిషిలోని స్వార్థం చచ్చిందా? మనిషిలోని పగ, ద్వేషం, ఈర్ష్య, విధ్వంసకాంక్ష చచ్చినయా? ఎన్నో ఉద్యమాలొచ్చినయ్... విప్లవాలొచ్చినయ్.. వ్యవస్థలు మారినయి... కని మనిషి మారిండా? కాబట్టి నాకు మళ్ళీ రాజకీయాల్లోకిగానీ, ఇతర సంస్థల్లోకిగానీ రావాలని లేదు. పుట్టినవాడికి చావు తప్పదని తెలుసు. అందుకే ఆ చావుకోసం ఎదురుచూస్తూ కొంతకాలం ప్రశాంతంగా గడపదల్చుకున్న... ఎందరో యువకులు, ఉత్సాహవంతులు చాలా మందే ఉన్నరుగదా! యువకుల్లోనే యేదన్న చేసి ఈ ప్రపంచాన్ని ఉద్ధరించాలన్న ఉత్సాహం ఉంటది. వాళ్ళకవకాశం యివ్వండ్రి" అన్నాడు రాఘవరెడ్డి.

"పనంత వాళ్ళే జేస్తరు, మనలాంటి అనుభవజ్ఞులు వాళ్ళకు కొంచెం దారి చూపెట్టాలె. అందుకే నిన్ను ఈ

మనస్తత్వ విశ్లేషణలో ట్రెండ్‌కి నాంది పలికిన సుప్రసిద్ధకులం - మూడు దశాబ్దాల


విజయవిహారం పాతకాపీలు కావాలంటే, మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000) కాపీ ఒక్కటి రూ.10/-, రెండవ సంపుటి (మార్చి 2001 తర్వాత) కాపీ ఒక్కటి రూ.15/-

జిల్లా పౌరహక్కుల సంఘానికి అధ్యక్షున్ని చెయ్యాల్సని చాలా మంది అనుకుంటున్నారు. రేపు ఈ జిల్లా కమిటి పార్మమవుతున్నది. రాజధాని నుండి చాలా మంది స్టేట్ కమిటి వాళ్ళోస్తున్నారు. నువ్వా మీటింగ్‌కు రావాలె. నీకే సంగతి చెప్పాల్ననే నేను ఊరిచివర ఉన్న మీ యిల్లు వెతుక్కుంటొచ్చిన" అన్నాడు పురుషోత్తం.

"ఈ పౌరహక్కుల సంఘంల ఎవరుంటారు? దాని కథేందోజెప్పు" అన్నాడు రాఘవరెడ్డి.

"పౌరహక్కుల సంఘమంటే అందరికీ సంబంధించిందే - దాంట్లో అన్ని పార్టీల వాళ్లుంటారు - మేధావులు, సంఘసేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అడ్వొకేట్లు... అందరూ ఉంటరు. మన రాజ్యాంగం మన దేశం పౌరులకిచ్చిన పౌరహక్కుల్ని ప్రభుత్వం వారు కాల రాయకుండా చూస్తా, ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే ఈ సంఘం చేసే ముఖ్యమైన పని.... ఉదాహరణకు ఈ దేశ పౌరులకు జీవించే హక్కుంది. తమ అభిప్రాయాల్ని ప్రకటించే హక్కుంది. కానీ ప్రభుత్వం వారు తమకిష్టంలేని, తమ అధికారానికి ఆటంకం కల్గిస్తారనుకునేవాళ్ళను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేస్తున్నది. చట్టాన్ని కాపాడవలసిన రక్షక భటులే చట్టాన్ని కాలరాస్తున్నారు. అందుకే పోలీసోడు చట్టవ్యతిరేకమైన యే చర్యకు పాల్పడ్డా పౌరహక్కుల సంఘం వెంటనే జ్యం చేసుకుంటది. ఇవ్వాళ్ళ పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లలో ఎంతోమంది అమాయకుల్ని చంపుతున్నారు. అట్లాంటి హత్యల్ని పౌరహక్కుల సంఘాల వాళ్ళు వెంటనే ఖండిస్తరు. ఎన్‌క్వైయిరీ చేయించాలని డిమాండ్ చేస్తరు. నిజనిర్థారణ కమిటీలను నియమించి నిజాన్ని రాబడ్తరు. ఇవ్వాళ్ళ సమాజంలో చాలామంది పౌరహక్కుల సంఘాలవాళ్ళకు ఓ ప్రశ్న అడుగుతుంటరు. మీరు పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్లను గూర్చి వెంటనే స్పందిస్తరుగని అవతలివాళ్ళు చేసిన హత్యల్ని గూర్చి మాట్లాడరెందుకని అడుగుతారు. క్రాంతికారుల చేత చంపబడినవాళ్ళకు పౌరహక్కులు లేవా... వాళ్ళకు మాత్రం జీవించే హక్కులేదా అని అడుగుతారు. దానికి మా సమాధానం ఏమిటంటే చట్టాన్ని కాపాడవలసిన వాళ్ళే చట్టాన్ని తుంగలో తొక్కినప్పుడు మాత్రమే మేం జోక్యం చేసుకుంటం... అవతలి వాడు అమాయకుల్ని చంపినప్పుడు పోలీసుల ఆ హత్యలు చేసినవాళ్ళను పట్టుకోవాలె... చట్ట ప్రకారం వాళ్ళను శిక్షించాలె... పోలీసులున్నది ఈ పని చెయ్యటానికే కదా. చంపిన వాడెవడైనా సరే... వాన్ని పట్టుకొని శిక్షించాల్సిన బాధ్యత పోలీసుది... ఆ బాధ్యత పోలీసులదని పౌరహక్కుల సంఘాల వాళ్ళు చెప్పాల్సిన పనిలేదు.. చట్టాన్ని కాపాడవలసిన పోలీసులే చట్టాన్ని కాలరాసినప్పుడు పౌరహక్కుల సంఘాలవాళ్ళు జోక్యం చేసుకుంటరు. వేరే వాడు చట్టాన్ని ధిక్కరించనప్పుడు వాడిని పోలీసులు పట్టుకొని శిక్షించనీయండి. చట్టాన్ని తనపని తాను చేసుకొనీయుండ్రి. ఎవరొద్దంటున్నరు.. తప్పుచేసిన వాళ్ళను పట్టుకొని న్యాయస్థానాలకు అప్పగించడం వరకే పోలీసులపని. అంతేగని పోలీసు స్టేషన్లే న్యాయస్థానాలుగా మారితే ఎట్లా? పోలీసోడే న్యాయమూర్తి అయిపోతే ఇక న్యాయస్థానాలెందుకు? ఈ విషయం ప్రజలదృష్టికి తేవడం కోసమే పౌరహక్కుల సంఘం ఏర్పడింది. ఈ సంఘానికి యేరాజకీయ పార్టీతోనూ సంబంధంలేదు. ఇదో స్వచ్ఛంద సంస్థ. ఎవరైనా దీంట్లో చేరొచ్చు. మొదట్నించీ ప్రజాపోరాటాలతో ఎంతో సంబంధం వున్న నువ్వు మన జిల్లా సంఘానికి అధ్యక్షునివైతే బావుంటదని అందరం అనుకుంటున్నం!!" అన్నాడు పురుషోత్తం. అతని మాటలన్నీ జాగ్రత్తగా విన్న తర్వాత "నన్ను కొంచెం ఆలోచించుకోనియ్యి" అన్నాడు రాఘవరెడ్డి.

"ఆలోచించు.. రేపు నువ్వు ఈ ఊరి టౌన్‌హాల్లో జరుగుతున్న మీటింగ్‌కు వస్తవనే అనుకుంటున్న.. రేపు ఉదయం పదిగంటలకు మీటింగుంటది" అని చెప్పి పురుషోత్తం భోజనం చేసి వెళ్లిపోయాడు.

ఊరికినే ఇంట్లో కూర్చునే బదులు ఇలాంటి మంచి పనులు చేసే సంఘాలతో సంబంధం పెట్టుకుంటే బాగనే ఉంటుందేమో... అనుకున్నాడు రాఘవరెడ్డి... ఒక సారేమో ఇలాంటి సంఘాలెన్నొచ్చినా ఈ సమాజం ఏం మారుతుందన్న నిర్లప్తభావం... మరోసారేమో.. యేదన్నా చేద్దాం... మనవల్ల ఈ సమాజానికి యే కొంచెం మేలు జరిగినా మంచిదేకదా అన్న ఉత్సాహభావం. రాఘవరెడ్డి చాలా సేపు ఆలోచించి రేపటి సమావేశానికి వెళ్ళాలనే నిర్ణయించుకున్నాడు.

ఆ మర్నాడు ఆ ఊర్లో పెద్ద సభ జరిగింది.

ఆ ఊర్లో ఉండే చాలా మంది మేధావులు - ముఖ్యంగా అడ్వొకేట్లు, జర్నలిస్టులు, అధ్యాపకులు, రచయితలు, అనేక ప్రతి పక్ష రాజకీయ పార్టీల సభ్యులు హాజరయ్యారు.

దేశ రాజధాని నుండొచ్చిన నాయకులు పౌరహక్కులంటే ఏమిటో మన రాజ్యాంగం మనకిచ్చిన మౌలిక ప్రాథమిక హక్కుల్ని ఇవ్వాళ్ళ అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎలా తుంగలో తొక్కుతున్నదో, ఈ ప్రభుత్వాన్ని ఇలాగే వదిలేస్తే త్రిలిగ ద్వీపంలో పూర్వం జర్మనీలో హిట్లర్ 'ఫాసిజం' , 'నాజీజం' పేర్లతో సాగించిన భయంకరమైన దమనకాండలాంటి దమనకాండ జరుగుతుందని, అట్లాంటి నిర్దాక్షిణ్య, నిరంకుశ, నిర్లజ్జ ప్రభుత్వం ఏర్పడకుండా ఉండాలంటే ప్రజలు అప్రమత్తులై ఉండాలనీ, అనుక్షణం తమ హక్కులకోసం పోరాడాలనీ, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని వివరిస్తూ ధారాళంగా ప్రసంగించారు.

ఆ తర్వాత ఎన్నికలు జరిగాయి.

రాఘవరెడ్డిని ఆ జిల్లా పౌరహక్కుల సంఘఅధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎనుకున్నారు. తర్వాత ఉపాధ్యక్షునిగా పురుషోత్తంని కార్యదర్శిగా ప్రభంజన్ కుమార్ అనే యువ అడ్వొకేట్‌ను, సహాయకార్యదర్శిగా మన్‌మోహన్‌సింగ్ అనే లెక్చరర్‌నూ ఎన్నుకున్నారు.

కార్యదర్శిగా ఎన్నికైన ప్రభంజన్‌కుమారంటే నిజంగా ప్రభంజనమేనని ఆ ఊర్లో చాలామందికి తెలుసు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను గూర్చి, అక్రమాలను గూర్చి, ఉన్నావాడు లేనివాన్ని దోచుకోవడం గురించి ప్రభంజన్ కుమార్ చాలా ఆవేశపూరితమైన ఉపన్యాసాలిచ్చేవాడు. చాలా బలమైన శస్త్రచికిత్స జరిగితే తప్ప ఈ సమాజం బాగుపడదనీ. ఆ శస్త్ర చికిత్సంటే సాయుధవిప్లవమేననీ ప్రభంజన్ కుమార్ తన ఉపన్యాసాల్లో ఘోషించేవాడు. రాఘవరెడ్డి, ప్రభంజన్ కుమార్, అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకోవడం వల్ల అనుభవానికి ఆవేశం తోడైందని అందరూ సంతోషించారు.

ఇది జరిగిన మూడేళ్ళ దాకా ఆ పౌరహక్కుల సంఘం సాఫీగానే పనిచేసింది. ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగితే అక్కడ ప్రభంజన్‌కుమార్ ప్రత్యక్షమయ్యేవాడు. వెంటనే అదో బూటకపు ఎన్‌కౌంటర్ అని స్టేట్‌మెంటిచ్చేవారు. వెంటనే ఓ నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసి ఎన్‌కౌంటర్

## నవీన్‌కు రావిశాస్త్రి స్మారక పురస్కారం

ప్రసిద్ధ రచయిత నవీన్‌కు 'రావిశాస్త్రి స్మారక పురస్కారం 2000'ను ప్రదానం చేయనున్నట్లు 'రావిశాస్త్రి స్మారక సాహిత్య ట్రస్టు' ప్రకటించింది. హైద్రాబాద్‌లో జూలై 30న ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ అవార్డుకింద పదివేల రూపాయల నగదు, జ్ఞాపిక బహుకరిస్తారు. 1941 వరంగల్ జిల్లా వావిలాల గ్రామంలో జన్మించిన నవీన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పట్టబద్రుడై కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. 1969లో చైతన్య స్రవంతి ప్రక్రియలో రచించిన అంపశయ్య మనో వైజ్ఞానిక నవల ఒక సరికొత్త ఒరవడిని సృష్టించింది. నవీన్ ఇప్పటివరకూ 50 పైగా కథలు, 23 నవలలు, మరెన్నో సాహితీ వ్యాసాలు, నాటికలు రచించారు.

జరిగిన ప్రదేశానికి తీసికెళ్ళేవాడు. నిజనిర్ధారణ కమిటి జరిపిన పరిశోధనలో అది బూటకపు ఎన్‌కౌంటర్‌ని రుజువయ్యిందని ప్రకటించేవాడు.

రాఘరవరెడ్డి మాత్రం ఎక్కువుగా ఇంట్లోనే ఉంటుండేవాడు. ఎంతో ముఖ్యమైన సమావేశం జరిగినప్పుడో, ముఖ్యమైన ప్రెస్ కాన్ఫరెన్స్ జరిగినప్పుడో మాత్రమే వెళ్ళేవాడు. "పత్రికల్లో అన్నీ నీ స్టేట్‌మెంట్లే కనిపిస్తున్నయి... అధ్యక్షుల వారి స్టేట్‌మెంట్లు కనిపించడంలేదేమిట'ని ఎవరైనా అడిగితే "ఆయన పెద్ద మనిషైపోయిండు. ఆయన్ని ఇబ్బంది పెట్టడం దేనికని నేనే అన్ని పనులు చూసుకుంటున్నాన''ని ప్రభంజన్‌కుమార్ సమాధానం చెప్పేవాడు.

కొన్నిసార్లు రాఘవరెడ్డికి క్కూడా అనుమానం కల్గుతుండేది... ప్రభంజన్ కుమార్ తనను కావాలనే పక్కన పెడ్తున్నాడా అని .... చాలామంది అనుకుంటున్నట్లు ప్రభంజన్ కుమార్ క్రాంతికారుల మనిషేనేమో... తమను నామకార్థంగా మాత్రమే పెట్టుకున్నాడేమో... ఈ మాటే ఓ సారి పురుషోత్తంతో అంటే "నాక్కూడా అట్లనే అనిపిస్తాంది" అన్నాడు. "ఎవరో ఒకరు పని చెయ్యాలెగద... యువకుడూ... ఉత్సాహవంతుడు... పనిచేస్తున్నడు.. చెయ్యనీయ్.. మంచిదేకదా!" అనుకున్నారు వాళ్ళిద్దరు.

ఇలా ఉండగా....

పక్క జిల్లాలో రాజకీయాల్లోంచి విరమించుకున్న రామకృష్ణారావు లాంటి ఒకప్పటి మేరుపర్వతాన్ని, రాజకీయ దిగ్గజాన్ని ఎవరో గుర్తు తెలీనవ్యక్తులు హత్యచేశారని తెలుసుకున్న రాఘవరెడ్డి చాలా ఆశ్చర్య పడ్డాడు. "గిప్పుడు గాయన్ను చంపి వీళ్ళేం సాధించదల్చుకున్నరో నాకైతే సమఝ్‌కాలే" అన్నాడు రాఘవరెడ్డి - "నాకు మాత్రం సమఝ్‌యిందనుకున్నవా?" అన్నాడు పురుషోత్తం.

రామకృష్ణారావు హత్య జరిగిన మర్నాడే.. అర్ధరాత్రి దాటాక ఊరిచివర ఉన్న రాఘవరెడ్డి యింటి మీద ఎవరో గుర్తు తెలీనవ్యక్తులు దాడిచేసి రాఘవరెడ్డిని కాల్చేసి గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళిపోయారన్న వార్త తెల్లారేటప్పటికి ఊరంతా వ్యాపించింది.

"గుర్తు తెలీన వ్యక్తులు ఎవరో కాదు. పోలీసులే" అనుకున్నారు చాలామంది.

"ఇది మారువేషాల్లో వచ్చిన పోలీసులు చేసిన హత్య. దీనికి వాళ్ళు చాలా పెద్ద మూల్యాన్నే చెల్లించాల్సి ఉందని" అన్నాడు ప్రభంజన్‌కుమార్.

"ఎంత ఘోరం జరిగిపోయింద"ని నిట్టనిలువునా కూలిపోయాడు పురుషోత్తం.

"నన్నుకూడ తీసుకపోక ఆయన్నొక్కన్నే ఎందుకు తీసుకపోయినవు దేవుడో!" అని హృదయవిదారకంగా యేడుస్తూ రాఘవరెడ్డి భార్య సొమ్మసిల్లిపోయింది.

వెంటనే కరీమాబాద్ జిల్లాలో బంద్ జరిగింది.

అనేకచోట్ల హింసాత్మక సంఘటనలు జరిగాయి.

ఆర్.టీ.సి. బస్సుల మీద రాళ్ళు రువ్వారు. కొన్ని చోట్ల ఆర్.టీ.సి. బస్సుల్ని తగులబెట్టారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజీలను దగ్ధం చేశారు. కొన్ని దూరప్రాంతంలోని మండల కార్యాలయాలను మందుపాతరలతో పేల్చేశారు. ప్రభుత్వ వాహనాలకు నిప్పంటించారు. అనేకచోట్ల గుమిగూడిన ప్రజల్ని చెదరగొట్టటానికి పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తర్వాత మనుషులమీదనే కాల్పులు జరిపారు. పోలీసు కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు చనిపోయారని ప్రభుత్వం ప్రకటిస్తే పదిమంది దాకా చనిపోయారని అనధికారవర్గాలవాళ్ళు ప్రకటించారు. రాఘవరెడ్డి మీదున్న అభిమానంతోటే ప్రజలు అప్రయత్నంగా అలా స్పందించారని, కట్టలు తెంచుకున్న వాళ్ళ ఆగ్రహం అంతటి విధ్వంసానికి దారి తీసిందని పరిశీలకులు భావించారు.

"సంఘవ్యతిరేక శక్తులూ, క్రాంతికారులూ కుమ్మక్కై, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, తప్పనిసరి పరిస్థితులలోనే మేం కాల్పులు జరుపవలసి వచ్చిందని పోలీసువర్గాలవాళ్ళు ప్రకటించారు. రాఘవరెడ్డి హత్యను గూర్చి న్యాయవిచారణ జరిపిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

రాఘవరెడ్డి నామకార్థంగ మాత్రమే పౌరహక్కుల సంఘానికి అధ్యక్షునిగా ఉన్నాడే తప్ప ఆ సంఘకార్యకలాపాల్లో ఉత్సాహంగ పాల్గొన్నవాడు కాడు.

రాఘవరెడ్డి చాలా సౌమ్యుడు. అజాత శత్రువు... చీమక్కూడా హాని చేసేవాడు కాడు... రాజకీయాల్ని వదిలేసి ప్రశాంత జీవితం గడుపుతున్న అతన్ని నేనే ఈ సంఘంల చేరమని చెప్పిన... ఆయన ఏనాడూ ఎవరితోనూ ఎట్లాంటి వివాదాలకు దిగినవాడు కాడు. ఎవర్నీ నొప్పించినవాడు కాడు. ఇంత మంచి వ్యక్తిని, సచ్చరిత్రున్ని, వయోవృద్ధున్ని ఎవరో గుర్తు తెలీని వ్యక్తులొచ్చి ఎందుకు చంపినట్లు? ఏమిటీ అన్యాయం?" అంటూ వాపోయాడు పురుషోత్తం.

"ఇది కేవలం ప్రతీకారం తీర్చుకోవడం కోసం చెయ్యబడిన హత్య. వాళ్ళు రామకృష్ణారావు అనే వయోవృద్ధున్ని చంపిండ్రు కదా... వీళ్ళుకూడా ఓ వయోవృద్ధుని కోసం చూసిండ్రు.. ఊరి చివర ఉన్న రాఘవరెడ్డి చాలా ఈజీ టార్గెట్‌గా కనిపించిండు. అంతే లేపేసిండ్రు. దీంట్ల న్యాయాన్యాయాల ప్రసక్తెక్కడిది న్యాయాన్ని గురించి ఎవడు పట్టించుకుంటున్నడు న్యాయాన్ని, ధర్మాన్ని, చట్టాన్ని కాపాడాల్సినోడే ఇట్ల జేసినప్పుడు ఈ దేశాన్నెవడు రక్షిస్తడు?" అన్నాడు ఆ ఊర్లో సీనియర్ అడ్వొకేట్‌గా పేరు పొందిన అజయ్‌కుమార్.

(ఇంకావుంది)

ఇది మారువేషాల్లో వచ్చిన పోలీసులు చేసిన హత్య. దీనికి వాళ్ళు చాలా పెద్ద మూల్యాన్నే చెల్లించాల్సి ఉంది.



**కల్లోల తెలంగాణా జీవితంపై - వెలువరిస్తున్న ఆలోచనాత్మక సీరియల్**

## జేబురుమాలు

బోళాశంకర్ టాంక్‌బండ్ దగ్గిర విహారానికి వెళ్ళినపుడు అక్కడ ఒక పెద్ద మనిషి రంగురంగుల జేబురుమాళ్ళు అమ్మడం చూశాడు.

బోళాశంకర్ "ఎంత?" అని అడిగినపుడు, పెద్ద మనిషి "5 రూపాయలు" అని బదులిచ్చాడు. నిజానికి బోళాశంకర్‌కి జేబురుమాలు అవసరం లేదు. కానీ ఆ అమ్మే పెద్ద మనిషిని చూసి బోళాశంకర్ చాలా జాలి పడ్డాడు. తనకి జేబురుమాలు అక్కర్లేదని చెప్పి, చటుక్కున జేబులోంచి 5 రూపాయలు తీసి ఉంచమని ఇచ్చి, వెళ్ళిపోయాడు.

బోళాశంకర్ అలా ప్రతిరోజూ టాంక్‌బండ్ దగ్గిరకి వచ్చినప్పుడల్లా ఆ పెద్ద మనిషికి 5 రూపాయలు ఇచ్చేవాడు. అలా 3 నెలలు గడిచాయి.



ఒక రోజు యధాప్రకారం బోళాశంకర్ టాంక్‌బండ్‌కి వెళ్ళాడు. ఆ జేబురుమాళ్ళ పెద్దమనిషి కనిపించగానే 5 రూపాయలు ఇచ్చి ముందుకు కదిలాడు.

అంతలోనే ఆ జేబురుమాళ్ళ పెద్దమనిషి సార్, సార్ అని వెంటపడ్డాడు.

బోళాశంకర్ వెనక్కి తిరిగి చిరునవ్వు నవ్వాడు. "నేను ప్రతిరోజూ ఇలా జేబురుమాలు తీసుకోకుండానే నీకు 5 రూపాయలు ఎందుకు ఇస్తున్నానని నువ్వు అడగదలుచుకున్నావు, అంతేనా?" అని ప్రశ్నించాడు.

పెద్దమనిషి తల అడ్డంగా తిప్పి, "ఛఛ, అదేం లేదు సార్, రేట్లు పెరిగాయి నేను ఇప్పుడు జేబురుమాలు ఒక్కటీ 6 రూపాయలకి అమ్ముతున్నాను" - అని ఒక రూపాయికోసం చేతులు చాచాడు.

## కదా

"మీ బరువు 250 కిలోలు వుంది. మీరు అర్జెంటుగా ఎక్సర్‌సైజ్ చేసి బరువు తగ్గకపోతే ప్రమాదం. ఓ నెల్లాళ్ళపాటు రోజుకి 10 కి.మీ. పరుగెత్తండి" అని విరాటరావుకి ఒబేసిటీ క్లినిక్‌లో డాక్టర్ చెప్పాడు.

విరాటరావుకి ఇష్టం లేకపోయినా ఒప్పుకోక తప్పిందికాదు.

నెల్లాళ్ళ తర్వాత డాక్టరుగారికి విరాటరావు దగ్గిర్నుంచి ఫోను వచ్చింది.

"నేను చెప్పినట్టు రోజూ పరుగెత్తారా?" డాక్టర్ అడిగాడు.

"పరుగెత్తాను డాక్టర్" విరాటరావు రొప్పుతూ బదులిచ్చాడు.

"సరే, పది నిముషాల్లో క్లినిక్‌కి రండి, ఎంత బరువు తగ్గారో చూస్తాను" డాక్టర్ ఉత్సాహంగా చెప్పాడు.



"పది నిముషాల్లో ఎలా రాగలను?" విరాటరావు నిర్ఘాంతపోయాడు, "నేను ఇప్పుడు సిటీకి 300 కి.మీ. దూరంలో కదా ఉన్నాను!" అని అరిచాడు.

## కవి

భలేరావు ట్రైన్లో తన ఎదురుగా జుబ్బా వేసుకుని సిగరెట్ తాగుతున్న వ్యక్తిని అడిగాడు.

"మీరేం చేస్తున్నారు?"

జుబ్బా ఆయన ఒక దమ్ములాగి చెప్పాడు: "నేను కవిని. మరి మీరో?"



"నేను చెవిటివాడ్ని" చటుక్కున వచ్చింది సమాధానం.

## కన్‌ఫ్యూజన్



భలేరావు చాలాసేపట్నించి ఇద్దరు అందగత్తెల వెనకపడి నడుస్తున్నాడు.

హఠాత్తుగా వాళ్ళలో ఒకామె వెనక్కి తిరిగి చూపుడు వేలు కదుపుతూ వార్నింగ్ ఇచ్చింది: "రేయ్, పోరా, కావాలంటే ఇంకో కుర్రాడినెవడినైనా వెంట తెచ్చుకో, నీతో మేం కన్‌ఫ్యూజ్ అయ్యి నెత్తికొట్టుకుని ఛస్తున్నాం".

## 5 లక్షలు

"మా ఆవిడ ముద్దుల పెంపుడు పిల్లి తప్పిపోయింది. పట్టి తెచ్చిన వారికి రూ. 5 లక్షలు బహుమానం" - అని పత్రికలో ప్రకటన ఇచ్చేందుకు అడ్వర్టైజ్‌మెంట్ ఏజన్సీకి వచ్చాడు వెంకట్రావు.

"దీన్ని బట్టి చూస్తే మీ ఆవిడ మీకు చాలా ప్రేమ అని ఆవిడ బాధపడుతుంటే చూళ్ళేరని అర్థమౌతోంది. లేకపోతే పిల్లిని పట్టి తెచ్చినవారికి 5 లక్షల బహుమతి అంటే చాలా ఎక్కువ" అడ్వర్టైజ్‌మెంట్ ఏజన్సీ మేనేజర్ వెంకట్రావుని ప్రశంసించాడు.



"అదెవ్వడికీ దొరకదు లెండి. దాన్ని నేనే రాత్రి మురిక్కాలవలో ముంచి చంపి అవతల పారేశా" వెంకట్రావు గుసగుసగా చెప్పాడు.




## బకాయి

బోళాశంకర్ గుడికి వెళ్ళినపుడు ముష్టివాడొకడు చెయ్యి చాచాడు.

"ఇప్పుడు చిల్లర లేదు, మళ్ళీ వచ్చినపుడు చూద్దాం" అన్నాడు బోళాశంకర్.

"ఛ, ప్రతీవాడు బకాయి పెట్టేవాడే. ఇప్పటికే, ఈ బకాయిలు వసూలు చేసుకోలేక ఛస్తున్నాను" రుసరుసలాడాడు ముష్టివాడు.



## పెళ్ళి



భలేరావు, బోళాశంకర్, చిన్నారావు ఒక మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళారు.

మొదట చిన్నారావుని పిలిచారు.

"పెళ్ళయిందా?" అని ప్రశ్నిస్తే కాలేదని జవాబిచ్చాడు చిన్నారావు. అతనికి ఉద్యోగం దొరకలేదు.

తర్వాత బోళాశంకర్ వంతు వచ్చింది. బోళాశంకర్ పెళ్ళయిందని చెప్పాడు. అతనికి ఉద్యోగం దొరికింది.

చివరగా భలేరావుని పిలిచారు.

"పెళ్ళయిందా?" అని ప్రశ్నిస్తే "ఓ, రెండుసార్లు" అని ఉత్సాహంగా బదులిచ్చాడు. అతనికి ఉద్యోగం దొరకలేదు.

భలేరావుకి కోపం వచ్చి కారణం అడిగాడు.

"ఒకసారి జరిగిన తప్పునించి గుణపాఠం నేర్చుకోని ఇడియెట్‌కి మేం ఉద్యోగం ఇవ్వం" అని కంపెనీ మేనేజర్ జవాబిచ్చాడు.

## సమస్య



"డాక్టర్ నా సమస్య ఏమిటంటే ఏ సంగతైనా చటుక్కున ఇట్టే మరిచిపోతున్నాను" తన మతిమరుపు గురించి డాక్టర్‌కి మొరపెట్టుకున్నాడు పేషంట్.

"సరే, మొదట ఫీజు అడ్వాన్సుగా చెల్లించండి, మీ సమస్య చూస్తాను" డాక్టరు తేల్చాడు.

## కోళ్ళు

చిన్నారావుని పోలీసులు బోనెక్కించారు. "నేరం ఏమిటంటే 16 కోళ్ళ దొంగతనం, నువ్వేనా ముద్దాయివి?" జడ్జిగారు గంభీరంగా ప్రశ్నించారు.

"ఛ ఛ లేద్సార్, నేను ఆ కోళ్ళు దొబ్బేసిన వాడిని" చిన్నారావు సరి చేశాడు.



## అక్షర క్రీడ-15 నిర్వహణ : కె.రాజేశ్వరరావు



నిబంధనలు : ఈ గళ్ళ నుడికట్టులో కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా పూరించి పోస్టులో పంపాలి. జిరాక్స్‌కాపీ అనుమతించబడదు. అన్ని జవాబులు సరిగ్గారాసిన వారికి విజయవిహారం పత్రిక ఆరు నెలలు ఉచితంగా పంపిస్తాము. తుది నిర్ణయం యాజమాన్యానిదే. ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశంలేదు. ఎంట్రీలు జూన్ 20వ తేదీలోపుగా మా కార్యాలయానికి అందాలి.

**ఆధారాలు - అడ్డం :** 1. తెలుగునాట ఇది తెప్పలుగా పారుతోంది అన్నాడు గజ్జెల మల్లారెడ్డి (4). 4. ఎడమ కాదు (2). 5. నిద్రలో పిల్లలు ఉలిక్కిపడి లేస్తే ఇది వచ్చిందా అని అడుగుతారు (4). 8. ముసలితనం (2) 9. కంచిలో కామాక్షి వుంటే, మధురలో వుండేది (3). 13. తెలుగులో ఈక్వాలిటీ (3). 15. రుణాలు మరో విధంగా (3). 17. తమ నగరిలో ఇల్లాలు (3). 18. ప్రవాహగానంలో ప్రయాణసాధనం (3). 19. దీపావళికి ఈ పంచా ఎక్కువ కాలుస్తారు (2). 20. మండూకం (2). 21. ఇంగ్లీషు వేపుడు (1). 22. కొందరు ఆడవాళ్ళ తలలో పడతాయి (2). 23. సముద్రంలో ఓడను నిలపడానికి ఇది వేస్తారు (3). 27. ఈ టాండన్ జాతీయ స్థాయి ఉత్తమ నటిగా ఎంపికైన హిందీచిత్ర నాయిక (3). 29. కాదనలేక ఆద్యంతాలు కలిపితే వేడి (2). 30. నవవధువుకు భర్త ఇంట్లో ఈమె అర్థమొగుడితో సమానం - అటు నుండి (5). 32. ఈ పాలు తాగితే బలం వస్తుందని కొందరి నమ్మకం (2). 33. వార్షికాదాయం మరో విధంగా, మధ్య అక్షరం లేకుండా (4) 34. మంత్రులకు, అధికారులకు కోరికలు తెలియజేస్తూ సమర్పించే పత్రం (3). 36. బిలం మధ్య మరో అక్షరంతో పిల్లి (3) 38. చివరి అక్షరం జారిపోయిన తెర (3). 40. ప్రబంధం, గ్రంధం (2). 42. ఆగకుండా పరుగెత్తితే ఎవరికైనా వస్తుంది (3). 44. నది (2) 45. చరిత్రలో సుప్రసిద్ధులైన తొలి తెలుగు చక్రవర్తులు (5). 46. ఉరగడు సర్దితే బహుమతి (4). 47. దూషించు మరోలా (2)

**నిలువు :** 1. కొందరు దేవుడి ముందే కాదు, అధికారుల ముందు కూడా చేస్తారు (3). 2. ముక్తి కాదు: తలకిందులైన అనురాగం(2). 3. కిందినుండి మగాళ్ళకీ, రొయ్యకీ వుండేది (2). 4. పొట్ట (2). 6. ఆడపిల్లలు వేసుకునేది తలకిందులైంది (2). 7. పాండవులకోసం దుర్యోధనుడు దీంతో ఇల్లుకట్టించాడు (2). 10. డాక్టర్లు ముందు ఇది చూస్తారు (2) 11. పశ్చిమ బెంగాల్ ఎర్రకోటను పడగొడతానన్న నారి (3). 12. మైసూర్ పులిగా ప్రసిద్ధుడైన సుల్తాను (2). 13. సగంగరి సర్దితే ఒకరకం స్నానాలు (4) 14. ఈ డాట్ కామ్ టేపులే బిజెపి పరువు తీశాయి(3). 15. పాతకాలం పావలాలో నాలుగోవంతు (2). 16. మూషికాలు-మొదటి అక్షరం లేదు(3) 19. తెలంగాణాలో ఈ సరస్వతీ ఆలయం ప్రసిద్ధం (3). 22. పెన్నుకు పాతకాలం పేరు (2). 23. ఈ పొగాకు చాలా ప్రసిద్ధం (2) 24. ఇవి ఆరు రకాలట(3). 25. పసివాడి బంగారం చెల్లాచెదురయింది (3) 26. చెదిరిన వసంతం (3). 28. విసన కర్ర (3). 29. మేఘపంక్తి (4) 31. సమాజంలో అడుగున పడి వున్న జీవులు చెదిరిపోయారు (3). 33. అలంకరించిన కన్యని కాళ్ళు కడిగి అర్పిస్తే - కన్యాదానం అంటారు (4). 34. రోత పుట్టించే విధులు శత్రువులా? (4). 35. తలకిందులైన సన్యాసి (2). 37. ...... వతి యు.పి.మాజీ ముఖ్యమంత్రి (2). 39. పెళ్ళి కొడుకు (3) 41. వారి తిక్క, ముందు సరిచేస్తే కనపడే కాంగ్రెస్ నాయకుడు (3). 42. అజ్ఞ (3). 43. సాయంత్రం కాదు: ఎడిఎంకే అధినేత జయలలిత తల్లి, ప్రముఖ నటి కూడా (2). 45. సరస్వతి మరోలా, చివరక్షరం లేదు(2).

ఎంట్రీలు పంపే చిరునామా : అక్షరక్రీడ, **విజయ విహారం**, 12-5-33/2, విజయపురి, తార్నాక, సికింద్రాబాద్-17 ☎ 7007053

పేరు : ______

చిరునామా : ______

పిన్‌కోడ్ : ______

### అక్షరక్రీడ-14 సమాధానాలు



**అక్షరక్రీడ-14 విజేతలు :**

- దాసరి వేణు గోపాల్,అనంతపురం.
- శ్రీమతి కె.శ్రీదేవి, కర్నూలు.
- పి.జయకృష్ణ, సికింద్రాబాద్.
- జె.ఇందిర, బెరహంపూర్.
- పి.లక్ష్మీకాంతారావు, అనంతపూర్.
- శ్రీమతి కోటా లలిత, సికింద్రాబాద్.
- శ్రీమతి కోటా పద్మావతి, సికింద్రాబాద్
- పి.హరిప్రసాద్, విజయవాడ.
- పి.ఉషారాణి, కర్నూలు.
- కరణం సత్యన్నారాయణ,విశాఖపట్నం.
- వేముల సాంబయ్య, వరంగల్.
- ఎస్.చైతన్య, అమలాపురం.

మీరు హైద్రాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు







## చిట్టి కథ

## నక్కబావా - కోడిపెట్టా

జిత్తులమారి నక్కకు కోళ్లని ఎత్తుకుపోవడం అంటే మహా సరదా! అందుచేత, కోళ్లపెంపకం దారులు తమ కోళ్లని బయటికి వదలాలంటేనే భయపడుతూ ఉండేవాళ్ళు. కోళ్లని తప్పనిసరిగా రాత్రింబగళ్ళూ ఇనప తీగెల పంజరాల లాంటి గూళ్లలో పెట్టి ఉంచేవాళ్ళు. పొద్దస్తమానం అలా బంధిఖానాలో ఉన్నట్లు ఉండడం వల్ల కోళ్లకి పిచ్చెత్తి నట్లుంది. వాటికి జబ్బువాలకం పడింది. అయితే, ఆ కోళ్లలో ఒక పెట్ట ఉంది. అది జిత్తుల మారి నక్కకి గుణ పాఠం నేర్పదలుచుకుంది. ఓ రోజున నక్క కోడిపెట్ట ఉన్న చోటికి వచ్చి, ''ఓహోహో! మీ యజమాని నిన్ను నాబారి నుంచి రక్షించడానికి గానూ ఈ ఇనపతీగెల గూట్లో పెట్టి గొళ్లెం వేశాడన్న మాట! నేనేం తక్కువదాన్నా! చూస్తుండు! ఏదో ఓరోజున నిన్ను గుటకయస్వాహా చేయకపోతే నాపేరు నక్కేకాదు.'' అంది దుందుడుకుగా. కోడిపెట్ట దిగులుగా మొహంపెట్టి, ''నక్కబావా! నా వంట్లో ఏం బావులేదు! కడుపులో యమ బాధగా ఉంది. నేను చావడం ఖాయం కానీ చచ్చే లోపల ఈ నొప్పిని భరించలేను! చావు కోసం ఎదురు చూడ్డం చచ్చేచావుగా ఉంది. ఈ లోపలే నేను సునాయసంగా మరణించగలిగితే ఎంత బావుండు!'' అంది. ''అది వింటున్న నక్కకి ఆశ్చర్యం కలిగింది. కోడి పెట్ట చెబుతూనే ఉంది. ''నువ్వు గనక ఇట్లాగే కాస్త దూరం నడిచి ఎడం చేతివైపుకి తిరగావంటే అక్కడొక కంత ఉంటుంది. నువ్వు తేలిగ్గా ఆ కంతలోనుంచి నా గూట్లోకి రావచ్చును. చటుక్కున నన్ను చంపి లటుక్కున తినేయ వచ్చును. నీ ఆకలి తీరుతుంది. నా బాధా తీరుతుంది'' అంది. నక్క బావకు నోరూరింది. 'భలే భలే!' అనుకుంటూ అటువైపు పరిగెత్తింది. కానీ కోడి పెట్ట ప్లాను నక్కకేం తెలుసూ! అటువైపున ఎరువులకోసం కోళ్లపెంపకం దారు ఒక పెద్ద గుంట తీసిపెట్టాడు. ఆత్రంగా అటువైపు వెళ్ళిన నక్క తలక్రిందులుగా అందులో పడి దొరికి పోయింది. తను త్రవ్వు కున్న గోతిలో తనేపడినట్లు అయింది నక్కపని!



# బుడుగు

రాజధాని : నికోసియా
భాషలు : గ్రీకు, టర్కిష్, ఇంగ్లీషు
మతం : క్రైస్తవ, ఇస్లాం
కరెన్సీ : సైప్రస్ పౌండు

సైప్రస్ దేశం మధ్యధరా సముద్రపు తూర్పు తీరపుకొనలో ఉంది. ఆ దేశపు రాజధాని నికోసియా రెండు పర్వత శ్రేణుల మధ్య ఉండే పల్లపు ప్రాంతంలో నిర్మించబడింది. నగరానికి ఉత్తర దిశలో కైరెనియా పర్వత సానువులు ఉంటాయి. దక్షిణ దిశలో ట్రూడూస్ పర్వతాలు ఉంటాయి. ఈ ద్వీపాన్ని బ్రిటన్ 1878 సంవత్సరంలో ఓట్టోమన్ టర్కుల దగ్గర నుంచి స్వాధీనం చేసుకుంది. 1960లో స్వాతంత్ర్యం వచ్చాక, గ్రీకు, టర్కిస్, సైప్రియాట్లు ప్రభుత్వపాలనని పంచు కున్నారు. కానీ, తగాదాలు ముదరడం వల్ల ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని సైనికులను పంపి శాంతి స్థాపించవలసి వచ్చింది. ఎక్కువగా టర్కిష్, సైప్రియాట్లు నివసించే ఉత్తరభాగాన్ని టర్కీ 1974లో ఆక్రమించుకుంది. అక్కడ నివసిస్తూ ఉండిన గ్రీకులు దక్షిణానికి వలస వెళ్ళిపోయారు. ఈ ద్వీపం ఉత్తరాన టర్కిష్ ప్రాంతంగా, దక్షిణాన గ్రీకు ప్రాంతంగా విభజించబడింది. విభజన రేఖ నికోసియా నగరం మధ్యనుంచి వెళ్తుంది. సైప్రస్ దేశంలో ఎండలు మెండుగా ఉంటాయి. కానీ శీతాకాలంలో చల్లగా ఉంటుంది. వర్షాలు ఓ మోస్తరుగా పడతాయి. దక్షిణాన సముద్ర తీరాన ఉండే బీచ్‌లు సంవత్సరం పొడుగునా పర్యాటకులను ఆకర్షిస్తూ ఉంటాయి.




## శాస్త్రవేత్తలు

## డాక్టర్ హోమీ జె. భాభా



ఇండియాలో అటామిక్ ఎనర్జీ రిసెర్చికి (అణుశక్తి పరిశోధన) అంకురార్పణ చేసిన డాక్టర్ హోమీ జె. భాభా ముంబైలోని ఒక ధనిక పార్శీకుటుంబంలో 1909, 30 అక్టోబర్ తారీఖున జన్మించాడు. ఆకర్షణీయమైన రూపం, కార్యదక్షత, ఉత్తేజం కలిగించేలా మాట్లాడే చతురత ఇవన్నీ ఉన్న భాభా చిన్నప్పటి నుంచి కూడా సైన్సు పరిశోధనల పట్ల ఆసక్తి కలిగి ఉండేవాడు. అల్‌ఫిన్‌స్టన్ కాలేజీనుంచీ, రాహుల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నుంచీ డిగ్రీలు తీసుకున్న తర్వాత భాభా నెయిల్ బోహర్ లాంటి సుప్రసిద్ధ సైంటిస్టులతో కలిసి పనిచేశాడు. 'మిజోనో' మీద అయిన చేసిన పరిశోధనలు ప్రఖ్యాతి పొందాయి. అయన ఇండియాకు తిరిగి వచ్చాక బెంగుళూరులో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫన్‌డమెంటల్ రిసెర్చ్' సంస్థని స్థాపించి చాలాకాలంపాటు దాని డైరెక్టర్‌గా పని చేశాడు. అయన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకి దగ్గరి వాడు కావడం వల్ల నెహ్రూ అయన టాలెంటుని గుర్తించి, అయన పరిశోధనలకు ఎంతో సాయం అందించడం జరిగింది. ఇండియాలో అటామిక్ ఎనర్జీ కమిషన్‌ని స్థాపించిన తర్వాత అయనే మొదటి ఛెయిర్మన్ అయ్యాడు. ఆసియాలో మొదటి అటామిక్ రియాక్టరు 'అప్సరస' రూపొందించింది భాభానే అణుశక్తి గురించి ఐక్యరాజ్యసమితి అధ్వర్యంలో జనీవాలో జరిగిన కాన్ఫరెన్సుకి అయన అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. అణుశక్తి రంగంలో అయన చేసిన కృషి అయనకి ఆ గౌరవం దక్కేలా చేసింది. అజన్మబ్రహ్మచారిగా జీవితం గడిపిన భాభా 1966 జనవరి 24న జరిగిన ఒక విమాన ప్రమాదంలో అసువులు బాసారు.

## చుక్కలు కలిపితే చక్కని బొమ్మ



## దారి చూపండి!



పిల్లికి ఆకలిగా ఉంది. ఎలుకను పట్టుకోవాలి. మీరు దారి చూపిస్తారా?

# ఈ చట్టమే ఒక ఆర్గనైజ్డ్

## టాడాకన్న భయంకరమైన ఆర్గనైజ్డ్ నేరాల చట్టం

వ్యవస్థీకృత నేరాలను అదుపుచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన శాసనం టెర్రరిస్టు చట్టాలకన్న భయంకరమయింది. పోలీసులకు ప్రభుత్వానికి అపారమయిన అధికారాలను ఇచ్చేందుకు గాను ఇంతవరకూ ప్రపంచంలోనూ మన దేశంలోనూ అమలవుతున్న అన్ని న్యాయవిచారణా సూత్రాలను, మౌలిక నియమాలను తిరగరాసి ఎవరినైనా సరే బొక్కలో తోసి లక్షలు వసూలు చేయగల విశృంఖల అధికారాలను ఖాకీలకు ధారాదత్తం చేస్తున్నది. సాక్ష్య నియమాలను, కోర్టులు విచక్షణాధికారాన్ని నిర్ణయించే ధర్మ సూత్రాలను ఈ చట్టం పూర్తిగా తలకిందులు చేస్తున్నది. సాక్ష్యాలను ఊహించవచ్చు. నేరాంగీకారాన్ని సాక్ష్యంగా ఆమోదించవచ్చు. బెయిల్ గ్రాంట్ చేయడానికి వీల్లేదు. నేరం రుజువైనట్టు ఊహించవచ్చు. జడ్జిగారు నిందితుడని నమ్మి తీరాలి. పోలీసు ప్రాసిక్యూటింగ్ వ్యవస్థలో ఏవయినా పొరబాట్లు దొర్లితే మాత్రం సదుద్దేశంతో జరిగిన తప్పులుగా భావించి దావాలు కేసులు వేయకూడదు. జరిమానాలు లక్ష నుంచి అయిదు లక్షల దాకా ఉండవచ్చు. ఇంట్లో సమాచారం దొరికినా, ఆయుధం దొరికినా, వేలి ముద్రలు వాహనాలపైన దొరికినా, నేరం రుజువైనట్టే. ఆస్తి జప్తు చేయవచ్చు. జప్తు చేసిన ఆస్తిని శరవేగంగా స్వాధీనం చేసుకోవచ్చు. టెలిఫోన్లు, సెల్‌ఫోన్లు, ఈ మెయిల్ వంటి రకరకాల సమాచార ప్రసార సాధనాలను టాప్ చేయవచ్చు. ఆ విధంగా వచ్చిన సమాచారాన్ని విలువైన సాక్ష్యంగా కోర్టు అనుమతించి తీరాలి. తరువాత ఆమోదించి తీరాలి..... ఇట్లా అనేక కొత్త నియమాలు - దేశంలో ఎక్కడా లేని భయంకరమయిన నియమాలు. ఏ ప్రపంచ న్యాయసూత్రం కూడా ఒప్పుకోని విధానాలు ఈ భయానక చట్టంలో ఉన్నాయి. ఈ సమాజం మీద ఈ చట్టమే ఒక ఆర్గనైజ్డ్ నేరమేమో అనిపించేంత అన్యాయమయిన నియమాలు ఇందులో ఉన్నాయి.

ఈ చట్టం చేతిలో ఉంటే అధికార పార్టీకి ప్రతిపక్షం ఉండకపోవచ్చు. వ్యతిరేక వర్గం ఉండకపోవచ్చు. అధికార పార్టీలో ఉన్నవాళ్లు తప్ప అందరూ వ్యవస్థీకృతనేరగాళ్లుగా ముద్రపడి ఆస్తులను ప్రభుత్వానికి వదులుకుని లక్షల జరిమానాలు చెల్లించి జైళ్లలో ఉండిపోవచ్చు. నిర్వచనం నుంచి నియమాలదాకా, నేర సమన్వయం నుంచి రుజువుల అనుమతి, భావన, నమ్మకాల దాకా ఈ చట్టం అన్నీ కొత్త విధానాలనే ప్రతిపాదిస్తున్నది. సత్వర విచారణకు ఏ నేర విచారణను అయినా తరలించగల శక్తి ఈ చట్టానికి ఉంది. నిజంగా ఈ భయానకమయిన అధికారాలు ఖాకీలు అంది పుచ్చుకున్న నాడు ఈ చట్టం అసలు స్వరూపం ఏమిటో తెలుస్తుంది. అందాకా దాన్ని ఊహించడం కూడా ఒక్కోసారి సాధ్యం కాకపోవచ్చు. శాంతి భద్రతల యంత్రాంగానికి సరికొత్త ఆయుధాన్ని సమకూర్చిన ఈ చట్టంలో టాడాలో ఉన్న అన్ని భయానకమయిన అంశాలు ఉన్నాయి.

### అస్పష్టమయిన నిర్వచనాలు

నిర్వచనం చాలా అస్పష్టంగా ఉంది. ఈ అస్పష్టత వల్ల ఏ నేరాన్నయినా వ్యవస్థీకృత నేరంగా పరిగణించే విస్తృతమైన అధికారం పోలీసులకు లభిస్తుంది. మరణ శిక్ష లేదా జీవిత ఖైదు, లక్షల రూపాయల్లో జరిమానా విపరీత శిక్షలున్న ఈ చట్టంలో నిర్వచనం సరిగా లేకపోతే చాలా ప్రమాదకరమయిన పరిణామాలు వస్తాయి. ఒక ఆర్గనైజ్డ్ క్రయిం సిండికేట్ సభ్యుడిగా లేదా ఆ సిండికేట్ పక్షాన, హింసను వాడుతూ లేదా హింసిస్తానని బెదిరించి, భయపెట్టి, వత్తిడి చేసి లేదా ఇతర చట్ట వ్యతిరేక పద్ధతుల ద్వారా డబ్బు పరమయిన లాభాలు పొందడానికి లేదా తనకు గానీ ఇతర వ్యక్తికి గానీ లేదా తిరుగుబాటు ప్రోత్సహించే వారికి గానీ అనర్హమైన ఆర్థిక తదితర లాభాలను సమకూర్చేందుకు ఒక వ్యక్తి ఒంటరిగా గానీ సమిష్టిగా గానీ వరసగా చేసే నేరాన్ని ఆర్గనైజ్డ్ నేరం అన్నారు. (సెక్షన్ 2 (ఇ) )

### తీవ్ర నిర్వచనాలు తీవ్ర పరిణామాలు

ఆర్గనైజ్డ్ క్రైం సిండికేట్ అంటే ఇద్దరు లేక అంతకన్న ఎక్కువ మంది ఒంటరిగా గానీ లేదా సమిష్టిగా గానీ ఒక సిండికేట్‌గా లేదా గ్యాంగ్‌గా ఏర్పడి ఆర్గనైజ్డ్ క్రైం చర్యలకు పాల్పడే వారని సెక్షన్ 2 (ఎఫ్) నిర్వచించింది. ఇద్దరు కలిసి చేసే ఏ నేరాన్నయినా ఆర్గనైజ్డ్ నేరం అని నిర్వచించడం, ఆ జట్టులో సభ్యుడు కాని వ్యక్తి కూడా సిండికేట్ తరఫున ఒంటరిగా చేసిన పనిని కూడా ఆర్గనైజ్డ్ నేరంగా పరిగణించడం ఈ నిర్వచనంలో ఎడాపెడా వాడడానికి ఉపయోగపడే భాగాలు. తిరుగుబాటు అని ప్రత్యేకించి పేర్కొనడం వల్ల నక్సల్ వాద ఉద్యమాన్ని సమర్థించే వారి పనులను, పౌరహక్కుల ఉద్యమాలను ఈ నిర్వచనం పరిధిలోకి తెచ్చారని భావించాలి. ఇతర మాఫియా కార్యక్రమాల ప్రస్తావన నిర్వచనంలో లేదు. 'చట్ట వ్యతిరేక' అనే పదం కిందికి ఆ కార్యక్రమాలన్నీ వస్తాయని అనుకోవాలి. తిరుగుబాటు కూడా చట్ట వ్యతిరేకమే. అయినా ఆ పదాన్ని స్పష్టంగా పేర్కొనడం ద్వారా ఈ చట్టం ఎటు మొగ్గు చూపుతుందో అర్థమవుతుంది. సట్టాసార్వభౌములను, మద్యం గ్యాంగ్‌లను, కిరాయి గుండాలను, పిల్లలను ముఖ్యంగా ఆడపిల్లలను అమ్ముకునే గ్యాంగులను, వేశ్యావ్యాపారం సాగించే ముఠాలను ఆర్గనైజ్డ్ క్రయిం సిండికేట్‌లని స్పష్టంగా పేర్కొనకపోవడం ఒక లోపం. అసలు ఇటువంటి చట్టపరమయిన అధికారం విరుచుకు పడాల్సింది వీరిపైన. వాటిని వదిలేసి, 'తిరుగుబాటు' అనే పదాన్ని పేర్కొనడం వల్ల దేన్నయినా తిరుగుబాటుగా పరిగణించి ఈ చట్టం కింద పౌరులను ప్రాసిక్యూట్ చేసే అవకాశం అధికారం లభిస్తుంది.

ఈ నిర్వచనం తీవ్రతను అర్థం చేసుకోవాలంటే ఇతర నిర్వచనాలను, నేరం చేసాడని లేదా నేరం రుజువయిందని భావించే 'భావనా నియమాలను' (ప్రిసంప్షన్స్). మామూలుగా ఇండియన్ పీనల్ కోడ్‌లో అబెట్‌మెంట్ అనే నేరనిర్వచనం ఉంది. నేరప్రోత్సాహాన్ని కూడా నేరంగా పరిగణించడం ఆ నిర్వచనం ఉద్దేశం. లార్డ్ మెకాలే అప్పట్లో ఈ నిర్వచనం రాసినపుడు స్వాతంత్ర సమరంలో బ్రిటిషు వారిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన వారితో పాటు వారికి సహకరించిన, ప్రోత్సహించిన వారిని కూడా శిక్షించడానికి ఈ సెక్షన్ బాగా ఉపయోగపడుతుందని విమర్శించారు. నేరం చేసిన వాడితోపాటు నేరాన్ని ప్రోత్సహించిన వారు, అందుకు ఇతోధికంగా సహకరించిన వారు కూడా సమానమయిన నేరస్తులే అని నేర శాసనాలు ప్రపంచమంతటా చెప్తున్నాయి. దాన్ని కాదనడం కష్టం కూడా. అందుకే ఆ నిర్వచనాన్ని స్వతంత్ర భారత్ కూడా కొనసాగిస్తున్నది. ఈ కొత్త చట్టం ఆ పదానికి అదనపు అర్థాల్ని సమకూరుస్తున్నది. ఇదివరకు లభ్యమయ్యే మామూలు అర్థాలకు తోడుగా ఆర్గనైజ్డ్ క్రైం సిండికేట్‌తో కమ్యూనికేషన్ జరిపినా, వారి వారితో అసోసియేట్ అయి ఉన్నా కూడా నేర ప్రోత్సాహం చేసినట్టే. మరో వ్యక్తి సిండికేటుకు సహకరిస్తున్నాడని తెలిసి లేదా ఆటువంటి పనులు చేస్తాడని నమ్మడానికి తగిన కారణాలున్నా, ఆ వ్యక్తితో కమ్యూనికేషన్ జరిపినా అతనితో కలిసి ఉన్నా అతను కూడా నేరస్తుడే అని సెక్షన్ 2 (ఎ) వివరిస్తున్నది. అంటే సిండికేట్ సభ్యుడు, వాస్తవంగా నేరం చేసిన వాడు మాత్రమే నేరస్తులు కారు. వారితోపాటు ఉండేవారు, వారితో కమ్యూనికేట్ చేసేవారు అంటే వారితో మాట్లాడే వారూ, ఉత్తరాలు రాసేవారూ కూడా ఈ నిర్వచనం వల్ల నేరస్తులవుతున్నారు. శిక్షాస్మృతి ప్రకారం నేరం చేసిన వారికి ఎంత శిక్షో నేరప్రోత్సాహకులకు కూడ అంతే శిక్ష ఉంటుంది. అతను సిండికేటు సభ్యుడని తెలిసినా తెలిసే కారణం ఉన్నా నేరస్తుడయిపోతాడు. ఇంత వివరంగా ఉన్నా చాలదన్నట్లు ఇంకో నియమం ఏర్పాటు చేసారు. ఈ సిండికేటుకు సహాయం చేయగల ఏ సమాచారాన్ని ఇచ్చినా, లేదా ప్రచురించినా, సిండికేటు నుంచి అందిన ఏ పత్రం కానీ విషయంగానీ మరొకరికి ఇచ్చినా, ప్రచురించినా పంచినా అది కూడా అబెట్‌మెంట్ అవుతుంది. మరొకరు ఒక నేరం చేస్తున్నాడని తెలిసి ఆ నేరం చేయాలన్న ఉద్దేశంతో అతనికి సహకరించినప్పుడే అబెట్‌మెంట్ అవుతుందని ఐపిసి చెప్తున్నది. కాని ఈ కొత్త చట్టం వారితో మాట్లాడినా, సమాచారం మరొకరికి అందించినా, వారి పత్రాలు పంచినా సమాచారం మరొకరికి ఇచ్చినా నేరస్తులవుతారు. నక్సలైట్లు విడుదల చేసిన పత్రికా ప్రకటనను విలేకరి తన పత్రికకు పంపితే ఈ సెక్షన్ కింద అతను అబెట్‌మెంట్ చేసిన నేరస్తుడవుతాడు. అది ప్రచురించిన పత్రికా సంపాదకులు ముద్రాపకులు అందరూ అదే నేరస్తులవుతారు. ఇది ఊహాత్మకమయిన భయాందోళన ఏమాత్రం కాదు. ఆ ప్రకటన ఇచ్చింది నక్సలైట్ అని తెలిసినా లేదా అని నమ్మడానికి తగిన కారణం ఉన్నా చాలు వీరి నిర్వచనానికి సరిపోతారని కాస్త తరచి చూస్తే సులువుగా అర్థం అవుతుంది. పత్రికల వారిని ఏమీ అనబోం అని హామీ ఇవ్వవచ్చు. కాని ఎకె 47 వలె ఈ నియమం పోలీసుల అమ్ములపొదిలో ఎప్పుడూ ఉంటుంది. దీంతో ఎప్పుడయినా ఎవరినైనా ప్రాసిక్యూట్ చేయవచ్చు. అంతా వారి దయమీద ఆధారపడి ఉంటుంది.

వారికి ఆర్థిక సాయం చేసినా లేదా మరే ఇతర సాయం చేసినా కూడా నేరస్తులే అని మరొక నియమం కూడా ఉంది. ఇతర సాయం అంటే ఏమిటన్నది మరో అస్పష్టత.






## మాడభూషి శ్రీధర్ కాలమ్

### సభ్యత్వమే నేరం

సెక్షన్ నాలుగు ప్రకారం ఏ నేరం చేయకపోయినా ఆ సిండికేటులో సభ్యుడుగా ఉండడమే నేరం. అందుకు అయిదేళ్ల జైలు శిక్ష అయిదు లక్షల రూపాయల జరిమానా విధించవచ్చు. చట్టవ్యతిరేక సమావేశంలో పాల్గొన్నవారని, ఒకే విధమయిన లక్ష్యం ఉద్దేశం ఉన్నందుకు నేరస్తులుగా పరిగణించ వచ్చునని ఐపిసి చెప్తున్నది. కాని ఒకే ఉద్దేశం లేకపోయినా సిండికేటు చేసే ఏ నేరంలో పాలుపంచుకోకపోయినా నేరం చేసే దురుద్దేశం లేకపోయినా, నేరం జరగకపోయినా, కేవలం ఆ సిండికేట్‌లో సభ్యుడిగా ఉన్నందుకు మిగతా నేరాలను రుజువు చేయనవసరం లేకుండా అయిదేళ్లపాటు శిక్షించడానికి ఈ సెక్షన్ వీలు కల్పిస్తుంది. నేరాలు రుజువు చేయడం చేతగాక ఇటువంటి సెక్షన్లు రాసుకున్నారన్న మాట. ఉదాహరణకు నక్సలైట్ దళం సభ్యుడు గానీ, లేదా ఒక దొంగల ముఠా సభ్యుడయినా సరే వారు ఏ నేరం చేయక పోయినా సరే, ఏ నేరం చేయాలన్న ప్లాన్ లేకపోయినా సరే ఈ సెక్షన్ కింద శిక్షించవచ్చు.

### సమర్థన కూడా నేరమే

ఎవరయినా ఒక ఆర్గనైజ్డ్ క్రైం జరగడానికి కుట్ర చేసినా, ప్రయత్నించినా, అది మంచిదే అని వాదించినా, అబెట్ చేసినా తెలిసి వీలు కల్పించినా లేదా ఆ నేరం జరగడానికి గాను ఎటువంటి ముందు తయారీ చర్యలు చేసినా అయిదేళ్లకు తక్కువ కాకుండా జైలు, అయిదు లక్షలకు తక్కువ కాకుండా జరిమానా విధించవచ్చు. (సెక్షన్ 3(2)) ఇది గాక ఎవరు ఈ సిండికేటు సభ్యుడికి ఆశ్రయం ఇచ్చినా ఇచ్చేందుకు ప్రయత్నించినా కనీసం అయిదేళ్ల జైలు అయిదు లక్షల జరిమానా విధించవచ్చు. (సెక్షన్ 3(3))

ఏ వ్యక్తి అయినా ఆర్గనైజ్డ్ క్రైం ద్వారా సంపాదించిన ఆస్తి కలిగి ఉండడం నేరం.

సిండికేటు సభ్యుడి తరఫున ఎవరయినా ఎప్పుడయినా ఆస్తి కలిగి ఉంటే, ఆ స్థిరాస్తి లేదా చరాస్తి ఎక్కడిదో చెప్పలేకపోతే అది కూడా ఎక్కడిదో చెప్పలేకపోతే అది కూడా నేరమే. అందుకు అయిదేళ్ల జైలు, కనీసం లక్ష జరిమానా, ఆస్తుల జప్తు శిక్షలు టకటకా విధించవచ్చు (సెక్షన్ 4)

ప్రత్యేక కోర్టులు ఈ చట్టం కింద మూడేళ్ల జైలు శిక్ష విధించగల నేరాలను సత్వర విచారణలో ముగించవచ్చు. స్పెషల్ కోర్టు ఎవరికైనా క్షమాపణ ప్రసాదించి నేరానికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని సంపాదించవచ్చు.

ఆర్గనైజ్డ్ నేరం వల్ల ఎవరయినా మరణిస్తే ఆ నేరస్తుడికి మరణ దండన లేదా జీవిత ఖైదు విధించవచ్చు.

### లేనివి కూడా ఊహించే బలమైన భావనా నియమాలు

సెక్షన్ 17(2) ప్రకారం సిండికేట్ సభ్యుడు గానీ అతని తరఫున మరెవరైనా గానీ స్థిరచరాస్తులు కలిగి ఉంటే, ఆ ఆస్తులు సంపాదించడానికి సరయిన మార్గాలు అనుసరించినట్టు వివరించలేకపోయాడని రుజువయితే, ఆ ఆస్తులు అక్రమంగా సిండికేట్ నేరాల ద్వారా సంపాదించినట్టు భావించి తీరాలి. అంటే నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులు అని రుజువు చేయవలసిన అవసరం ప్రాసిక్యూటర్‌కు లేదు. కాని అది కాదు ఆ విధానాల ద్వారా సంపాదించలేదని రుజువు చేయలేకపోతే శిక్షకు గురయ్యే పరిస్థితి నిందితుడికి ఉంటుంది. నేరాలు చేయకుండా, నేరాల ద్వారా సంపాదించాడని రుజువు కాకుండా కూడా, నేరాల ద్వారా సంపాదించలేదని రుజువు చేయలేనంత మాత్రాన నేరం రుజువైనట్టు భావించే ఈ నియమం ఎంత తీవ్రమయినదో ఊహించుకోవచ్చు. ఇవి కూడా భావించవచ్చు అని చెప్పడం లేదు. భావించి తీరాలి అని నిర్దేశిస్తున్నది. అంటే కోర్టులకు విచక్షణాధికారం ఎంత మాత్రం లేదు. ఎవరినైనా కిడ్నాప్ చేస్తే అది పెద్ద ఎత్తున డబ్బు గుంజడానికే అని భావించాలని సెక్షన్ 17(3) నిర్దేశిస్తున్నది.

అక్రమ ఆయుధాలు, ఇతర పత్రాలు నిందితుడి వద్ద లభిస్తే ఆ ఆయుధాలు పత్రాలు నేరం జరపడానికి వినియోగించారని నమ్మడానికి కారణాలుంటే, ఆ ఆయుధాల మీద పత్రాల మీద, సామగ్రి మీద, వాహనాల మీద నిందితుడి వేలిముద్రలు ఉన్నాయని వేలిముద్రల నిపుణులు సాక్ష్యం చెప్తే నిందితుడు ఆ నేరం చేసాడని స్పెషల్ కోర్టు భావించి తీరాలని సెక్షన్ 21 చెప్తున్నది.

సెక్షన్ 3(2) కింద ఆర్గనైజ్డ్ క్రైం చేసిన వ్యక్తికి లేదా చేసాడని సహేతుకంగా నమ్మడానికి వీలున్న వ్యక్తికి ఆర్థిక సాయం చేస్తే ఆ విధంగా డబ్బిచ్చిన వ్యక్తి ఆ సెక్షన్ కింద నేరం చేసిన వ్యక్తిగా భావించి తీరాలని కూడా సెక్షన్ 22 చెప్తున్నది.

నేరం జరిగి, అందులో భాగస్వామ్యం రుజువైతేనే శిక్షించాలన్న ప్రాథమిక న్యాయ సూత్రాన్ని విస్మరిస్తున్నామన్నది ఇక్కడ గమనించాలి. నేరస్తులను సమర్థించడానికి కాదు. నేరస్తులనే సరిగా గుర్తించి శిక్షించడానికి ఈ నియమాలు చేసారన్న విషయం గుర్తు చేసుకోవాలి.



### ముందస్తు బెయిల్ లేదు

ఈ చట్టం కింద నేరం చేసినట్టు ఆరోపణకు గురి అయిన వ్యక్తి ముందస్తు బెయిల్ తీసుకోవడానికి వీలుండదు. ఎందుకంటే సెక్షన్ 438 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఈ నేరాలకు వర్తించదని సెక్షన్ 21 చెప్తున్నది.

### బెయిల్ కూడా లేదు

ఈ చట్టం కింద నిందితులను బెయిల్‌పైన కానీ, సొంత పూచీకత్తు బాండ్ పైన కానీ విడుదల చేయడానికి వీల్లేదని సెక్షన్ 21(4) స్పష్టం చేస్తున్నది. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు బెయిల్‌ను వ్యతిరేకించే అవకాశం ఇచ్చిన తరువాతనే బెయిల్ గురించి కోర్టులు ఆలోచించాలి. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యతిరేకించిన తరువాత నిందితుడు నేరం చేయలేదని, నేరం చేయబోడని నమ్మడానికి తగిన కారణాలుంటేనే బెయిల్ ఇవ్వాలి అని ఈ సెక్షన్ వివరిస్తున్నది. అంటే సాధారణ నిందితులకు వర్తించే బెయిల్ నియమాలు, న్యాయసూత్రాలు వీరికి వర్తించవన్నమాట.

### కస్టడీ 30 రోజులదాకా

అరెస్టయిన నిందితుడిని 24 గంటల్లోగా కోర్టులో హాజరు పరచాలన్న రాజ్యాంగ నియమం సిఆర్‌పిసి నియమానికి కూడా ఈ చట్టం మినహాయింపు ఇచ్చింది. 24 గంటల్లో పోలీసు పరిశోధన పూర్తి కాకపోతే అధికారి దరఖాస్తు పైన, వారు ఇచ్చిన రికార్డు ఆధారంగా మెజిస్ట్రేట్ నిందితుడి కస్టడీని మరో పదిహేను రోజులు పొడిగించవచ్చునని సెక్షన్ 167 సిఆర్‌పిసి వివరించింది. కాని ఈ కొత్త చట్టం ప్రకారం 30 రోజులపాటు పొడిగించవచ్చు. 30 రోజుల గడువు విధించి ఉంటే దాన్ని 90 రోజులకు పొడిగించాలని సిఆర్‌పిసి నియమాన్ని ఈ చట్టం కోసం మార్చారు.

ఈ చట్టం కింద కాంపిటెంట్ అధికారిగా అదనపు పోలీసు డిజిపిని నియమించాలి. ఈ అథారిటీ ముందు ఎసిపి స్థాయి పోలీసు అధికారులు పెట్టుకున్న దరఖాస్తులు పరిశీలించి అనుమానితులు, నిందితుల వైర్, ఎలక్ట్రానిక్, మౌఖిక కమ్యూనికేషన్‌ను ఇంటర్ సెప్ట్ చేసేందుకు అనుమతించవచ్చు. అంటే ఫోన్‌ను, ఇంటర్‌నెట్‌ను ఈ మెయిల్‌ను ఇతర ఉత్తర ప్రత్యుత్తరాలను ఆపి చదివి టాప్ చేసి సాక్ష్యాలుగా వినియోగించుకోవచ్చు. అరవై రోజులపాటు ఈ విధంగా టాప్ చేసే అధికారం పోలీసులకు లభిస్తుంది. ఈ విధమయిన కమ్యూనికేషన్ సౌకర్యం కల్పించిన వ్యక్తి, పరికరం కస్టడీ ఉన్న వ్యక్తి, ఇంటి యజమాని లేదా తదితరులు పోలీసు అధికారులకు కావలసిన సమాచారం ఇవ్వాలి, సహకరించాలి, సాంకేతికంగా కూడా సహాయం చేయాలి. అథారిటీ ముందు దరఖాస్తు చేసే పద్ధతులు, ఆర్డరు వివరాలు, అథారిటీ నిర్ణయాలపైన రివ్యూ కమిటీకి అప్పీలు చేసుకునే అవకాశాల గురించి వివరమయిన నియమాలు రూపొందించారు. ఈ విధంగా టాప్ చేసి సంపాదించిన సమాచారాన్ని అనుమతించదగిన సాక్ష్యంగా

కోర్టులు పరిగణించి అనుమతించి తీరాలని సెక్షన్ 14(13) నిర్దేశిస్తున్నది. విచారణ జరగడానికి 10 రోజుల ముందు అధారిటీ ఉత్తర్వు కాపీని, టాపింగ్ చేసే అవసరాన్ని రాతపూర్వకంగా వివరించినపుడే ఈ సమాచారాన్ని సాక్ష్యంగా అనుమతించవచ్చు. కాని ఈ 10 రోజుల ముందు సమాచారం ఇవ్వాలనే నియమానికి కూడా మినహాయింపు ఇవ్వవచ్చునని నియమంలో పేర్కొన్నారు.

### దుర్వినియోగాన్ని శిక్షించే మార్గాలు తక్కువ

ఈ విధంగా లభించిన సమాచారాన్ని దుర్వినియోగం చేస్తే లేదా నియమాలను పరిమితులను ఉల్లంఘిస్తే పోలీసు అధికారిని రెండేళ్లపాటు జైలుకు పంపవచ్చుననీ, లక్ష రూపాయల జరిమానా విధించవచ్చునని సెక్షన్ 16 చెప్తున్నది. కాని పోలీసులు సదుద్దేశంతో చట్టం లక్ష్యాల సాధనకు చేసిన పనులను నేరాలుగా పరిగణించి ప్రాసిక్యూట్ చేయడంగానీ సివిల్ కేసు వేయడంగానీ చేయరాదని సెక్షన్ 26 వివరిస్తున్నది. అంటే పోలీసు అధికారులు ఒకవేళ తమ విశృంఖలమయిన అధికారాలను దుర్వినియోగం చేసినా శిక్షించడానికి ఏ మాత్రం వీలు ఉండదని స్పష్టమవుతున్నది. ఈ చట్టంలో దుర్వినియోగం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు కనిపించినా దురుద్దేశంతో ఈ పనులు చేసారని రుజువయితేనే అధికారులపై చర్యలు తీసుకోవచ్చునని నిర్దేశించి వారిని రక్షించారు. నిందితుల నేరం విషయంలో అన్నీ రుజువయినట్టు భావించే నియమాలు రూపొందించి, పోలీసుల ఉల్లంఘనల విషయానికి వచ్చేసరికి దురుద్దేశం రుజువు కావాలని నిర్దేశించడం గమనించాలి.

### సాక్షులకు రక్షణ, ప్రచురణపై నిషేధాలు

ఈ చట్టంలో సాక్షులను రక్షించడానికి కొన్ని నియమాలు చేసారు. విచారణ రహస్యంగా కొనసాగించవచ్చు. (సెక్షన్ 19) సాక్షి వివరాలు దాచిపెట్టవచ్చు. సాక్షి వివరాలు ప్రచురించకుండా నిషేధించవచ్చు. అవసరమయితే కోర్టు విచారణా స్థలాన్నే మార్చవచ్చు. సాక్షుల విచారణ మాత్రమే కాదు, కోర్టు విచారణ వివరాలను ప్రచురించకుండా నిషేధించవచ్చు. సాక్షుల పేర్లు, అడ్రసులు ప్రజలకు అందుబాటులో ఉన్న ఏ రికార్డులో కూడా పేర్కొనకుండా ఆదేశించవచ్చు. అంటే చివరకు తీర్పులో కూడా పేర్కొనడానికి వీల్లేదు. ఫలానా సాక్షిని పిలిపించాలన్న ఆదేశాలను కూడా రహస్యంగా ఉంచవచ్చు. ఈ రకమయిన అపరిమిత అధికారాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటారో ఎంత సులువుగా

# నేరమా?

దుర్వినియోగం కావచ్చో ఎవరయినా ఊహించవచ్చు. ఈ నియమాలను ఉల్లంఘిస్తే ఏడాది జైలు వేయి రూపాయల జరిమానా విధించవచ్చు. (సెక్షన్ 19)

### ఆస్తి జప్తు, స్వాధీనం

నిందితుల ఆస్తిపాస్తులను జప్తు చేయడానికి తరువాత స్వాధీనం చేసుకోవడానికి కోర్టుకు పూర్తి అధికారాలు ఇచ్చారు. కఠిన శిక్షలు, లక్షల రూపాయల జరిమానాలకు తోడు ఆస్తి జప్తుకు కూడా ఆదేశాలు ఇవ్వవచ్చు. విచిత్రమేమిటంటే ఆ ఆస్తులపై వేరే క్లెయింలు ఇతరులెవరికి ఉన్నా అవేవీ లేనట్టుగా భావించి ఆ ఆస్తిని ప్రభుత్వం తీసుకుంటుందని నియమం చేసారు. అంటే ఆ నిందితుడు ఎవరికయినా బాకీ ఉంటే ఆ బాకీలు వసూలు చేసుకునే అవకాశం ఆ మూడో వ్యక్తికి ఉండదన్నమాట.

అవినీతికరమయిన పనులు చేసి డబ్బు విపరీతంగా సంపాదించిన రాజకీయ నాయకులు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి చట్టాలు రూపొందించాలని లా కమిషన్ ఎన్నోసార్లు సూచించింది. ఆ చట్టాలు చేయరు. కాని ఇటువంటి చట్టాలు చేయడానికి వెనుకాడరు.

లా ఆఫ్ అరెస్టును కూలంకషంగా మార్చి పోలీసు అధికార దుర్వినియోగాన్ని అరికట్టడానికి అనేక జాగ్రత్తలు తీసుకోవాలని లా కమిషన్ ఒక వైపు తీవ్రంగా ఆలోచించి ప్రతిపాదనలు రూపొందించి సవరణలపై సలహాలు సేకరిస్తూ సమావేశాలు నిర్వహిస్తుంటే, మరోవైపు సర్కారు వారు పోలీసుల అధికారాలను విపరీతంగా పెంచుకుంటూ హక్కులను హడలెత్తించే ఈ కొత్త శాసనాన్ని రచించారు. ఈ చట్టం ముందు, లా కమిషన్ సంస్కరణలు ఎన్ని తెచ్చినా పౌరహక్కులను రక్షించలేరు. ఇది టెర్రరిస్టు చట్టం కన్న భయంకరమైంది. కాశ్మీరులో కూడా ఇటువంటి శాసనాన్ని చేయాలన్న ఊహైనా వచ్చి ఉండకపోవచ్చు. ఈ చట్టం చేతికి వస్తే నక్సలైట్ ఉద్యమం వంటి ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేయడానికి చాలా ఆస్కారం ఉంది. అధికారంలో ఉన్న పార్టీకి సర్వాధికారాలున్న అధికారుల అండదండలు లభించి మళ్ళీ మళ్ళీ అధికారంలోకి రావడానికి ఉపకరించే అవకాశం ఉంది. పౌరహక్కులు తిరుగుబాటు ఉద్యమాల మీద కాకుండా, నిజమైన గంజాయి మత్తుమందు వ్యాపారులు, రాయలసీమలో హత్యాకాండను కొనసాగించే ఫాక్షన్ ముఠాలను వేశ్యా వ్యాపారులు, మద్యం మాఫియా గ్యాంగులను ఈ ఆయుధం ప్రయోగించి నిర్మూలించగలరన్న నమ్మకం పోలీసులు కలిగించగలరా?

### ఎందుకంత హడావుడి

ఈ బిల్లును అసెంబ్లీ ఆమోదించడం కూడా శరవేగంగా అర్ధరాత్రి జరిగిపోయింది. ప్రతిపక్షాలు వాకవుట్ చేసిన దశలో అధికార పక్ష సభ్యులు కూడా తక్కువగా హాజరీ ఉన్నపుడు నిమిషాల మీద బిల్లు పాస్ అయిందనిపించారు. అసలు ఏమాత్రం చర్చగానీ వ్యతిరేక అభిప్రాయాల పరిశీలనకానీ లేకుండా ఇంత తీవ్ర పరిణామాలున్న శాసనాన్ని యాదాలాపంగా కానివ్వడం చాలా అప్రజాస్వామిక నిర్ణయం. ఈ బిల్లును ఆమోదించినపుడు సభలో దాదాపు యాభై మంది అధికారపక్షం సభ్యులు మాత్రం ఉన్నారు. ఒకొక్క క్లాజ్‌ను సభ ఆమోదానికి పెట్టకుండా, సభ్యుల 'అయెస్' అనుకూల స్వరాలు వినబడక ముందే డిప్యూటీ స్పీకర్ వ్యవహారాన్ని నడిపించి బిల్లు పాస్ అయిందన్నారు. ఇంత హడావుడిగా బిల్లును గట్టెక్కించాల్సిన అవసరం ఏమిటనేది మరో ప్రశ్న.

లక్ష్యాలు ఫలానా అని చెప్పుకున్నంత మాత్రాన సరిపోదు. క్రిమినల్ న్యాయసూత్రాలను మౌలిక నియమాలను పూర్తిగా తిరగరాసే ఈ విధమయిన చట్టాలు చేసుకుంటే ఇక న్యాయ వ్యవస్థ విచారణా వ్యవస్థ ఎందుకు? నేరుగా పట్టుబడిన వాడిని మరుక్షణం ఉరితీయడానికి లేదా జైలులో వేయడానికి, ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి లేదా లక్షల రూపాయల జరిమానా విధించడానికి వీలయ్యే చట్టం చేసుకుంటే ఇక మనకు తాలిబాన్ల వంటి మత ఛాందస పాలకులకు ముషారఫ్ వంటి సైనిక పాలకులకు తేడా ఏమయినా ఉంటుందా? ●

ముగ్గురు సిబ్బందితో, చిన్న అపార్టుమెంటులో మొదలైన 'ఐ2 టెక్నాలజీస్' సంస్థతో ప్రపంచం బిలియనీర్లలో ఏడవస్థానానికి చేరిన హైదరాబాది

# సంజీవ్ సిద్ధూ




మన తెలుగు వాడు.....

హైదరాబాద్‌లో చదువుకున్నవాడు....

కొన్నేళ్ళ క్రితం దాకా ఓ మామూలు ఉద్యోగిగా వున్నవాడు... కాని ఇప్పుడు - ప్రపంచంలోనే నంబర్‌వన్ కోటీశ్వరుడైన సాఫ్ట్‌వేర్ రారాజు బిల్‌గేట్స్ తర్వాతి స్థానంలోకి దూసుకుపోవాలని చూస్తున్నాడు.

ఇప్పటికే - ప్రపంచ టెక్నాలజీ రంగంలోని 33 మంది అపర కుబేరుల్లో ఏడవస్థానంలోకి చేరుకున్నాడు.

ఆయనే సంజీవ్ సిద్ధూ...... ప్రపంచం రూపు రేఖల్నే మార్చేస్తున్న సాఫ్ట్‌వేర్ ప్రపంచంలో తారాజువ్వలా దూసుకు పోతున్నాడు సిద్ధూ.

కేవలం పదేళ్ళ క్రితం ఏర్పాటైన ఆయన సంస్థ "ఐ2 టెక్నాలజీస్" ఇవాళ ప్రపంచ అగ్రశ్రేణి సంస్థల్లోనే ఒకటి.

మహామహా మేధావుల్నే బిత్తరపోయేలా చేస్తూ ఎలక్ట్రానిక్ కామర్స్ (ఇ-కామర్స్)లో 15 శాతం మార్కెట్ వాటాని చేజిక్కించుకుంది.

ఫోర్బ్స్ - ఎఎస్ఎపి వెల్లడించిన ప్రపంచ కోటీశ్వరుల జాబితాలో ఏడవస్థానంలో వున్న సిద్ధూ సంపద సుమారు 980 కోట్ల డాలర్లు (రూపాయల్లో 45 వేల కోట్లకు పైనే). భారతీయుల్లో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, అంబానీ, విప్రో ప్రేంజీలను దాటి మొదటిస్థానంలో వున్నాడు. సంజీవ్‌సిద్ధూ.

ఆయన ఇంతటి ఉన్నత స్థాయికి చేరడానికి పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు.

సిద్ధూ పుట్టిందీ, పెరిగిందీ హైదరాబాద్‌లోనే. ఓ కేంద్ర ప్రభుత్వ సంస్థలో కెమిస్టు అయిన ఆయన తండ్రి ఉద్యోగ రీత్యా హైద్రాబాద్‌లో స్థిరపడ్డాడు. దీంతో ఇదే సిద్ధూ స్వస్థలమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అప్పుడే ఏదో ఉద్యోగంలో చేరేందుకు అవకాశాలున్నా - సిద్ధూ ఆలోచన వేరు. అమెరికా వెళ్ళి ఒక్లహామా యూనివర్శిటీలో కెమికల్ ఇంజనీరింగ్‌లోనే మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. 1980 ప్రాంతంలో టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ అనే కంపెనీకి వైస్ ప్రెసిడెంట్‌గా మారడం - సిద్ధూ శ్రమకీ, అంకితభావానికీ దక్కిన ఓ అరుదైన గౌరవం.

కాని ఆ గౌరవం సిద్ధూకి సంతృప్తి ఇవ్వలేదు. స్వంతంగా ఓ సంస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఆయనని కుదురుగా వుండనివ్వలేదు.

అనుభవమే తప్ప ఆర్థిక వనరులు లేకున్నా వెనక్కి తగ్గలేదు. తన ఉన్నతోద్యోగానికి రాజీనామా చేసాడు. అప్పటికి ఆయన వయసు కేవలం 30 ఏళ్ళే. 'ఐ2 టెక్నాలజీస్' అనే సంస్థను 1988లో ప్రారంభించాడు. డల్లాస్‌లోని ఆయన అపార్ట్‌మెంట్ కొంత భాగమే సంస్థ ఆఫీసు. సిబ్బంది కేవలం ముగ్గురే. వారిలో సిద్ధూ ఒకడుకాగా ఆయన భార్య లేఖ, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ప్రోగ్రామర్‌గా పనిచేసే కేన్‌శర్మ అనే మరో వ్యక్తి వున్నారు. వివిధ కంపెనీలకు వాటి ఉత్పత్తుల నమూనాలు అందజేయడం, ఉత్పత్తులు వేగంగా చవకగా మార్కెట్‌కి చేరేందుకు అవసరమైన వ్యూహాలని సూచించడంపై 'ఐ2 టెక్నాలజీస్' దృష్టి సారించింది. మొదట్లో చాలా ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో ముందడుగేసిన సిద్ధూ-ప్రసిద్ధ సంస్థల దృష్టిని ఆకర్షించగలిగాడు. రక్షణ, ఎలక్ట్రానిక్స్ కెమికల్స్, చమురు ఇలా ప్రధాన రంగాలకు చెందిన ప్రసిద్ధ కంపెనీలు సిద్ధూ పనితీరు బాగా ఆకట్టుకుంది. జిఐ ఎలక్ట్రికల్స్, తోషిబా, ఫిలిప్స్, శామ్‌సంగ్, మోటరోలా, ఐబిఎం వంటివి సిద్ధూ కస్టమర్ల జాబితాలోని కొన్ని ప్రసిద్ధ సంస్థలు.

కేవలం ముగ్గురు సిబ్బందితో ఏర్పాటైన ఐ2 టెక్నాలజీస్ ఇప్పుడు 6000లకు పైగా ఉద్యోగాలతో అమెరికాలోని అన్ని ప్రధాన నగరాలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ ఎక్స్చేంజిలో నమోదైనప్పుడు 20 డాలర్లున్న షేరు ధర కేవలం రెండు వారాల్లోనే 54 డాలర్లకు చేరి సంచలనం సృష్టించింది. గత ఏడాది 'యూక్రెస్ట్ డెవలప్‌మెంట్' అనే ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థను విలీనం చేసుకోవడం - సిద్ధూ వ్యాపార సామ్రాజ్యం రాత్రికి రాత్రే అనూహ్యంగా విస్తరించింది. ప్రపంచ సాఫ్ట్‌వేర్ చరిత్రలోనే దీన్ని అతి పెద్ద విలీనంగా భావిస్తున్నారు. దీంతో సిద్ధూ సంపద ఏకంగా 580 శాతం పెరిగి ప్రపంచ బిలియనీర్స్‌లో ఒకడిగా నిలిపింది. మరో రెండు మూడేళ్లలో బిల్‌గేట్స్ తర్వాత స్థానాన్ని చేరతారని టెలిగ్రాఫ్ పత్రిక చెప్పిన జోస్యం - ఖచ్చితంగా నూటికి నూరుపాళ్లు నిజం ●




దేశంలో తొలి టెలివిజన్ ప్రసారాన్ని ప్రారంభించిన తొలి అనౌన్సర్, న్యూస్ రీడర్, యాంకర్

# ప్రతిమా పురి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, 1959.

'దూరదర్శన్' పేరిట టెలివిజన్ మొట్టమొదటిసారి మనల్ని పలకరించిన రోజు. తొలి ప్రసారానికి ఏర్పాట్లన్నీ చకచకా జరిగాయి. ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ నాటి ముఖ్య అతిథి.

అతి తక్కువ మందికి మాత్రమే బుల్లి తెర అద్భుతాన్ని చూసే అదృష్టం దక్కింది ఆ రోజు. ఢిల్లీ చుట్టుపక్కల కొన్ని ఎంపిక చేసిన చోట్లలో ప్రభుత్వమే కొన్ని టివి సెట్లను అమర్చింది. గంట నిడివిగల ప్రోగ్రాం... అదీ వారానికి రెండు రోజులు మాత్రమే ప్రసారం. ప్రయోగాత్మకంగా అలా మొదలైంది టివి ప్రసారం. వీధుల్లో టివి సెట్లకు గుడ్లప్పగించారు గుంపులుగా మూగిన జనం.

బయట సందడి ఇలా వుంటే స్టూడియో లోపల ఓ అమ్మాయి చాలా నెర్వస్‌గా వుంది.

ఆవిడ పేరు ప్రతిమ పురి. దూరదర్శన్ 'ఫస్ట్ లేడీ'గా ప్రోగ్రాం ప్రెజెంటర్‌గా, వ్యాఖ్యాతగా - కొద్దిక్షణాల్లో దేశమంతటికీ పరిచయం కాబోతున్నానన్న ఆనందం ఉద్వేగం ఆమెని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ధైర్యంగా కెమెరా ముందు నిలబడింది. రాష్ట్రపతి లాంఛనంగా మీటనొక్కి ప్రసారాన్ని ప్రారంభించారు. ప్రతిమా పురి - స్వచ్ఛమైన భారతీయత వుట్టిపడే గెటప్‌లో - దేశ ప్రజలకి అభివాదం చేసి, ప్రసార విశేషాలు చెప్పింది.

ఆ విధంగా - కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ప్రతిమాపురి పేరు జనానికంతా తెలిసిపోయింది. అందరినోటా ఆమె పేరే.

దేశంలో టెలివిజన్ తొలిప్రసారంతో, బుల్లితెరపై కనిపించిన తొలి మహిళ ప్రతిమ - ఆ తర్వాత దాదాపు రెండు దశాబ్దాలపాటు అనౌన్సర్‌గా, న్యూస్ రీడర్‌గా, యాంకర్‌గా, ఇంటర్వ్యూయర్‌గా దూరదర్శన్ అభివృద్ధి క్రమంలో పాలుపంచుకుంది. ప్రసారాలని ప్రెజెంట్ చేయడం, వార్తల్ని చదవడం, ప్రముఖ వ్యక్తులని ఇంటర్వ్యూ చేయడంలో ప్రతిమ చూపిన స్టైల్, చురుకుదనం, స్పాంటేనిటీ ఆ తర్వాతి తరానికి ఓ దారి చూపాయి. అప్పట్లో ఆమె సమర్పించిన 'ఘర్ పరివార్' అనేది మోస్ట్ పాపులర్ ప్రోగ్రాం. ఎన్నో ఏళ్లపాటు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న ఆ ప్రోగ్రాంకి కేవలం ప్రతిమ చార్మింగ్ స్టైలే ముఖ్య ఆకర్షణ అని చెబుతారు.

ప్రముఖులతో ప్రతిమ చేసిన ఇంటర్వ్యూలకి లెక్కలేదు. చంద్రమండలాన్ని ముద్దాడి వచ్చిన తొలి వ్యోమగామి యూరి గగారిన్ దంపతులని చేసిన ఇంటర్వ్యూ ప్రతిమకి బాగా పేరు తెచ్చింది.

వందలు, వేల ఛానెళ్ళు ఇప్పుడు చిన్ని తెర ఎంతగా వికసిస్తున్నా - దేశంలో తొలి టెలివిజన్ ప్రసారాన్ని ప్రారంభించిన తొలి అనౌన్సర్‌గా, న్యూస్‌రీడర్‌గా ప్రతిమా పురి పేరు మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతుంది●


యూరిగగారిన్ దంపతులతో ప్రతిమ ఇంటర్వ్యూ

# ఈ బురిడీబాబా



పరిశోధనాత్మక ధారావాహిక - 15

## ఆడవాళ్ళని 'ఆ-డోళ్ళు'

### పుట్టబాబా బోధనల చిట్టా -

(గత సంచిక తరువాయి)

**"స్త్రీకి కూడా శరీరం ఉంది; దానికి వ్యాయామం యివ్వాలి. ఆమెకి మెదడు ఉంది; దానికి జ్ఞానం యివ్వాలి. ఆమెకి హృదయం వుంది; దానికి అనుభవం యివ్వాలి - అనే సంగతి గుర్తించని ఈ దేశానికి, నేను రాసే సంగతులు అర్థమవుతాయా?"**

అని 75 సంవత్సరాల క్రితం ప్రశ్నించుకుని బాధపడ్డాడు - మహానుభావుడు చలం.

ఇవ్వాల్టికీ మగసంతానం '+'గానూ ఆడ సంతానం '-'గానూ పరిగణించ బడుతోంది. పురిట్లోనే అనేకమంది ఆడశిశువులు హత్యకి గురౌతున్నారు. జనాభాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో స్త్రీల సంఖ్య తగ్గిపోతోంది. స్త్రీలపైన అనేక రకాలైన పీడనలు, అత్యాచారాలు, అణచివేతలు సాగుతున్నాయి.

* * *



చెలం



కందుకూరి

75 సంవత్సరాల్లో ప్రపంచం చాలా మారింది కానీ చలం ప్రశ్న ఇప్పటికీ ప్రశ్నగానే ఉండిపోయింది.

యుగాల పురుషాధిపత్య అణచివేత చీకటి నుంచి, కష్టాన్నుంచీ స్త్రీలు ఇప్పుడిప్పుడే మేలుకుంటున్నారు. దారి వెతుక్కుంటున్నారు.

రాజా రామ్మోహన్‌రాయ్, ఫూలే దంపతులు, కందుకూరి వీరేశలింగం వంటి సంస్కర్తలు ఎందరో స్త్రీ జనాభ్యుదయం కోసం పాటుపడ్డారు.

గడచిన శతాబ్దంలో స్త్రీ విద్య ప్రాధాన్యత, ప్రచారం పెరిగాక స్త్రీల జీవితాల్లో పెద్ద మార్పు వచ్చింది. ఈ రోజు మన దేశంలో పురుషులకి దీటుగా ప్రతీరంగంలోనూ స్త్రీలు తమ శక్తి సామర్థ్యాలని ఋజువుచేసుకుంటున్నారు.

వంటగదుల్నీ, పతి పాద పూజల్ని పక్కనపెట్టి ఇవ్వాల్టి మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి తమకి నచ్చిన రంగంలో ఏదైనా సాధించి చూపాలని, తమని తాము ఋజువు చేసుకోవాలని తపిస్తున్నారు.

కరణం మల్లీశ్వరి, కిరణ్ బేడి, ఇందిరాగాంధీ, కోనేరు హంపి, శకుంతల, లతా మంగేష్కర్, మేధాపాట్కర్ వంటి మహిళలు భారత స్త్రీలు ఏ రంగంలోనైనా అత్యుత్తమ శ్రేణి ప్రతిభని ప్రదర్శించగలరని చెప్పడానికి ఉదాహరణలు.

ప్రతీ పురుషుడి విజయం వెనక స్త్రీ ఉంటుందనేది - ఇవ్వాళ పాత మాట. వెనకాల ఉండటానికి మాత్రమే స్త్రీలు పరిమితం కావాలనుకోవట్లేదు. అవసరమైతే పురుషుణ్ణి వెనక్కి నెట్టి మరీ విజేతలై దూసుకుపోగలుగుతున్నారు.

కొట్టినా, తిట్టినా, అవమానించినా, అణచివేసినా పతిపాదాలే దిక్కు అని ఇవ్వాళ్టి యువతులు అనుకోవట్లేదు. మీ చరణదాసిని, మీ పాదదాసిని - అంటూ భర్తకి లొంగి పడి ఉండేందుకు నేటి మహిళ సిద్ధంగా లేదు.

ఇప్పటివరకూ తిరుగులేనివిగా చలామణి అయిన విలువల్ని, ఆలోచనల్ని, ఆదేశాల్ని చైతన్యవంతులైన ఇవ్వాల్టి స్త్రీలు ప్రశ్నిస్తున్నారు.

మహిళల్లో చైతన్యం పెరుగుతున్న మాట నిజమే అయినా - అంతమాత్రాన స్త్రీలు పూర్తిగా స్వతంత్రులైనారనీ, పురుషాధిపత్య వ్యవస్థ అంతమైందనీ చెప్పలేము.

మనిషి కల్పించిన ఈ కుల, మత, జాతి, లింగ వివక్షలన్నీ - మనిషి దృష్టికే కానీ - ఈశ్వరుడంటూ ఉంటే - ఈశ్వరుని దృష్టిలో ప్రతీప్రాణి సమానమేనని, ఎటువంటి భేదభావం ఉండదని - ఇంగితం ఉన్నవారెవరైనా అంగీకరిస్తారు.

* * *

పుట్టబాబా తనని తాను సకల చరాచర సృష్టికర్తగా, దేవాధిదేవుడిగా చెప్పుకుంటాడు. లక్షలాది మంది ఆయన భక్తులు సైతం నిజమని నమ్మి పూజిస్తున్నారు. మాటమాటకీ ముక్కుపగిలే పురుష దురహంకార దుర్గంధాన్ని వెదజల్లే వ్యక్తి దేవుడెలా అవుతాడు?

స్త్రీలకి సంబంధించి - అత్యంత అభ్యంతరకరమైన, అభివృద్ధి నిరోధకమైన, కుసంస్కారమైన, దుర్మార్గమైన అభిప్రాయాలని - ప్రచారం చేసే వ్యక్తిని ఎవరూ ప్రశ్నించకపోవడం నిజంగా ఆశ్చర్యం.

పైగా ఇటువంటి అభిప్రాయాలతో ఉండే ఈయన విద్యావ్యవస్థని నెత్తిన పెట్టుకుని బలవంతంగా ప్రజల నెత్తిన రుద్దేందుకు కూడా ఒక దశలో రాజకీయ నాయకులు ప్రయత్నించారు.

స్త్రీలకి సంబంధించి పుట్టబాబా అభిప్రాయాలు అత్యంత పురాతనమైనవీ, బూజు పట్టినవీ. ఈయన అభిప్రాయాలని నెత్తిన పెట్టుకునే భక్తులు లక్షలాది మంది ఉండటం వల్లే - ఈయన అభిప్రాయాల్లోని ఉచితానుచితాలని విశ్లేషించక తప్పట్లేదు.

### మనుధర్మం బహు గొప్పది!!(?)

పితారక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే
రక్షంతి స్థావిరేపుత్రా నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి

స్త్రీని బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు రక్షిస్తారు, స్త్రీకి స్వాతంత్ర్యార్హత లేదు - అని మనుస్మృతి ఢంకా బజాయించి చెపుతోంది.

స్త్రీలు స్వభావ సిద్ధంగానే వ్యభిచారగుణం కలవారని, వాళ్ళని పురుషులు ముఖ్యంగా భర్తలు కనిపెట్టి, అదుపులో ఉంచాలని, స్త్రీని వంటపనిలోనూ, ఇంటి చాకిరీలోనూ ఉంచాలని మనుస్మృతి కుటిలమైన నీతులు వల్లిస్తుంది.

శూద్రులపట్ల, స్త్రీలపట్ల, దుర్మార్గమైన వైఖరి తీసుకున్నందుకే నిరసనగా, డా॥అంబేద్కర్ మనుస్మృతిని ప్రతీకాత్మకంగా దగ్ధం చేశారు.

మనుస్మృతిలో అనేక దుర్మార్గమైన విధివిధానాలు ఉన్నాయని - ఈ రోజు అనేక మంది హిందువులు సైతం అంగీకరిస్తున్నారు.

సత్యానికీ, న్యాయానికీ ఏది దూరంగా ఉందో, - అది దైవం నుంచి కూడా దూరంగా ఉన్నట్టే. మనుస్మృతిని దైవశాసనంగా న్యాయబుద్ధి, ఇంగితం ఉన్న హిందువు ఎవడూ అంగీకరించడు.

స్త్రీలపట్ల పుట్టబాబా దృక్పథం నిస్సిగ్గుగా మనుస్మృతిని కౌగలించుకుంటుంది.

మనుధర్మం పట్ల తన ప్రేమను పుట్టబాబా ఏనాడూ రహస్యంగా దాచుకోలేదు. పుట్టబాబా అధికార పత్రిక సనాతన సారధి, మే 1992 నాటి సంచికలో, మనుధర్మం పట్ల పుట్టబాబా వారి అమూల్యాభిప్రాయాన్ని ఇలా ప్రకటించింది:

" మనుధర్మమును మించినది లేదు
అన్నింటికి మూలాధారమైనటు వంటిది మనుధర్మము. దీనికి మించినది ప్రపంచంలో మరొకటి లేదు..." - (పే. 110)



### బాల్యవివాహాలకే బాబాగారి ఓటు

బాల్యవివాహాలపైన మన సంస్కర్తలు విద్యావేత్తలు అలుపు లేకుండా పోరాడి, అది ఒక దురాచారమనే గుర్తింపు తీసుకొచ్చారు. బాల్య వివాహాల్ని ఇప్పుడు ప్రభుత్వం నిషేధించింది కూడా. ఈ దురాచారం ప్రస్తుతం చాలా వరకూ తగ్గుముఖం పట్టింది.

బాల్యవివాహాలని ఈ రోజు కనీసజ్ఞానం ఉన్న వాళ్ళెవరైనా బలపరుస్తారని ఊహించడం కూడా సాధ్యం కాదు.

పురాతన భావాల పుట్ట లాంటి మన బాబాగారి మనసు బాల్య వివాహాలపైన అనురక్తితో నిండి ఉందని తెలిస్తే ఆయన ఆధునిక భక్తులు ఏమని చెపుతారో?

పుట్టబాబా తొలినాళ్ళ భక్తురాలు కుమారమ్మ అలియాస్ విజయకుమారి బాబా భక్తి పారవశ్యంతో రాసిన "అన్యధా శరణం నాస్తి" అనే గ్రంథంలో 82వ పేజీలో బాబాగారి ప్రవచనం ఈ విధంగా ఉంది:

"ఆడ పిల్లలకు సకాలంలోనే పెళ్ళిళ్ళు చెయ్యాలి. వయస్సు మీరితే బాగుండదు. పిల్లలు యెదిగి తల్లితండ్రులకు చేతికందాలి. తల్లితండ్రులకు అరవై దాటినా, పెళ్ళికి యింకా పిల్లలుంటే యమయాతన ఔతుంది వారి జీవితం. అందుకనే ఆ కాలంలో 13, 14 యేండ్లకే పెళ్ళి చేసేవారు. నన్నడిగితే అదే మంచిది"

ఈ చిన్నతనం పెళ్ళిని ఒప్పుకోవడ మంటే, ఇక పుట్టబాబాకి స్త్రీల చదువు గురించి అనుకూల అభిప్రాయం ఎక్కడుంటుంది.

అందుకే అప్పట్లో కుమారమ్మ చదువుకుంటానని చెప్పినా బాబా వ్యతిరేకించి ఆమెని పెళ్ళి వైపుకే నెట్టాడు.

"అమ్మను చూచి 'కుమారమ్మ పెళ్ళెప్పుడు' అన్నారు. ఉరుములేని పిడుగులా నెత్తిన పడింది బాంబు. 'స్వామీ! యిప్పుడే పెళ్ళి చేసుకోను. ఇంకా చదువుతాను. స్వామితోనే వుంటాను' అని బెదురుతూ అంటే 'నీకెందుకు? వరున్ని నేనే చూస్తాను. పెళ్ళి నేనే చేస్తాను. చదువుకొని యేమి చేస్తావు' అన్నారు..."

- (అన్యధా శరణం నాస్తి, పే. 73)

"...నన్ను చూచి 'నీకు నేనే వరున్ని చూచి నేనే పెళ్ళి చేస్తాను అన్నారు. వద్దు మొర్రో అంటుంటే ఒకటే బలవంతం..." - (అదే పుస్తకం, పే. 82)

బలవంతం చేయడమే గాక బురిడీబాబా కుమారమ్మ పెళ్ళిచూపుల్లో కూడా జోక్యం పెట్టుకున్నాడు.

ఒక పెళ్ళికొడుకుపైన బాబా వ్యాఖ్యల్ని చూస్తే, బాబా ఆలోచన ఏ స్థాయిలో సాగుతుందో అర్థం అవుతుంది.

"... కోతి మొహం. వచ్చేటప్పుడు చూశావా! ఆడదానిలాగా కూజా చెంబు పట్టుకొని వచ్చాడు. ఇంకో చేత్తో రేకు పెట్టె, పళ్ళెత్తు, నల్లగా వున్నాడు..."

- (అన్యధా శరణం నాస్తి, పే.83)

ఇదీ వరస - ఇలా 'ఆడదాని లాగా' అనే మాట

---

**గతసంచికల్లో...** పుట్టబాబా దెయ్యాల్ని తోలే నెపంతో, స్త్రీలను జుట్టు పట్టుకుని కొట్టిన సంగతి, గిరగిర తిప్పి గోడకి బంతిలా విసిరి కొట్టిన సంగతి, తల మధ్య భాగం నుంచి వెంట్రుకలు పీకి కింద ముల్లులా పొడవుగా ఉన్న దాన్ని చూపిన సంగతి, కొన్నాళ్ళ తర్వాత ఈ నాటు పద్ధతి మానుకున్న సంగతివివరంగా. పుట్టపర్తిబాబా తెలుగులో ఒక్క లైనుకి మూడు తప్పులు రాసే సంగతి ఆధారాలతో.



పుట్టపర్తి బాబా తానే దేవుడ్ననీ, ఈ విశ్వమంతా తానే సృష్టించాననీ, కృష్ణావతారంలో కుండల కొద్దీ పాలు త్రాగడం వల్ల ఇప్పుడు పాలమీద విరక్తిగా ఉన్నాననీ, ఆకాశాన్ని భూమిగా, భూమిని ఆకాశంగా మార్చగలుగు తాననీ, వేదాలు తననే వర్ణించాయనీ, త్యాగ రాజుకి తానే సంగీతం నేర్పాననీ... ఎలా పడితే అలా గప్పాలు కొట్టే సంగతులు ఆధారాలతో.

పుట్టపర్తిబాబా చెప్పుకున్న అవతార రహస్యం అనబడే అతుకుల బొంత పిట్ట కథ, తనని పొగుడుతూ పూజించమని చెప్పు, తానే రాసుకున్న స్వంత డబ్బా పాటలు, పద్యాలూ కూడా. పుట్టపర్తి బాబా తనకి ఆహారం అక్కర్లేదని, కేవలం ప్రజలకోసమే తింటున్నాననీ దబాయించిన సంగతి.

పుట్టపర్తి బాబా శ్రీరాముడికంటే, శ్రీకృష్ణుడి కంటే తాను అధికుడినని అహంకరించిన సంగతి. శ్రీకృష్ణుడి కాలంలో కంటేతాను జన్మించిన కాలంలో జన్మించడమే భక్తులకి ఎక్కువ అదృష్టమని గొప్పలు చెప్పుకున్న సంగతి. బురిడీబాబా తన గొప్ప తనం చాటుకునేందుకు పార్వతీ పరమేశ్వరుల, ఇతర దేవతా విగ్రహాలను తన పాదాల దగ్గర ప్రదర్శించుకునే సంగతి.

బుద్ధుడిపైన విమర్శలు, బుద్ధుడి వేషంతో బురిడీ బాబా పాదాలపై పడే నాటకం.

యూదుమతం గురించి పుట్టబాబా అజ్ఞానం. నకిలీ దేవుడికి నకిలీ కవుల స్తోత్రాలు. పుట్టబాబా రాశాడని చెప్పే పద్యంలో గణభంగాలు, యతిప్రాసల నియమభంగాలు.

క్రీస్తు పుట్టిన తేదీపై పుట్టబాబా మాటమార్పడం. మోజెస్ క్రీస్తును పూజించాడనే కబుర్లు. బురిడీబాబా సృష్టించాడని చెప్పే 2000 ఏళ్ళ క్రితంనాటి క్రూసిఫిక్స్ బండారం. క్రీస్తు మరణంపై పుట్టబాబా పాసగని వ్యాఖ్యానాలు. శిలువని వేలాడదీశారని వాదనలు. గొర్రె బా-బా- అని తన పేరే జపిస్తుందని చెప్పటం.

బాబా భక్తిప్రచారంకోసం కోట్ల రూపాయల ప్రభుత్వాదాయానికి తూట్లుపొడిచే జీ.ఓ. బండారం. అలెగ్జాండర్ గురించి పుట్టబాబా అజ్ఞానం.



శ్రీ అరవింద యోగి పైన, వివేకానందుడిపైన బురిడీ బృందం దుష్ప్రచారం వివరాలు.

బురిడీబాబాపై అంతర్జాతీయంగా వెల్లువెత్తుతున్న సెక్స్ ఆరోపణల దుమారం వివరాలు.

షిరిడీ సాయి పేరిట బురిడీ బాబా మోసం వివరాలు.

ఆత్మయోగి రమణ మహర్షిపై బురిడీ క్యాంప్ అసత్య ప్రచారం.

 విజయవిహారం పాతకాపీలు కావాలంటే, మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000) కాపీ ఒక్కటి రూ.10/-, రెండవ సంపుటి (మార్చి 2001 తర్వాత) కాపీ ఒక్కటి రూ.15/-

# దేవుడెలా అయ్యాడు?

రచయిత : చంద్రకౌంస్ సీనియర్

తక్కువతనానికి చిహ్నంగా వాడటం బాబాకి ఇష్టమైన అలవాటు. నల్లగా వుండటం వల్ల హేళన కూడా మామూలే.

మరో పెళ్ళి సంబంధాన్ని బురిడీ బాబా తిరగ్గొట్టించాడు: కారణం ఏమీ లేదు, పెళ్ళికొడుకు తండ్రి పెళ్ళిచూపుల్లో కాస్త చొరవ చేసి లోపలికొచ్చి 'నీ పేరేమమ్మా! చక్కగా పాడావు. మీ నాన్నగారు మాకు బాగా స్నేహితులు. సంగీతం యెంతకాలం నేర్చుకొన్నావు? నీకు గీత వచ్చా?' అని అడిగారు అంతే - దాంతో పుట్టబాబాకి తిక్కరేగి ముందు కుమారమ్మని మందలించాడు. తర్వాత ఏమయ్యిందో కుమారమ్మ మాటల్లోనే చూడండి:

"... అమ్మ ఎదురువడితే ఆమెకు నాలుగు వడ్డించారు. ... నాన్న వచ్చారు. ఆయనకూ నాలుగు అంటించారు. 'చూశావా! నీ స్నేహితుల మర్యాద? అమ్మాయి ఒంటరిగా వుంటే, వచ్చి మాట్లాడుతాడా? ఈ సంబంధం వద్దని చెప్పు' అని చీవాట్లు పెట్టి వెళ్ళారు..."

చెయ్యను స్వామీ అన్నాడు. అమ్మో, పచ్చి అబద్ధం. ఈ కాలం యువకులు దండిగా మిస్టేకులు చేస్తున్నారు. '*Missను Take* చెయ్యటం' చాలా విరివిగా జరుగుతున్నది..."

"... ఒక మనిషి చెడేకి కారణం 3 "*W*" అన్నారు. అదే *Woman, Wealth and Wine*"

- (అన్యధాశరణం నాస్తి, పే.253)

పురుషుడు చెడిపోవడానికి కారణం స్త్రీ అయితే స్త్రీ చెడిపోవడానికి కారణం ఎవరు? పురుషుడు కాదా?

స్త్రీని ఒక పాపాల పుట్టగానూ పురుషుడిని పాపంలోకి లాగి పతనం చేసే క్షుద్రురాలిగా చూడటం ప్రపంచంలోని అన్ని మతాల్లోనూ ఉన్న జాడ్యమే.

అవ్వ ఫలాన్ని రుచి చూద్దామని ప్రేరేపించిన కారణంగానే, ఆదాము, అవ్వ స్వర్గ లోకం నుంచి పతితులైనారనీ - ఇటువంటి పాపాల ఫలితంగానే స్త్రీలు ప్రసవ సమయంలో వేదన అనుభవిస్తారని పాశ్చాత్యులు భావించేవారు.

ఉండటం మగతనమనీ, గొప్పనీ చీరలు కట్టుకోవడం మీసాలు లేకపోవడం తక్కువనే అర్థం వచ్చే వాదాలు చెయ్యడం ఏ విధంగా సమంజసం? దీంట్లో దైవత్వమేముంది, ఉత్త పురుషాహంకారం తప్ప.

* * *

పుట్టబాబా ఉద్దేశ్యంలో స్త్రీల విద్యకి పరమార్థం గృహిణులు కావడమే, ఉద్యోగాలు చెయ్యడం కాదు.

"ఎవరు మిమ్మల్ని పెండ్లాడినప్పటికీ - 'ఇలాంటి భార్య నా అదృష్టవశాత్తూ లభించింది' అని భర్త అనుకుంటే - అదే ఘనత. 'సత్యసాయి ఇన్‌స్టిట్యూట్‌లో చదివిన విద్యార్థిని మాకు కోడలుగా వచ్చింది. ఈమె చాలా గుణవంతురాలు' అని అత్తమామలు చెప్పుకుంటే - అదే ఘనత. ఇంతకంటే ఘనత మీరు సాధించనక్కర లేదు."

- (సనాతన సారధి, జనవరి 1992, పే.7)

- ఇదీ వరస, విద్యార్థిని లక్ష్యం మంచి భార్య కావడం, మంచి కోడలు కావడం, ఇంకేమి సాధించక్కర్లేదు -

విద్యార్థికైతే మాత్రం ఇలా మంచి 'భర్త' కావడం, మంచి 'అల్లుడు' కావడం ఒక్కటే లక్ష్యమని అంతకంటే సాధించాల్సింది ఇంకేమీ లేదని పుట్టబాబా అనగలడా?

విద్యార్థిని అంతకంటే సాధించాల్సింది ఇంకేమీ లేదా?

"పురుషులకి ప్రత్యేకించి ఒక్కొక్కరికీ వేరు వేరు ఆదర్శాలూ జీవితోద్దేశాలూ ఉన్నాయి. స్త్రీలందరికీ కలిపి

సాహిత్యమంతటా ప్రసిద్ధంగా వినిపిస్తుంది.

"ఉద్యోగములు చేయ ఉవిదలందరు పోవ
ఇంటిలోనుండెడి ఇంతులెవరు?
ఆలుమగలు యిద్దరు ఆఫీసులకుపోవ
గృహమును దిద్దెడి గృహిణి ఎవరు?
పర బాలురకు నేర్ప పాఠశాలలకు పోవ
తమ బాలురకు చెప్పు పడతులెవరు?
పుస్తకాల్ చేపట్టి పురుషులవలె పోవ
వంట యింటిలో పనిచేయు వనిత ఎవరు?
డబ్బులేని యట్టి యిబ్బంది తీరిన
ఇంటిలోని కొరత ఎట్లు తీరు?
సుఖము చూడబోవ శూన్యమేయగుకదా!
పదవి యందున్న పడతికెపుడు"

బురిడీ బాబా రాసిన ఈ పద్యం బురిడీ సాహిత్యంలో ఎడాపెడా తగుల్తూనే ఉంటుందని ఇందాకే చెప్పాను.

శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతి నిలయం వారు ప్రచురించిన "శ్రీ సత్యసాయి దివ్యబోధ" పుస్తకంలో 65, 66 పేజీల్లో ఈ పద్యం కనిపిస్తుంది. జనవరి 1999 నాటి సనాతన సారధి పత్రికలో 9వ పేజీలో ప్రచురించిన పుట్టబాబా ఉపన్యాసంలో ఈ పద్యం ప్రసక్తి ఉంది. పుట్ట ప్రవచనాలతో డా॥ జంధ్యాల సుమన్ బాబు కూర్చి శ్రీ సత్యకృష్ణ పబ్లికేషన్స్, కాకినాడ వారు ప్రచురించిన "అమృతవాణి" పుస్తకం 37వ పేజీలో ఈ పద్యం ఉంది.

రిటాబ్రూస్ అనే అమెరికా భక్తురాలు రాసిన 'విజన్ ఆవ్ సాయి' పార్ట్ -1 అనే పుస్తకంలో 126వ పేజీలో ఈ పద్యం ఇంగ్లీష్ అనువాదం కూడా వుంది.

స్త్రీలకి సంబంధించి బురిడీ బాబా దృక్పధాన్ని, బోధల్ని వివరంగా చెప్పేందుకు ఆర్. సీతాలక్ష్మి రచించిన "భగవాన్ శ్రీ సత్యసాయి స్త్రీ ధర్మ ప్రబోధం" పుస్తకంలో 80, 81 పేజీల్లో ఈ పద్యాన్ని ఇచ్చారు. దురదృష్టమేమంటే ప్రఖ్యాత చిత్రకారుడు బాలి ఈ పుస్తకంలో ఈ పద్యానికి రంగురంగుల బొమ్మలు సైతం గీశారు.

# అని వెక్కిరించిన బురిడీ బాబా

## (మొదటి భాగం)

## ఒట్టి పురుషాహంకార ప్రవచనాల తుట్ట



స్వభావ సిద్ధంగానే స్త్రీలు వ్యభిచారశీలత్వం కలవారని - మనుస్మృతి పరమ దుర్మార్గంగా ప్రకటించింది.

* * *

మగవాళ్ళు ఎక్కువ ఆడవాళ్ళు తక్కువ అనే పురుషాహంకార భావం పుట్టబాబా నరనరాల్లోనూ జీర్ణించుకుని ఉంది.

ఒకటే. గుర్రాలకి సవారీ, కుక్కలకి యిల్లు కాయడం లాగు, పుట్టినప్పట్నించి ఆడపిల్లకి పెళ్ళి ఆదర్శం. అందరు ఆడపిల్లలకీ అంతే" అని చెలం బాధపడ్డాడు.

(చూడండి: స్త్రీ, పే.51)

### గృహలక్ష్మా? ఆఫీసులక్ష్మా?

స్త్రీలు ఉద్యోగం చెయ్యడం బురిడీ బాబా హర్షించడన్నది బహిరంగ రహస్యమే -

మనుస్మృతి ఇలా చెపుతోంది:

అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్,
శౌచే ధర్మేన్నపక్త్యాంచ పారిణాహ్యస్యచేక్షణే

స్త్రీలని ధనం కాపాడటంలోనూ, ఖర్చు చేయడంలోనూ, పదార్థాలని, శరీరాన్ని పరిశుభ్రపరచడంలోనూ, భర్త శుశ్రూష మొదలైన కార్యాల్లోనూ, వంట వార్పుల్లోనూ, గృహోపకరణాలని సంరక్షించడంలోనూ నియమించాలి.

బురిడీ బాబా విరచితమైన పద్యం ఒకటి బురిడీ

ఈ పద్యం, ఇందులోని భావం లక్షలాది మంది మీద ప్రభావం వేస్తోంది.

"పుస్తకాల్ చేపట్టి పురుషుల వలె పోవ వంట యింటిలో పనిచేయు వనిత ఎవరు?" అని స్త్రీలని బురిడీబాబా విమర్శిస్తున్నపుడు - పుస్తకాలను కేవలం పురుషులే చేపట్టాలని, స్త్రీలు కేవలం వంట యింటికే పరిమితం కావాలనే విష సందేశం భక్తుల మెదళ్ళపై ముద్రించబడుతోంది.

'అవును నిజమే - స్త్రీలు కూడా పురుషుల్లాగా పుస్తకాలు తీసుకుని వెళ్తుంటే ఇంక వంటింట్లో వంట ఎవరు చేస్తారు?' అనేది ఒక సహజమైన ప్రశ్నలాగే భక్తులకి ధ్వనిస్తుంది. మనువు కూడా స్త్రీలని వంటపనికి నియమించమని చెప్పాడు.

అయితే మరి ఈ ప్రశ్నకి సమాధానం లేదా? స్త్రీలు కూడా పుస్తకాలు పట్టుకుని తయారైతే ఇంతకీ వంట ఎవరు చేస్తారు?

⇨



- (అన్యధా శరణం నాస్తి, పే.83)

స్త్రీ విద్య అన్నా, విద్యావంతురాలైన స్త్రీ అన్నా పుట్టబాబాకి తేలికైన అభిప్రాయం ఉన్న సంగతి ఆయన బోధనల్లో బయట పడుతూనే వుంటుంది.

"నేటి విద్యావంతులైన స్త్రీల ప్రవర్తన, వారి అభిరుచులు, వారు చదువు సాహిత్యము, వారు చూచు అసభ్యమైన చలనచిత్రములు జుగుప్స కలిగించక మానవు." - (శ్రీ సత్యసాయి సూక్తులు, పే.39)

విద్యావంతులైన పురుషులు చదివే సాహిత్యం, చూసే సినిమాలు కాకుండా స్త్రీలు ఏదైనా ప్రత్యేకంగా చదువుతున్నారా?, చూస్తున్నారా?. మరి విద్యావంతులైన పురుషులని వదిలి కేవలం స్త్రీలనే వేలెత్తి చూపాల్సిన అవసరం ఏమొచ్చింది?

### మరికొన్ని నేలబారు ప్రవచనాలు

"... నీవు యే *Mistake* చేస్తావురా అన్నారు.

'మగతనం' అంటే ఏదో గొప్పని ఆడవాళ్ళంటే ఏదో తక్కువనే అభిప్రాయం ఆయన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.

"... సేవలో పాల్గొనని మగవారి మగతనమెందుకు? అట్టివారు చీరలు కట్టుకుంటే మంచిది. సేవలలో పాల్గొనని వారు పంచలు కట్టుకోవడం, ప్యాంట్లు వేసుకోవడం అవమానమే!..."

"... తోటి మానవునికి సహాయం చేయనప్పుడు నా మగతనమెందుకు? బొద్దింకకు మీసాలున్నాయి, ఎలుకకు మీసాలున్నాయి, దోమకు మీసాలున్నాయి, నాకూ మీసాలున్నాయి!! ఇంక భేదమేమిటి? కనుక తోటివారికి సహాయం చేయలేనప్పుడు మీసాలు అనవసరం..."

- (సనాతన సారధి, జనవరి 1994, పే.7)

ఈ ప్రబోధాలన్నీ సేవకోసం చెప్తున్నట్టు కనిపించినా ఉపమానాలన్నీ అభ్యంతరకరమైనవే.

ఇలా పంచలు, పాంట్లు వేసుకోవడం మీసాలు

అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

ఈ ప్రశ్నకి నిజమైన జవాబు - 'ఏం పురుషులు చెయ్యకూడదా, ఆ వంటపని?' అనే ప్రశ్నే.

వంట చేయడం మాట అటుంచి కనీసం వంట పనిలో పురుషుడు సహకరించాలని కూడా పుట్టబాబా ఎక్కడా చెప్పడు.

"పని లేక ఇంట్లో సోమరిగా కూచునే పనికిమాలినవాడు కూడా, వూళ్ళో జీతానికి వంట చేసేవాడు కూడా భార్యకి వండిపెట్టడు. ఆమె యెంత తెలివైనదైనా సరే! శాస్త్రాల్లో భర్తకి భార్య సేవ చెయ్యాలని వుంది. భార్యకి సేవ చెయ్యమని వుందా! దయగా కుక్కల్నీ, ఆవుల్నీ చూసినట్లు చూడమని వుంది. పొలం మీద వచ్చే డబ్బుతినే ఈ సోమరి మొగవాళ్ళందరూ యేమిటి లోకంలో చేస్తున్న పని? భార్యకి వంటచేసి పెట్టరాదూ? ఇళ్ళూడవలేరూ? పైగా ఒక్క భర్తకేగాక, తత్సంబంధమైన సోమరిపోతులందరికీ సేవ చెయ్యాలి స్త్రీ. వంట విషయమై నియోగింపబడిన, జీతం భత్యంలేని ఒక 'స్త్రీ బానిస' సంఘంలో తేరగా పడివుండడం వల్ల, యీ పురుషులకి రుచులెక్కువైనాయి. నాలుగు గంటలు పదార్థాలు తయారు చేయవలసినంత నాజూకు బలిసింది భోజనపు రుచులలో. వంటమనిషిని పెట్టుకోలేనంతటి బీదవాడికి కూడా, దేవుడేర్పరచిన వంటమనిషి తయారుగా వుందిగా! యేం? హోటల్లో భోజనం చెయ్యలేడూ! 'అమ్మా పెళ్ళాము ఉండగా హోటల్లో భోజనం చేసే ఖర్మమేం నాకు?' అంటాడు. భార్య చచ్చిపోతే, 'వొండిపెట్టే దిక్కన్నా లేద'ంటాడు. భార్యల ఉపయోగం స్పష్టంగా తెలుస్తోనే వుంది. వీళ్ళే పెద్దబల్లల మీద యెక్కి భార్యా, గౌరవం, సహధర్మచారిణీ' అని వుపన్యాసాలిచ్చేది..."

అని చెలం 75 సంవత్సరాల క్రితమే ఈ మనస్తత్వాన్ని చాకిరేవు పెట్టాడు.

(చూడండి : స్త్రీ, పే. 54)

"దేశ నాయకుడో శాస్త్ర పండితుడో కావలసిన పురుషుణ్ని చెప్పులుకుట్టే పనిలో పెడితే దేశానికెంత నష్టం! అతనికెంత బాధగా వుంటుంది! స్త్రీ కట్లా కాదూ! యెందరు నర్తకుల్నీ, చిత్రకారుల్నీ, కవులని, శిల్పుల్నీ, యంత్రకారుల్నీ, స్త్రీలలో తరతరమూ దేశం పోగొట్టుకుంటోందో! రాజ్యమేలగల స్త్రీలుకూడా అంట్లే తోముతున్నారు" - (స్త్రీ, పే. 52, 53)

అని చెలం ఆవేదన పడ్డాడు.

"నేడు సమాజములో ప్రబలుచున్న అన్యాయ అధర్మ అక్రమ అత్యాచారములకు కారణము తల్లుల పెంపకంలోని లోపమే..." అంటాడు పుట్టబాబా.

(చూడండి:సత్యం శివం సుందరం,తృతీయ భాగము, పే.7)

ఇది తప్పు. పిల్లలు బాగుపడినా, చెడిపోయినా అందుకు బాధ్యత తల్లితండ్రులిద్దరిదీ. చెడిపోతే తల్లిదే బాధ్యత అని చెప్పడం అన్యాయం.

పురుషులు చేయలేనివి, స్త్రీలు చేయగలిగినవీ పనులు రెండే - స్త్రీలు 9 నెలలు మోసి పిల్లల్ని కనగలరు, శిశువులకి పాలిచ్చి పోషించగలరు. ఈ రెండు పనులూ పురుషులు చేయలేరు.

మిగతా పనులన్నీ స్త్రీ చేసేవి పురుడు కూడా చేయగలడు. ఇంటి పని, వంటపని, పిల్లల పెంపకం పురుషుడు చేయగలిగిన పనులే.

'మాతృత్వం' ఎంత గొప్పదో, ఎంత తీయనిదో, పితృత్వం కూడా అంతే గొప్పదీ, తీయనిదీ.

ఇంటి చాకిరీ, పిల్లల చాకిరీ పూర్తిగా స్త్రీల బాధ్యతేననే పరిస్థితి మారాలి. ఇప్పుడు చాలా వరకూ మారుతోంది కూడా.

దీనర్థం స్త్రీలందరూ ఖచ్చితంగా ఉద్యోగాలు చేసి తీరాలనీ, పురుషులు వంటపనే చెయ్యాలని కాదు.

స్త్రీ పురుషుల్లో ఎవరు ఏ పని చేయడానికైనా ఎటువంటి ఆటంకం అభ్యంతరం ఉండకూడదూ - ఏ పనీ ఒక్కళ్ళకే 'విధి' కాకూడదు.

ఉద్యోగాలు చేయడానికి స్త్రీలు, పురుషులు వెళ్ళి ఆర్థిక బాధ్యతలు పంచుకున్నట్టే, ఇంట్లో పని బాధ్యతలూ పంచుకోవచ్చు.

'పరబాలురకి' నేర్పడానికి పురుషులు పాఠశాలలకి వెళ్ళినపుడు ఇంట్లో 'తమ బాలురకు' ఎవరు చెప్తున్నారనే ప్రశ్న వస్తోందా?

మరి స్త్రీలు ఆఫీసుకి వెళ్ళినపుడు మాత్రం 'పరబాలురకు నేర్ప పాఠశాలలకు పోవ తమ బాలురకు చెప్పు పడతులెవరు?' అనే ప్రశ్న ఎందుకు రావాలి?

ఇంటిదగ్గిర తమ బిడ్డలకి శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత తల్లితండ్రులిద్దరిదీ.

బురిడీ బాబా దృష్టిలో మాత్రం స్త్రీ జీవిత పరమార్థం ఇంటి చాకిరీనే. అందుకు ఆధారాలు ఆయన రచనల్లో మనకి కొల్లలుగా దొరుకుతాయి.

"...స్త్రీలు పెందలకడనే నిద్రలేచి గృహమును శుభ్రపరుస్తారు. స్నానాది కృత్యాలు తీర్చుకొని జపధ్యానాలు చేసుకుంటారు..." - (అమృతవాణి, పే.32)

"... మీ గృహకృత్యములను మీరే నిర్వర్తించండి..."
- (భగవాన్ శ్రీ సత్యసాయి స్త్రీ ధర్మ ప్రబోధం, పే.224)

"... స్త్రీ ప్రధాన ధర్మం, గృహధర్మం. ఉద్యోగం కాదు..." - (అదే పుస్తకం, పే. 228)

"... మీ ఇంటి పనులనైనా చక్కగా చేసుకోండి. ఇంటిని శుభ్రంగా వుంచుకోండి. మీ భర్తను పిల్లలను చక్కగా చూసుకోండి. దానిని మించిన కర్తవ్యం మరొకటి లేదు..." - (అదే పుస్తకం, పే. 233)

అసలు మగవాళ్ళకి వంట పనులు రావని ఆడవాళ్ళకే వచ్చని పుట్టబాబా అభిప్రాయం.

"ఎంత వంటకు ఎంత మంట? ఎంత పప్పుకు ఎంత ఉప్పు? అనేది వారికే తెలుసు. మగవారికి తెలిసినా వారు అలక్ష్యం చేస్తూ ఉంటారు."

- (సనాతన సారధి, జనవరి 1994, పే.7)

ఇదీ పుట్టబాబా వాదన.

కానీ అటువంటప్పుడు పుట్టబాబా 'అలక్ష్యం' చేసే మగవారిని మందలించి సరిచేసే ప్రయత్నం చేస్తే బాగుంటుంది.

అది మానేసి, మగవాళ్ళకి వంట రాదనే వాదాలు మొదలు పెడితే ఎలా?

ఈ రోజు పెద్ద పెద్ద స్టార్ హోటళ్ళలో దేశవ్యాప్తంగా (ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా) పేరు మోస్తున్న పాకశాస్త్ర ప్రవీణులు మగవాళ్ళే.

హిందూ పురాణాల ప్రకారం కూడా గొప్ప వంటగాళ్ళు నలుడు, భీముడు. అందుకే వంటని మెచ్చుకునేటప్పుడు 'నలభీమ పాకం' అనే మాట వాడతారు.

ఎంత వంటకు ఎంత మంట, ఎంత పప్పుకు ఎంత ఉప్పు - మగాళ్ళకి తెలీదనడం - ఆడవాళ్ళని వంట ఇళ్ళకి కట్టెయ్యడానికే. తెలీదంటే కుదరదు, తెలుసుకోవాలనీ అవసరమైతే వంట బాధ్యత తీసుకోవాలనీ మగవాళ్ళకి చెప్పాల్సిందే.

ఇటువంటి సమంజసమైన ఆలోచనలు, ప్రశ్నలు బురిడీ బాబా పురుషాహంకార చత్వారదృష్టికి అగుపించకపోవడంలోనూ అర్థం కాకపోవడంలోనూ ఎటువంటి ఆశ్చర్యం లేదు.

ఆయన వక్రదృష్టికి పరాకాష్టగా ఆఫీసులక్ష్మి, గృహలక్ష్మి, ఇంటిస్త్రీ, ఆఫీసు స్త్రీ - అంటూ వెకిలి తర్కాన్నే ప్రదర్శించాడు, చూడండి:

"స్త్రీని గృహలక్ష్మి అన్నారు కానీ ఆఫీసు లక్ష్మి అనలేదు. స్త్రీకి మరొక పేరు అర్ధాంగి అని. అంటే భర్తలో ఆమె సగము అని, అంతే గానీ ఉద్యోగంలో భాగస్వామిని అని కాదు. స్త్రీకి ఇల్లాలు అని మరొక పేరు. దానికి అర్థం ఇంటి స్త్రీ అని, అంతేగానీ ఆఫీసు స్త్రీ అని కాదు"

- (అమృత వాణి, పే. 27)

దురదృష్టమేమంటే ఈ వెకిలి తనాన్ని దివ్య ప్రవచనాలుగా భావించేవాళ్ళు ఉండటం, అందులోనూ స్త్రీలు కూడా ఉండటం.

వచ్చే సంచికలో పుట్టబాబా స్త్రీకి భర్తే దేవుడని చెప్పిన సంగతి, స్త్రీ తల మీద కెక్కికూర్చుంటుందని చెప్పిన సంగతి, స్త్రీలని 'ఆ-డోళ్ళు' అని వెక్కిరించిన సంగతీ - మరెన్నో సంగతులు విపులంగా మాట్లాడుకుందాం.

(ఇంకావుంది)



## పుట్టబాబా ఉవాచ:11

### తూ.. సాయి

'తూ రామా, తూ కృష్ణా, తూ సాయి... అంటూ, 'తూ' అనే శబ్దాన్ని ఉపయోగపెడుతుంటారు. 'తూ' అనేది చాలా చెడ్డ శబ్దము, కావాలంటే 'తూహై' అని పాడుకోవచ్చుగాని, 'తూ' అనే శబ్దాన్ని ఉపయోగించకండి..

- సనాతన సారధి, మార్చి 2001,పే.81



# ప్రపంచాన్ని ముంచుతున్న ఆర్థిక మాంద్యం

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడి అనేక రంగాలు అస్తవ్యస్తం అయ్యాయి. ఈ ఆర్థిక మాంద్యం కారణంగా 2001 సంవత్సరంలో ప్రపంచ వాణిజ్యంలో అయిదు శాతం క్షీణత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ప్రపంచ వాణిజ్య సంస్థ హెచ్చరించింది. 2000 సంవత్సరంలో ప్రపంచ వాణిజ్యం వృద్ధి రేటు 12 శాతం కాగా ఈ ఏడాది అది ఏడు శాతానికి పరిమితం అయ్యే అవకాశం ఉన్నదని సంస్థ తన నివేదికలో హెచ్చరించింది.

ఇదిలా ఉండగా ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా ఆర్థిక వ్యవస్థలో తిరోగమనం ఒకప్పటి ఊహాత్మక స్థాయి నుంచి వాస్తవ స్థాయికి చేరిందని ప్రపంచ ఆర్థిక వ్యవస్థల తీరుతెన్నులపై అధ్యయనం చేసే ఎకనామిక్ సైకిల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఇసిఆర్ఐ) తేల్చి చెప్పింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనం స్థాయిని దాటి తిరోగమనం స్థాయిలో పరుగెడుతున్నదని ఈ సంస్థ గత మార్చిలోనే హెచ్చరించింది. 1990 ఫిబ్రవరిలో అప్పటి తిరోగమనం వాస్తవరూపం దాల్చడానికి ముందు కూడా ఈ సంస్థ ఇదే తరహా హెచ్చరికలు చేసింది. గతంలో కూడా ఏర్పడిన కొన్ని తిరోగమన పరిస్థితుల్లో అమెరికా ఆర్థిక వ్యవస్థలోని అత్యంత కీలక రంగాల తీరుతెన్నులను, వాటి ప్రవర్తనా శైలిని సమగ్రంగా అధ్యయనం చేస్తే అమెరికాలో తిరోగమనం ఇప్పటికే ప్రవేశించిందని తేలుతున్నదని ఈ సంస్థ హెచ్చరించింది. తిరోగమనాన్ని నిర్వచించే సూచికలన్నీ ఈ వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయని సంస్థ పరిశోధన విభాగం డైరెక్టర్ అనిర్బన్ బెనర్జీ తెలిపారు.

మరోపక్క భారతదేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉన్న కారణంగా సరళీకృత విధానాల ఫలాలు, మార్కెట్ సంస్కరణల ఫలాలను పూర్తిగా అందుకోలేక పోతున్నట్లు ఆసియా అభివృద్ధి బ్యాంకు పేర్కొంది. ఎడిబి ఇటీవల విడుదల చేసిన ఏషియన్ డెవలప్‌మెంట్ ఔట్‌లుక్ - 2001 నివేదికలో ఈ విషయాన్ని నిష్పక్షపాతంగా ప్రకటిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిగజారుడు ఆర్థిక విధానాలు ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక ప్రయోజనాలకు భంగకరంగా నిలుస్తున్నాయని సూచించింది. 2000 సంవత్సరంలో భారతదేశంలో స్థూల జాతీయోత్పత్తి ఆరు శాతం స్థాయిలో వృద్ధి చెందిందని, ఇందులో వ్యవసాయ రంగం ప్రగతి 0.9 శాతం, పారిశ్రామిక రంగం ప్రగతి 6.6 శాతం, సర్వీసుల రంగం ప్రగతి 8.3 శాతం స్థాయిలో ఉన్నాయని నివేదిక సూచించింది. 1999లో సాధించిన 6.4 శాతం అభివృద్ధి రేటు కన్నా ఇది తక్కువే అయినప్పటికీ గత ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఆర్థిక వ్యవస్థల్లో ఇండియా ఒకటిగా నిలిచిందని పేర్కొంది. రానున్న రెండు సంవత్సరాల కాలంలో జిడిపి వృద్ధి రేటు ఈ ప్రకారంగానే ఉంటుందని అంచనా వేస్తూ 2001లో 6.2 శాతం. 2002లో ఏడు శాతం ఉండే అవకాశం ఉన్నదని పేర్కొంది. అయితే అత్యంత కీలకమైన రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడులు పెట్టకపోవడం పెద్ద సవాలుగా పరిణమించిందని సూచించింది.

అత్యంత ప్రధానమైన నీటిపారుదల రంగంలో పెట్టుబడులు తగినంతగా లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం ప్రగతి కుంటుపడిందని పేర్కొంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడుల రాక 1970, 1980 దశకాల్లో 21 శాతం ఉండగా 1990 దశకంలో 9.2 శాతానికి పడిపోయిందని తెలిపింది. అదే విధంగా ప్రభుత్వ, ప్రయివేటు మౌలిక వసతుల్లో కూడా పెట్టుబడులు తగ్గిపోయాయన్న విషయాన్ని గుర్తు చేసింది. దీని వల్ల పారిశ్రామికాభివృద్ధికి అవరోధం ఏర్పడిందని తెలిపింది. ఇక విద్యుత్ రంగం విషయానికి వస్తే ఎనిమిదో ప్రణాళిక కాలంలో నిర్దేశిత ఉత్పాదకత పెరుగుదల లక్ష్యంలో 50 శాతం కొరత ఏర్పడిందని సూచించింది. జిడిపిలో దేశంలోని అన్ని రాష్ట్రాల ఉమ్మడి ఆర్థికలోటు 1993లో ఉన్న 2.3 శాతం నుంచి 1998 నాటికి 4.3 శాతానికి పెరిగి ఇప్పుడు అయిదు శాతానికి చేరువలో ఉన్నదని తెలిపింది. అన్ని రాష్ట్రాల ఉమ్మడి రుణాలు జిడిపిలో 20 శాతం స్థాయిని దాటాయని తేల్చింది. నిర్దేశిత అభివృద్ధి లక్ష్యాన్ని సాధించాలంటే భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు దిగజారుతున్న ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు దృష్టి సారించాలని సూచించింది.

## తిరోగమనంలో మౌలిక పరిశ్రమలు

దేశంలో ఆరు మౌలిక పరిశ్రమలు 2001 ఏప్రిల్ నెలలో పూర్తి తిరోగమనంలో పడ్డాయి. బొగ్గు, ఉక్కు, ముడిచమురు రంగాలు పూర్తిగా మందగించిపోగా ఒక్క సిమెంట్ రంగం సాధించిన స్వల్ప వృద్ధి కారణంగా వృద్ధిరేటు 1.1 శాతానికి పరిమితం అయింది. సిమెంటురంగం ఆదుకోని పక్షంలో మొత్తం మౌలిక పరిశ్రమలరంగమే కుప్పకూలిపోయి ఉండేదని విశ్లేషకులు అంటున్నారు. 2000 ఏప్రిల్ నెలలో దేశంలో మౌలిక పరిశ్రమల రంగం 7.8 శాతం వృద్ధిరేటును సాధించింది. గత ఏడాది ఏప్రిల్‌లో 0.5 శాతం ప్రతికూల వృద్ధిరేటును సాధించిన సిమెంట్ రంగం ఈ ఏప్రిల్‌లో 3.6 శాతం వృద్ధిరేటును సాధించి మౌలిక పరిశ్రమల రంగాన్ని ఆదుకుంది.

పెట్రోరిఫైనరీ రంగం గత ఏప్రిల్‌లో 32.8 శాతం వృద్ధిరేటు సాధించగా ఈ ఏడాది అది - 1.4 శాతానికి పడిపోయింది. బొగ్గు రంగం వృద్ధిరేటు 15.8 శాతం నుంచి 0.9 శాతానికి క్షీణించిపోగా విద్యుత్‌రంగం కేవలం 1.2 శాతం వృద్ధిరేటుతో సరిపెట్టుకోవలసివచ్చింది. అదేవిధంగా స్టీల్ రంగం వృద్ధిరేటు 5.7 శాతం నుంచి 0.6 శాతానికి పడిపోయింది.



మౌలిక పరిశ్రమలకు మంచి రోజులు ఎప్పుడో?

## కల్లలయిన డాట్‌కామ్ కలలు

### 64 లక్షల అమెరికన్లకు ఉపాధికరవు

అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనం ప్రభావం డాట్‌కామ్ కంపెనీల పై గణనీయంగా పడింది. ఇంటర్నెట్ ఆర్థిక వ్యవస్థను ఆధారం చేసుకుని సొమ్ము చేసుకుందామని అమెరికా వెళ్ళిన భారతీయులు కలలు కల్లలై తిరుగుముఖం పట్టలేక, అమెరికాలో మనలేక తల్లడిల్లుతున్నారు. అమెరికాలోని ఇంటర్నెట్ కంపెనీలు 2000 సం॥లో 50 వేల ఉద్యోగాలను తగ్గించివేశాయి. అనేక మంది భారతీయులు దివాలా తీసి ఐపి పెట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కలెక్షన్ ఏజెంట్లు తమ కార్లను. ఇతర విలువైన వస్తువులను ఎప్పుడు పట్టుకుపోతారో అని భయపడుతూ రోజులు లెక్కపెట్టుకుంటున్నారు. ప్రధానంగా భారతీయులు ఎక్కువగా నివశించే శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉద్యోగాల కోత ఖ్యలో ఉన్నదని ప్లేస్‌మెంట్ సంస్థలు చెబుతున్నాయి. 2001 సం॥లో మరో అయిదు లక్షల వరకు హైటెక్ ఉద్యోగాలకు ముప్పు వస్తుందని పరిశ్రమవర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతే కాకుండా పోయినసి పోను ఇప్పుడు పని చేస్తున్న శాన్‌ఫ్రాన్సిస్కో ప్రాంతంలోని డాట్‌కామ్ కంపెనీలు కూడా దివాలా స్థితిలో ఉన్నాయనీ, అవి కూడా ఈ ఏడాది పూర్తిగా మూసివేసే ప్రమాదంలో పడ్డాయని వారంటున్నారు. అదే జరిగితే డాట్‌కామ్ రంగంలో మరో 30 వేల మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. మొత్తంమీద అమెరికాపై ఎన్నో ఆశలతో వెళ్ళిన భారతీయులు దిక్కుతోచని స్థితిలో దారం తెగిన గాలిపటం చందంగా బతుకువెళ్ళదీస్తున్నారు.



డాట్‌కామ్‌ల దివాలా

అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన మందగమనం ప్రభావం వల్ల వివిధ పరిశ్రమలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించడంతో 64 లక్షల మంది అమెరికన్లు ఉపాధిని కోల్పోయారు. వీరిలో 25 లక్షల మంది ఏప్రిల్ నెలలోనే ఉపాధి కోల్పోయారు. దీనితో నిరుద్యోగుల సంఖ్య అమెరికాలో గత అక్టోబర్‌లోని 3.9 శాతం నుంచి 4.5 శాతానికి పెరిగింది. మాన్యుఫాక్చరింగ్ రంగం ముఖ్యంగా 50 లక్షల మంది ఉద్యోగులను తొలగించింది. సర్వీసుల రంగం లేఆఫ్‌లు ప్రకటించడం ద్వారా 1.21 లక్షల మంది ఉపాధిని కోల్పోయారు● - శ్రీవత్స



సవాల్‌ను ప్రేమించే తరం కోసం సంధించిన గెలుపు బాణం - జనహర్ష గ్రూపు నుంచి నెలనెలా విజయవిహారం!

ఒక వ్యక్తి పీడిత కులానికి చెందిన వాడైనందు వల్ల అసహ్యించుకోవడం తప్పయినట్లయితే, మరో వ్యక్తి కేవలం అగ్రకులానికి చెందిన వాడైనంత మాత్రాన అసహ్యించుకోవడం ఏవిధంగా సమంజసమవుతుంది?

భారతీయ మస్తిష్కం సృష్టించిన వాటిలో అత్యంత లజ్జాకరమైనది కులతత్వం. అయితే, కరుణ, జాలి భారతీయ మస్తిష్కం సృష్టించిన వాటిలో అత్యంత మనోజ్ఞమైనవి. అహింసా భావన మానవాళికి అది ఇచ్చిన మహోన్నతమైన కానుక. అహింస, కరుణ ఒకే నాణేనికి బొమ్మా-బొరుసు వంటివి.

రామస్వామి నాయకర్ నడిపిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం బ్రాహ్మణులను మాత్రమే పక్కకు తప్పించగలిగింది గాని బ్రాహ్మణ వాదాన్ని కాదు.

కంచ ఐలయ్య 'నేను హిందువునెట్లయిత?' పుస్తకంపై కేశవరావు జాదవ్ స్పందన

# కులనిర్మూలనా పోరాటానికి ద్వేషం ప్రాతిపదిక కాదు

(నాల్గవ భాగం)



**(గత సంచిక తరువాయి)**

మార్క్స్ ఊహించినట్లుగా పెట్టుబడిదారీ విధానం పతనం కాదు. ఎంచేతంటే దాని అదనపు విలువ వలసల నుండి, యూరోపియన్ మహిళల నుండి వస్తుంది. మరిన్ని ఎక్కువ కాలనీలు, మరింత నిర్దాక్షిణ్యమైన దోపిడీ కారణంగా పాశ్చాత్య ప్రపంచం దాని కార్మిక వర్గానికి కొన్ని రొట్టె ముక్కలు విసిరెయ్యడానికి వీలు కలిగింది. రష్యన్ కమ్యూనిస్టు వ్యవస్థ ఎంచేత కుప్పకూలిపోయిందంటే, అది సొంత వలసలు లేకుండా పాశ్చాత్య ఉత్పత్తి వ్యవస్థను అనుకరించడానికి ప్రయత్నించింది. అయితే ఈ అనుకరణ వల్ల రష్యన్ పౌరుల మానవహక్కులను ధ్వంసం చేయడం, రైతుల నుండి అదనపు విలువను దోచుకోవడం, కమ్యూనిస్టు సిద్ధాంతంలోని గ్రామీణ అంశాన్ని ధ్వంసం చేయడం సోవియట్ రష్యాకు తప్పనిసరి అయ్యింది. పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజం-రెండూవాటిసొంత కులనిర్మాణాల్ని సృష్టించుకుంటాయి.

మార్కెట్ ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టడం భారతీయ అంతర్గత వలస నిర్మాణాల్ని తీవ్రతరం చేస్తుంది. కులవ్యవస్థ ప్రాచీన, మధ్యయుగాల్లో మరీ అంత నిర్దాక్షిణ్యమైనది కాదు. బ్రిటిష్ వారి కింద అది అలా తయారయింది. చేతివృత్తులవారి, ఇతర పీడిత కులాలవారి వృత్తివ్యాపారాలను బ్రిటిష్‌వాళ్ళు ధ్వంసం చేయడంతో వారు దరిద్రులైపోయారు. పెద్ద, చిన్న రైతులు వలస వ్యవస్థకు తల వంచి, వ్యవసాయ కూలీలపట్ల మరింత పీడకులుగా మారారు. అంతిమ పర్యవసానంగా ఒక క్రూరమైన వ్యావసాయిక వ్యవస్థ ఏర్పడింది. పాత భారతీయ ఆర్థిక, సామాజిక-ఆర్థిక వ్యవస్థలు రెండూ నిర్మూలమయ్యాయి. ఏదో ఒక ఉపాధి కోసం లక్షోపలక్షల మంది కలకత్తా, బొంబాయి, మద్రాసు, తదితర నగరాలకు వలసపోయారు. రష్యన్లలాగే నెహ్రూ కూడా పాశ్చాత్య ఉత్పత్తి వ్యవస్థను అనుకరించాడు. అలా భారత్ మరో అమెరికా కాగలదనే ఊహతో, దానికోసం ప్రయత్నించాడు. అది అసాధ్యం అయినందువల్ల, ఆయన అంతర్గత వలసలను సృష్టించడంలో విజయం సాధించగలిగాడు. బ్రిటిష్ వలసవాదం వల్ల పూర్తిగా విలువ కోల్పోయిన కులవ్యవస్థ మీద పెట్టుబడి దారీ విధానాన్ని రుద్దినట్లైతే, బయటి వలసలు లేనందువల్ల, అది అంతర్గత వలసలను మాత్రమే సృష్టించగలదు. వలసలు లేకుండా పెట్టుబడిదారీ విధానం మనుగడ సాగించలేదు. అవి ప్రత్యక్ష, రాజకీయ-ఆర్థిక వలసలు కాకపోయినా, కనీసం ఆర్థిక వలసలైనా అయివుండాలి. పాశ్చాత్య దేశాలకు మార్కెట్ ఆర్థిక విధానమంటే ఆర్థిక వలసలను సృష్టించుకోవడం. ఆర్థిక వలసలుగా వున్న దేశాలు వాటిని అనుకరించడమంటే అర్థ అంతర్గతవలసలను ఏర్పరచు కోవడం. కనుక భారత్‌లో కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడటం మరింత కష్టం అవుతుంది. ఏమంటే దానికిప్పుడు బూటకపు ఆధునికతా వాదం, పాశ్చాత్య దేశాల అండ వుంది. సర్వతోముఖ ప్రైవేటీకరణతో ఉద్యోగాలలో, విద్యాసంస్థలలో రిజర్వేషన్లు అదృశ్యమైపోయి, పీడితకులాలను చీకటి కుహరాల వెనక్కి నెట్టేస్తాయి.



రామ్ మనోహర్ లోహియా

భారత్ ఆత్మగౌరవంగల దేశంగా మనుగడ సాగించాలంటే కులవ్యవస్థ పోవాలి; కులసమాజాలు అదృశ్యమై ఆరోగ్యవంతమైన సమాజానికి చోటు ఇవ్వాలి.

కులం ప్రాతిపదికగా ఏర్పడిన సంస్థల ద్వారా కులవ్యవస్థ మీద దాడి చేసే ప్రయత్నాలు జరిగాయి. కానీ ఈ సంస్థలు కుల ప్రాతిపదికగల రాజకీయ పార్టీల మాదిరిగానే సమస్య పరిష్కారానికి పోరాటం పథాన్ని కాక ద్వేషమార్గాన్ని స్వీకరించాయి. వృత్తిగతమైన సమస్యల్ని అరుదుగా మాత్రమే పట్టించుకున్నందు వల్ల, అవి కులసమస్యల్ని కాక, కులాల్ని రాజకీయం చేయడంలో మాత్రమే విజయవంతం అయ్యాయి. సంఖ్యలతో ఆటలాడే ప్రయత్నం జరిగింది. నిర్మాణాత్మక కృషి స్థానాన్ని ఆలంకారిక భాష ఆక్రమించింది. విద్యాధికృత ఉద్యమంలోని మేధావుల్ని పీడిత కులాలనుండి పేద విభాగాల నుండి పరాయీకరించింది. భాషాద్వేషం తర్కరహితమైనది మాత్రమేకాక, అది అగ్రకుల భాషను అనుకరిస్తుంది. అలా చేయడం వ్యూహాత్మకంగా తెలివైన పని కాదు. అగ్రకులాల రాజకీయ, ఆర్థిక ప్రవర్తనను అనుకరించడం పీడిత కులాల్లోని వివిధ విభాగాల మధ్య విచ్ఛిత్తిని సృష్టిస్తుంది. ఒక వ్యక్తి పీడిత కులానికి చెందిన వాడైనందు వల్ల అసహ్యించుకోవడం తప్పయినట్లయితే, మరో వ్యక్తి కేవలం అగ్రకులానికి చెందిన వాడైనంత మాత్రాన అసహ్యించుకోవడం ఏవిధంగా సమంజసమవుతుంది? పుట్టుక యాదృచ్ఛికం. దాన్ని ఒక వ్యక్తికి, లేదా బృందానికి వ్యతిరేకంగా వినియోగించుకోకూడదు. అలా చేయడం మతతత్వంకన్నా భిన్నమైనది కాదు. వర్తమానంలోని, లేదా గతంలోని ఊహాత్మకమైన లేక వాస్తవికమైన తప్పిదాల మీద విద్వేషమనే ఉపకరణంతో పగతీర్చుకోమని మతతత్వవాదులు బోధిస్తుంటారు. దాని నెత్తి మీద కులవ్యవస్థను వుంచడం కొత్త తరహా దోపిడీదారుల్ని, దోపిడీకి గురయ్యేవారిని మాత్రమే సృష్టిస్తుంది. ఎవరైనా కులతత్వం అన్యాయమైనదీ, అమానుషమైనదీ గనుక వ్యతిరేకిస్తారు. ఈ అన్యాయం పోవాలి. కాని దాని స్థానంలో మరో రూపంలో వున్న అన్యాయాన్ని, అమానుషత్వాన్ని ఉంచే ప్రయత్నం చేసినట్లైతే అది స్వీయ పరాజయమే అవుతుంది. అలాంటి వారి విశ్వసనీయతే ప్రశ్నార్థక మవుతుంది. భారతీయ మస్తిష్కం సృష్టించిన వాటిలో అత్యంత లజ్జాకరమైనది కులతత్వం. అయితే, కరుణ, జాలి భారతీయ మస్తిష్కం సృష్టించిన వాటిలో అత్యంత మనోజ్ఞమైనవి. అహింసా భావన మానవాళికి అది ఇచ్చిన మహోన్నతమైన కానుక. అహింస, కరుణ ఒకే నాణేనికి బొమ్మా-బొరుసు వంటివి. విదేశీయులు భారీస్థాయి హింసకు పాల్పడినప్పుడు మతపరమైన, జాతిపరమైన సమస్యలు హింస ద్వారా ఎప్పుడూ పరిష్కారం కాలేదు. అరుదుగా మాత్రమే అలా జరిగింది. పశ్చిమాసియా యూరప్‌లలో మాదిరిగా కాక భారత్ ఎప్పుడో కాని జాతి శుద్ధిలాంటి పద్ధతుల్ని అనుసరించలేదు. ఇటువంటి వాటిని విదేశీయులు ఆచరణలోపెట్టారు. అయినప్పటికి భారతీయులు అటువంటి పద్ధతుల్ని అరుదుగా తప్ప ఎన్నడూ ఆచరణలో పెట్టలేదు. అయితే ఈ అరుదైన సంఘటనలు కూడా వాటిని ఆచరించిన వారిలో విరక్తిని కలిగించాయి. అశోకుడు, కొంత వరకు విదేశీయుడైనప్పటికీ అక్బరు ఇందుకు సాక్ష్యం.

అదే సమయంలో సామాజిక అంశాలను "పరిష్కరించడానికి" విద్వేషాన్ని వినియోగించడం వల్ల అది అంతరంగిక హింసను సృష్టించడం మాత్రమే సృష్టించగల్గింది. అది సమస్య మూలాలను కాక పైపై అంచుల్ని మాత్రమే తడిమింది. రామస్వామి నాయకర్ నడిపిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం బ్రాహ్మణులను మాత్రమే పక్కకు తప్పించగలిగింది గాని బ్రాహ్మణ వాదాన్ని కాదు. ఇప్పుడు ఆయన అనుయాయులు దాన్ని అనుసరిస్తున్నారు. దక్షిణ తమిళనాడులో వన్నియార్‌ల తిరుగుబాటు, దేవర్ - దళిత్ సంఘర్షణ చూడండి. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం సాగించిన పోరాటం 'బ్రాహ్మణుడు మరణించాడు, బ్రాహ్మణ వాదం వర్ధిల్లాలి' అనే నూతన నినాదంగా మారడం బాధాకరం. బ్రాహ్మణవాదం ఇప్పుడు భారత్‌లోని అన్ని కులాల, మత సమాజాల సిద్ధాంతం అయింది.

సనాతనేతర భారతీయులు కానీ, విదేశీ మతాలు కానీ భారతీయ ప్రజానీకానికి సమగ్రమైన విముక్తి జ్ఞానాన్ని ఇవ్వలేకపోయారు. పైగా వారు మరోపక్కన సనాతన కులవ్యవస్థలోని అన్ని దురాచారాలను స్వీకరించారు. ఆ విధంగా వారు భారతదేశంలో మరిన్ని సామాజిక విచ్ఛేదాలను సృష్టించడంలో విజయం సాధించగలిగారు. దేవునితో తమకు ప్రత్యేక సంబంధం ఉందని వారు ఎన్ని గప్పాలు కొట్టుకున్నప్పటికీ వాళ్ళు కూడా పాత కుల వ్యవస్థను ఆచరించే నూతన కులాలుగా మారిపోయారు. అప్పటికే ఉన్న అనేక దేవుళ్ళ కూటమిలో వారి దేవుళ్ళు కూడా చేరారు.

ఇప్పటికీ కులవ్యవస్థ మన మస్తిష్కాలని లక్ష్యంగా చేసుకుని ఒక విధమైన హింసను ఆచరణలో పెడుతోంది. అన్యాయమైన వ్యవస్థకు అనుగుణంగా మిమ్మల్ని మీరు సర్దుబాటు చేసుకోవడానికి సిద్ధపడినట్లైతే, దానికి వ్యతిరేకంగా మాట్లాడినప్పటికీ మీరు భౌతికంగా మనుగడ సాగించగలరు. మేధోప్రక్షాళన ప్రక్రియ ద్వారా అణగారిన కులాలు ఈ వ్యవస్థతో సమాధాన పడ్డాయి. మన కాలంలోనే తమిళనాడు బ్రాహ్మణులు ఉద్యోగాల నుండి రాజకీయాలకు వ్యాపారాలకూ మారారు. వాళ్ళు వారి సొంత తరహా కులతత్వంమీద పోరాడాలని భావించకపోవడం వల్ల వారు ద్రవిడ కజగం బ్రాండు కులతత్వం మీద కూడా పోరాడలేక పోయారు. ద్వేషం వల్ల తమిళనాడులో కులతత్వానికి జరిగిందేమిటి? ఇతర పొజిషన్స్‌లో మార్పులు వచ్చాయి కానీ కులం పొజిషన్ మాత్రం మారలేదు. ఒకవేళ ద్రవిడ కజగం ఉద్యమం బ్రాహ్మణ ద్వేషం మీద ఆధారపడడానికి బదులుగా కులతత్వం పట్ల విప్లవాత్మక వైఖరి అవలంబించినట్లైతే అది కులతత్వ విషాన్ని క్షాళనం చేయగలిగేది. కానీ బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం ఈ లక్ష్యాన్ని సాధించటంలో విఫలమైంది. ఎంచేతనంటే అది ద్వేషం మీద నిరంతర వ్యతిరేకత మీద ఆధారపడింది. ఈ క్రమంలో అది తనకు తానే బ్రాహ్మణ వాదాన్ని ఇంజెక్ట్ చేసుకుంది. శత్రువుల ఆకృతుల్ని ఆవాహన చేసే ప్రక్రియలో వారి గుణాల న్నింటినీ ప్రోది చేసుకుంటూ అందులో నిన్ను నువ్వు ప్రతిష్ఠించుకుంటావు. అన్యాయానికి వ్యతిరేకంగా ప్రదర్శించవలసిన ఆగ్రహం, ఆ అన్యాయం చేస్తున్న వ్యక్తుల్ని దారి తప్పిన మనుషులుగా చూడటం మీద ఆధారపడి ఉండాలి. ఏ వ్యక్తి చేసే అన్యాయాన్ని అయినా అసమంజసత్వాన్ని అయినా ప్రతిఘటన ద్వారానే తొలగించాలి. బ్రాహ్మణవాదిగా ఉండటం మాదిరిగానే బ్రాహ్మణ వ్యతిరేకంగా ఉండటం కూడా ఒక ప్రమాదమే.

కులాలవల్ల వృత్తిపరమైన నిశ్చలత్వం ఉండవచ్చు కాని అన్యాయం మాత్రం పోవాలి. ఈ రకమైన వైఖరిలో రిజర్వేషన్ల విధానం ఒక భాగం మాత్రమే. కులాంతర, మతాంతర వివాహాల్ని ప్రోత్సహించాలి. ముస్లిం, క్రైస్తవ సమాజాలలోని పీడిత కులాలకు విడిగా రిజర్వేషన్లు కల్పించాలి. రిజర్వేషన్లు ఇప్పుడు మాత్రమే వచ్చాయని భావించడం పొరపాటు. వాస్తవానికి కులవ్యవస్థ అనేదే పక్షపాతంతో కూడిన అన్యాయమైన రిజర్వేషన్ల మీద ఆధారపడింది కాబట్టి కులాంతర వివాహాలు సామాజిక చలన శీలతలో ఒకభాగం.

ఆర్థిక వ్యత్యాసాలను తగ్గించే నూతన ఆదాయాల వేతనాల విధానం రూపొందాలి. మానసిక శ్రమ ఉన్నతం, శారీరక శ్రమ అల్పం అనే భావన మీద దాడి జరగాలి. అసమానతలతో కూడిన వలసవాద ఆర్థిక నిర్మాణాల మీద దాడి చేయకుండా కులవ్యవస్థను బలహీనపరచడం దాని ఒక్కదాన్నే నిర్మూలించడం జరగదు.

ఉచిత నిర్బంధ సెకండరీ విద్య రెలెవెంట్‌గా సమానంగా ఉండాలి. ఉన్నత విద్య కూడా రెలెవెంట్‌గా సమానంగా ఉండాలి. దాని వలన ఎవరి హృదయం భగ్నమనే అవసరం లేకుండా ఒక నూతన వ్యవస్థ రూపొందాలి. బ్రిటిష్ వారికన్నా ముందున్న విద్యావిధానం ఇప్పుడు మరింత రెలెవెంట్‌గా ఉంటుంది.

పౌష్టిక ఆహారం లేకపోడంవల్ల, మలేరియా, కలరా వంటి నయం చేయగలిగిన రోగాలవల్ల ఏటా లక్షోప లక్షలమంది చనిపోతున్నారు. వారిలో ఎక్కువమంది పీడిత కులాలకు చెందినవారు. పౌష్టిక ఆహారాన్ని సరఫరా చేయడం మీద ఆధారపడిన నూతన ఆరోగ్య సంరక్షక వ్యవస్థ, జానపద వైద్యం, ఆయుర్వేదం, యునాని, హోమియోపతి వంటి తక్కువ ఖర్చుతో కూడిన ఆరోగ్య రక్షణ వ్యవస్థలు నెలకొల్పాలి. కానీ ఇప్పుడు జరుగుతున్నదంతా దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. ప్రభుత్వరంగం నుండి ఆరోగ్య రక్షణను విసిరికొట్టి చౌకగా లభ్యమయ్యే ఆరోగ్య రక్షణ లేకుండా చేస్తున్నారు. ఐదునక్షత్రాల సూపర్ స్పెషాలిటీస్ ఆస్పత్రులను నెలకొల్పుతున్నారు. ఇప్పుడు ఏ చిన్న రోగం వచ్చినా నయం చేసుకోవడానికి మీరు భారీ మొత్తాలను ఖర్చు చేయవలసి వస్తుంది.

భారత్‌లో ఇప్పుడు రెండు సమాంతర సంస్కృతులున్నాయి. అవి జానపద, సంప్రదాయ సంస్కృతులు. ఇవి అగ్రకులాల్లో వర్గాల్లో అతిశయాన్ని పెంచుతున్నాయి. ఇది కులతత్వానికి ఆజ్యం పోస్తోంది. జానపదంలోని స్పాంటేనిటీని, సాంప్రదాయిక నిర్మాణాన్ని వ్యవస్థీకృత వైఖరినీ మేళవించి జానపద, సంప్రదాయ రీతులతో నూతన శైలినీ, ధోరణినీ రూపొందించాలి.

అంతిమంగా, ఇంతకుముందే పేర్కొన్నట్లు, కులపరమైన అన్యాయాన్ని నిర్మూలించడానికి కుల-వర్గ వైఖరి అవసరమని పదే పదే చెప్పనక్కర్లేదు. అన్ని కులాల మహిళలు, అగ్రవర్ణాలలోని పేదలతో సహా అన్యాయాలకు గురి అవుతున్నారు. కానీ వాళ్ళ బాధలు నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి. ఇది ఒంటెత్తుపోకడలకు, వైఖరులలో మరింత కాఠిన్యానికి దారితీస్తుంది. కులవ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలోకి, అగ్రకులాలలోని పేదలను, అన్ని కులాల మహిళలను తీసుకురావాలి. అందులోనే వారి విముక్తి, భారత్ విముక్తి వుంది. అగ్రకులాల పేదలు, తమను రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే వినియోగిం చుకునే అగ్రకులాలతో చేతులు కలపడం ఆత్మహత్యా సదృశం. అలాంటి అగ్రకుల పేదలరాజకీయ అధినేతల్ని, స్వీయార్థ ప్రాపకులైన మేధావుల్ని విస్మరించి వారికి పీడిత కులాలు స్నేహహస్తాన్ని అందించాలి. ఇది జరగాలంటే అట్టడుగు స్థాయి నుండి ఉద్యమం అవసరం. ఇది చేయగలిగిన సామర్థ్యం, నేర్పు స్త్రీలకు వున్నాయి. కానీ వారు ఈ పోరాటం కోసం-భారతదేశ చరిత్రలో మహోన్నతమైన పోరాటం కోసం-తమంతట తాము డీక్లాస్ కావాలి, డీక్యాస్ట్ కావాలి.

మానవ సమాజం మూడు పీడన వలయాల్లో చిక్కుకుని వుంది. ఇందులో అత్యంత విస్తృతమైనది, దాదాపు ప్రపంచమంతటా వున్నది మహిళల పీడన; రెండవ వలయం సామాజిక పీడన. ఇది కులం, జాతి, మతం, తెగ, సంస్కృతి, జాతీయత వంటి వాటి మీద ఆధారపడి వుంటుంది. మూడవ రకం పీడన ఆర్థిక కారణాల మీద ఆధారపడి వుంటుంది. కొన్ని సందర్భాలలో షెడ్యూల్డు కులాలు, నలుపు, ఎరుపు భారతీయ మహిళల జీవితాల్లో ఈ పీడన వలయాలు ఒకదానితో ఒకటి కలిసిపోతుంటాయి. మహిళలు ఎదుర్కొంటున్న పీడనలోని వాస్తవిక స్వభావాన్ని పట్టించుకోకపోయినట్లయితే, మిగతా రెండు వలయాల చిక్కు విడదీయడం కష్టం. మగవారి నియంత్రణలో వుండే స్త్రీ అతని కోసం అనేక రకాలైన దోపిడీకి, అక్రమాలకు గురి అవుతుంది. ఎప్పుడైతే ఒక స్త్రీ తల్లిగా, చెల్లిగా, కూతురుగా, భార్యగా దోపిడీకి గురి అవుతుందో, అపుడే ఆమె ఇతర కులాల, జాతుల, తెగల, మతాలకు చెందిన సమాజాల దోపిడీకి గురి అవుతుంది. చాలా తేలికగా ఆర్థికంగా బలహీనురాలవుతుంది. లింగ, మత, రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలన్నీ దోపిడీకి పీడనకు హక్కు కల్పించే సిద్ధాంతం మీదే ఆధారపడి వున్నాయి. ఆ హక్కు, ప్రవక్తల దివ్య ప్రబోధాలని చెబుతున్న వాటి మీదగానీ, లేక సామాజిక-ఆర్థిక సిద్ధాంతాల అనివార్యత మీదగానీ పెంపొందుతుండే. ఏ సిద్ధాంతంలోని మంచి అయినా వందేళ్లకు మించి మనుగడ సాగించలేదు. ఎప్పుడైతే సిద్ధాంతం వ్యవస్థగా ఏర్పడుతుందో అప్పుడా సిద్ధాంతంలోని దుష్టత్వం మాత్రమే మిగిలివుండి మొత్తం వ్యవస్థను ఆక్రమిస్తుంది. ఆ విధంగా పాగన్, కాఫిర్, శూద్ర, ఆర్థిక బలహీనులు వంటి వ్యక్తీకరణలు పుట్టుకొచ్చాయి. మనసు దహించివేసే అలాంటి ముద్రలు కొన్నిసార్లు మొత్తం ప్రజను నాశనం చేయడానికి ఉపయోగపడతాయి.

మానవ చరిత్రలో మరో సమస్య విద్వేషంనుండి హింస పెరగడం. అసలు విద్వేషమే పూర్తిగా అహేతుకం. కానీ ఈ పద్ధతిలో అన్యాయాల్ని తుడిచిపెట్టవచ్చనే విశ్వాసంతో కొన్ని సందర్భాలలో హింసాత్మకమైన పదాలు, కార్యాచరణలు వినియోగించారు. వ్యవస్థను నిర్వహించే వ్యక్తుల మీద వుండే ద్వేషం వేరు. అన్యాయమైన వ్యవస్థపై వుండే ఆగ్రహం వేరు. వ్యక్తుల్ని నాశనం చేసినంత మాత్రాన వ్యవస్థ నాశనం కాదు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడటానికి ఆగ్రహం అవసరమే. కానీ ఆ ఆగ్రహం ద్వేషంగా మారకూడదు. లోహియా చెప్పినట్లు ఒక కంట్లో ఆగ్రహజ్వాల వుంటే, మరో కంట కరుణతో కూడిన కన్నీరు వుండాలి. ఒక వ్యవస్థను నెత్తిన పెట్టుకున్నట్లయితే న్యాయం దానంతటదే అమలు జరుగుతుందనుకోవడం పొరపాటు నిర్ధారణ అవుతుంది. నిజానికి జరిగేదేమంటే ఒక అన్యాయం స్థానాన్ని మరో రకమైన అన్యాయం ఆక్రమిస్తుంది.

(ఇంకావుంది)

బ్రాహ్మణవాదిగా ఉండటం మాదిరిగానే బ్రాహ్మణ వ్యతిరేకంగా ఉండటం కూడా ఒక ప్రమాదమే.

మానవ చరిత్రలో మరో సమస్య విద్వేషంనుండి హింస పెరగడం. అసలు విద్వేషమే పూర్తిగా అహేతుకం. కానీ ఈ పద్ధతిలో అన్యాయాల్ని తుడిచిపెట్టవచ్చనే విశ్వాసంతో కొన్ని సందర్భాలలో హింసాత్మకమైన పదాలు, కార్యాచరణలు వినియోగించారు.

లోహియా చెప్పినట్లు ఒక కంట్లో ఆగ్రహజ్వాల వుంటే, మరో కంట కరుణతో కూడిన కన్నీరు వుండాలి.

సం॥ చందా రూ.180/- ; 5 సం॥ చందా రూ.800/- ; అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

# మాఫియాని ఏలుతున్న మహిళా డాన్‌లు

రాజకీయాల్లో మాదిరిగా, మాఫియాలోనూ వారసత్వ పోకడలు కనిపిస్తున్నాయి. అయితే ఈ వారసులు కొడుకులు కాదు, భార్యలు. ముంబై నగరాన్ని గడగడలాడించే మాఫియా ముఠా నాయకుల భార్యలు, భర్తలకి కష్టకాలం దాపురించిన సమయాల్లో నాయకత్వాన్ని స్వీకరిస్తున్నారు. ఎక్కడా తగ్గకుండా తెగువతో ప్రవర్తిస్తున్నారు.

ప్రముఖ గ్యాంగ్‌స్టర్ అశ్వనీ నాయక్ జైల్లోఉన్న కాలంలో, భార్య నీతా నాయక్ రాజకీయవేత్తగా ఎదిగింది. వీళ్లిద్దరిదీ ప్రేమ వివాహం. పద్నాలుగేళ్ల కూతురు, పదేళ్ల కొడుకూ వున్నారు. చాలా కాలం ఇద్దరూ సుఖసంతోషాలతో కాపురం చేశారు. పదేళ్ల క్రితం ఇంటి మీద పదే పదే జరిగిన పోలీసు దాడులు, వేధింపులు నీతాను 'లీడర్'గా తయారు చేశాయని చెప్పొచ్చు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిస్తే ఈ పీడ పోతుందనుకుంది నీతా. తోడికోడలు అంజలీ నాయక్‌ను (అమర్ నాయక్ భార్య) కలుపుకుంది. ఇద్దరూ శివసేన తరపున నిలబడ్డారు. అంజలి ముందుకెళ్లలేక పోయింది కానీ తెలివితేటలు, దూసుకుపోయే స్వభావమూ వున్న నీతా నాయక్ జనంలోకి చొచ్చుకెళ్లింది. ఆమె వాగ్ధాటి, చురుకుదనం ఆమెను మంచి మెజారిటీతో గెలిపించాయి. అప్పుడు భర్త అశ్వనీ నాయక్ తీహార్ జైల్లో వున్నాడు. క్రమం తప్పకుండా జైలుకెళ్లి భర్తను చూసి వచ్చేది. భర్త సింగపూర్‌లో వున్నప్పుడు రిస్కు తీసుకుని రహస్యంగా వెళ్లి అతడ్ని కలిసి వచ్చింది. రోజూ ఫోన్ చేసుకునేవాళ్లు కూడా. అయితే కార్పొరేటర్ అయిన కొద్ది కాలానికే తన వాగ్ధాటితో, సాహసిక ప్రవృత్తితో ముంబైలో బాగా పాపులర్ అయింది. త్వరలోనే ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి వేరే ఇల్లు కొనుక్కుంది. తాను అశ్వనీ నాయక్ భార్యని అనే సంగతిని మరిచిపోయినట్టే కనిపించేది. జైల్లో ఉన్న అశ్వనీ నాయక్ కొంతకాలానికి తన భార్య ఒకరిద్దరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు విని భగ్గుమన్నాడు. పైగా సంవత్సరకాలం పాటు తనని చూడటానికికూడా భార్యరాకపోవటంతో ఇంకా రగిలిపోయిన నాయక్, గత నవంబర్ 14వ తేదీన తన ఇద్దరు అనుచరులను పంపి భార్యను కాల్పించాడు. తీవ్రంగా గాయపడిన నీతా మరణించడానికి ముందు రెండు రోజులపాటు కనీసం పలకరించే దిక్కు కూడా లేకుండా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పడి వుంది. నీతాను అప్పుడు మాత్రం ఒక గ్యాంగ్ స్టర్ భార్యగానే చూశారు తప్ప కార్పొరేటర్‌గా ఎవరూ చూడలేదు. రెండోసారి కూడా పిలిచి టికెట్టు ఇచ్చి గెలిపించుకున్న శివసేన కనీసం ఒక్క ప్రకటన కూడా ఇవ్వలేదు.



'గాడ్‌మదర్' చిత్రంలో లేడీడాన్ పాత్రకు జీవం పోసిన షబానా అజ్మీ



నీతా నాయక్ మృతదేహం

నీతా నాయక్ ఒక్కరే కాదు, గత పదేళ్ల కాలంలో డాన్‌ల భార్యలు చాలామంది 'పవర్ సెంటర్'లుగా ఒక వెలుగు వెలుగుతున్నారు.

ఒకప్పుడు అరుణ్ గావ్లీ అంటే పెద్ద పేరు. కానీ ఇప్పుడు మాత్రం అతడికంటే, భార్య ఆశా గావ్లీకే పాపులారిటీ వుంది. గ్యాంగ్‌లో అందరూ అరుణ్‌ను 'డాడీ' అని పిలిచేవాళ్లు. సహజంగానే ఆశా వాళ్లందరికీ 'మమ్మీ' అయిపోయింది. ఆశా ఒక మ్యూజిక్ కంపెనీని కూడా నడుపుతోంది. ఆమె స్వయంగా బాణీలు కూర్చుకుని మరీ పాటలు పాడుతుంది. జైల్లో వున్న అరుణ్ గావ్లీకి ప్రతినిధి లాంటిదే అయినా, మీడియాకి మాత్రం ఆ ఇద్దరిలో ఆశా అంటేనే ఆకర్షణ.

నీతాకి కానీ, ఆశాకి కానీ ఒక్క రోజులోనే 'గ్యాంగ్ లీడర్' హోదా రాలేదు. తమ భర్తలు జైల్లో వున్నప్పుడు మిగతా ముఠా సభ్యుల మంచీచెడ్డా పట్టించుకోవటం, సభ్యులు జైల్లో పడినప్పుడు వారి భార్యలకు అండగా నిలబడటం లాంటి పనులతో వాళ్లు అనుకోకుండానే ఆ హోదాలోకి రాగలిగారు. అదీగాక, మగవాళ్లు కుట్ర చేసి తమ నాయకత్వానికి, ఎసరు పెడతారేమోనన్న భయం - డాన్‌లు తమ భార్యలను ప్రోత్సహించటానికి, నమ్మటానికి వెనక వున్న అసలైన కారణం. ఆశా ముస్లింగా పుట్టినప్పటికీ, హిందువైన గావ్లీ కుటుంబంతో బాగా కలిసి పోయింది. గ్యాంగ్ సభ్యులలోనూ బాగా ఆమె అరుణ్ తర్వాతి స్థానానికి ఎదిగింది. గావ్లీ జైల్లో వుండగా అతడి గ్యాంగ్‌లో సభ్యుడైన సదాపావ్లే నాయకత్వాన్ని చేజిక్కించుకునే ప్రయత్నం చేశాడు. తీరా అతడు కూడా జైలు పాలయ్యాక, తను బయటికొచ్చే వరకు గ్యాంగ్ వ్యవహారాలు చూడవలసిందంటూ భార్యను కోరాడు. వేరే వారిని విశ్వసించక పోవడం వల్లే సదాపావ్లే కూడా భార్యను ప్రోత్సహించే ప్రయత్నం చేశాడు.

వీరంతా కాక, అసలైన 'గాడ్ మదర్' ఒకామె వుంది. ఈమె కథ ఆధారంగానే 'గాడ్ మదర్' సినిమా తీశారు. ఈ సినిమా ద్వారా షబానా ఆజ్మీ ఉత్తమనటి అవార్డు గెలుచుకుంది. కాకపోతే ఈ లేడీ డాన్‌ది ముంబై కాదు, గుజరాత్‌లోని పోర్‌బందర్ (గాంధీజీ పుట్టిన పట్టణం).

ఆమె పేరు శాంతోక్ బెన్ జడేజా. భర్త సర్మన్ స్థానికంగా పేరుమోసిన గూండా. చట్టవ్యతిరేక కార్యకలాపాలతో, హత్యలతో విసిగిపోయి మామూలు జీవితం గడపాలని నిర్ణయించుకున్నాడు. అదే సమయంలో ప్రత్యర్థి కాలియా కేశవ్ ముఠా సర్మన్‌ను హత్య చేసింది. పగతో రగిలిపోతూ శాంతోక్ బెన్ జడేజా రంగంలోకి దిగింది. కేవలం కాలియాను చంపటంతోనే ఆగిపోకుండా, అతడి ముఠా సభ్యులు 13 మందినీ తుడిచి పెట్టింది.

తర్వాత శాంతోక్ బెన్ కూడా రాజకీయాల్లో అడుగు పెట్టింది. 1990లో జనతాదళ్ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో నిలబడి 36 వేల ఓట్ల మెజారిటీతో గెలిచింది. కొడుకు పెళ్లి జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్‌తో సహా, అనేక మంది క్యాబినెట్ మంత్రులు కూడా హాజరయ్యారంటే ఆమె పలుకుబడి ఊహించవచ్చు.

వారసత్వంగా రాజకీయాల్లోకొచ్చే మహిళలు కొన్నాళ్లకి పదవులూ, నాయకత్వమూ కోల్పోవచ్చు. కానీ మాఫియాలో ప్రాణాలే పోవచ్చు. మాఫియా అంటే రక్తం రుచి మరిగిన తుపాకులు; కరుడుగట్టిన నేరస్తులు; నిత్యం ప్రాణాలతో చెలగాటం! అసూయ, అభద్రత, ప్రత్యర్థులతో పోరాటం, చట్టానికి దొరక్కుండా బతకటం, గ్యాంగ్‌ను సమర్థంగా నడపటం - ఇన్ని ఒత్తిళ్లుంటాయి. నీతా లాగా ప్రాణాలు పోగొట్టుకోవటానికి వీటిలో ఒక్కటి చాలు ●

\- మమత

---

# కెప్టెన్ బేగ్

**వయసు : 57, వృత్తి : పైలట్, ఆరోగ్యం : ఒకసారి బైపాస్ సర్జరీ, హాబీలు : స్కేటింగ్, సాహసాలు : స్కైడైవింగ్; పర్వతారోహణ**




సాహసమే ఊపిరిగా బతికే ఈ 57 ఏళ్ల యువకుడి పేరు కెప్టెన్ రెజా బేగ్. చిన్నప్పట్నుంచీ కలల్లోనైనా, పగటి కలల్లోనైనా ఆకాశంలోనే విహరించేవాడు కానీ భూమ్మీదకి దిగేవాడు కాదు. తినమని చపాతీలు పెడితే వాటిని విమానం ఆకారంలోకి మలిచేవాడు. ఎప్పటికైనా పైలట్ అయి విమానాలను నడపాలనేదే బేగ్ లక్ష్యం. చివరికి తన కలను నిజం చేసుకున్నాడు. కానీ ఈ మధ్యకాలంలో ఒకసారి బేగ్‌కి హార్ట్‌ఎటాక్ వచ్చింది. దాన్ని కారణంగా చూపించి కెప్టెన్‌గా పని చేయడానికి అనర్హుడిగా నిర్ణయించినప్పుడు బేగ్ మరింత పట్టుదలతో తానేమిటో నిరూపించాలనుకున్నాడు. న్యూయార్క్ సమీపంలో వున్న క్యాట్‌స్కిల్ పర్వత ప్రాంతంలో 14,000 వేల అడుగుల ఎత్తు నుంచి విమానం లోంచి దూకేశాడు. ఇంకా 5,000 అడుగుల దూరం వుండగా ప్యారాచూట్ సాయంతో నేల మీదకి దిగాడు. ఈ సాహసం మొత్తాన్ని వీడియో తీసి ఎయిర్ ఇండియా వైద్యశాఖ అధికారుల ముందు పెట్టాడు. విమానాన్ని సురక్షితంగా నడపగలగటానికి తగిన ఆరోగ్యం, చేవ వున్నాయని నిరూపించుకున్నాడు. గుండెకు బైపాస్ సర్జరీ అయి కూడా స్కైడైవింగ్ చేసిన వారిలో మొదటి వాణ్ణి తానేనని సగర్వంగా చెబుతాడు బేగ్.

బేగ్‌ది పెద్ద కుటుంబం. ఈ కారణం వల్ల ప్రైవేట్ ఫ్లయింగ్ లైసెన్స్‌ను సంపాదించుకునే ఆర్థిక పరిస్థితి లేకుండా పోయింది. 1960లో ఎన్.సి.సి. ఎయిర్‌వింగ్‌లో చేరి కష్టపడి కమర్షియల్ పైలట్ పరీక్షలో నెగ్గాడు. మొదట కళింగ ఎయిర్‌లైన్స్‌లో పనిచేశాడు. కొన్నాళ్లకు అది మూతపడటంతో కలకత్తాలోని ఒక ఎయిర్‌లైన్స్ కంపెనీలో చేరాడు. అక్కడ మూడు నాలుగేళ్లపాటు అస్సాం టీ తోటల్లో పండే తేయాకును రవాణా చేశాడు. ఆ సమయంలో అతడు తన భార్య లియోనీని కలుసుకున్నాడు. కలకత్తా నుంచి మద్రాస్ చేరి 'హిందూ' దినపత్రికలో చేరాడు. డకోటా విమానంలో 'హిందూ' పేపర్ల పార్సిల్స్‌ను తెల్లవారక ముందే దక్షిణాదిలోని ముఖ్య నగరాలన్నింటికీ చేర్చేవాడు. మూడు నాలుగేళ్లు పనిచేశాక ఆ పత్రిక అధునాతన ఫాసిమిలీ ప్రింటింగ్ టెక్నాలజీని ఏర్పాటు చేసుకుంది. దీంతో ఎయిర్ పార్సిల్ అవసరం లేకుండా పోయింది. అక్కణ్నుంచి బయటికి వచ్చిన బేగ్ కొన్నాళ్లు ప్రైవేటు ఛార్టర్ విమానాలను నడిపాడు. ఈలోగా ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో అప్పటి వరకూ వున్న లాకౌట్ తొలగిపోయింది. అందులో చేరి బోయింగ్‌ల నుంచి జంబోల వరకూ నడిపాడు. గల్ఫ్, యూరోప్, జపాన్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దూరదేశాలకు ఏకబిగిన వారంపదిరోజుల పాటు ప్రయాణించేవాడు. ఎయిర్ ఇండియా నుంచి ప్రతి ఏడాదీ జరిగే "పది కిలోమీటర్ల వరల్డ్ ఎయిర్‌లైన్స్ రోడ్ రేస్"లో పాల్గొని పతకాలు గెలుచుకొచ్చేవాడు.

జాగింగ్, మారథాన్ రన్నింగ్ చేస్తూ ఎప్పుడూ ఆరోగ్యంగా, దృఢంగా వుండే బేగ్‌కి 1988లో ఒకసారి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. బైపాస్ సర్జరీ చేశారు. బేగ్ ఇక పైలట్‌గా పనికిరాడని అధికారులు అతడి లైసెన్స్‌ను రద్దుచేశారు. కానీ, బేగ్ నిదానంగా ఆరోగ్యాన్ని పుంజుకున్నాడు. మళ్ళీ జాగింగ్ మొదలు పెట్టాడు. ఆరోగ్యం బాగా మెరుగు పడిన తర్వాత అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆఫీస్‌లో కూర్చునే పని అప్పగించారు. ఆ సమయంలో అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల్లోని ఏవియేషన్ నియమనిబంధనల గురించి బాగా తెలుసుకున్నాడు. బైపాస్ సర్జరీ చేయించుకున్న పైలట్‌లు కొన్ని కఠిన వైద్య పరీక్షలను అధిగమించగలిగితే వారికి మళ్లీ లైసెన్స్ ఇవ్వవచ్చునని ఆ నియమాలు చెబుతున్నాయి. దీన్ని ఆధారంగా చేసుకుని "నాకు అన్ని పరీక్షలూ పెట్టండి" అంటూ అధికారులను కలిశాడు బేగ్. బ్లడ్, స్ట్రెస్ థాలియం, ముగా ట్రెడ్‌మిల్ టెస్ట్, 2డి-ఎకో, 24 హోల్టర్ మానిటర్ రీడింగ్స్, ఏంజియోగ్రామ్స్... ఈ అన్ని టెస్ట్‌లనూ అవలీలగా దాటాడు. దీంతో కోపైలట్‌గా 1992లో మళ్లీ విమాన మెక్కాడు. ఎలాగైతేనేం, కోపైలట్‌గానే అయినాసరే, చివరికి మళ్లీ కాక్‌పిట్‌లోకి చేరుకోగలిగినందుకు బేగ్ పొంగిపోయాడు. కానీ మునుపటిలాగా పూర్తి స్థాయి పైలట్ హోదాలోకి మళ్లీ చేరాలన్న కాంక్ష బలీయంగా పెరిగింది. దాని కోసమే న్యూయార్క్ సమీపంలోని పర్వత ప్రాంతంలో స్కైడైవింగ్ చేశాడు. చివరికి అది ఫలించింది. ఆసియా ఖండపు ఏవియేషన్ రంగంలో చరిత్రను సృష్టించాడు.

ఆరోగ్యం దెబ్బతీసినా ఆత్మవిశ్వాసంతో మళ్లీ పూర్వ స్థానానికి ఎదిగిన బేగ్ 1997లో తన 58వ ఏట రిటైరయ్యాడు. కాంట్రాక్టు పద్ధతి మీద మరో రెండేళ్లు పనిచేసి బొంబాయిలో స్థిరపడ్డాడు. నిరంతరం ఉత్సాహంతో ఉరకలు వేసే బేగ్‌కి స్కేటింగ్, బాల్‌రూమ్ డాన్స్ అంటే ఇష్టం. ప్రతి రెండో రోజూ కనీసం పది కిలోమీటర్లు జాగింగ్ చేస్తాడు. ప్రతి జనవరిలోనూ దుబాయ్‌లో జరిగే 'డిసర్ట్ ఫన్ ర్యాలీ' పోటీలలో పాల్గొంటాడు. కొండలెక్కడమంటే బాగా ఇష్టం. పోయిన సెప్టెంబర్‌లో జపాన్‌లోని ఫ్యుజి పర్వతాన్ని (12,300 అడుగుల ఎత్తు) రాత్రివేళ అధిరోహించి, ఉదయిస్తున్న సూర్యుడిని ఫొటో తీశాడు. ప్రస్తుతం బ్రెజిల్‌లో అమెజాన్ నదీ పరీవాహక ప్రాంతంలోని అరణ్యాలలో తిరుగుతున్నాడు. వేసవిలో కిలిమంజారో పర్వతం ఎత్తు ఎంతో స్వయంగా ఎక్కి కనుక్కునే పనిలో వుండబోతున్నాడు. సాహసమే జీవితంగా బతుకుతున్న బేగ్ బ్లడ్‌గ్రూప్ ఓ-నెగెటివ్. అతడు ఎప్పుడూ చెప్పే మాట 'బీ పాజిటివ్'. బేగ్ దృష్టిలో యవ్వనం అనేది మనసుకి సంబంధించింది. నన్ను నేను ఎప్పుడూ నవ యువకుడిలాగానే అనుకుంటూ వుంటాను అంటున్నాడు ఈ డేర్‌డెవిల్●



సవాల్‌ను ప్రేమించే తరం కోసం సంధించిన గెలుపు బాణం - జనహర్ష గ్రూపు నుంచి నెలనెలా విజయవిహారం!

తెలుగు కెరటాలు

# బాలయ్య

## బాతిక్ కళనే ఇంటిపేరుగా చేసుకున్న బాలయ్య













ఈ మేష్టారిని పరిచయం చేయాలంటే కాస్తభయమే. ఎందుకంటే బాతిక్ కళనే ఇంటిపేరుగా చేసుకున్న బాలయ్యగా ఎప్పుడో అందరికీ తెలిసిన వాడు. జిల్లాలు, రాష్ట్రాల హద్దులు దాటి ఎదిగిన వాడు... పల్లె బతుకులోని అందాన్నీ, అమాయకత్వాన్నీ, చీకటినీ, వెలుగునీ కాన్వాసు మీద కళ్లకు కట్టించినవాడు... ఎక్కడో బెంగాల్‌కి ఇక్కడి తెలుగు నేలకి వారధి కట్టినవాడు. అలా అందరి మనసుల్లోకి చొరబడ్డ ఈ పెద్దమనిషి గురించి కొత్తగా ఏదో కనుక్కున్నట్టు ఏమిటి చెప్పడం? రంగులతో కనికట్టు చేసే ఆయన ఒక్కో బాతిక్ రంగుల బొమ్మ చూపుతోనే ఠకీమని బాలయ్యని పట్టి చ్చేస్తుంటే - ఆయన కళ గురించి జ్ఞానిలా ఎంత చెప్పినా అదంతా పట్టి వెలితే! ఈ విషయం తెలిసుండీ - ఏదో రాసేస్తున్నామంటే - మన తెలుగు వాడు - వెనకబడ్డ 'మెతుకు' సీమలో సిద్దిపేటకు పెద్ద పేరు తెచ్చిన వాడన్న ఆత్మీయత డామినేట్ చేయడం వల్లే!



వయసు అరవై దాటి ఏడాదైంది ఈ మేష్టారికి. సర్కారీ రూల్స్ ఈ 'బడిపంతుల్ని' ఎప్పుడో రిటైర్ చేసాయి. అయినా క్షణం తీరిగ్గా వున్నట్టు కనిపించడు. కుంచెతో కుస్తీ పడుతూనే వుంటాడు. బాతిక్ చిత్రకళ నిజంగా పెద్దకసరత్తే. గొడ్డు చాకిరీ అంటావేం! సరిగ్గా అలాంటిదే. సృజనాత్మక నైపుణ్యంతో బొమ్మ తాలూకు స్కెచ్‌గీసుకోవడం ఒక ఎత్తైతే దాన్ని బట్టమీద ఓ కళారూపంగా ఆవిష్కరించడం మరో ఎత్తు. తేనెగూడు మైనం, పారాఫిన్‌ల మరిగించిన మిశ్రమంతో తెల్లటి బట్టపై ముందుగా స్కెచ్ వేస్తారు. దీనికోసం దారాన్ని సన్నటి వెదురు బద్దలకు కండెలా చుట్టి తయారుచేసిన ప్రత్యేకమైన కలాన్నే వాడాలి. ఎందుకంటే దీన్నుంచి మైనం చుక్కలుగా ఒక క్రమపద్ధతిలో జారుతుంది. బొమ్మలో ఎక్కడ రంగులు రావాలో అక్కడ మైనం వాడాలి.

మామూలుగా నీలం, ఎరుపు, పసుపు రంగులే బ్యాక్‌గ్రౌండ్‌లో బేస్‌కలర్స్‌గా కనిపిస్తాయి. బొమ్మలో కనిపించే రంగులకు నాఫ్తల్ కలర్స్ వాడతారు. వీటిని సరిగ్గా బ్యాలన్స్ చేయడంలోనే వుంది గొప్పతన మంతా. రంగులు అద్దడం అయ్యాక మరిగే సబ్బు నీటిలో గుడ్డని ముంచితే మైనం పగులుతుంది. మైనపు పొర పగిలినప్పుడు - ఆ పగుళ్లలోంచి రంగు బట్టపైకి దిగి కళ్లు మిరుమిట్లు గొలిపే అద్భుతమైన డిజైన్ ప్రత్యక్షమవుతుంది.

ఇదంతా - చెపితే బొత్తిగా అర్థం కాదు. ఆ నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా చూడాల్సిందే. తేనెటీగల పెంపకం బాగావుండే ఇండోనేషియా, మలేసియా దేశాల్లో ప్రచారంలో వున్న ఈ ప్రక్రియ మన దేశానికీ కొత్తదేం కాదు.

జగమెరిగిన చిత్రకారుడు జగదీష్ మిట్టల్ శాంతినికేతన్ నుంచి బాతిక్ చిత్రకళని మన తెలుగు నేలకి పరిచయం చేశాడు. లక్ష్మాగౌడ్, గౌరీశంకర్, రాజయ్యలాంటి ఉద్దండులు ఈ కళలో తర్ఫీదు పొందినా - దీన్ని ఓ కళా రూపంగా ఆరాధించి, సాధన చేసిన ఒకే ఒక్కడిగా బాలయ్యే మిగిలాడు. అద్దకం స్థాయినుంచి బాతిక్‌ను ఓ సృజనాత్మక కళారూపంగా మలచిన ఘనత బాలయ్యదే. లేకుంటే బాతిక్ కళ మరుగున పడ్డ మరో ప్రాచీన కళారూపంగా మిగిలిపోయింది. బాతిక్‌కి పుట్టిన వూరు బెంగాల్‌లో లేని ప్రాభవం తెలుగునాట వచ్చిందంటే అది బాలయ్య చలవే.

1939లో జన్మించిన బాలయ్యది సిద్దిపేట దగ్గర్లోని ఇబ్రహీంపూర్ పుట్టినవూరు. సిద్దిపేట సర్కారీ స్కూల్లో చదువుతున్నప్పుడు డాక్టర్ కాపు రాజయ్య ప్రోత్సాహం దొరికింది. డ్రాయింగ్ హయ్యర్ పాసయ్యాక ఆంధ్రప్రదేశ్ లలితకళాసమితి ఆర్థిక సహాయంతో విద్యాభూషణ్ దగ్గర శిష్యరికం కొన్నాళ్లు. ఆర్ట్ ప్రొఫెసర్ లక్ష్మాగౌడ్ దగ్గర బాతిక్ శిక్షణ పొందడం బాలయ్య కెరీర్‌లో గొప్పమలుపు. కళతోనూ బొత్తిగా సంబంధం లేని కుటుంబ నేపథ్యం. చిన్ననాట వంటింటి మసిగోడలపై బలపం గీతలతో మొదలైంది ఆయన జిజ్ఞాస. కూటికి అక్కరకు రాని కళ మనకొద్దురా అని తండ్రి మందలించినా ఆ గీతలు మానలేదు. ఎలాంటి ప్రయోగాల జోలికి వెళ్ళకుండా బాతిక్‌లోని నిసర్గ సౌందర్యాన్ని కాపాడుకుంటూ వచ్చాడు. తన తెలంగాణా బతుకునే బాతిక్‌లో చిత్రించాడు. అందుకు ఈ కళాఖండాలు కొన్ని మచ్చుతునకలు మాత్రమే.

\- శేషు













కథ

# అపూర్వ స్వప్నం

## కొండవీటి సత్యవతి



ఆటో నిమ్స్ గేటులోంచి లోపలికి ప్రవేశించింది. ఆటోలో కూర్చున్న హరిత మనసులో చెప్పలేని అలజడి. ప్రభాకర్ ఎలా వున్నాడో? ఆటో ఆగీ ఆగగానే డబ్బులిచ్చేసి ఒక్క ఉదుటన ఎమర్జన్సీ వార్డు దగ్గరికి పరిగెత్తింది. చంద్రశేఖర్ ఎదురుపడ్డాడు.

"చంద్రా!... ప్రభా ఎలా వున్నాడు" గొంతు పూడుకుపోతోంది.

"డోంట్ వర్రీ హరితా! ప్రభా బావున్నాడు. హి ఈజ్ అవుటాఫ్ డేంజర్. లోపలికెళ్ళి చూసిరా. నేనీ మెడిసిన్స్ తీసుకుని వస్తాను." చంద్రశేఖర్ మెడికల్ షాపు వేపు వెళ్ళాడు.

హరిత లోపలికెళ్ళింది. నాలుగు బెడ్‌లు దాటాక ప్రభాకర్ పడుకుని వున్న బెడ్ కన్పించింది. అతను నిద్రపోతున్నాడు. చేతికి గ్లూకోజ్ బాటిల్. తదేకంగా చూస్తూ నిలబడింది. ఎలా అయిపోయాడు? మాసిన గడ్డం. గుంటలు పడిన కళ్ళు. బరువుగా గాలి పీలుస్తూ అచేతనంగా పడుకుని వున్న ప్రభాకర్‌ని చూస్తుంటే హరితకి కన్నీళ్ళాగడం లేదు. కన్నీళ్ళలోంచి అస్పష్టంగా కన్పిస్తున్న అతని రూపం ఏవో దృశ్యాలను ఆవిష్కరిస్తోంది.

మందులు తీసుకుని చంద్రశేఖర్ వచ్చాడు.

కళ్ళ నీళ్ళతో నిల్చుని వున్న హరితని చూస్తుంటే అతనికీ దుఃఖం వస్తోంది. తమాయించుకుని

"కూర్చో హరితా! వుయ్ ఆర్ లక్కీ. భయపడాల్సిందేమీ లేదని డాక్టర్ చెప్పారు" అని తను తెచ్చిన మందులు నర్స్ చేతికిచ్చాడు.

"పేషెంట్ దగ్గర ఇద్దరుండకూడదు. బయటకెళ్ళాలి" నర్స్ అంది.

చంద్రశేఖర్ బయటకెళ్ళబోయాడు. ఒకసారి ప్రభాకర్ వేపు చూసి తనూ అతనితో బయటకు నడిచింది.

"టీ తాగుతావా? రాత్రంతా నిద్ర లేనట్టుంది. నువ్వు ఇంటికెళ్ళి స్నానం చేసిరా. నేనుంటాలే. ఏం ఫర్వాలేదు" చంద్రశేఖర్ అన్నాడు.

"టీ తాగాలని లేదు. ఇంటికా? తర్వాత చూద్దాంలే"

రాత్రంతా ప్రయాణం. బెర్త్ దొరకలేదు. దాదాపు కూర్చునే వుంది. ప్రభాకర్‌కి బాగాలేదని, అర్జంటుగా బయలుదేరమని చంద్రశేఖర్ ఫోన్ చేసేటప్పటికి తను టూర్‌లో వుంది. తనకి మెసేజ్ పంపారు. ఉన్న పళాన బయలుదేరింది. విపరీతమైన టెన్షన్. ప్రభా ఎలా వున్నాడో, ఏం వినాల్సివస్తుందోననే ఆందోళన క్షణం కన్ను మూయనీయలేదు. ప్రభాని చూసి సంవత్సరం పైనే అయింది. ఒకసారి ఆఫీసు పని మీద హైదరాబాదు వచ్చినపుడు అతన్ని కలవాలని ప్రయత్నించింది. ఇంటికి ఫోన్ చేస్తే తన గొంతు గుర్తుపట్టి ఫోన్ పెట్టేసాడు. ఆ తర్వాత తను కూడా అతన్ని కలవడానికి ప్రయత్నించలేదు. ఇపుడు ఇలా చూడాల్సి వచ్చింది. హరిత కళ్ళు నీళ్ళతో నిండాయి.

"హరితా! ప్లీజ్! కంట్రోల్ యువర్‌సెల్ఫ్. ప్రభాకేమీ కాలేదు. ప్రమాదం దాటిందని డాక్టరు చెప్పారుగా" అనునయంగా అన్నాడు.

"ఎందుకిలా జరిగింది? ఎలా వుండేవాడు ప్రభా? జరిగిందాంట్లో నా తప్పేంటో నాకిప్పటికీ తెలియడం లేదు. నేను ఎంత ప్రయత్నించి తనని కన్విన్స్ చేయలేకపోయాను. మా మధ్య ఇంత అగాధం ఎందుకయ్యిందో? ఎవరు దీనికి బాధ్యులో" హరిత ఎటో చూస్తూ మాట్లాడుతోంది.

"అవన్నీ ఇపుడెందుకులే హరితా! తర్వాత మాట్లాడుకుందాం. పద కొంచెం టీ తాగుదాం"

హరిత లోపలికెళ్ళి చూసి వచ్చింది. ప్రభాకర్ అలాగే పడుకుని వున్నాడు. కాసేపు చూసి బయటకొచ్చింది. పక్కనే వున్న కాంటీన్‌లో టీ తాగి వచ్చి బెంచి మీద కూలబడ్డారు. హరిత కళ్ళు మూసుకుని గోడకానుకుంది.

ఆమె మనసు నిండా ఆలోచనల హోరు.

గతం తాలూకు దృశ్యాలు ఒకదాని తర్వాత ఒకటి సినిమా రీళ్ళలా తిరుగాడుతున్నాయి. కొన్ని మనస్సును గిలిగింతలు పెట్టే మధురదృశ్యాలు. మరికొన్ని గాయాలను రేపే దృశ్యాలు.

మూర్తీభవించిన సంస్కారంలా వుండేవాడు ప్రభా. స్నేహ మాధుర్యం చవులూరే అతని వ్యక్తిత్వం. తన గుండెల్లో దీపం లాగా వెలిగిన అతని ప్రేమ. ఎంత బావుండేవి ఆ రోజులు. ఏమైపోయాయి?

ప్రభాకర్‌తో తన పరిచయం, ఆ పరిచయం స్నేహంగా మారడం గుర్తొచ్చి మనస్సునిండా ఒక అనిర్వచనీయమైన హాయి కమ్ముకుంది. తామిద్దరూ కలిసి గడిపిన కాలం ఎంతో అపురూపమైంది. జీవితం నల్లేరు మీద బండిలా సాగిపోయింది. ప్రతీ అనుభవమూ అద్భుతమైందిగానే వుండేది. సభలు, సమావేశాలు, సినిమాలు, సంగీత కార్యక్రమాలు ఎక్కడికెళ్ళినా జలపాత హోరులా వుండేది. తమ మధ్య అల్లుకున్న గాఢ స్నేహం ఆవిర్భవం ఎపుడు మొదలైంది?

అతడు స్నేహితుడుగా వున్నపుడు కల్మషం లేని సెలయేరులా స్వచ్ఛంగా వుండేవాడు. ఏ రోజునైతే మొగుడి అవతారం ఎత్తేడో ఆ రోజే అతడు అధికార సంబంధాలలోకి జారిపోయాడు. అహంకారం ఎంత అవలీలగా అతనిలో సాక్షాత్కరించింది. సున్నితంగా, సౌకుమార్యంగా వుండే అతని ఆలోచనా ధోరణి ఎంత మొరటుగా మారిపోయింది. అతనిలో వచ్చిన మార్పు తనని ఎంత హింసించింది. ప్రవహించే తనని నిలవనీరులా కట్టిపడెయ్యాలని చేసిన ప్రయత్నాలు తనలో లోతైన గాయాలు చేసాయి.

ఆ రోజు ఏం జరిగింది?

* * *

సారా పోరాటం ఉధృతంగా సాగుతున్న రోజులు. హరిత మరో పదిమంది కలిసి ఆ ఉద్యమాన్ని అధ్యయనం చెయ్యాలని నెల్లూరు బయలుదేరుతున్నారు. హరిత నెలలో సగం రోజులు ఏవో ఊళ్ళకి తిరుగుతూనే వుంటుంది. మొదట్లో ప్రభాకర్ కూడా ఆమెతో వచ్చేవాడు. అయితే క్రమంగా రావడం మానుకున్నాడు. హరితను కూడా వెళ్ళొద్దనడం మొదలు పెట్టేడు. హరిత పట్టించుకోకుండా తిరిగేది. హరిత బట్టలు సర్దుకుంటోంది.

"అన్ని బట్టలెందుకు? ఇల్లొదిలేసి ఎన్ని రోజులు బయట తిరుగుతావ్?"

"అదేంటి ప్రభా! ఇల్లొదిలేయడం ఏమిటి? ఇంతకు ముందు ఎన్నిసార్లు వెళ్ళలేదు. వింతగా మాట్లాడుతున్నావేంటి?" ఆశ్చర్యంగా అంది హరిత.

"ఇంతకు ముందు వేరు. ఇపుడు నీకు పెళ్ళయింది. అన్నేసి రోజులు ఇల్లొదిలేసి పోతే అందరూ ఏమనుకుంటారు"

"అందరూనా? ఎవరా అందరూ? ప్రభా! నువ్వేమిటి ఇలా మాట్లాడుతున్నావ్? ప్లీజ్! ఇలా మాట్లాడి నన్ను నువ్వు దిగజార్చుకోకు"

"నేనే మాట్లాడుతున్నా. ఇప్పటికే అలుసిచ్చి నెత్తికెక్కించుకున్నాను. ఇంక చాలు. నీ కార్యక్రమాలు, సభలూ, సమావేశాలు తగ్గించుకుంటే ఇద్దరికీ మంచిది" అనేసి విసురుగా బయటకెళ్ళిపోయాడు. హరిత స్తంభించిపోయింది. అంటే ఇక నుంచీ తను అన్నీ వదిలేసుకోవాలా? ప్రభా ఎందుకలా మారిపోతున్నాడు. ఊరి నుంచి వచ్చాక చూద్దాంలెమ్మని హరిత నెల్లూరెళ్ళిపోయింది.

వారం తర్వాత తిరిగొచ్చిన హరితని కనీసం పల్కరించలేదు ప్రభాకర్. గుండె నిండా ఉద్యమం నింపిన ఉత్సాహం ప్రభాకర్ ఉదాసీన వైఖరిలో ఆవిరైపోయింది. చెప్పలేని దిగులేదో హరితని అతలాకుతలం చేయడం మొదలెట్టింది. ఏం జరుగుతోంది? ఎందుకిలా జరుగుతోంది? ప్రభా ఏమవుతున్నాడు. అతనిలో ప్రవేశించిన భూతం తమ సహజీవనాన్ని ఏం చేయబోతోంది. సాహిత్య పుస్తకాల్లోంచి షేర్ పుస్తకాల్లోకి దిగజారిన ప్రభా డబ్బుమనిషెందుకయ్యాడు? అన్నీ ప్రశ్నలే.

* * *

తను హైదరాబాదు వదిలేయడానికి కారణమైన ఆ రోజు హరిత కళ్ళముందు కదలాడింది. ఆ రోజు ఆదివారం. ప్రభాకర్ పదింటిగ్గాని లేవడు. తనకి మీటింగ్ ఉంది. త్వరత్వరగా పనులు ముగించుకుని బయటపడాలని హడావుడి పడుతోంది. ఆ హడావుడిలో చేతిలో నుంచి కంచం జారి నేలమీద పెద్ద చప్పుడుతో పడింది. ఇల్లంతా ప్రతిధ్వనించింది. ప్రభాకర్ విసురుగా వంటింట్లోకొచ్చాడు. కోపంతో అతని ముఖం దేవురించింది.

"నీకసలు బుద్ధుందా? పొద్దున్నే ఏంటీ పాడుగోల?"

"పొరపాటున చేతిలోంచి కంచం కిందపడింది. దానికింత గొడవేంటి?" హరిత కూడా విసురుగా అంది.

"బంగారంలాంటి నా నిద్ర చెడగొట్టింది చాలక గొడవంటావా? నీకీమధ్య కళ్ళు నెత్తికెక్కాయిలే"

"పొరపాటున చెయ్యిజారిందంటే అర్థం కావడం లేదా? దానికి అంతంత మాటలంటావా?"

"నోర్ముయ్! మాటకి మాట సమాధానం చెప్పడం నాకిష్టముండదు" విసురుగా బాత్‌రూమ్‌లోకెళ్ళి తలుపు బిగించుకున్నాడు.

హరిత అవాక్కయి అలాగే నిలబడిపోయింది. ఏమిటీ మనిషి? ఇలా ఎందుకైపోయాడు. ఎంత సున్నితంగా ఉండేవాడు. మనుష్యులూ ఇంతగా మారిపోతారా? తన్ని అనుక్షణం సూటిపోటి మాటలతో హింసించే ఈ మనిషి తన ప్రభా ఒకరేనా?

హరిత అన్యమనస్కంగానే పనులు ముగించింది. బాగ్ తీసుకుని బయటికి బయలుదేరబోతుంటే

"ఆదివారాలు కూడా తిరుగుడేనా? ఈ రోజు నా ఫ్రెండ్స్ భోజనానికి వస్తున్నారు. నల్గురికి వంట చెయ్యి" హుకుం జారీచేసాడు.

"ఇప్పుడా చెప్పేది? నేను బయటకు వెళ్ళాలి. వంట చేయడం కుదరదు" చెప్పులేసుకుంటూ అంది హరిత.

"అంటే! నేను చెప్పాక కూడా నువ్వు బయటికెళతావా? ఈ మీటింగ్‌లు పెట్టి మీరెవర్ని ఉద్ధరిస్తారట. ఊరికే షో చేయడం తప్ప. నువ్వీరోజు బయటకు వెళ్ళడం లేదు. అంతే"

"పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. నీ సంగతి చూస్తూనే ఉన్నాను. నా ఇష్టం వచ్చినపుడు బయటకెళ్ళే హక్కు నాకుంది. నువ్వెవడివి నన్నాపడానికి" కోపంతో నిలువునా వణికిపోతూ అంది హరిత.

"నేను ఎవడినోనేవరకూ వచ్చిందా? ఇపుడే చూపిస్తాను" అంటూ గబుక్కున వచ్చి హరిత చేయిపట్టుకుని విసురుగా వెనక్కి విరిచాడు. హరిత బాధతో కెవ్వుమని అరిచింది. అపుడే ఇంట్లోకి వస్తున్న చంద్రశేఖర్ ఆ దృశ్యం చూసి స్థాణువై నిలబడిపోయాడు. వెంటనే తేరుకుని

"ఒరేయ్ ప్రభా! ఏమిట్రా ఈ పని. నువ్వసలు మనిషివేనా? ఛీ... ఛీ..."

"చంద్రా! మర్యాదగా మాట్లాడు. ఇది మా స్వవిషయం. నువ్వెందుకు తలదూరుస్తావు"

హరిత సిగ్గుతో, అవమానంతో కుంగిపోయింది.

చంద్రశేఖర్‌కి నోటమాట రాలేదు. తన ప్రాణస్నేహితుడు, తన ప్రతి భావాన్ని పంచుకునే ఆత్మీయుడు ఇతనేనా? ఏం మాట్లాడకుండా గిరుక్కున వెనక్కు తిరిగి బయటికెళ్ళిపోయాడు.

ఆ సంఘటన జరిగాక హరిత మామూలుగా ఉండలేకపోయింది. ప్రభాకర్ పట్ల, అతని ప్రవర్తన పట్ల మనస్సంతా అసహ్యంతో నిండిపోయింది. డబ్బుతో సమస్తం కొనుక్కోగలను అనే అహంతో విచ్చలవిడిగా ప్రవర్తించే ప్రభాకర్‌తో ఇంక ఎంతమాత్రం కలిసుండడం కుదరదనే నిశ్చయానికి వచ్చింది. ఇతను తను ప్రేమించిన ప్రభా కాదు. డబ్బు పిచ్చిలో పడి కొట్టుకుంటున్న ఇతను వేరు. ఎప్పుడూ తన కొత్త కారు గురించి, కొత్త కొత్త షేర్ల గురించి మాత్రమే మాట్లాడే ఈ మనిషి తన మనిషి కాడు. ఇతనికి కవిత్వం అంటే పనీపాటా లేని వాళ్ళ పైత్యం. ఒకప్పుడు చెవికోసుకున్న సంగీతం శుద్ధ దండగదని. అతనిపుడు చదివేది వినేది షేర్ల గురించి మాత్రమే. వందల్ని వేలుగా, వేలని లక్షలుగా మార్చడం ఎలా అనే ఆలోచనలు తప్ప కథలు కాకరకాయలు అక్కరలేదు.

హరిత ఆలోచనలు ఓ రూపు దిద్దుకోక ముందే వైజాగ్ ట్రాన్స్ఫర్ అయ్యింది. హరిత వైజాగ్ వెళ్ళడానికి ప్రభాకర్ ఒప్పుకోలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసేసి ఇంట్లో కూచోమన్నాడు. తను లక్షలు సంపాదిస్తున్నానని నీ బోడి ఉద్యోగం డబ్బులు అవసరం లేదనే ధోరణిలో మాట్లాడాడు. అతని అహంకారపు ధోరణికి చాచి లెంపకాయ వేయాన్నంత కోపం వచ్చింది హరితకి. ఛీ... ఛీ... ఈ మనిషి గురించి ఆలోచించడం దండగ. పతనం అంచులవైపు వేగంగా జారిపోతున్న ఇతను మారడం సాధ్యం కాదు.

హరిత వైజాగ్ వెళ్ళి జాయినైపోయింది. ప్రభాకర్ ఎంత అడ్డం పడినా, ఎన్ని మాటలన్నా లెక్కచెయ్యలేదు. హైదరాబాదు వదిలేసి సంవత్సరం అవుతోంది. అప్పటి నుండి ఇద్దరి మధ్యా ఎలాంటి సంబంధాలు నడవలేదు. మళ్ళీ ఇపుడే ప్రభాకర్‌ని చూడడం.

* * *

మూడో రోజున ప్రభాకర్‌ని డిస్చార్జ్ చేసారు. ఈ మూడు రోజుల హరిత తన ఫ్రెండ్ ఇంట్లోనే ఉంది. ప్రభాకర్‌తో ఎక్కువ మాట్లాడలేదు. ఎక్కువ సమయం అతను నిద్రపోతూనే ఉన్నాడు. చంద్రశేఖర్ కారు తీసుకొచ్చాడు. ప్రభాకర్ కారులో కూర్చున్నాడు. హరిత హాస్పిటల్ మెట్లమీద నిలబడిపోయింది.

"హరీ! ప్లీజ్! కారెక్కు." ప్రభాకర్ పిలిచాడు.

ఆ సమయంలో హాస్పిటల్ గేట్‌లో ఏమీ మాట్లాడలేక హరిత కారెక్కింది. చంద్రశేఖర్ మౌనంగా కారు నడుపుతున్నాడు. ఓ పది నిముషాల్లో వాళ్ళని ఇంట్లో దింపేసి వెళ్ళిపోయాడు చంద్రశేఖర్. సంవత్సరం తర్వాత ఇంట్లో అడుగు పెట్టింది హరిత. ప్రభాకర్ చాలా నీరసంగా ఉన్నాడు. ఇంటికెళ్ళగానే పడుకుని నిద్రపోయాడు. ఆ ఇంటి వాలకం చూసి హరిత చీదరించుకుంది. ఎంతో నీట్‌గా, శుభ్రంగా ఉండే ప్రభాకర్ ఇంత ఘోరంగా ఎందుకయ్యాడు. ఫ్రిజ్‌లో డ్రింక్ సీసాలు. ఎక్కడబడితే అక్కడ సిగరెట్ పెట్టెలు. ఇలా బతికే మనిషికి హార్ట్‌ఎటాక్ ఎలా రాకుండా ఉంటుంది. ఎపుడూ నిప్పుతొక్కిన కోతిలా చిటపటలాడే ఈ మనిషి ప్రశాంతంగా ఎలా బతకగలడు. అహంకారం, అతిశయం అణువణువులోనూ జీర్ణించుకుపోయిన మనిషి. ఇతను ఇలాకాక ఇంకెలా బతుకుతాడు. ఛీ... ఛీ... తను అనవసరంగా మళ్ళీ ఈ ఇంటికొచ్చింది. ఈ మూడు రోజులుగా లోపలెక్కడో మెత్తబడిన మనస్సు వజ్రంకన్నా కఠినంగా మారిపోయింది. అతను నిద్రలేవగానే వెంటనే అక్కడ్నుంచి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాక హరిత మనస్సు కొంచం శాంతించింది.

సాయంత్రం ఏడయినాగాని ప్రభాకర్ గదిలోంచి బయటకు రాలేదు. చిరుచీకట్లు కమ్ముకుంటున్నవేళ హరిత కొంచం కంగారుపడుతూ అతని రూమ్‌లోకి తొంగి చూసింది. ప్రభాకర్ మెలకువగానే ఉన్నాడు. టేబుల్ లాంప్ వెలుగుతోంది. టేబుల్ ముందు కూర్చొని అతనేదో దీర్ఘంగా రాస్తున్నాడు. చాలాసేపటి నుండి రాస్తున్నట్టున్నాడు. అతనేం రాస్తున్నాడో హరితకి అర్థం కాలేదు. గొంతు సవరించుకొని

"నేను వెళుతున్నాను" అంది.

ప్రభాకర్ చటుక్కున తలెత్తి "ఒక్క పదినిముషాలు ఆగుతావా హరీ! ప్లీజ్" అతని స్వరం ఎంతో మెత్తగా ఉంది.

ఓ పది నిముషాల తర్వాత ఓ తెల్ల కవర్ తెచ్చి హరిత చేతికిస్తూ "దయచేసి చింపేయకుండా ఈ ఉత్తరం చదువు" అన్నాడు. హరిత ఆశ్చర్యపోయింది. ఉత్తరమేమిటి? ఏం రాసుంటాడు. 'నేను మారిపోయాను. నన్ను క్షమించు' లాంటి డైలాగులు వల్లించి ఉంటాడు అనుకుంటూ

"ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో" అని చెప్పి తన ఫ్రెండింటికి బయలుదేరింది. ఇంటికెళ్ళగానే ఆత్రుతగా కవర్ విప్పింది హరిత.

హరీ!

నాకోసం వచ్చినందుకు థాంక్స్. ఈ రోజు నువ్వెళ్ళిపోతావని నాకు తెలుసు. నీతో ముఖాముఖీ మాట్లాడే శక్తి నాకిపుడు లేదు. నా ఆరోగ్యం పాడైపోయింది. కాబట్టి నేను మారిపోయానని, మనం కలిసుండవచ్చని నేను నీకు రాయడం లేదు.

నువ్వొకరోజు ఒక మాటన్నావు. మనం ఏదోవిషయమై తీవ్రంగా గొడవపడుతున్నపుడు.

(తరువాయి 48వ పేజీలో)



విజయవిహారం మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000 : 11 సంచికలు) ముచ్చటైన బైండ్ సెట్‌గా వెలువడింది! వెల : రూ.125/-

## 'వెంటాడే కలాలు' పుస్తకసమీక్షపై ప్రసేన్ జవాబు

# రేపటి సాహిత్య ప్రతిష్టలు నేడు సంచలనాలుగా కనిపించవచ్చు!

ఇవాళ్టి జాలి రేపటి ప్రేమగా మారితీరుతుంది. ఇది నాకు మానవ సంబంధాల పట్ల ఉన్న విశ్వాసం. పుస్తక సమీక్షలపై స్పందించడం మర్యాద కాదని తెలిసి కూడా సమీక్ష గాడి తప్పడానికి కారణాలైన నేపధ్యాలను వివరించడానికి ఇది వేదిక అవుతుందని భావించి మాత్రమే ఈ చిన్న పాటి వివరణ. అంతే కానీ మాకు వెంటాడే కలాలు సమీక్షకుడితో ఎటువంటి పేచీ లేదు. ఆ సమీక్షకుడే రేపు మమ్మల్ని ప్రేమిస్తాడన్న నమ్మకం నాకు బలంగా ఉంది. అందుకే కేవలం సమీక్ష పరిధిలోనే కాకుండా ఇతర అంశాలపై కూడా చర్చించడానికి కొంత స్వేచ్ఛ నాకు నేనుగా తీసుకున్నాను.

సంచలనాలకు సాహిత్య గౌరవం ఉండదు. ఇది అక్షరాలా నిజం. అయితే ఏది సంచలనం, ఏది సాహిత్య గౌరవం పొంద తగింది అనే గీత కచ్చితంగా గీయగలగడమే అసలైన విమర్శకుడు లేదా సిసలైన పాఠకుడు చేయవల్సిన పని. ఒకో మారు భవిష్యద్దర్శనం చేసే శక్తి సరిగా లేనందువల్ల కొన్ని నష్టాలు జరుగుతాయి. ఇవాళ సంచలనంగా మాత్రమే కనిపించిన అంశాలు రేపు సాహిత్య గౌరవాన్ని అందుకోవడం ఇటువంటి సందర్భంలోనే సాధ్యమవుతూంటుంది. మాదిగలు తమ పేర్లకు చివరన మాదిగ అని తగిలించుకోవడం మొదలు పెట్టినపుడు దాన్ని ఒక సంచలనంగా మాత్రమే తెలుగు ప్రపంచం భావించింది, కొంటె విసుర్లు కూడా విసిరింది. ఆ తర్వాత ఆ విధంగా పేరుకు తక్కువ కులాన్ని తగిలించుకోవడం ఆత్మ గౌరవం అని అదే ప్రపంచం అర్థం చేసుకోవడం మన అనుభవంలోనే ఉంది. 'బర్న్ ది బ్రా' అని స్త్రీ వాదులు ఉద్యమం ప్రారంభించినపుడు దాన్ని ఒక వినోదంగానూ వెకిలిగానూ చూసినవారు, రాసిన వారు మనకు తెలుసు. అదే స్త్రీ వాదులు ఆతర్వాత ఎంత గౌరవం పొందారో కూడా మనకు తెలిసిన అనుభవాల్లోనే ఉన్నాయి. కనుక ఇప్పుడు 'వెంటాడే కలాల' ముందు మాటకు సంచలనం అని పేరు పెడితే నాకేమీ అభ్యంతరం లేదు. ఎందుకంటే అటువంటి పేర్లు పెట్టడం కేవలం ఆ నామకరణీయుల హ్రస్వదృష్టిని మాత్రమే తెలియ చేస్తుంది. నా బాధల్లా సమీక్షలో చేసిన విమర్శలను విమర్శకుడు సరిగా కన్సాలిడేట్ చేయకపోవడం గురించే. 'హైజాక్ చేయడం' 'తొడ కొట్టుళ్లు' వంటి పద ప్రయోగాల పట్ల సమీక్షకుడు చాలా అభ్యంతర పడడం వినపడింది. హైజాక్ చేయడం అనే మాటలో సమీక్షకుడికి బిసిలు రాసిన కవిత్వాన్ని దళితులు తమ కవిత్వంగా చెప్పుకున్నారన్న అర్థం కనిపించడం నిజంగా అర్థం చేసుకోవడంలో లోపం తప్ప మరేమీ కాదు. దళితులపై జరిగిన దాడులకు ప్రతిస్పందనగా కవిత్వం రావడం, దళిత వేదనను సహానుభూతితో కవితలుగా వెలువరించడం మొదట బిసిలు మాత్రమే చేసారన్నది మా అభిప్రాయం. ఆ తర్వాత కొందరు ఎస్సీ కవులు బిసిలను అసలు మీరు దళితులే కాదని ఊళ్లోకి నెట్టేందుకు నడుం కట్టారని, దళిత కవిత్వానికి తాము మాత్రమే ప్రతినిధులమని నమోదు చేసుకునేందుకు ప్రయత్నం చేసారన్నది మా వాదన. ఇక్కడ కొన్ని పేర్లను తప్పనిసరి పరిస్థితుల్లో ఉదహరించవల్సి వస్తున్నందుకు ఇబ్బందిగానే ఉన్నప్పటికి తప్పడం లేదు. కవులంతా అనుభూతులను, సామాజిక సంఘటనలకు ప్రతిస్పందనలను కవిత్వంగా రాసుకుంటున్న కాలంలో దళిత అవగాహనతో కవిత్వం రాసిన మొదటి ఎస్సీ కవి సతీష్ చందర్ మాత్రమే. ఆ తర్వాత దళిత కవులుగా తమకు తాము ముద్రలు వేసుకునేందుకు ప్రయత్నం చేసిన వారందరూ దళిత సారాన్ని పులుముకున్న వారే తప్ప వేదనా తీవ్రత రుచి తెలిసిన వారు కాదు. వారికి సామాజిక సంఘటనలకు ప్రత్యామ్నాయంగా దళిత భావన దొరికింది అంతే. సతీష్ చందర్ 'పంచమ వేదం' అంటున్నప్పుడు ఈ కవులు ఇంకా 'వర్తమానం' అనే అంటున్నారు. మరో దళిత కవి ఉన్నాడు. ఆయన కవిత రాసి ఆంధ్రజ్యోతి త్రిపురనేని శ్రీనివాస్‌కు పంపితే శ్రీనివాస్ ఆ కవితను తిప్పి పంపుతూ నువు దళితుడివి కనుక నువు దళిత కవిత రాస్తేనే అచ్చేస్తాను అని ఉత్తరం రాస్తే అప్పుడు ఆయన దళిత వేదనను కన్నీళ్లు కార్చాడు. కవిత అచ్చుకావడం కోసం. ఈ పిట్ట కథను ఆ కవే స్వయంగా తన కిర్రు చెప్పుల భాషలో చెప్పుకున్నాడు. ఇటువంటి దళిత కవుల నిజాయితీ వల్ల సందేహం కలగని వారిని సందేహించాలన్నది మా వాదన. ఆ తర్వాత ఇటువంటి ఇద్దరో ముగ్గురో మాత్రమే దళిత కవులుగా తమ పీఠాలను భద్ర పరచుకునే వ్యూహంలో భాగంగానే బిసిలను దళితుల నుంచి వేరుచేయాలని చూసారు. ఇదీ హైజాక్ అనే పద ప్రయోగం వెనుక నేపధ్యం. బిసిలు అప్పటికే దళిత కవిత్వం రాస్తున్న విషయాన్ని తెర మరుగు చేసి ఎస్సీలు రాసేది మాత్రమే దళిత కవిత్వం అన్న వాదనను ప్రచారం చేసి అప్పటి వరకు దళితులుగా సహానుభూతి పొందుతూ దళిత కవిత్వం రాసిన బిసిలను తోసిరాజని దళిత ముద్రను వేసుకునేందుకు కొందరు ప్రయత్నం చేసారన్నది మా ఉద్దేశ్యం. ఇదీ మా హైజాక్ పదానికి అర్థం! ఈ విషయాన్ని సటిల్‌గా ముందు మాటలో చెప్పాం. ఇందులో సమీక్షకుడు అభిప్రాయపడ్డట్టు సంచలనం కోసం స్టేట్‌మెంట్లు ఇవ్వాలన్న దుగ్ధ లేదు.

ఇకపోతే తొడ కొట్టుళ్లు అనే పద ప్రయోగం గురించి... ఉద్యమానికి వాచాలత్వం ఉండకూడదు, దానికి ఉండాల్సింది కేవలం కార్యశూరత్వం మాత్రమే. దళితులుగా బలమైన కవిత్వం చెప్పాలన్న తాపత్రయంలో ఎస్సీ దళిత కవులు బూతులు కూసారు. అనవసరపు వాచాలత్వాన్ని చూపారు. ఉద్యమానికి ఉపయోగ పడని సవాళ్లు విసిరారు. ఈ వాచాలత్వాన్నే తొడకొట్టుళ్లు అనే మాట ద్వారా చెప్పే ప్రయత్నం మేం చేసాం. ఎస్సీ దళిత కవుల కవిత్వంలో వాచాలత తప్ప కార్యశూరత్వం లేదన్నది మా పద ప్రయోగ ఉద్దేశ్యం. ఉద్యమాలు కానీ కవిత్వం కానీ మరింత నిర్దిష్టతను సంతరించు కోవడం ముందు మాట రాసిన వారికి విడిపోవడంగా కనిపించిందని సమీక్షకుడు అభిప్రాయ పడ్డారు. అలా మేం అభిప్రాయ పడ్డట్టు ముందు మాటలో ఎక్కడా లేదు. ఘర్షణ అనంతరం జరిగే ఐక్యత అత్యంత పటిష్టంగా ఉంటుందని మేం నమ్ముతాం. ఘర్షణ పట్ల మాకు ఎటువంటి అభ్యంతరాలు లేవు. అయితే అన్ని ఘర్షణలూ పటిష్టపడే క్రమంలో మాత్రమే జరగవు. చాలా ఘర్షణలు కేవలం విడిపోవడానికిమాత్రమే జరుగుతాయి. మాల, మాదిగ ఘర్షణ అలా విడిపోవడానికే జరిగిందని మా అభిప్రాయం. మాదిగ ఉద్యమం పట్ల మాదిగల పట్ల మాకు సానుభూతి లేదన్న ఆరోపణలో అర్థం లేదు. మాల బ్రాహ్మల దళిత దాష్టీకం అనే శీర్షికతో నేను రాసిన వ్యాసాన్ని చాలా మంది మాదిగలు భద్రంగా ఇప్పటికీ దాచుకున్నారన్న విషయం చెప్పుకోవడానికి నాకు మోడెస్టీ అడ్డురాకపోవడం నా సైద్ధాంతిక నేపధ్యాన్ని అర్థమయేట్టు వివరించడానికే. మాల మాదిగలు ఘర్షణ పడ్డట్టుగా బిసి కవుల్లో ఒక కులంతో మరొక కులానికి ఘర్షణ లేదు అని చెప్పడం ఇక్కడ మా ప్రధాన ఉద్దేశం. మాల మాదిగలు ఐక్యత దిశగా వెళ్లలేదని చెప్పడానికి వేరే ఆధారాలు చూపనవసరం లేదనుకుంటాను. చరిత్రే పెద్దక్షరాలతో సాక్ష్యం చెపుతున్న మాట సమీక్షకుడికి కూడా వినపడి తీరాలి. అంబేద్కర్ పూలేల గురించిన మా వ్యాఖ్యలు అవగాహనా రాహిత్యాన్ని తెలియ చేస్తున్నాయని సమీక్షకుడు అన్నాడు కానీ ఎక్కడ ఏ వ్యాఖ్య ఏ మేరకు అవగాహన రాహిత్యాన్ని తెలియ చేస్తుందో కన్సాలిడేట్ చేయలేదు. ఇది కచ్చితంగా ఆధారాలు లేని స్వీపింగ్ కామెంట్. అవగాహన లేకుండా ఒక అక్షరం ముక్క కూడా మేం రాయలేదని నేను చెపుతున్నాను. ధృక్కోణాలు మారే సందర్భంలో, ఆయా వ్యక్తులు అర్థాలు చెప్పుకునే క్రమంలో మాది అవగాహనలేమిగా కనపడితే అది మా తప్పు కాదు. కవిత అచ్చుకావడం కోసం దళిత వేదనను పులుముకున్న కవికి కూడా మా అవగాహన లేమి గురించి వ్యాఖ్యానించే సైద్ధాంతిక స్తోమత ఉందని మేం అనుకోవడం లేదు. ఇకపోతే సమకాలీన సాహిత్య ప్రపంచం గురించి సమాచారం ఈ సమీక్షకుడి వద్ద లేదని కూడా ఈ సమీక్ష చెపుతోంది. వెంటాడే కలాలు పుస్తకం మొట్టమొదటి బిసి కవితా సంకలనం కానేకాదు. ఇది మొట్ట మొదటి బిసి కవితా సంకలనం అనడం స్వల్ప పరిజ్ఞానంతో చేసిన కామెంట్. ఇంతకు ముందు ఒక బిసి కవితా సంకలనం వచ్చింది. తెలుసుకోండి సమీక్షక మహాశయా! పుస్తకంలోని నెగెటివ్ థాట్‌ను పట్టించు కోకుండా వదిలేసారు అనడం కూడా సమకాలీన సాహిత్య ప్రపంచం పట్ల అవగాహన లేకపోవడమే. ఈ పుస్తకాన్ని పట్టించుకోకుండా ఎవరూ వదిలిపెట్టలేదు. బిసి కవులందరూ ఈ కవితా సంకలనంలో లేరు అన్నది మరో విమర్శ. ఈ కవితా సంకలనం బిసి కవితా సర్వస్వం కానే కాదు. ఆంధ్ర దేశంలోని బిసి కవులందరి కవిత్వం ఇందులో ఉంటుందని కానీ, ఉందని కానీ ఎక్కడా ప్రకటనలు, హామీలు వెలువడలేదు. ఇది ఇరవై ముగ్గురు బిసి కవుల దళితాత్మ కవిత. అంతే! దూదేకుల వారు బిసిలేనా కాదా అనే విషయంలో (సాంకేతికంగా సరే) మాకు కొన్ని రిజర్వేషన్స్ ఉన్నాయి. ఇవి ఇంకా చాలా మందికి కూడా ఉన్న రిజర్వేషన్సే. ఈ విషయంలో చర్చ జరగాల్సి ఉందని మేం అనుకుంటున్నాం.

ముందు మాటలో ఎస్సీలపై అనేకానేక ఆరోపణలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నది మరొక వాదన. దళితులతో మమేకమై, సహానుభూతితో దళిత కవిత్వాన్ని రాసిన బిసి కవులు వేరు కుంపటి పెట్టినట్టు దళిత కవితా సంకలనం కాక బిసి కవితా సంకలనం ఎందుకు వేయాల్సి వచ్చింది అని ప్రశ్నించుకుంటే ఈ ముందు మాట అర్థం అవుతుంది. ఈ ముందు మాటలో బిసిలు దళితుల నుంచి వేరు అనే అర్థం వచ్చే మాట ఎక్కడా లేదు. ముందుమాటను మొత్తంగా దళితాత్మ కవిత అనే అన్నాం. దళితులతో ముందు ముందు కలిసి నడవడానికే బిసిలు ఇష్టపడుతున్నారన్న విషయాన్ని కూడా స్పష్టంగానే చెప్పాం. బిసి కవితా సంకలనం ముందు మాటలో బిసి తాత్విక ధృక్పథం వివరించడం కాక బిసి ఎస్సీ సాహిత్య రాజకీయాలను చర్చించడానికి కారణం కూడా ఎస్సీలతో కలిసి ముందుకు సాగడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పడానికే. ఎస్సీల తాత్విక ధృక్పథమే బిసి తాత్విక ధృక్పథం అని మేం నమ్ముతున్నాం. బిసిలకు వేరేగా తాత్విక ధృక్పథం ఉండకూడదు. ఒకవేళ ఉండాలని ఎవరైనా అంటే వారు ఎస్సీలు బిసిలు వేరు వేరు అని అంటున్నారని అర్థం. మేం అలా అనడం లేదు. జరిగిన కొన్ని పొరపాట్లను ఎత్తి చూపించడం మాత్రమే ముందు మాటలో జరిగింది. మేం పొరపాట్లుగా చెప్పినవి పొరపాట్లు అవునో కాదో మాత్రమే చెప్పండి. కావని రుజువు చేయండి. ఘర్షణ ద్వారా ఐక్యత అనే సూత్రానికి ఇదే సరైన పద్ధతి అని మేం నమ్ముతున్నాం. పద్ధతి ప్రకారం చర్చించకుండా కేవలం మా మీద నిందలు వేసే ప్రయత్నాలు మాత్రమే జరుగుతున్నాయి. మేం ముందు మాటలో కొన్ని ప్రశ్నలను సంధించాం. ఆ ప్రశ్నలను సహించలేని వారు మాత్రమే మా మీద దాడులు చేస్తున్నారని మేం అనుకుంటున్నాం. ప్రశ్నించడాన్ని సహించలేకపోవడం ఫ్యూడల్ భావజాలం, బ్రాహ్మణ్యం లక్షణం! అది మన భాష కానే కాదు.

\- ప్రసేన్

అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

## ఆటవికుడు

చొక్కా విప్పి పడుకోవడం నాకిష్టం
విప్పిన చొక్కా మళ్లీ వంటి
మీదకెలా వచ్చిందో నాకు తెలియదు.
అడిగినా ఎవ్వరూ చెప్పరు

నోరు మూయటం మూయించటం
యిక్కడి రూలు.
ఆకాశంలో
రెండు కాకులు సంగమిస్తాయి
యిక్కడ కళ్లకింద
నల్లటి నీడ జన్మిస్తుంది
వీధులన్నీ విచిత్రమయిన కాంతితో
కరువు వాసనతో పొంగి పొర్లుతాయి.
చెట్ల నుంచి కల్లు కుండల్ని దించి
కోతులకి తాపటం నాకానందం
నా యింట్లో
ఒక గబ్బిలం చేరింది
యిల్లు ఖాళీ అయినా చేయాలి
లేదు - గబ్బిలంతో సహా జీవనం
అయినా చేయాలి.
ఏది రైటని నువ్వడిగితే
ఏం చెప్పాలి
ఎలకని నొక్కాలి
అప్పుడు ప్రపంచంలో ప్రపంచం
దెయ్యంలో భూతం కన్పిస్తుంది
మనుషులు అంకెలుగానూ, డాట్స్‌గానూ
మిగిలిపోతారు
ఇది వరమో శాపమో కూడా
నాకు తెలియదు
నా యిష్టం లేకుండా నా యింట్లోకి
ఎలా వచ్చిందో - వేళ్లతో సహా
పీకి పారేయటం నా వల్ల అవుతుందా

ఇంకా మొలచుట్టూ ఆకులు
కట్టుకు తిరుగుతున్న వాణ్ణి
పశువుల మందవెంట తిరుగుతూ
పేడ పొగు చేసుకుంటున్న వాణ్ణి
ఎలకల సంగతీ, internet సంగతీ
నాకేం తెలుస్తుంది చెప్ప -
యింత గోసీ పెట్టుకుని
ఊళ్లెంట తిరిగే వాడికి
సైబర్ చొక్కాలెందుకు, వేలి చివర
వెలుస్తున్న ఊర్ధ్వ ప్రపంచాలెందుకు.
యింకా
మెతుకులు రాల్తాయని మోరెత్తి
ఆకాశం కేసి చూస్తున్నవాణ్ణి
'అమ్మా ఆకలి' అని
దోసిలిబట్టి నిలబడితే, నెత్తురు కూడు
నా ముందు బెట్టిందెవరు.

ఆహారం కోసం
చెట్టూ చేమలు పట్టుకు తిరుగుతున్న నాకు
ఈ సింథటిక్ వస్త్రాలెందుకు, బర్గర్ భోజనాలెందుకు
యింకా దుంపలు తవ్వుకు తింటున్న నాకు
ఈ చిన్నిపెట్టెలో ప్రత్యక్షమయ్యే
మాయాజాలమెందుకు
మంత్ర నగరులెందుకు
మాఫియా ముఠాలెందుకు
నన్నిలానే
నా గోసితోనూ, నా ఈటెతోనూ
నా పగ్గంతోనూ, పందుల్ని వేటాడుకుంటూ బతకనీ
\-
నాకు పందిగా
ఎవరు కన్పడ్డా వేటాడి తీరుతాను
ఆటవికుణ్ణీ, అడవి మనిషినే
అయినా
అమెరికాకు నమస్కారం పెట్టని వాణ్ణి.

\- కె. శివారెడ్డి



అనువాద కవిత

## జీవన గీతం

జీవితమొక శూన్యపు కల అని
దుఃఖపు అంకెల్లో చెప్పొద్దు నాకు
ఆత్మకు ఆనందం మరణిస్తేనే!
కనిపించే వస్తువులు
ఎప్పటికీ వాటి నిజస్వరూపాలు కావు
*
జీవితం వాస్తవమైంది, ఊహాజనితం
కూడా.
శ్మశానం కాదు దాని గమ్యస్థానం.
నీవు కేవలం దుమ్మే,
ఆ దుమ్మైనా కనీసం నీతో వస్తుందని
నీ ఆత్మ చెప్పలేదు నీతో.
*
గొప్పగా చనిపోయినవాళ్ళు
ఎప్పటికీ గుర్తు చేసేది
మన జీవితాల్ని మనమే
ఉన్నతంగా చేసుకోవాలని.
ఈ లోకాన్ని మనం విడిచివెళ్లేప్పుడు
మన వెనుక మిగిలేవి కేవలం
కాలం, ఇసుకతిన్నెలపై కాలిగుర్తులు.
*
కాలిగుర్తులు ఏవైనా
జీవితాన్ని అంతంవరకూ జీవించాలి.
దుఃఖమైనా, విషాదమైనా
తెలిసేది హృదయానికే.
*
ఇకనైనా విధిని ఎదుర్కొందాం
హృదయాలను మేల్కొల్పుదాం
ఇంకా సాగిపోదాం.. ఇంకా సాధిద్దాం,
శ్రమించడం నేర్చుకుందాం.

ఆంగ్లం : వాల్ట్‌విట్మన్, తెలుగు : బాణాల శ్రీనివాసరావు

## సంకెళ్ల గణితం

నా చుట్టూరా నిల్చున్న ఊచల్ని
లెక్కిస్తూనే వున్నాను
పాత లెక్కే
ఎక్కడి నుంచి మొదలెట్టానో
అక్కడికే వస్తున్నాను తప్ప
లెక్క తేలటం లేదు
అమ్మమ్మ అమ్మకు చెప్పింది
అమ్మ నాకు చెప్పింది
అయినా ఈ పాతలెక్క ఎప్పటికీ ప్రశ్నార్థకమే!
రేపునా చిట్టితల్లికైనా
ఈ లెక్క గొడవ తప్పేనా?

\- కల్పనా రెంటాల

## బెస్ట్ యానిమేటర్ ఇన్ ఇండియా

# శ్యామ్ రామన్న



'టైటానిక్' నుంచి 'గ్లాడియేటర్' వరకూ అన్నీ కంప్యూటరైజ్డ్ స్పెషల్ ఎఫెక్టులతో, డిజిటల్ మాయాజాలంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న సినిమాలే. అది భారీ నౌక అయినా, డైనోసార్ అయినా, పురాతనమైన రోమన్ కలోసియం అయినా భారీ సెట్టింగ్‌లు వేసి తీసే శ్రమ తప్పిపోయింది. మామూలు సినిమాల్లో కూడా పేలుళ్లు, కార్లు గుద్దుకోవటం, తదితర దృశ్యాలలో స్పెషల్ ఎఫెక్టులను వాడుకోవటం తప్పనిసరైపోయింది. ఇప్పుడు డిజిటల్ యానిమేషన్, స్పెషల్ ఎఫెక్టుల రంగంలో ప్రపంచవ్యాపితంగా ఏడాదికి 25 బిలియన్ డాలర్ల బిజినెస్ జరుగుతున్నట్టు చెబుతున్నారు. 2005 సంవత్సరానికి ఇది 70 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఇప్పటివరకూ బయటి ప్రపంచానికి పెద్దగా తెలీకపోయినా - ఇందులో తాను కూడా తన వాటా దక్కించుకోవటానికి కృషి చేస్తోంది 'క్రెస్ట్ యానిమేషన్ స్టూడియో'. ముంబయ్‌తో పాటు చెన్నయ్, బ్యాంకాక్, సింగపూర్, అమెరికాలలో బ్రాంచీలున్న ఈ స్టూడియో అధినేత శ్యామ్ రామన్న. నలభై రెండేళ్ల ఈ బక్కపల్చటి యువకుడు డిజిటల్ యానిమేటర్, ఫిల్మ్ మేకర్. ఇతడి స్టూడియో అడ్వర్టయిజింగ్, యానిమేషన్, టీవీ సాఫ్ట్‌వేర్, ఫిల్మ్ ఎడిటింగ్ లాంటి పనులు చేస్తుంది. 'బోర్డర్' లాంటి కొన్ని హిట్ సినిమాలకు స్పెషల్ ఎఫెక్టులను సమకూర్చిన ఘనత దీనిదే. రెండుమూడేళ్ల కిందటి వరకూ ఆర్థికంగా ఇబ్బందుల్లో నడిచిన ఈ సంస్థ పోయినేడాది ఒక మిలియన్ డాలర్ల లాభంతో నిలబడింది. శ్యామ్ రామన్న 15 సెకన్ల యాడ్ తీయడానికి పదిరోజులను, 40 వేల డాలర్లను తీసుకుంటాడు. (ఫీజు కచ్చితం కాదు. బేరాన్ని బట్టి అటూ ఇటుగా వుంటుంది.) ఇప్పుడు రామన్న రెండు హాలీవుడ్ ప్రాజెక్టులు చేపట్టే పనిలో వున్నాడు. కొలంబియా ట్రిస్టార్ వాళ్ళు పెట్టుబడి పెడుతున్న 'ఆటోమేషన్-ఎ టాయ్ స్టోరీ'కి బహుశా రామన్న అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయవచ్చు. ఈ 50 మిలియన్ డాలర్ల ప్రాజెక్టుకి హాలీవుడ్‌లో పేరున్న రిచ్ దర్శకుడుగా పనిచేస్తున్నాడు. ఒక బ్యాంకాక్ సంస్థ పెట్టుబడిలో డిజిటల్ యానిమేషన్‌లో రామన్న దర్శకత్వంలో 'రామాయణం' తీసే ప్రాజెక్టు కూడా వుంది.

"చాలాకాలంగా ఆసియాను వరల్డ్ క్లాస్ యానిమేషన్‌కి కేంద్రం కాదని భావిస్తూ వచ్చారు. ఇప్పుడు అది నిజంకాదని చెప్పాలి" అంటున్నాడు శ్యామ్. బహుశా తన రెండు సినిమాలతో తన ప్రతిభ ఏమిటో ప్రపంచానికి చాటే ఉద్దేశ్యంలో వున్నాడు.

శ్యామ్ గతంలో - ఒక చిరుత కవాసాకి బజాజ్‌గా మారినట్టు తీసిన యాడ్ బాగా పాపులర్. పదేళ్ల క్రితం - అప్పట్లో సంచలనం సృష్టించిన మొట్టమొదటి కండోమ్ యాడ్ కూడా శ్యామ్ తీసిందే. అమ్మకాల రీత్యా ఆ కండోమ్ ఇప్పుడు దేశంలో నెంబర్‌వన్. ఆ యాడ్ ద్వారా రామన్న - బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ కెమెరావర్క్ అవార్డులను అందుకున్నాడు. ఇప్పటి వరకూ రామన్న ఇటువంటివి 42 అవార్డులు అందుకున్నాడు.

రామన్న జీవితం అనుకోకుండా ఈ రంగంలోకి మలుపు తిరిగింది. శ్యామ్ తండ్రి రాజారామన్న - ప్రసిద్ధ సైంటిస్టు, మాజీ రక్షణ మంత్రి, అణుశక్తి రంగపు పితామహుడు. సహజంగానే శ్యామ్ సైన్స్ చదువుకున్నాడు. ముంబయ్ యూనివర్సిటీలో జియోఫిజిక్స్, టెక్నాలజీ చదువుకున్నాడు. కొన్నాళ్లు ఒక ప్రభుత్వ ఆయిల్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. కొంతకాలం ఒక మ్యూజిక్ కంపెనీకి ప్రొడక్షన్ వర్క్ చేస్తున్న మిత్రుడికి సహాయంగా వున్నాడు. మ్యూజిక్ వీడియోలు అప్పుడప్పుడే ఇండియాకి వస్తున్నాయి. వాటి ఎడిటింగ్‌లో వచ్చిన అనుభవం, ఆసక్తి అతడ్ని కంప్యూటర్ గ్రాఫిక్స్‌లోకి మళ్లించాయి. అతడికి అప్పట్లో నెలకి 25 డాలర్లు వచ్చేవి. ఆ తర్వాత సొంతంగా ఒక కంపెనీని పెట్టి యాడ్ కమర్షియల్స్ తీయడం మొదలుపెట్టాడు. యాడ్‌లతో మొదలుపెట్టి స్పెషల్ ఎఫెక్టులు, యానిమేషన్ రంగంలో నెంబర్‌వన్ ఎక్స్‌పర్ట్‌గా ఎదిగాడు. ఇప్పటికే అరబ్ దేశాలకీ, ఆగ్నేయాసియా దేశాలకీ విస్తరించిన రామన్న, త్వరలో ప్రపంచాన్ని కూడా జయించబోతున్నాడు.

## ఆయేషా సేవ



హిందీ, పంజాబీ, కన్నడ భాషలన్నీ కలుపుకొని 52 సినిమాల్లో నటించిన ఆయేషా జుల్కా ఈ మధ్య నాటకరంగంలో మంచి పేరు తెచ్చుకుంది. గత పదహారేళ్లుగా విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'పురుష్' అనే నాటిక హిందీ వెర్షన్‌లో ఆయేషా, నానాపటేకర్ నటిస్తున్నారు. దేశంలో విజయవంతమైన ఈ నాటికను ఇటీవల అమెరికాలోని కొన్ని నగరాల్లో ప్రదర్శించారు. ఇందులో ఆయేషాది తిరుగుబాటు తత్వం గల టీచర్, సామాజిక కార్యకర్త పాత్ర. ఈ పాత్రను ఇప్పుడు నిజ జీవితంలో కూడా పోషిస్తోంది. ఆయేషా తన తల్లి పేరు మీదుగా 'స్నేహ' అనే స్వచ్ఛంద సంస్థ పెట్టింది. పేద పిల్లలకోసం, వృద్ధుల కోసం, పని చేస్తానని చెబుతోంది. ఇప్పటికే ఒక స్కూల్‌ను ప్రారంభించింది.

## యుక్త'సఖు'డు మాధవన్



దక్షిణాది సినిమాల్లో ఏంమత్తు, మహత్తు వుందో ఏమోగాని చాలామంది బాలీవుడ్ తారలు - ఇక్కడ ఛాన్స్‌ల కోసం అర్రులు జాస్తున్నారు. ఇక్కడి నుంచి వెండితెరమీదికి వెళితే అచ్చివస్తుందనేమో! వీరిలో ప్రపంచ అందాల రాసులు కూడా వున్నారు. ఐశ్వర్యారాయ్ సంగతి తెలిసిందే. జీన్స్‌తో ఆమెకి కొంతైనా అదృష్టం కలిసొచ్చింది. ఇప్పుడు మిస్ యూనివర్స్ యుక్తాముఖి కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ముంబాయిలో అఫ్తాబ్ శివదాసానితో తొలి సిన్మాని ఒప్పుకున్నప్పటికీ తమిళంలో వచ్చిన మరో ఆఫర్ పట్ల ఎంతో ఆశగా వుంది యుక్త. దీనికి కారణం - తమిళ సిన్మాని డైరెక్ట్ చేస్తున్నది క్రియేటివ్ జీనియస్ మణిరత్నం కావడమే! అయితే అన్నీ పకడ్బందీగా ప్లాన్ చేసుకునే దాకా ఏదీ వెల్లడించే అలవాటు లేని మణి మాత్రం దీనిపై పెదవి విప్పడం లేదు. కాని ఇండస్ట్రీలో మాత్రం అప్పుడే ఈ సంగతి గుప్పుమంది. ఇంతకీ యుక్తకి ఈ సినిమాలో ఇష్ట సఖుడిగా నటిస్తున్నది - మణి తాజా హాట్ ఫేవరేట్ మాధవన్ అట!

## మన సినిమాల్లో... యూ ఆర్ అండర్ అరెస్ట్

"హీరోకి విలన్ గ్యాంగ్‌కి మధ్య (ఒక్కోసారి విలన్ మాత్రమే) భీకర పోరాటం జరుగుతోంది. ఇద్దరికీ దెబ్బలు బాగానే తగిలాయి. ఇద్దరూ అప్పటికే చాలా దూరం ప్రయాణం చేస్తూ కొట్టుకున్నారు. అంతలో పోలీసులు వచ్చేశారు. "యూ ఆర్ అండర్ అరెస్ట్" అన్నాడు ఒక పోలీసు అధికారి. విలన్‌ను లేదా గ్యాంగ్‌ను వాళ్ళే గుర్తుపట్టి ఒక్కొక్కరిని జాగ్రత్తగ వ్యాన్‌లో ఎక్కించి తీసుకుని వెళ్ళిపోయారు. అదీ సాధారణంగా పాతకాలం సినిమాల్లో కనబడే దృశ్యం. కొంతకాలం దాక సినిమాల్లో పోలీసులకి పెద్దగా పనుండేది కాదు. అందుకే చివర్లో వచ్చేవాళ్ళు. తర్వాత తీరే మారింది (పోలీసులు మారలేదు... గమనించండి). ఇపుడు పోలీసులకు చేతినిండా (సిన్మాల్లో) పని దొరుకుతోంది. పాత సిన్మాల్లో పోలీసులు కొంచెం సాఫ్ట్‌గానూ కొండొకచో సింపథిటిక్ గానూ కనిపించేవారు. ఇపుడలా కాదు. (పోలీసు దుస్తుల్లో మార్పు రావటం కేవలం వాళ్ళకి సంబంధించిన విషయం. సిన్మా వాళ్ళకి పాత్ర లేదు). ఈ మధ్య కాలంలో వచ్చిన సినిమాల్లో 'పోలీస్ బీటింగ్' అంటే పోలీసులను చావగొట్టాడు అన్నది మొదలైంది. (ఉదా: చిరంజీవి నటించిన 'ఖైదీ')



ఇపుడు సిన్మాల్లో పోలీసులు (ముఖ్యంగా కాన్‌స్టేబిళ్ళు) హాస్య పాత్రలు వేస్తున్నారు. కామెడీని పుట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని సినిమాల్లో పోలీసు(లు) విలన్(లు)గా వుండటం పరిపాటి అయ్యింది. ఏకంగా ఒక ఐ.జి. (ఇన్‌స్పెక్టర్ జనరల్!)నే విలన్‌గా చూపించగలిగిన సినిమా "శత్రువు". సాధారణంగా అయితే విలన్‌కు సహకరించే ఇన్‌స్పెక్టర్‌లు వుంటారు. కొన్ని సినిమాల్లో ఇంకా పైస్థాయి అధికారులు వుండవచ్చు. మన సినిమాల్లో పోలీసులు ఏదైనా కేసు పరిష్కరించటం అరుదు. (హీరో పోలీస్ అయితే తప్ప) సాధారణంగా పోలీసులు అవినీతిపరులు (సిన్మాల్లో).

ఇక హీరో పోలీస్ అధికారయితే చెప్పేదేముంది. ఊర్లో ఏం జరిగినా ఆయనే వుంటాడు. అది హత్యకావచ్చు, బ్యాంకు దోపిడీ కావచ్చు, నక్సలైట్లు కావచ్చు, కిడ్నాప్ కావచ్చు. పోలీస్ హీరోకి ఒక ఏరియా వుండదు. ఊరంత (లేదా సిటీ అంతా) ఆయనదే. హీరో పోలీస్ అధికారి అయితే - అతనికి ఒక ప్రత్యర్థి (డిపార్ట్‌మెంటులోనే) వుండాలి. ఒక్కోసారి సినిమాలో పోలీసులు ఏమాత్రం కనిపించరు. లేదా ఒక్కసారి మాత్రమే కనిపిస్తారు (ఏమీ చెయ్యరు) కొన్ని సార్లు హీరోయిన్ పోలీస్‌గా వుంటుంది. హీరో కూడా వుంటాడు కనుక ఆమె చెయ్యాల్సిన పనులన్నీ అతనే చేస్తాడు. (కర్తవ్యం లాంటి సిన్మాలు తప్ప) పోలీస్ కానిస్టేబిల్ హీరోగా హీరో వుండటం చాలా అరుదు. (ఉదా: పోలీస్ బ్రదర్స్). కొన్ని పోలీస్ సినిమాలే వచ్చాయి. అందులో హీరో ఎస్.పి. లేదా కమిషనర్‌గా వుంటాడు. అతను అధికారి కూడా విలన్‌లతో స్వయంగా తలపడతాడు. వేరేవాళ్ళకి ఛాన్సివ్వడు. విలన్‌లు కూడా చాలా మామూలుగా వాళ్ళ కుటుంబంలో (ఏం సెక్యూరిటీనో!) ఎవర్నో ఒకర్ని చంపేయటం, ఎత్తుకు పోవటం చేస్తుంటారు. (ఒక జిల్లా స్థాయిలో ఎస్.పి. దగ్గరికి ఒకసారి వెళితే తెలుస్తుంది. ఆయన్ని కలవటమే ఎంత కష్టమో! ఇంక ఏమైనా చెయ్యటమా?) హీరో పోలీస్ కానపుడూ - అయినపుడూ కూడా పోలీసుల పరిస్థితి దారుణం! ఎంత మంది పోలీసులున్నా హీరోని ఏం చెయ్యలేరు. హీరోనే పోలీసయితే మిగతా వాళ్ళని ఎలాగూ ఏమీ చెయ్యనివ్వడు. ఈ మధ్య వస్తున్న సినిమాల్లో పోలీస్ స్టేషన్ చిత్రంగా వుంటోంది. ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌లో తాగటం మామూలే. హీరో పోలీసు అధికారిగా వుంటే ఆ ర్యాంకు ఏదో భలే కన్ఫ్యూజింగా వుంటుంది. కనుక్కోవటం కష్టం. సాధారణంగా (ఏ స్థాయిలో వున్నా సరే) హీరో పోలీసయితే 'ఒన్ మ్యాన్ ఆర్మీ' అంటే ఏం జరిగినా సరే ఒక్కడే జీపు వేసుకుని వెళ్ళటం - అక్కడ అందర్నీ చావగొట్టడం జరుగుతాయి. అదే హీరో పోలీసు కాకుండా వుంటే ఎక్కువ మంది పోలీసులు వెళ్ళటం - హీరో చేతిలో తన్నులు తినటం జరుగుతుంది. హీరో పోలీస్‌గా వుంటే పిస్టల్ గురి తప్పదు. అది రివర్స్ అయితే హీరో వంద మంది పోలీసులు తుపాకులు పేలుస్తున్నా సునాయాసంగా తప్పించుకుని వెళ్ళిపోతాడు. కోర్టులో హీరో పోలీసయితే గొడవనే జరగదు. సాక్షులు బుద్ధిగా వుంటారు. (రివర్స్‌లో) కోర్టులో హీరోని అంతమంది పోలీసులు కంట్రోలు చెయ్యలేరు.

సినిమాల్లో (హీరో పోలీసయితే) పోలీసులు సమర్థంగా వుంటారు. అలా కాకపోతే చాలా వీక్‌గా వుంటారు. తెలుగు సిన్మాలో హీరో పోలీస్ 'ఇందుగలడందు లేదని సందేహం వలదు..." అన్నట్టుగా వుండటం సర్వసాధారణం.

(44వ పేజీ తరువాయి)

# అపూర్వ స్వప్నం

'I can buy any thing with money and I can make any body dance before me' అని నేనన్నపుడు 'నీ అహంకారమే నిన్నీ స్థితికి తెచ్చింది. ఇంత అతిశయం పనికిరాదు. నువ్వు ఏకాకిగా మిగిలిపోయి, మనిషి కోసం ఏడ్చే రోజొకటి వస్తుంది' అన్నావు. నిజం! హరితా! నేను ఎంత పొగరుగా, అహంకారంగా ప్రవర్తించానో తలుచుకుంటే నా మీద నాకే అసహ్యం వేస్తోంది. కన్ను మిన్నూ గానకుండా నా చేజేతులా నిన్ను దూరం చేసుకున్నాను. నాకు ప్రాణవాయువు లాంటి నా చంద్రని దూరం చేసుకున్నాను.

వ్యక్తిత్వంతో, ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడే నీలాంటి అమ్మాయిని నా సహచరిగా, నా స్నేహితురాలిగా అంగీకరించలేక ఎంత సంకుచితంగా ప్రవర్తించానో, నిన్ను ఎలాంటి మాటలతో గాయపరచానో తలుచుకుంటే నేను ఇంత నీచ స్థితికి ఎలా దిగజారానో అన్పిస్తుంది.

"నీ చేతుల్లో చేతులేసి నీ పక్కన నడవాలనుంది ప్రభా" అని నువ్వడిగినపుడు ఆనందంగా అంగీకరించిన నేను తీరా నువ్వు నాతో సమానంగా అడుగులేయడం మొదలు పెట్టగానే నిన్ను వెనక్కి నెట్టేయడానికి నా శాయశక్తులా కృషి చేసాను. నువ్వు నన్ను దాటి వెళ్ళిపోతావేమో అనే భయం అనుక్షణం నన్ను పీడించేది. నిటారుగా ధైర్యంగా నడిచే నిన్ను భరించలేక అణిచివేయడానికి అనేక రకాలుగా ప్రయత్నించాను. నీ జీవితాన్ని శాసించి నిన్ను ఇంటి నాలుగ్గోడలకి పరిమితం చేయాలనే నా ప్రయత్నాలని తిప్పికొట్టి, నా అహంకారాన్ని ఛీత్కరించి నువ్వు నీ గమ్యం వేపు సాగిపోయావు. నిజం! హరితా! నువ్వు స్వేచ్ఛగా విశాల ప్రపంచంలోకి వెళ్ళిపోయావు. మరి నేను? నా చుట్టూ గిరిగీచుకుని, డబ్బుతో అన్నీ కొనగలనని అతిశయంతో, ఆత్మీయులందర్నీ దూరం చేసుకుని అంటరానివాడిగా మిగిలిపోయాను. ఓ అర్ధరాత్రి హఠాత్తుగా గుండె బరువెక్కిపోయి, ఊపిరి ఆడని స్థితిలో అతిహీనంగా, నడవలేక కుప్పకూలిపోయినపుడు, నేను ఎవరినైతే అవమానించి, దుర్భాషలాడానో ఆ మిత్రుడు ఆఘమేఘాలమీద నన్ను హాస్పిటల్‌కి తెచ్చి నన్ను బతికించాడు. అపుడుగాని నాకు మనుష్యుల విలువ తెలిసిరాలేదు. నేను అతి సునాయాసంగా సంపాదించిన డబ్బు నన్ను భుజానవేసుకుని హాస్పిటల్‌కి తీసుకురాలేక పోయింది. నన్ను అభిమానించి స్నేహాన్ని, ఆప్యాయతని పంచే మనుష్యుల్ని దూరం చేసుకుని, ప్రాణంలేని వస్తుసముదాయాన్ని ప్రేమించిన నేను ఎంత మూర్ఖుణ్ణో నాకిపుడు అర్థం అవుతోంది. జీవితాన్ని తేజోవంతం చేసే సాహిత్యాన్ని, పుస్తకాలని నిర్దాక్షిణ్యంగా కాలదన్ని షేర్ గైడులు, బిజినెస్ టుడే లాంటి వాటి వెంట వెర్రి పరుగులు తీసిన నేను, నీ అభిరుచుల్ని, నీ ఆశయాలని, ఆదర్శాలని గౌరవించలేని నేను, నీ విశాల ప్రపంచాన్ని కుదించేసి నిన్ను బావిలో కప్పలాగా తయారు చేయాలని ప్రయత్నించిన నేను మూర్ఖుడినే. స్వేచ్ఛగా, హాయిగా ఎగిరే రామచిలకల్ని పట్టుకుని రెక్కలు కత్తిరించేసి పంజరంలో బంధించేయాలనుకునే లక్షలాదిపురుషుల జాబితాలో నేనూ ఒకణ్ణి. వెలుతురు విరజిమ్మే నీ వ్యక్తిత్వాన్ని భరించలేక కళ్ళు మూసుకున్న గుడ్డివాణ్ణి. నన్ను దాటి ముందుకు దూసుకుపోయే నీ తెగింపు, గుండె నిబ్బరం చూసి అనుక్షణం ఆత్మన్యూనతతో బాధపడేవాణ్ణి. అధికార సంబంధాలకి అలవాటుపడిన వాణ్ణి కదా! నువ్వందించిన స్నేహ సంబంధంలోని మధురిమని ఎలా అర్థం చేసుకోగలను? ఐదేళ్ళ క్రితం మనకి పరిచయమైన కొత్తల్లో మన మధ్య ఎంత చక్కటి స్నేహం ఉండేది. నేను భర్త హోదాలోకి వచ్చాక స్నేహం స్థానంలో అధికారం, అహంకారం ఎంత అవలీలగా వచ్చేసాయి. ఈ రెండు జాడ్యాలు నా రెండు కళ్ళని కప్పేసాయి. నా ప్రవర్తన నిన్నెంత మానసిక క్షోభకి గురిచేసిందో ఇపుడు అర్థం అవుతోంది. ఆ రోజు నీ చేతిని మెలిపెట్టి నువ్వు బాధతో విలవిల్లాడుతుంటే నేనెంత రాక్షసానందం పొందానో, అడ్డొచ్చిన ఆప్తమిత్రుణ్ణి ఎంత నీచంగా అవమానించానో తలుచుకుంటే నా మీద నాకెంత అసహ్యం వేస్తుందో మాటల్లో చెప్పలేను. నేను చేసిన అన్యాయం, అవమానం దిగమింగుకుని నాకోసం వచ్చిన నువ్వు ఎంత ఎత్తుకు ఎదిగిపోయావో అర్థం చేసుకోగలను. మానవత్వం, కేవలం మానవత్వంతో నాకోసం వచ్చిన నీ స్థాయికి నేను ఎప్పటికి ఎదగలేను. వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం ఆభరణాలుగా ముందుకు సాగే మీలాంటి ఆడవాళ్ళని అర్థం చేసుకుని సహజీవనం చేసే స్థాయికి మేమింకా ఎదగలేదు. మేము సంసారానికి తప్ప సహజీవనానికి పనికిరాం. ఈ సంసారాలు ఎంత అరాచకంగా ఉండనీ, ఎంత సంక్షుభితంగానైనా ఉండనీ మేము అందులోనే పొర్లుతుంటాం. వాటిని మార్చుకునే చిన్న ప్రయత్నం కూడా మేం చేయం. మీరు చేస్తే సహించలేం. మీరు సంసారాలు కూల్చేస్తున్నారని, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసేస్తున్నారని ప్రచారం చేస్తాం. నేను ఎన్నిసార్లు నిన్నీ మాటలనలేదు.

హరితా! నీ పట్ల నేను ఎంతో అనుచితంగా నీచంగా ప్రవర్తించాను. ఈ నాలుగు రోజులు నేను ఈ ఆలోచనలతో సతమతమవుతున్నాను. నా తప్పుల్ని నీ ముందు ఒప్పుకోవడానికి నేను సిగ్గుపడడం లేదు. నేను మనిషిగా, మునుపటి ప్రభాకర్‌గా మారాలనుకుంటున్నాను. ఎంతో హాయిగా సాగిన ఆ జీవితాన్ని తిరిగి తెచ్చుకోవాలని ఆశపడుతున్నాను. ఎంతవరకు సక్సెస్ అవుతానో నాకే తెలియడం లేదు. ఇక ఆపేస్తాను. - ప్రభాకర్

ఉత్తరం చదవడం ముగిసేసరికి హరిత కళ్ళు నీళ్ళతో తడిసిపోయాయి. ప్రభాకర్‌లో వచ్చిన మార్పు నిజమేనా? ఇదో అపూర్వ స్వప్నంలా వుంది. అనుకుంటూ ఆలోచిస్తూ వుండిపోయింది.

* * *

మూడు నెలలు గడిచిపోయాయి. హరిత ఆఫీసు పనితో క్షణం తీరిక లేకుండా వుంది. అటెండర్ లోపలికొచ్చి "అమ్మా! మీ కోసం ఎవరో వచ్చారని" చెప్పి స్లిప్ టేబుల్ మీద పెట్టాడు.

'చంద్రశేఖర్, హైదరాబాదు' అని వుంది దాని మీద.

"లోపలికి రమ్మను" అంది హరిత.

చంద్రశేఖర్ లోపలికొచ్చాడు.

"హరితా! బావున్నావా?" అన్నాడు నవ్వుతూ.

"బావున్నాను. ఏమిటి విశేషాలు? యింత దూరమొచ్చావేమిటి చంద్రా?" అంది హరిత సంతోషంగా.

"పెద్ద విశేషమేమీ లేదు. ఓ పెళ్ళికి వచ్చాను. యింత దూరం వచ్చేను కదా! నిన్ను చూసి పోదామనిపించింది. నీకో మంచి వార్త కూడా చెప్పాలి. బయటకెళదామా? నీకేమైనా పనుందా?"

"ఫర్వాలేదులే. వెళదాం పద. ఉదయం నించీ మీటింగులకి అటెండయ్యి నాక్కూడా విసుగ్గా వుంది" అంది లేస్తూ.

"బీచ్‌కెళదామా" అంది హరిత.

"అంతకన్నానా. కాస్త చల్లగాలి భోంచేస్తూ మాట్లాడుకోవచ్చు" అన్నాడు చంద్రశేఖర్ ఉత్సాహంగా.

రామకృష్ణా బీచ్‌లో కూర్చున్నారు.

సముద్రం ఎగిసి పడుతోంది. విరిగిపడుతున్న కెరటాలని చూస్తుంటే నీళ్ళలోకి దిగాలన్పిస్తోంది హరితకి.

ఇపుడు పశ్చాత్తాపపడి ఏం లాభం చంద్రా! దెబ్బతిన్న ఆరోగ్యాన్ని తెచ్చుకోగలడా? గాయపడ్డ నా మనస్సును ఊరడించగలడా! ఏం చేయగలడు?" హరిత కంఠం ఓరబోయింది.

"నిజమే హరితా! ప్రభా పట్ల నీకుండే ప్రేమ నాకు తెలియనిదా! ఫూల్ కాబట్టే నిన్ను దూరం చేసుకున్నాడు. నీ ప్రేమని పోగొట్టుకున్నాడు. అయితే వాడు పశ్చాత్తాపంతో రగిలిపోతున్నాడన్నది మాత్రం నిజం. తను జారవిడుచుకున్న జీవితాన్ని వెతుక్కునే ప్రయత్నంలో మునుపటి ప్రభాగా మారిపోయాడు. నా మిత్రుడు దొరికాడని నాకెంతో సంతోషంగా వుంది. ఆ సంతోషాన్ని నీతో పంచుకోవాలను కున్నాను అంతే. అంతకి మించి నీకు సలహాలివ్వాలని నా ఉద్దేశ్యం కాదు సుమా!" నవ్వుతూ అన్నాడు చంద్రశేఖర్.

హరితకి ప్రభాకర్ రాసిన ఉత్తరం గుర్తొచ్చింది. నిజానికి హరిత ఆ ఉత్తరం గురించి చాలా రోజులు ఆలోచించింది. ఆ ఉత్తరం వరకూ చాలా నిజాయితీగానే రాసాడు. ఈ మూడు నెలల కాలంలో నిజంగానే మారివుంటాడేమో! చంద్రశేఖర్‌కి అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు. వాళ్ళిద్దరి స్నేహం ఎలాంటిదో తనకు తెలుసు.

"ఏంటి హరితా! ఆలోచిస్తున్నావ్?"

"ఏం లేదు చంద్రా! నీకు నీ ఫ్రెండ్ దొరికినందుకు కలిగిన ఆనందాన్ని చూస్తున్నాను. అలాగే ప్రభా నాకు రాసిన ఉత్తరం గురించి కూడా ఆలోచిస్తున్నాను" అని ఆ ఉత్తరం విషయం చెప్పింది.

చంద్రశేఖర్ ముఖం సంతోషంతో విప్పారింది.

"చూసావా? నే చెప్పింది నిజమని యిప్పటికైనా నమ్ముతావా? ఆ రాత్రి వాడికి గుండెనొప్పి వచ్చి గిలగిల్లాడినప్పుడే వాడిలో మార్పు మొదలైంది. ఆ విషయం వాడే చెప్పాడు. హరితా! నాకెంతో ఆప్తులైన మీరిద్దరూ ఎవరికి వారే యమునాతీరేగా బతకడం నాకు చాలా బాధగా వుంది. మనకి పరిచయమైన మొదటి రోజుల్లో ఎంత బావుండేది. మనం ముగ్గురం సాహిత్య చర్చలతో, సంగీతం వింటూ ఎన్ని గంటలు గడిపేవాళ్ళం. ప్రభా ఎంత బాగా మాట్లాడేవాడు. వాడి భావాలెంత నిశితంగా వుండేవి. మీ సహజీవనం ఎంత ఆదర్శవంతంగా వుండేది. హరితా! ప్రభాతో ఒక్కసారి మాట్లాడకూడదా!" చంద్రశేఖర్ కళ్ళల్లో సన్నటి నీటిపొర చూసి హరిత తెల్లబోయింది.

"చంద్రా! ఏమిటిది? యింతగా కదిలిపోతున్నావేంటి? నువ్వు నాక్కూడా మంచి మిత్రుడివే. నీ సలహాకి థాంక్స్ చంద్రా. ఈ మూడునెలలుగా నేనూ సీరియస్‌గానే ఆలోచిస్తున్నాను. మునుపటి ప్రభా దొరికితే నాకూ సంతోషమేగా. అయితే నాక్కొంచెం టైం కావాలి. నిజానిజాలు నిగ్గుతేలాలిగా. వెళదాం పద. ఏదైనా హోటల్‌కెళ్ళి కాస్త కాఫీ తాగుదాం" అంటూ లేచింది హరిత.

"థాంక్యూ!" అంటూ లేచాడు చంద్రశేఖర్. అతని మనసు దూదిపింజలాగా తేలికపడింది. ఆత్మవిశ్వాసం ఉట్టిపడేలా అడుగు ముందుకేస్తున్న హరితని అనుసరించాడు చంద్రశేఖర్.

---

వచ్చే సంచికలో డి.ఆర్. ఇంద్ర కథ

'పంథొమ్మిదో పురాణం'

---

## చిత్ర విహారం



# ప్రేమతో...రా!

## రా... సిరీస్‌లో మరో రొటీన్ సినిమా

వెంకటేశ్ తప్ప మిగతా అందరూ తమ వయసుకు - ఇమేజికి తగ్గ పాత్రల్లో నటించిన (?) సిన్మా ఇది. ఈ సినిమా బావుందని చెప్పే అంశాలు ఇందులో పెద్దగా లేవు కానీ బాలేదని చెప్పటానికి బోల్డు విషయాలున్నాయి. మొదటిది ముఖ్యమైంది వెంకటేశ్ - అతని పాత్ర. రెండు కథా - కథనం... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో వున్నాయి. ఈ సినిమా చూసింతర్వాత కథ ఎక్కడో విన్నట్లో లేదా చూసినట్లో అనిపించటంలో ఆశ్చర్యం లేదు. ఇదొక సాధారణమైన కథ. ఒక ప్లేబాయ్ (వెంకటేశ్) చుట్టూ అల్లబడిన ఈ కథలో కొత్త విషయాలు కానీ కొత్తగా చూపించిన విషయాలు కానీ ఏమీ లేవు. ఈ తరహా సిన్మాలో వుండాల్సిన టెంపో మనకు కన్పించకుండా చేసిన ఘనత దర్శకుడిదే. సన్నివేశాలు చాలామటుకు పేలవంగా వున్నాయి అంటే దానికి కారణం స్క్రీన్‌ప్లే. వెంకటేశ్ తాతయ్య (కోట శ్రీనివాసరావు), అలీ పాత్రల ద్వారా హాస్యం పండించే ప్రయత్నం బాగలేదు. సినిమాలో పలు సన్నివేశాలు కన్విన్సింగా లేకపోవటం వల్ల లాగబడినట్లు అనిపిస్తుంది. కొన్ని సన్నివేశాలు మరీ ఎక్కువగా లాగబడి సహనాన్ని పరీక్షిస్తాయి. ఉదాహరణకు వెంకటేశ్ సిమ్రాన్ ప్రేమకోసం ప్రయత్నం చేసే సీన్లు - ఒక హోటల్ రూమ్‌లో ఒకేసారి ముగ్గురు అమ్మాయిలను వెంకటేశ్, అలీ, కోట మేనేజ్ (సారీ! తప్పుగా అనుకోవద్దు) చేసే సన్నివేశాలు అతిగా అనిపించి చికాకు కలిగిస్తాయి.

ఇక కథ చూస్తే బాగా డబ్బున్న ఒక పెద్ద కుటుంబం. కోట శ్రీనివాస రావు, సుజాతల కొడుకు మురళీ మోహన్. అతనికి ఇద్దరు కొడుకులు (వెంకటేశ్, సురేష్). పెద్దవాడు సురేష్ సహజంగా బుద్ధిమంతుడు. వెంకటేశ్ మాత్రం జులాయిగా అమ్మాయిల వెంట తిరుగుతూ (మధ్యలో పాటలు పాడుతూ) వుంటాడు. అతనికి తోడు అలీ. ఇక నిక్కరు వేసుకున్న తాతయ్య (ఎందుకోమరి!)కు వెంకటేశ్ చేసే పనులు తెలుసు. బాగా ఎంకరేజ్ చేస్తూ వుంటాడు. మధ్యమధ్యలో స్కోరు (?!) అడుగుతూ వుంటాడు. ఇతనికి తోడు ఎల్బీ శ్రీరాం (పాపం). ఒకసారి ఊటీలో లొకేషన్‌లు చూడటానికి వెళ్ళిన (ఇతను తన స్వంత కంపెనీకే యాడ్ ఫిల్ములు తీస్తుంటాడు) వెంకటేశ్ సిమ్రాన్‌ను చూస్తాడు. ఎలాగైనా పొందాలనుకుంటాడు (హీరో!?). అయితే ఆమెను లొంగదీసుకోవటం అంత సులభం కాదని తెలుసుకుని ఒక ఛాలెంజ్‌లా తీసుకుంటాడు. (హీరో ఛాలెంజ్ మరి. ఏమవుతుంది). చివరకు విజయం సాధిస్తాడు. ఆమెను వదిలేసి వెళ్ళిపోతాడు.

ఇక్కడ సురేష్ తను రెండేళ్ళుగా ప్రేమించిన ప్రేమ (నటి పేరు)తో పెళ్ళి జరుగుతుండగా ఆమె సడన్‌గా పెళ్ళి చేసుకోను అని చెపుతుంది. అంతా ఆశ్చర్యపోతారు. అపుడు ఆమె తన చెల్లెలు సిమ్రాన్‌ను పెళ్ళి మంటపంలోకి తీసుకొచ్చి వెంకటేశ్ ఆమెని మోసం చేశాడని చెపుతుంది. అలాంటి వ్యక్తి వున్న ఇంట్లోకి పెళ్ళి చేసుకుని వచ్చి కాపురం ఎలా చెయ్యాలని వెళ్ళిపోతుంది. వెంకటేశ్ ఆలోచనలో పడతాడు. చివరకు సిమ్రాన్ అక్క దగ్గరికి వెళ్ళి అన్నను పెళ్ళి చేసుకోమని అడుగుతాడు. దానికోసం తాను సిమ్రాన్‌ను పెళ్ళి చేసుకుంటానని చెపుతాడు. అయితే సిమ్రాన్ తిరస్కరిస్తుంది. మంచివాడిగా మారితే సిమ్రాన్ ఒప్పుకుంటుందని ఆమె అక్క వెంకటేశ్‌కు సలహా ఇస్తుంది. సరేనని వెంకటేశ్ మంచివాడిగా మారే ప్రయత్నాలు మొదలు పెడతాడు. అయితే హోటల్‌లో వెంకటేశ్ మరొకరితో వుండగా చూసిన సిమ్రాన్ అతన్ని నమ్మే ప్రసక్తి లేదని చెపుతుంది. కాని అక్కకోసం పెళ్ళికి ఒప్పుకున్నట్లు నటిస్తుంది. అక్క పెళ్ళి ముందు కనుక ఆమె పెళ్ళి కాగానే వెళ్ళిపోవటానికి ఏర్పాట్లు చేసుకుని వెంకటేశ్‌కి చెపుతుంది. చివరగా అలాగే వెళ్ళిపోతుండగా వెంకటేశ్ వచ్చి 'నేనే వెళ్ళిపోతాను నువ్వు వుండు' అని వెళ్ళిపోతాడు. అంతలో సిమ్రాన్‌కు హాస్పిటల్ నుంచి ఫోన్ వస్తుంది. ఆమె అక్కడికి వెళితే అంతకు ముందు హోటల్ రూమ్‌లో వెంకటేష్‌తో వున్న అమ్మాయి వుంటుంది. (సరదాగా కాదు యాక్సిడెంటయ్యి). ఆమె అదంతా నాటకమని చెపుతుంది. దాంతో సిమ్రాన్ పరిగెత్తుకుంటూ ఎయిర్‌పోర్టుకు వెళ్ళి విమానం ఆపి (ఇది కాపీ అని అనుమానమా? కచ్చితంగా అవును) వెంకటేశ్‌ను కలుస్తుంది. ఇలా జరుగుతుందని ప్రేక్షకులకు ముందే తెలిసినప్పటికీ - అది తెలియచేసిన పద్ధతి, తెలుసుకున్న పద్ధతి రెండూ బాధాకరంగా వున్నాయి. మొదట క్లైమాక్స్ చూద్దాం. వెంకటేశ్ ఎలాంటి నాటకమైనా ఆడగలడని చెప్పిన సిమ్రాన్ - హాస్పిటల్‌లో ఒకమ్మాయి చెప్పిన దాన్ని బట్టి ఒక్కసారిగా వెంకటేశ్‌ని నమ్మటం చిత్రమే. ఆ అమ్మాయి ద్వారా వెంకటేశ్ నాటకం ఆడి వుండవచ్చన్న అనుమానం అస్సలు రాదు ఎందుకోమరి? ఎంతోమంది అమ్మాయిలతో తిరిగిన వెంకటేశ్ సిమ్రాన్‌ను మోసం చేశావని ఫీల్ కావటం విచిత్రమే. కోటశ్రీనివాసరావు పాత్ర నడిపించిన తీరు ఏమీ బాగలేదు. మనమడిని సపోర్ట్ చెయ్యటం అసలు బాలేదు. అలీ పాత్ర కొంతవరకు అసభ్యతను కూడా ప్రదర్శించిందన్నది వాస్తవం. అమ్మాయిలను వలలో వేసుకోవటం గొప్ప విద్యని చెప్పే ప్రయత్నం చేసే పాత్ర అది. (వెకిలి హాస్య కూడా వుంది) సినిమాలో బ్రహ్మానందం కూడా వున్నాడు వెయిటర్ పాత్రలో. సినిమాలో ఫైట్సు వుండాలి కనుక ఒకడున్నాడు. వాడితో అసలు ఫైటు ఎందుకో అర్థం కాదు.

ఇక వెంకటేశ్ ఆ పాత్రకి ఏమాత్రం సరిపోలేదు. పైగా నవ్వుకునేటట్లు వున్నాడు. అది అతని తప్పు కాకపోవచ్చు కానీ పాత్రలు ఎన్నుకోవటంలో కొంత విజ్ఞత ప్రదర్శించాలి మరి. ఇలాంటి పాత్ర ద్వారా వెంకటేశ్ లాంటి నటుడి నుంచి నటనను ఎక్స్‌పెక్ట్ చెయ్యటం సమంజసం కాదు. ఇక సిమ్రాన్ గురించి పెద్దగా చెప్పాల్సిందేముంటుంది? మిగతా నటుల్లో కొంత సిన్సియారిటీ కనబడుతుంది. ఎందుకంటే ఎవ్వరూ నటించే ప్రయత్నం చెయ్యలేదు. సురేష్ పాపం! అస్సలు ఏమాత్రం ప్రాధాన్యత లేని పాత్ర. కోటశ్రీనివాస రావు ఒక బోర్ పాత్రలో వేశాడు. సినిమాలో పాటలు ఎక్కువ మోతాదులోనే వున్నాయి. మొదట చెప్పినట్లు రెండు సబ్‌ప్లాట్స్ (సిమ్రాన్‌ను వల్లో వేసుకోవటం - హోటల్‌లో అమ్మాయిలు) వల్ల సినిమాకు ఒరిగిందేమీ లేదు. పైగా కన్ఫ్యూజన్ పెరిగింది. ఈ సినిమాకు మైనస్ పాయింట్లు హీరో (యాంటీహీరో?) హీరోయిన్‌ల పాత్రలే. రెండు ముఖ్య పాత్రల పోషణ కన్విన్సింగ్‌గా లేకపోవటం వల్ల వాటి చుట్టూ అల్లబడిన కథ కూడా పేలవంగా వుండటం సహజం.

ఒక సాదాసీదా కథను తీసుకుని కొత్తగా చూపించే ప్రయత్నంలో సహజంగానే దర్శకుడు విజయం సాధించలేకపోయాడు. ఇలాంటి సినిమాల్లో పాటలు (అందులో అమ్మాయిలను చూపించటం) వంటి వాటికి ప్రాధాన్యత వుంటుంది కనుక డైలాగులు ఎలా వున్నా (అనేక భాషల్లో) ఫర్వాలేదు కనుక అవి అలానే వున్నాయి. రా... సీరిస్‌లో వచ్చిన మరో మామూలు (అంతకన్నా తక్కువే?) సినిమా ఇది. వెంకటేశ్ అభిమానుల సినిమా ఇది!

- సి.యస్. సలీంబాషా

మీరు హైద్రాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు

# చిన్నాకి న్యాయం చేయని నాన్న




ఈ సినిమానంతా తానే నెత్తిన వేసుకున్నాడు దాసరి. కథ నుంచి మంటలు, పాటలు, నిర్మాణం, డైరక్షన్ దాకా అన్నీతానై చూసుకున్నాడు. ఇంతేకాదు.... తండ్రిగా ఓ ముఖ్యపాత్రలో నటించాడు కూడా.... ఇన్ని చేసినా కొడుక్కి (అరుణ్ కుమార్) అదృష్టం కలిసి వస్తుందా అన్నది అనుమానమే. నూటపాతికపైగా సినిమాలు తీసి, వాటిలో మెజారిటీ సినిమాల్లో నటించి, ఎందరో నటుల్ని వెండితెరపైకి ఎగబాకించి, ప్రతిసినిమాలో కథనుంచి డైరెక్షన్ దాకా అన్ని ముఖ్య శాఖల్ని డామినేట్ చేసి - సినిమాల్లోని సారమెల్ల తెలిసిన దాసరి - కొడుకుని స్టార్‌గా చేయగల ఓ బలమైన కథని ఎంచుకోలేకపోవడం ఆశ్చర్యం. అర్థంపర్థం లేని పగ, ప్రతీకారాలు ఒంటి చేత్తో వందమందిని చితగ్గొట్టే హీరో సాహసాలకి కాలం చెల్లిందన్న సంగతి కూడా ఈ మెగా దర్శకుడికి తెలియదా? 'చిన్నా' సినిమా గురించి చాలారోజుల్నుంచి, పత్రికల్లో, టీవీలో గొప్పగా ఊరిస్తుంటే - నిజంగా దాసరి చాలా గొప్ప ఎఫర్టేదో పెడుతున్నట్టే ఊహించారు ఆయన అభిమానులు. అలాంటిదేదీ ఈ సినిమాలో మచ్చుకి కనిపించదు.

ప్రేక్షకుడి పేషన్స్‌కి ఎలాంటి సీన్లు పరీక్ష పెడతాయో ఇన్నేళ్ళ, ఇన్ని సినిమాల అనుభవమున్న దాసరికి బాగా తెలిసే వుండాలి. కాని విచిత్రంగా 'చిన్నా' నిండా అలాంటి అసహజ, అసందర్భ, అతికింపుల సీన్లే అడుగడుగునా!

అసలు సినిమా బిగినింగులోనే అస్సలు బిగిలేదు. మొదటి పావుగంట కథంతా 'బస్సు - దాని ప్రాముఖ్యత' అనే టాపిక్ మీద తీసిన ఓ డాక్యుమెంటరీలా సా...గుతుంది.

ఓ బస్సుకి నిప్పు పెట్టేందుకు తెగబడే రౌడీలకి చిన్న చిన్న లెక్చర్సి, వాళ్ళని రబ్బరు బెలూన్ల కంటే హీనంగా గాల్లోకి పల్టీలు కొట్టించి చితగ్గొట్టే పోలీసులకి అప్పగించడంతో మొదలువుతుంది.

ఈ కొట్లాట తతంగాన్ని మన సినిమా సూత్రం ప్రకారం - కొన్ని వందల మంది చోద్యంగా చూస్తుంటారని గమనించాలి. అంతా అయ్యాక 'చిన్నా చిన్నా' అంటూ చుట్టూవున్న వాళ్ళంతా చప్పట్లు చరుస్తూ హిస్టీరిగ్గా ఎందుకు అరుస్తారో తెలియదు. ఈ సాహసానికి కలెక్టర్‌నించి గోల్డ్‌మెడల్ కూడా అందుకుంటాడు చిన్నా.

ఆ తర్వాతిది - ఆర్టీసీ వారోత్సవాల సీను. నిజాయితీకి మారుపేరైన డ్రైవర్ దాసరి బస్సు ప్రాముఖ్యత పై ఆవేశం, కన్నీళ్లు మిక్స్ చేసి చాలా ఎమోషనల్‌గా ఫీలైపోయి ఓ పాడవాటి పాట ఎత్తుకుంటాడు. చుట్టూ లైన్లో నిలబడ్డ డ్రైవర్లు, వేదిక మీద అధికారుల గోడకు కొట్టిన బొమ్మల్లా దాసరి పాట సందేశాన్ని వినడం - అనక మెమెంటో ప్రదానం... ఇవన్నీ చాలాకృతకంగా అనిపిస్తాయి. సందేశాలూ, నీతులూ ఇంత వాచ్యంగా చెబితే ఎబ్బెట్టుగా అనిపిస్తాయే తప్ప ఏ ప్రేక్షక పారుడిలో స్పందన కలిగిస్తుందో దాసరికే తెలియాలి. ఇంతదాకా ఓ డాక్యుమెంటరీగానే సాగుతుంది.

చట్టబద్ధుడైన ఓ యువకుడు తనకి జరిగిన అన్యాయానికి విలన్ మీద పగ తీర్చుకోవడం అన్న రొటీన్ కథే - ఈ సినిమా అంతా. ఇందులోని విలన్ రెవిన్యూ మంత్రి(కోటా). విలన్ వెనుక ఓ రౌడీ మూక... వాళ్ళలో మిక్సైపోయి ఓ కామెడీ జంటా... ఆయన కూతురు మిని (ఆకాంక్ష). అరడజన్ మెడళ్ళు, సర్టిఫికెట్లూ వున్నప్పటికీ ఉద్యోగంలేని చిన్నా (అరుణ్) ఓ లేడీస్ కాలేజి ముందు మొబైల్ రెస్టారెంట్ పెట్టుకుంటారు. అదే కాలేజీలో హీరోయిన్ చదువుతుందన్న మాట! టిఫిన్ సప్లై దగ్గర వాళ్ళిద్దరి మధ్య చిన్న తగువులు రావడం - అనక ఆ అమ్మాయిలో హీరోపట్ల ప్రేమ ముదరడం జరుగుతాయి. పొగరుమోతు పెద్దింటి పిల్లదీ - అతిమంచివాడైన హీరో మధ్య ప్రేమ చిగురించడాలూ - అంతా పరమ రొటీన్ కథ. ఇద్దరూ కలిసి ఎస్.ఎ. రాజ్‌కుమార్ (సంగీత దర్శకుడు) ట్యూన్లకి పొరుగునే ఉన్న శ్రీలంక ద్వీపంలోని లొకేషన్లన్నీ చుట్టేసి వస్తారు. ఇది చూసి మంత్రి రాజాజీకి చిర్రెత్తుకొస్తుంది. రామచంద్రయ్యని బెదిరిస్తాడు. అది చూసి చిన్న సాక్షాత్తూ ఆ మంత్రి ఇంట్లోనే ఆయన అనుచరుల్ని చితగ్గొడతాడు. ఎలా సాధ్యం అని అడక్కండి. మరో సందర్భంలో మంత్రిగారి రౌడీకొడుకు ముగ్గురు పిల్లలతో సహా ఓ బస్సుని తగలబెట్టడం - దీన్ని కోర్టులో చూసింది చూసినట్టు చెప్పేస్తానని రామచంద్రయ్య చెప్పడంతో ఆయన్ని ఓ మెంటల్ కేసుగా కోర్టులో ప్రూవ్ చేస్తుంది విలన్ గ్యాంగ్. ఇది తట్టుకోలేక ఆయన ఉరేసుకుంటాడు.

దీంతో అప్పటిదాకా చట్ట బద్ధుడైన మీరో హింసా మార్గంలో చెలరేగిపోయి అంతిమంగా దుష్ట శిక్షణ చేస్తాడు. ఈ క్రమంలో సినిమా నిండా అర్థంపర్థం లేని సీన్లే. రెవిన్యూ మంత్రి తన పదవి పోగానే రౌడీకొడుకు గ్యాంగ్‌తో సాక్షాత్తూ గవర్నర్‌నే కిడ్నాప్ చేయించడం ఏమిటో... అలా కిడ్నాప్ చేసింది తానేనని చిన్నా ఒప్పుకుంటేనే వదిలేస్తామని చెప్పడం ఏమిటో... ఈ డిమాండ్‌కు ముఖ్యమంత్రి ఒప్పుకోవడం ఏమిటో... జుట్టుపీక్కున్నా ఓ పట్టాన అర్థం కావు.

ఇక హీరో సాహసాలకైతే అంతే లేదు. మంత్రి ఇంట్లో హీరో ఎంట్రీకి ఎలాంటి అడ్డు అదుపూ ఉండదు. సరాసరి ఆయన బెడ్ రూంలోకే నేరుగా దూసుకుపోగలడు. ఆయన కూతురిని వాటేసుకోగలడు. మంత్రిని, ఆయన అనుచరుల్ని వాళ్ళింట్లోనే చితగ్గొట్టగలడు. పోలీస్ స్టేషన్‌లోనే ఇన్‌స్పెక్టర్ని రక్తం కక్కేట్లు కొట్టి చంపనూగలడు. స్టెన్ గన్‌లతో కాపలా కాసే సెక్యూరిటీ వాళ్ళను పురుగుల్ని నలిపేసినట్లు నలిపేయనూగలడు. గవర్నర్ కిడ్నాప్ ఉదంతం నుంచి క్లైమాక్స్ దాకా అంతా గజిబిజిగా నడుస్తుంది. కోటా నడుం చుట్టూ బాంబులు బిగించి రిమోట్‌ని ఓ కోతి చేతికివ్వడం - కిడ్నాప్ కథలో మెసెంజర్లుగా బ్రహ్మానందం, ఎవిఎస్‌ల వెకిలి వేషాలూ - ఎల్‌బి శ్రీరాం బిగింపు డైలాగులూ - అంతా కామెడి కామెడీగా సాగుతోంది. తెలుగును ఖూనీచేసే రాజా మూరద్‌ను లాయర్‌గా పెట్టి ఏం సాధించినట్టో?

ఈ సినిమాకి చలాకీ అరుణ్ కొంతలో కొంత ఊరట. దాసరి నటన కొన్ని సన్నివేశాల్లో అద్భుతంగా ఉంది. అరుణ్‌ని ఎలివేట్ చేయడానికి తన పాత్ర పరిధిని కుదించుకున్నట్టు కనిపిస్తుంది. ముఖ్యంగా ఫైటింగ్, డాన్స్ సీక్వెన్సుల్లో మునుపటి కంటే మంచి ఈజ్‌తో నటించాడు. డైలాగ్ మాడ్యులేషన్, క్లోజప్‌లో ఎక్స్‌ప్రెషన్స్ విషయంలో ఇంకా శ్రమ పడాలి. హీరోయిన్ రవీనా చాలా సీన్లలో లావుగా కనిపించటం మైనస్ పాయింట్. రాజ్‌కుమార్ ట్యూన్లలో రెండు మాత్రం క్యాచీగా ఉన్నాయి.

- వంశీ

# బలహీనమైన బంధం




ఒక సంబంధం - ఒక ప్రేమబంధం అమితాబ్ అక్షయ్ కుమార్‌ల సినిమా (తెలుగులో ఇలా అనువదించుకోవచ్చు) ఇది. చాలాకాలం తర్వాత అమితాబ్ - రాఖీల కాంబినేషన్‌లో వచ్చిన సినిమా. అందులో విశేషమేమీ కాకపోతే వాళ్ళిద్దరూ విడివిడిగాను కలిసి కట్టుగాను నటించే ప్రయత్నం చేసినా సినిమా నిరాశ పర్చటం ఒక విశేషం అదీగాక ఇందులో కరిష్మాకపూర్, జూహీ చావ్లా లాంటి హీరోయిన్‌లు కూడా వున్నారు. ఈ సినిమా బాగాలేకపోవటానికి ఇంకో కారణం కూడా ఇదే. ఇక అక్షయ్ కుమార్‌కి ఎప్పుడూ ఒక మంచి నటుడిగా పేరు లేదు కనుక ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇంతమంది తారల మధ్య సరైన సంబంధాన్ని నెలకొల్పలేకపోవటం వల్ల సినిమా ఒక బోర్‌గా మారింది. పైగా క్లైమాక్స్ మరీ సినిమాటిక్‌గా వుండి తేలిపోయింది. తమాషా ఏమిటంటే ఈ సినిమాకి అన్నీ ఎక్కువే. భారీ తారాగణం, భారీ సెట్లు విజయవంతమైన దర్శకుడు. అయినా సినిమా బలంగా లేదు.

కథాపరంగా ఇది ఒక కుటుంబానికి సంబంధించిన కథే అయినా - ఎక్కువ భాగం తండ్రి (అమితాబ్) కొడుకు (అక్షయ్ కుమార్)ల చుట్టూ తిరుగుతుంది. నిజానికి ఈ సినిమాకి 'ఏక్ రిస్తా' అన్న పేరు ఎందుకు పెట్టారన్నది స్పష్టంగా తెలియదు. అమితాబ్ (భార్య రాఖీ) ఒక సక్సెస్‌ఫుల్ బిజినెస్ మ్యాన్. అతనికి ముగ్గురు ఆడపిల్లలు (జూహీ చావ్లా పెద్దమ్మాయి) ఒక అబ్బాయి (అక్షయ్). భారతదేశంలో ఒక విజయవంతమైన పారిశ్రామిక వేత్తగా పేరు ప్రఖ్యాతులు వున్న అమితాబ్ దగ్గర ఓ ప్రతిభావంతుడైన (?) యువకుడు (మొనిష్ బెల్) ఉద్యోగం సంపాయిస్తాడు. క్రమేణా అమితాబ్‌కు, జూహీచావ్లాకు దగ్గరయ్యి ఇంటికి అల్లుడవుతాడు. అంతలో అమితాబ్ కొడుకు ఇండియాకు తిరిగివచ్చి ఇన్‌ఫర్మేషన్ రంగంలో (సాఫ్ట్‌వేర్) వ్యాపారం మొదలు పెట్టాలనుకుంటాడు. తండ్రి వారించి మొదట తన సామ్రాజ్యాన్ని చూసుకోమంటాడు. అలా అక్షయ్ తన ఫ్యాక్టరీలోనే (ఎందుకో మరి!) ఒక ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభిస్తాడు. అంతా బాగానే వుంది. అల్లుడు నమ్మకంతో అమితాబ్ చేత పవర్ ఆఫ్ అటార్నీ సంపాయించుకుని ఆస్తి చేజిక్కించుకుంటాడు. ఈ మధ్యలో కరిష్మాకపూర్‌తో అక్షయ్ పెళ్ళికావటం - అల్లుడు (సినిమాకి ఇతనే సాఫ్ట్ విలన్) కుట్రవన్ని తెలివిగా తండ్రి కొడుకుల్ని వేరు చేయటం జరుగుతుంది. దాంతో అమితాబ్ ఒంటరివాడవుతాడు. అక్కడ అక్షయ్‌ను వదిలి కరిష్మా పుట్టింటికి వెళ్ళిపోతుంది. భర్త నిజస్వరూపం తెలిసిన జూహీ చావ్లా ఇంటికి వచ్చేస్తుంది. చితికిపోయిన కుటుంబానికి గొడ్డలి పెట్టులా ఇల్లు, ఫ్యాక్టరీ వేలం వేయటానికి రంగం సిద్ధమవుతుంది. అక్షయ్ సినిమాటిక్‌గా ఆస్తిని తిరిగి కాపాడుకుంటాడు. అంతా మళ్ళీ ఒక్కటవుతారు. ఇలాంటి సినిమాకి కావాల్సినవి పవర్‌ఫుల్ పంచ్‌తో డైలాగులు, బాగా పండిన సన్నివేశాలు. (సన్నివేశాలు మరీ పండిపోయాయి - నటుల వల్ల!) బిగువైన స్క్రీన్‌ప్లే, బోర్ కొట్టించని కథనం. అవేవీ ఇందులో కనిపించవు. కొడుకు పట్ల ఎంతో జాగ్రత్త వహించిన (కొడుకునే నమ్మని బిజినెస్ మ్యాన్) అమితాబ్ అల్లుడి చేతిలో గుడ్డిగా మోసపోవటం బాగా లేదు. ముందే చెప్పినట్లు కొన్ని సన్నివేశాల్లో అమితాబ్ బాగానే నటించినా దర్శకుడి చేతిలో చిక్కిపోవటం వల్ల లాభం లేకపోయింది. మరీ ముఖ్యమైన సన్నివేశాలు (కొడుకుని ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని చెప్పే సీన్) తేలిపోవటం సినిమాని దెబ్బతీసింది. మానవ సంబంధాలు సున్నితమైన అంశం. ఎంతో జాగ్రత్తగా హ్యాండిల్ చెయ్యాల్సిన సబ్జెక్ట్. దర్శకుడి అవగాహన రాహిత్యం (కరిష్మా కపూర్ భర్తని వదిలేయటానికి సరైన కారణం లేదు) స్పష్టంగా కనపడింది. ఇందులో ఒకే ఒక అంశం బావుంది. అమితాబ్ రాఖీలు తమ వయసుకు తగిన పాత్రల్లో కొంతవరకు సిన్సియర్‌గా కనిపించారు. ఇక అక్షయ్‌కుమార్. పాత్ర పరంగా అవకాశం వున్నా లేకపోయినా నటించటం చేతకాదు. పైగా అమితాబ్‌తో సినిమా. అనవసరంగా ఇరుక్కుపోయినట్లు అనిపిస్తుంది. అనేక సన్నివేశాల్లో (మరీ నాటకీయంగా) తన అసమర్థతను బయట పెట్టుకున్నాడు. ఒక ముఖ్యమైన పాత్ర అలా వుండిపోవటం వల్ల సినిమా బాగా దెబ్బతింది. ఇక కరిష్మాకపూర్‌కి పాత్ర పరంగా నటించే అవకాశమే లేదు. జూహీ చావ్లా పరిస్థితి అదే! మిగతా ఇద్దరమ్మాయిలు సినిమాలో వున్నారు అంతే. అయితే కథ మొత్తం కన్విన్సింగ్‌గా లేదని చెప్పటం సమంజసం కాదు. కొంత వరకు స్పష్టమైన దారిలోనే నడిచింది. అల్లుడు ఆస్తిని కొట్టేయటంతో కథ దారి తప్పింది. దానికి తోడు క్లైమాక్స్‌లో అక్షయ్‌కుమార్ (తన నిజస్వరూపం చూపించి) మొనిష్ బెల్‌ను కొట్టి - (వర్కర్స్ సాయంతో) ఆస్తి తిరిగి ఇచ్చేలా చేస్తాడు. ఆ పని ముందే చేస్తానంటే వద్దని చెప్పిన అమితాబ్ చివరకి దాని కోసం ఎదురు చూడటం హాస్యాస్పదంగా వుంది. డైలాగులు కొన్ని బాగానే వున్నా సినిమా మొత్తం మీద పేలవంగా వున్నాయి. కొన్ని సన్నివేశాలు మరీ బలహీనమైపోయి ప్రేక్షకులు ఆవులిస్తూ కూర్చునే స్థితిలో వున్నాయి. అమితాబ్ మీదనే నమ్మకం పెట్టుకున్న దర్శకుడు అతనికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. అలా ఇవ్వకుండా వుంటే సినిమా బావుండేదని కాదు. మొహబ్బతే లాంటి సినిమాలో పాత్ర లాంటిదే ఇది కూడా. ఒకప్పుడు యాంగ్రీ హీరో పాత్రలు చేసిన అమితాబ్‌కి ఇది వయసుకి తగిన పాత్ర అయినా - అలాంటి నటుడికి తగిన పాత్ర కాదు. ఒక కుటుంబ సంబంధ బాంధవ్యాలను తెరకెక్కించటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉదా: మంచినటులు, స్క్రీన్‌ప్లే) తీసుకోకపోవటం వల్ల ఇదొక సాదా సీదా సినిమాగా తయారయ్యింది. అమితాబ్‌తో పాటు అక్షయ్ కుమార్ కూడా వీలైనంత త్వరగా మర్చిపోవాలనుకునే 'బోర్' సినిమా ఇది.

- సి.యస్. సలీంబాషా

# పరమ పాత కథలో కొత్త ముఖాలు

ఫిలిం ఇండస్ట్రీని ఏలుతున్న సినిమా వారసుల జాబితాలోకి మరో వారసుడు చేరాడు. ఆ కుర్ర హీరో నందమూరి తారక రామారావు. నటనలో నిజంగానే సార్వభౌముడైన ఎన్‌టిఆర్ ఇతడి తాతగారు. ఇదొక్కటే థియేటర్ దాకా జనాన్ని రప్పించే ముఖ్యమైన అంశం. ఈ వారసుణ్ణి వెండితెర మీదికి తెచ్చిన మెగా సంస్థ - ఉషాకిరణ్ మూవీస్. అంతా కుర్ర నటులతో, కొత్త దర్శకులతో బాక్సాఫీస్‌ని కొల్లగొట్టిన 'చిత్రం', 'నువ్వే కావాలి' లెవెల్లో ఈ సినిమా కూడా ఫ్రెష్‌గా, పసందుగా ఉంటుందని అభిమానులు అతిగా ఆశించడం సహజమే. కానీ తాతని చూసిన ప్రేక్షకుల కళ్ళకి ఈ మనవడు నచ్చాలంటే ఇంకా చాలా చాలా కష్టపడాల్సి వుందని సినిమా చూసాక తెలుస్తుంది. ఈ సినిమాకి నిర్మాణ దశలోనే పత్రికల్లోనూ, టీవీలోనూ తెగ ప్రచారం జరిగింది. కానీ టోటల్ సినిమాలో కథ, కథనం, పాటలు, దర్శకత్వం ఇలాంటి వాటి పరంగా చెప్పుకోడానికి ఏ ఒక్క బలమైన పాయింటూ కనిపించదు. ఓ కుర్రది, కుర్రాడు పెద్దల్ని ఎదిరించి చివరాఖరిగా ఒకటైపోవడం అన్న ఓ అరిగిపోయిన రొటీన్ థీమ్ చుట్టూ రెండున్నర గంటల సినిమాని నిర్లక్ష్యంగా సాగదీస్తూ పోయినట్టు కనిపించింది. కానీ 'నువ్వే కావాలి', 'చిత్రం' హిట్ సినిమాల్లో కూడా బలమైన కథేదీ లేకపోయినా ఎక్కడా బిగి సడలని కథనం, మాంచి ఊపున్న పాటలు ప్రేక్షకుణ్ణి సినిమాలో లీనం చేస్తాయి.

కథలోకి వెళితే మిఠాయి వ్యాపారంలోనూ, దానంలోనూ మంచి పేరున్న శివారెడ్డి (విశ్వనాథ్) మనవడు వేణు (ఎన్టీఆర్). అదే వ్యాపారంలో ఉన్న శివారెడ్డి ప్రత్యర్థి సహదేవరెడ్డి




(సత్యనారాయణ) మనవరాలు సిరి(రవీనా రాజ్‌పుత్)... ఓసారి వెయింగ్ మిషన్‌పై నిలబడ్డ వేణు కౌగిట్లోకి అనుకోకుండా వచ్చి వాలిపోతుంది సిరి. ఎలాగెలాగని అడగొద్దు. ఆ స్వీట్ సీన్‌తో బద్ధకస్తుడైన వేణులో ప్రేమ జాలు విదుల్చుకుంటుంది. అక్కణ్ణించి అమ్మాయి మనసుకోసం వేట మొదలౌతుంది. కానీ అటువైపూ, ఇటువైపూ ఉన్న తాతలిద్దరి మధ్య వ్యాపార శతృత్వం వేణు ప్రేమకి అడ్డు పడుతుంది. అమ్మాయి మనసు గెలవాలని ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తాడు. అమ్మాయి ఇంటి నౌకర్లకి చాటుగా డబుల్ జీతాలిచ్చి ఆవిడ ప్రతి కదలికనీ ట్రేస్ చేస్తాడు. సెల్‌ఫోన్లో లవ్ సందేశాలు షరామామూలే. బర్త్‌డే నాడు ఆమె బెడ్‌రూంలో పూలతో డెకరేషన్ చేస్తాడు. ఆఖరికి ఇన్విజిలేటర్‌కి ఓ కొత్త టీవీని ఎరగా వేసి ఆయనతోనే నకలు చీటీలు ఇప్పించి సిరిని ఇంటర్ పాసయ్యేట్టు చేస్తాడు. ఇవన్నీ తెలిసి - మెల్లిగా మనసు కరిగి - నువ్వే నా లోకం అంటుంది సిరి. ఇలా ఇద్దరూ ఈక్వల్‌గా ప్రేమలో మునిగాక - అమ్మాయి తండ్రి విలన్‌గా ఎంటరవుతాడు. ఇంతలో ఇద్దరు తాతలూ ఎన్నికల్లో పోటీకి దిగడం - ఆ ఎన్నికలయ్యేదాకా రెండు నెలల పాటు విడిగా, దూరంగా ఉందామని ప్రేమికులు - మరో చరిత్ర సినిమాలోలా - అనుకోవడం, ఆ క్రమంలో వేణు సిమ్లాలో వాలిపోవడం జరుగుతాయి. తనకు పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్న తండ్రి కళ్ళుగప్పి సిరి కూడా సిమ్లా చేరుతుంది. ఇక అందమైన మంచు లొకేషన్లలో పాటలూ, స్టెప్పులూ మామూలే. వేణుని 'ఏసెయ్యాలని' దూల్‌పేట రౌడీలను వెంటపెట్టుకుని సిరి తండ్రి కూడా సిమ్లా చేరతాడు. అక్కడ ఫైటింగ్‌లు, ఛేజింగ్‌లు, హీరోకి కత్తిపోట్లు, హాస్పిటల్ సీన్లు అన్నీ ప్రేక్షకుడు ఊహించినట్టే జరుగుతాయి. తాతలిద్దరూ చేతులు కలిపి అక్కడికి చేరుకుని పిల్లల్ని ఒక్కటి చేయడంతో శుభం కార్డు పడుతుంది.

హీరోగా పరిచయమైన ఎన్టీఆర్ జూనియర్ - ఒంటిని అదుపులో ఉంచుకోకపోతే ముందు ముందు కష్టమే. విచిత్రమేమంటే ఎక్కడా సీనియర్ ఎన్టీఆర్ గుర్తుకు రాడు. డాన్స్‌సీన్లలో మంచి ఈజ్ ఉన్నా - గొంతులో మాత్రం ఎక్కడా జీవం లేదు. వాయిస్‌ని మెరుగుచేసుకునేందుకు చాలా కష్టపడాలి. ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ అస్సలు లేవు. అందుకే ఎన్టీఆర్‌కి మరో అసలైన వారసుడు అనడానికి కాస్త ఇబ్బంది. రవీనా... జస్ట్ అనదర్ హీరోయిన్. నటన గురించి చెప్పేందుకు ఏమీలేదు. సినిమా అంతా ఓ రొటీన్ కథే కావడంతో దర్శకుడు వి.ఆర్. ప్రతాప్ క్రియేటివిటీ ఎక్కడా కనిపించలేదు. ఈ మధ్య హుషారైన ట్యూన్లని అందిస్తున్న ఎస్.ఏ. రాజ్‌కుమార్ ఈ సినిమాలో ఒక్క క్యాచీ ట్యూన్‌ని కూడా ఇవ్వకపోవడం విచిత్రమే.

- ఎస్.ఇ.ఎస్.

మీ ఇంటి వద్దే విజయవిహారం చందా చెల్లించవచ్చు!, పాత కాపీలను పొందవచ్చు- ఫోన్ చేయాల్సిన నంబర్ : 7007053, సెల్ నెం.9848019076

ఎక్కడైనా పండగంటే పండగే, ఆటపాటలూ మామూలే! రాకాశమ్మ పండగలో మాత్రం ఆటంటే మాటలు కాదు. ముఖాలకు చెక్క మాస్కులు తొడుక్కుని, కాళ్లకు కర్రలు కట్టుకుని - ఆరు అడుగుల ఎత్తున్న కర్రల మీద నాట్యమాడతారు ఇక్కడి గిరిజనులు. రాకాశమ్మ పండగంటే మద్యం మత్తూ, కోడి నెత్తురూ, బుర్రకథలూ, బూతుమాటలూ, ప్రేమ పాటలూ, తారాజువ్వలూ, రంగునీళ్లూ, చుట్టాలూ పక్కాలూ! రోగాల్నుంచి కాపాడమని, ఊరిని చల్లగా చూసుకోమని, పంటలు బాగా పండించమని రాకాశమ్మను వేడుకోవటమే ఈ అరుదైన పండగ అసలు సారాంశం.


రాకాశమ్మ దేవత

పండుగలు సంస్కృతికి ఆభరణాలు. వాటిలో దివ్యాభరణం - విశాఖ ఏజెన్సీ చింతపల్లె మండలంలోని బురిడీ వీధి, లంబసింగిలలో జరిగే 'రాకాశమ్మ పండుగ'. ఇప్పుడు మునుపటంత భారీగా జరుగకపోయినా ఒకప్పుడు మన్యంకే

## మన్నెంలో మహోత్సవం

# రాకాశమ్మ పండగ


ఆరడుగులు ఎత్తున్న కర్రల మీద నృత్య విన్యాసం

తలమానికం ఈ ఉత్సవం. గిరిజన పల్లె ప్రజలేగాక మైదాన ప్రాంతీయులు కూడా వేలాదిగా తరలి వచ్చేవారు.

సుమారు ఆరు అడుగుల ఎత్తు కర్రల మీద నాట్యమాడ్డం ఈ పండుగ ప్రత్యేకత. పెదబుడ్డి, చినబుడ్డి, పిల్లబుడ్డి అనే మూడు సైజులవారీ భీకర కొయ్యతల తొడుగులను (మాస్కులు) పండుగ నాటి రాత్రి పూజించి, మంగళసూత్రం కట్టి పెండ్లి చేస్తారు. కోళ్ళుకోస్తారు.

"అమ్మా మమ్మల్ని చీడపీడల నుంచి రక్షించు! రోగాల బారినుండి కాపాడు! ఊరికి మేలు చేయి! పంట బాగా పండేట్లు చూడు!" అనే భావార్థంతో పూజారులు దేవతలను కొలుస్తుంటారు. మద్యం మత్తులో పూజారులు ఒక విధమైన ట్రాన్స్‌లో ఈ తంతు నిర్వహిస్తుంటారు. మధ్యలో బూతులు తిడుతుంటారు. పరస్పరం కొట్లాటకు సిద్ధమౌతుంటారు. అంతా చిన్నపిల్లల చేష్టలా ముచ్చటేస్తుంది.

రాకాశమ్మ వివాహ వేడుకానంతరం, పురాతనకాలం నుంచి వస్తున్న కర్రలను అరికాళ్ళకు కట్టుకుని కొందరు యువకులు చినబుడ్డి, పిల్లబుడ్డి తలలు ధరించి లయబద్ధ వాద్య మోతలకు అనుగుణంగా శోభాయమానంగా నర్తిస్తారు. సంతోషం పట్టలేక కొందరు టపాకాయలు పేలుస్తారు. తారాజువ్వలు రువ్వుతారు. బురుసులు వెలిగిస్తారు. ఉద్వేగభరిత అరుపులు, కేకలతో ఆ ప్రాంతమంతా ఆనంద కోలాహలం తాండవిస్తుంది.

తెల్లవారు ఝామున గుడికి కొంచెం ఎగువ కొండపైని 'ఎక్కోట' అనే ఆలయం దగ్గర పూజచేసి కర్రల గడ్డనెక్కి మరలా తారాస్థాయిలో ఆడతారు. చూసే ప్రతి ఒక్కరూ తన్మయులైపోతారు. ఆ రాత్రంతా బుర్రకథలు, వీధి భాగోతాలు, పాటలు, నాట్యాలు యితరత్రా వినోద కార్యక్రమాలుంటాయి.

పగటివేళ కోడిపందేలల్లో ఈలలు, చప్పట్లలో పరిసరాలన్నీ మార్మోగుతాయి. అంగళ్ళు వెలస్తాయి.

సాధారణంగా మే మాసపు సోమ, మంగళ వారాల్లో జరిగే ఈ వేడుక ఒక కథ ప్రచారంలో వుంది.

నిజానికి అది రాకాశమ్మ పండుగ కాదు - 'ఆకాశమ్మ దేవత పండుగ'. కాలక్రమేణా ఆకాశమ్మ రాకాశమ్మగా రూపుదాల్చిందని అంటారు.

చేనులో పండిన పంటను తినడానికి వచ్చిన రాకాసిని పాండవ మధ్యముడు బాణంతో కొట్టడంతో అది నుదుటికి తగిలిందని, ఆ దృశ్యాన్ని పెదబుడ్డి నొసటన అలానే ప్రదర్శిస్తారు. (పంచపాండవులని అనబడే మంచి దారుఢ్యమున్న రాతి విగ్రహాలు లంబసింగిలో వున్నాయి).

ఒకప్పుడు రాకాశమ్మకు కంచు విగ్రహాలుండేవి. వాటిని ఒక ఇంటి ముందు వుంచి పనిమీద వెళ్ళివచ్చేసరికి ఇంట్లోని పసిపిల్లాడు కన్పించలేదు. వెతకగా వెతకగా పిల్లాడి చిటికిన వేలు మాత్రం తెగిపడి అగుపించింది.

"విగ్రహాలయితే చేసి పెట్టారు. మరి నైవేద్యం పెట్టలేదు కదా! అందుకే బాలుడ్ని బలిగొన్నాను" అని రాకాశమ్మ ఊరి పూజారి కలలో కనబడి చెప్పిందట. దాంతో జనాలందరూ కలిసి విగ్రహాలను పూడ్చేశారు. పూడ్చిన చోట జలవూట ఉబికింది. లోహాకృతుల స్థానంలో దారు రూపాలు తయారుచేసి పండుగ పూర్తయిపోతూనే నేలపై గాకుండా ఏడు పర్వతాల నుంచి తెచ్చిన తాళ్ళతో వాటిని కట్టేసి అటక మీద పడేస్తారు. మరలా పండుగ నాటికి చూస్తే కట్టిన తాళ్ళన్నీ పట్టువీడి కన్పిస్తాయని నమ్మకం.


పాండవుల విగ్రహాలు

ఉదయాన్నే ఆ దేవతామూర్తులను వెదురు బుట్టల్లో పెట్టుకుని ఊరేగింపుగా ఇంటింటికీ తీసుకెళతారు. ఇండ్లల్లోని ఆడవాళ్ళు దేవతలకు కుంకుమ బొట్లు పెట్టి పూజలు సల్పుతారు. ఈ సందర్భంగా యువకులు పరాచికాలు, పరిహాసాలాడుతూంటారు. కానీ ఎవ్వరూ కోపగించుకోరు. పైగా నవ్వుకుంటూంటారు. అట్లే ఊరేగింపు జరిపేవారిపై ఇళ్ళకాడ రంగునీళ్ళు జల్లుతూ తమాషాలాడుతుంటారు. అంతా ఆనందోత్సాహాల హేల. సంతోషోత్సవాల మేళా!

ఎక్కడెక్కడ్నుంచో వచ్చిన బంధువులు, స్నేహితులతో ఇళ్ళన్నీ నిండిపోతాయి. యువతలో ప్రేమ వలపులు పుష్పిస్తాయి.


ఊరేగింపు సందర్భంగా ఆడవాళ్ల పూజలు

ఎటువంటి పరిస్థితుల్లోనూ పండుగ రోజు మాత్రం వాన పడుతుందనేది ఊరోళ్ళ విశ్వాసం. వారి నమ్మకాన్ని నిజం చేస్తూ ఆ రోజు కిలకిల్లాడుతూ వర్షం కురిసింది.

మైదాన ప్రాంతాల వారికి మన్యం ముఖద్వారంగా పిలువబడే 'లంబసింగి' ఏజెన్సీలో ప్రసిద్ధ గిరిజన గ్రామం. ఊర్లో వాల్మీకుల జనాభా ఎక్కువ.

దట్టమైన అడవుల మధ్య విచ్చుకున్న విష్ణు పువ్వులా కన్పించే లంబసింగి మన్యం మహావీరుడు అల్లూరి సీతారామరాజు పితూరీలో ప్రముఖ స్థానం పొందింది. బ్రిటీషు వారి హయాంలో కీలక ప్రదేశంలో నిర్మితమైన అతిథిగృహం నక్సలైట్ల బాంబు పేలుళ్ళకు దెబ్బతింది. ఈ నేపథ్యంలో అక్కడి పోలీసు పోస్టు ఇసుక మూటలు, బారికేడ్ల కవచాలు ధరించి అప్రమత్తంగా అగుపిస్తుంది.

వాస్తవానికి లంబసింగి, బురిడీవీధి గ్రామస్థులు సమిష్టిగా రాకాశమ్మ ఉత్సవం జరుపుకునేవారు. అయితే తగాదాలవల్ల కాలక్రమేణా ఎవరికి వారు చేసుకుంటున్నారు.

విశాఖ ఏజెన్సీలో అతి పెద్ద సంరంభం ఏప్రిల్ - చైత్రమాసంలో జరిగే 'ఇటిం పండుగ'. ఈ రెండు ఊళ్ళకు మాత్రం 'రాకాశమ్మ జాతర' తరవాతే ఇటిం పండుగ●

ఫోటోలు, వ్యాసం : బి.వి. రమణ


కుర్రకారు సంబరం


పూజాతంతు



మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి. మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!